భారతి

సచిత్ర మాసపత్రిక

BHARATHI

(A TELUGU MONTHLY)

సంపాదకుడు:

శి. శంభుప్రసాద్

ఆంధ్రపత్రికా ముద్రాలయము,
మద్రాసు.
౧౯౪౦

సంపుటము ౧౭, సంచిక ౫

ప్రకటన


ఈక్రింది కనబరచిన నెంబర్ల వారికి ఈనెల భారతి (1940 సం. మే నెల)తో ఇదివరకు చెల్లించిన చందా పూర్తి యగుచున్నది. తిరిగి ఇంకొక సంవత్సరమున కగు చందా మాకు చేరునట్లు ఈనెలాఖరులోగా మనియార్డరు చేసినచో తెంపు లేకుండ పత్రికను పంపుచుందుము. అట్లు తమ యొద్దనుండి 30–వ తేది లోపుగ సొమ్మురానిచో సహజభాషాభిమానులగు తాము తిరిగి ఇంకొక సంవత్సరమువఱకు భారతి చందాదారులుగ నుందురను నమ్మకముతో 1940 సం. జూన్ 10–వ తేదిని రూ 6—4—0 లకు వి. పి. పంపుచున్నాము. కావున తా మెప్పటివలెనే పత్రికయం దభిమాన ముంచి సొమ్ము చెల్లించి వి. పి. ని గైకొన ప్రార్థితులు. ఒకవేళ తమకీ పత్రిక ప్రస్తుత మనవసరముగ దోచినచో మాకావిషయము వెంటనే తెలియజేసిన యెడల వి. పి. పంపుట నాపుదుము.

B 2. H 17, 19, 56, 64. K 8. P 5. R 4, 5, 16. S 13, 14, 17, 62, 64, 105. V 7. Y 1.

వ్యాసవిలేఖకులకు మనవి

వ్యాసాలు ఎనిమిదిపుటలకు మించకుండా ఉండాలి. కాగితానికి ఒకపెడే వ్రాయాలి. శాస్త్రీయవిషయాలనుగురించిన వ్యాసాలుకూడా ఎక్కువ పరిభాషా, ఎక్కువ వివరాలూ లేకుండా సంగ్రహంగాను, సామాన్యపాఠకునికి విషయం బోధపడేటట్టు సులభంగాను, మనస్సును కథలా ఆకర్షించేటట్టు ఆకర్షకంగాను ఉండాలి. శాసనవ్యాసాలు పదిహేన్నెండు పుటలకు మించేయెడల రెండు సంచికలలో ప్రకటింపవలసివచ్చును. "బాలానందమున" కుచితమైన కథలు, పాటలు, సాధ్యమైనంతవరకు పిల్లలభాషలో రచించి పంపించవలసినదని కవులకు మనవి. విమర్శలకు గ్రంథములు పంపువారు రెండుప్రతులు పంపవలెను.

దేశాన్ని ఎక్కువగా కలవరపరుస్తున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయాది విషయాలనుగురించీ, మనఆంధ్రుల ప్రత్యేకసమస్యలనుగురించీ ప్రత్యేకవ్యాసాలు కావాలి. సాధ్యమయినంతవరకు ఎత్తుకునే విషయంలోను, చూచే దృష్టిలోను, రచించేరచనలోను కొత్తదనం కావాలి. మన ఉద్యమాలు, మనదేశం, మనసంఘం, మనఆశయాలు భారతిలో ప్రతిఫలించేటట్టు చూడవలసిదని వ్యాసకర్తలకు మనవి.—భా. సం.



చంద్రోదయము



సంపుటం. ౧౭ విక్రమ, వైశాఖమాసము (మే 1940) సంఖ్య. ౫

ఆశీస్సు

శ్రీ నండూరి ఈశ్వరం

తెలుగుతనంబులో వలపు తేటలు వెన్నెలవెల్లిజాలులై
మలసిన మాతృదేశమున మంజులగానరసజ్ఞమాధురీ
చలితసుధార్ద్ర వీచిక లజస్ర సుఖోదయ గీతు లల్లు త్వ
ద్విలసిత జీవరోచికి నిదే! యభినందనమాల భారతీ!

జీవమనోహరంబయిన శిల్పము పండిన దాంధ్రభూమి నేఁ
డీవిధి శీర్ణమై యెదలనే రచియించె విషాద వేదనల్!
భావపరిస్ఫుటంబులు వివర్ధిత చిత్ర చిదన్మహస్సులన్
మావనటల్ కరంచితివి భారతి! దివ్యకళాప్రభారతీ!

ఈవిదగ్ధాంధ్రజాతీయతావిభూతి
నెచటనో జీవకణము గాలించి పెంచి
ఈ వినిద్రాణజాతిః స్వేచ్ఛా విలాస
కోకిలాబోధనల మేలుకొలిపినావు.

తెలుగు కవితకు చెలువులు తీర్చిదిద్ది
కవులకలకంఠ మధుర రాగములలోన
ఈవిశాలాంధ్రవనిః బల్లవించినావు
చివురుకొమ్మల నింక పుష్పింపుమమ్మ.

నీ వచస్సుల కవితా ప్రభావ మొలుక
నీ కరస్పర్శయే శిల్ప నీతిగాగ
నీ పదన్యాసమే లాస్య నియతిగాగ
దేవి ! భారతి ! మను చిరంజీవిని వయి.



ఆధునిక ఆంధ్రకవిత్వము

(సింహావలోకనము)

శ్రీ కటికినేని జగన్నాథరావు

రాజులు, రాజ్యాలు సమసిపోతూవున్న యుగం యిది. క్షణక్షణానికీ ఖండ ఖండాంతరాల్లో మానవుడు 'మానవుడు'గా వుండాలని పాటుపడుతున్నాడు. నేడు యావత్ప్రపంచమూకూడా స్వాతంత్ర్యంకొఱకు తపించిపోతూవుంది. శక్తిగలవారు దాస్యశృంఖలలను విదలించి బానిసత్వంనుండి విముక్తిని పొందుతున్నారు; శక్తివిహీనులు రక్తప్రవాహాలలో యీదుతున్నారు. సంఘంలో, జాతిలో, దేశంలో, ప్రభుత్వంలో — పిపీలికాది బ్రహ్మపర్యంతమూ విప్లవమే దృగ్గోచరమవుతూ వుంది. స్వాతంత్ర్యం లభిస్తేనేగాని ఈ మహావేశం చల్లారదు; సందెమీద చేయివేసుకొని మానవుడు నిద్రపోడు!!

ఒక్క రాజులూ, రాజ్యాలే కాదు యీ విప్లవ యుగంలో తలక్రిందు లవుతూవుంది; పైన చెప్పినట్లు, ప్రతి జాతీకూడా అర్థంలేని సంప్రదాయాలను అనుసరించడం మానేస్తూ వుంది; కాలవాహినికి ఎదురీదడం అంతరించింది; సౌదర్యభావం పెంపొందుతూవుంది. అనంతమైన, దివ్యమైన సౌందర్యం హృదయానిదేగాని, యీ భౌతిక దేహానిది కాదని తెలుసుకుంటూ వుంది.

ఈ విప్లవం ఒకక్షణం రాజకీయాల్లో ప్రతిబింబిస్తూవుంది; మఱుక్షణం సంఘంలో పొడసూపుతూ వుంది; పిమ్మట సారస్వతంలోకూడా స్థానం ఏర్పఱచుకొంటూవుంది—

ఆధునిక ఆంధ్రకవినికూడా చెదిరిస్తూవున్నది యీ విప్లవమే; ఈ స్వాతంత్ర్యాన్ని కాంక్షిస్తూన్న ఆర్తనాదాలతో కలిసి పాడడమే కవులకుకూడా విధ్యుక్తధర్మం; కాలప్రవాహం ఆలపిస్తూన్న యీరాగంలో కవిపాళీ అపశ్రుతి వేయజాలదు — వేయదు—

ఈ మహావేశంలోనే ఆధునిక కవులు పునాదులు వేసుకున్నారు; ఇలాంటి స్వాతంత్ర్యాన్నే వారూ కవిత్వంలో కాంక్షించారు. మంచిని కాదనలేదు, చెడును ఆదరించలేదు. ఆనాటి కవులను అధిక్షేపించడం లేదు; యీనాటి కాలప్రవాహాన్ని అడ్డగించడమూ లేదు—

కవి పరమావధి ఏమిటి? అని ప్రశ్నించుకొన్నాడు ఆధునిక ఆంధ్రకవి. పూర్వమంటారా, ఆ కవు లందరూ "మనరాజుగారికి ప్రియతమమైనది యేదీ?" అని ప్రశ్నించుకునేవారు. ప్రశ్నించుకొని రాజుగారికి ప్రియమైన వస్తువుపై—లేక స్త్రీ అయితే, ఆ 'లాలితరూపయౌవనవిలాసిని' మీద — పద్యంమీద పద్యం, గ్రంథంమీద గ్రంథం వ్రాసేవారు. తమగుండెలో నుండి ప్రసవించిన కవిత్వంకాదు వారి పాళీలోనుండి దూకింది; వారికవిత్వమే రాజుగారి యిష్టాయిష్టాల వెంబడి పరుగులు తీస్తూవుండేది. కాబట్టి సారాంశం ఏమంటే, ఆనాటికవికి కావలసింది ఒకజాతికాదు, ఒకకృష్ణదేవరాయలు! ఒకసంఘంకాదు, ఒక ఆస్థాన పండితమండలి. అతని పద్యాలను అర్థంచేసుకొని ఆనందించవలసింది సంఘంకాదు. రాజుగారి అనుభవాన్ని కవి పద్యాలుగా అల్లితే, తానుచేసిన మహత్కార్యాల యొక్క ప్రతిబింబాలను తన ఆస్థానకవియొక్క కవనంలో చూచుకొంటూ రాజు మురిసిపోయేవాడు. కాని, ఆనాడు ఆస్థానపండితులంటూ కొందఱుండేవారని చెప్పానుగా; యీపండితుల మెప్పుపొందితేనే కాని ఏకవియొక్క కవితాకన్యకూడా రాజుగారి కౌగిల్లో కులికేదిగాదు. అందుకని, కవులు పండితులతో కూడబలుక్కొని రాజాశ్రయాన్ని పొందేవారు. రాజుగారిని సంతోషపెడితేనేగాని, యీకవులకు

శొక్కాలు ఆజీవికావు. రాజులను ప్రేమించడానికీ, కామించడానికీ బాగా తీరికవుంటుంది; అందులో ఆ రోజుల్లో మరీని. ఇదికారణంగా, పూర్వపుకావ్యాలన్నింటిలోనూ, దాదాపు మాటికి తొంభై గ్రంథాల్లో శృంగారరసం వెల్లివిరిసింది. ఒక రాజు వేటకు పోతాడు. వేటాడి, అలసి, సొలసి సమీపంలో వున్న ఒక ఆశ్రమంలోనికి (ఆనాడు ఆశ్రమాలకు కొఱతలేదుకదండీ!) ప్రవేశిస్తాడు. దాహం తీర్చుకుంటానికని వచ్చిన యీ రాజుకంట్లో ఒక చక్కని స్త్రీమూర్తి తటుక్కు మంటుంది. అసలు దాహం అదృశ్యమయి ప్రేమపిపాస ప్రబలిపోతుంది. కావ్యం వెంబడి కావ్యంలో కనిపించే కథలన్నీ యీ శ్రేణికి జెందినవే. వారికవనమంతా, సారస్వతమంతా శృంగారరసభూయిష్ఠం అయిపోయిందంటే, యించుమించు దానికి కారణం రాజపోషణ అనే చెప్పాలి. "నిజ దారసుతోదరపోషణార్థమై" రాజును మెప్పించి నంతకాలమూ కవులకు భుక్తికి గడిచేది; దాంతో కవుల కూడా కాస్త శృంగారంమీదికి మనసు మఱలుతూ వుండేది. పూర్వకవిత్వాన్ని నేను విమర్శించడంలేదు; విమర్శించడానికి తగనుకూడా. ఆకవిత్వం ఆకాలానికి సరిపోయింది; నిరంతరమూ అలాగే వుండాలంటే అది కానిపని. ఈయుగాన్ని అనుసరించి మనకవిత్వంలో పరివర్తనలు రాక తప్పవు. కాలాన్ని ధిక్కరించడం ఎంత వివేకమో, యీ పరివర్తనను ధిక్కరించడమూ అంతే!

ఈనాటి రచనలను కొన్నింటిని మనసులో వుంచుకొని, యీయుగంలో నవకవులు సాధించిన, సాధిస్తున్న, సాధింపదలచిన మహత్కార్యం ఏమిటో పరిశీలించి చూతాము. నేడు మనం గాంధీయుగంలో నివసిస్తూవున్నాము. గాంధీయుగం మనకు నేర్పిన మూలసూత్రం స్వాతంత్ర్యపిపాస. ప్రతిమానవుడి హృదయమూ దేశభక్తితో తొణికిపోతూంది. ఇంట గెలిచి రచ్చగెలవాలి గనుక ప్రతివాడు తనజాతిని, తన సంప్రదాయాన్ని ప్రేమించడం నేర్చుకొంటున్నాడు. కవి అయిన ప్రతివాడూ యీనవయుగోదయానికి నోడ్పడి దేశభక్తిపూరితమైన కవిత్వాన్ని

కానుకగా అర్పించాలి. ఈ శుభసమయాన మన ఆధునిక ఆంధ్రకవులూ వెనుకంజ వేయలేదు. ప్రజానీకంయొక్క గుండెలో గుచ్చుకుపోయే భాషలో మహోత్కృష్టమైన ఆంధ్రాభిమానాన్ని వడకట్టారు. దేశకాలపాత్రభేదాల్ని అనుసరించి తమ కవితాకన్యగమనాన్ని మార్చుకున్న కవుల్లో మార్గదర్శకులు కీ. శే గురజాడ అప్పారావుగారు. దేశాభిమానం, ఆంధ్రాభిమానం వెల్లివిరిసిన కవిత్వాన్ని ప్రసాదించినవారు యింకా లేకపోలేదు. రాయప్రోలుసుబ్బారావు, విశ్వనాథసత్యనారాయణగార్లు యీశ్రేణికి చెందినవారే. ఆంధ్రజాతి శిథిల్యమై పోతూన్నసమయంలో తమ విస్ఫూర్తధర్మాన్ని మఱవక మనపూర్వపురాణ్యాన్ని కళ్ళకడ్డంగా తెచ్చి మహావేశంతో మనరక్తనాళాల్ని ప్రజ్వలింపజేశారు. వీరికీ గురజాడ అప్పారాయకవికీ భేదం లేకపోలేదు. గురజాడవారు ప్రజలయొక్క భాషలో కవనాన్ని అల్లి, వీరు, వారు అనక అందరిప్రశంసలను అందుకున్నారు. కవిత్వంలో ఈయన పోకడలకు నిదర్శనంగా యీ గీతాన్ని చిత్తగించండి:—

"దేశమును ప్రేమించుమన్నా,
మంచి అన్నది పెంచుమన్నా,
వొట్టిమాటలు కట్టిపెట్టోయ్!
గట్టిమేల్ తలపెట్టవోయ్!
....
"స్వంతలాభం కొంతమానుకు
పొరుగువాడికి తోడుపడవోయ్!
దేశమంటే మట్టికాదోయ్,
దేశమంటే మనుషులోయ్!"

ఇలా చక్కని వాడుకభాషలో కవనాన్ని అల్లి, మార్గదర్శకుడై సోదరకవిబృందాన్ని ఎలా మేలుకొలుపుతున్నాడో చూడండి:—

"ఆకులందున అణగిమణగీ
కవితకోవిల పలకవలెనోయ్,
"పలుకులను విని దేశమందభి
మానములు మొలకెత్తవలెనోయ్!"

అతని ప్రబోధం వ్యర్థం కాలేదు; తేటపదాల్లో వీరాద్భుతార్ధభావాలను 'కవిత కోకిల' పలికింది. తత్ఫలితంగా ఆంధ్రుడు దీర్ఘసుషుప్తినుండి మేల్కొంచాడు.

గుండెల్లో యిముడని దేశభక్తి కవిత్వరూపంగా పొంగి పొర్లింది శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారిలో. మహావేశంతో మాతృదేశాభిమానాన్ని గానం చేస్తున్నాడు యిలా:—

"ఏ దేశ మేగినా ఎందు కాలిడిన
ఏపీఠ మెక్కినా యెవ రెదురయిన
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతినిండు గర్వమ్ము
లేదురా యిటువంటి భూదేవి యెందు
లేరురా మనవంటి ధీరు లింకెందు!
ఏ పూర్వ పుణ్యమో ఏయోగ బలమొ
జనియించినాడ వీస్వర్గలోకమున!
ఏ మంచి పూవులన్ ప్రేమించినావో
నిను మోచె నీ తల్లి కనకగర్భమున"

నిద్రావస్థయందు, జాగ్రదవస్థయందు, స్వదేశమందు, విదేశమందు, కష్టంలో, సుఖంలో, కీడులో, మేలులో, స్వతంత్రుడవైనా, అస్వతంత్రుడవైనా నీవు భారతీయుడవని మాత్రం గర్వించు. ప్రపంచానికంతా కన్ను సట్టేటటువంటి నైతిక దార్ఢ్యాన్ని, సత్సంప్రదాయాన్ని, ధర్మాన్ని మన పూర్వులు మనకు ప్రసాదించారు; భారతీయుడ వని చెప్పటం చేతనే చాలు నాలుగు కాలాలపాటు పరపతితో బ్రతుకగలవు అంటున్నాడు కవి:—

"తమతపస్సులు ఋషుల్ ధారవోయంగ
చండ వీర్యము శూరచంద్రు లర్పింప,
రాగరుద్ధము భక్తరాజు లీయంగ
భావసూత్రము కవి బాంధవు లల్ల
దిక్కుల కెగదన్ను తేజంబు వెలుగ
జగముల నూగించు మగతనం బెగయ
రాలుపూవులు సేయు రాగాలు సాగ
సౌందర్య మెగబోయు సాహిత్య మెప్ప
వెలిగిన దీదివ్యవిశ్వంబు పుత్ర!
దీపించె నీపుణ్యదేశంబు పుత్ర!
అవమాన మేలరా అనుమాన మేల
భరతపుత్రుడ నంచు భక్తితో బలుక"

వీరరసపూరితమైన కవిత్వం చెప్పి, దేశభక్తి పెంపొందించినవారిలో శ్రీ కోటగిరి వెంకటకృష్ణారావుగారొకరు. జన్మతః భోగియయ్యూ, జీవితంలో త్యాగాన్నే వరించి అసమాన దేశభక్తిని చాటారు. వీరు రాజుల్లో కవు లనిపించుకున్నారు; అంతేకాదు, అంతకంటే ఘనతరంగా కవుల్లోకూడా రాజులా ప్రకాశించారు. వీరికవిత్వానికి నిదర్శనాలు చూపింతును గాని, కావలసిన సామగ్రి లేదు.

ఇక శ్రీ విశ్వనాథసత్యనారాయణగారి "ఆంధ్ర ప్రశస్తి" వీరరసపూరితమైన ఆధునికకావ్యాల్లో అగ్రగణ్యమైంది. సత్యనారాయణగారికి 'ఆంధ్ర' శబ్దమంటేనే ప్రాణప్రదం. మనస్మృతులక్రిందను కూరుకుపోయి, కాలగర్భంలో నమసిపోయిన, లక్షోపలక్షల, కోటానుకోట్ల వీరాధివీరుల సముజ్జ్వలగాథలను పైకి త్రవ్వి వాటిపై మనదృక్కులను కేంద్రీకరింపజేసి, వారితో మనకుగల సంబంధబాంధవ్యాలను నిరూపించి, ఆగాథలనుండి మనకు ఒక దివ్యసందేశాన్ని ఎలా అందిస్తున్నాడో పరికించండి:—

"ఏరాజు పంచెనో యిచట శౌర్యపుపాయ
సమ్ములు నాసులచవితినాళ్ళ,
ఏయొజ్జసంజలో నెలమి పల్లవరాజ
రమణులు కాళ్ళ పారాణులిడిరొ,
చిత్రరథస్వామి శ్రీరథోత్సవములో
తెలుగుపిల్లలు కత్తి త్రిప్పి రెపుడొ,
ఏరెండుజాముల యిమనివేడిమివచ్చి
కలిసిపోయెనొ త్రిలింగప్రభువుల,
నాజగచ్ఛ్రీయసంబులై యలరుతొంటి
వేంగిరాజుల పాదపవిత్రచిహ్న
గర్భితమ్మైన యీభూమిఖండమందు
నక్షుపులుజార్తు) జీవచ్ఛవాంధ్రజనులు."

వేంగిరాజులతో మనకుగల ఆ రక్తస్పర్శను పురస్కరించుకొని మనల్ని రెచ్చగొడుతున్నాడు కవి!

సంస్కృతి అనేది ఒకటి మనకు వున్నంతకాలమూ, కవిఅనేవాడు ఒకడు మనకు వున్నంతకాలము ఒకనాటి ఆంధ్ర సామ్రాజ్యవైభవాన్ని మనం మఱచిపోగలమా?

ఈనాటి శైథిల్యాల్లో కవి ఒకనాటిసిరి సంపదలను చూడగలడు. ఆనాడు ఆంధ్రసామ్రాజ్యాని కంతటికీ ప్రధాన పట్టణంగా ప్రజ్వలించిన శ్రీ కాకుళం దానిపూర్వపు శోభతో, కళతో, అతిశయంతో యీ కవికి యిలాదర్శన మిస్తూవుంది:—

శ్రీకృష్ణవేణీ గరిష్ఠ పాథస్తరం
గాహత ప్రాకార మైన యదియు
బురుజుల దితిజసమూహ రక్తముగ్రోలు
వాల్కవోలు పతాక నాటినదియు
ఆంధ్ర వీరభటాళి కాత్మ శౌర్యంబుల
యందు శాణోపలంబైన యదియు
ఘంటశాలా పురకలిత పూర్వాంధ్రశి
ల్పాచార్యులకు తల్లియైన యదియు
రాజరాజాంధ్ర విష్ణుని రాజధాని
కలుషముల కెల్లపిడుగు శ్రీ కాకుళంబు
కన్నులకు గట్టినట్లుగ గానబడెడు
వేదకాలమునాటి ముత్తైదువట్లు”

వయస్సును మించిన ప్రతిభతో, యీయుగం అందుకోలేని ధైర్యస్థైర్యాలు, శౌర్యసాహసాలు హృదయాన్ని వుఱ్ఱూతలూపగా, కీ. శే. కొడాలి సుబ్బారావుగారు మనకు “హంపీక్షేత్రాన్ని” కానుకగా ఇచ్చారు. హంపీలోని ప్రతిశిల్పమూ, ప్రతిచిత్రమూ, ప్రతి అణువుకూడా యీకవికి జలదగంభీరమైన గాథల్ని వినిపించి మహాసముద్రమంత వీరరసావేశంలో ఇతణ్ణి తేల్చినై. ఆ రసావేశానికి ఫలితమే “హంపీక్షేత్రం” గతించిన ఆంధ్రతేజస్సును, మేధస్సును, విజయాన్ని, వైభవాన్ని, కళల్ని, శిల్పాల్ని మనకనులముందు నిల్పి భవిష్యత్తులో మన ముందున్న కర్తవ్యాన్ని నిరూపించింది “హంపీక్షేత్రం”.

ఈ విధంగా, యీ యుగధర్మాన్ని, అనగా స్వాతంత్ర్య పిపాసను నవకవులు వుపాసించారు; వుపాసిస్తున్నారు.

కవి అనుభవాన్ని పాడుకోవడమనేది యీనాటి కవితలో రెండవ పరివర్తన. దీనికే యింగ్లీషులో **Subjective poetry** అనిపేరు. కవిత్వంలో కవి యొక్క వ్యక్తిత్వం ప్రతిబింబిస్తూ వుండడమే యీ రచనయొక్క లక్షణం. వ్యక్తిత్వ మంటే కవిబాహ్య జీవితపరిచయంమాత్రమే మనకు లభ్య మవుతుందని భావించకూడదు. కవి, పద్యమనేతాళపుచెవి మన చేతులోవుంచి, తనహృదయంలో దాచుకున్న భావపేటికను తెరిచేందుకు అవకాశం కల్పిస్తాడు. ఇది ప్రతికవీ చేయడా? హృదయంలోని భావాన్ని ప్రకటించడమే గదా కవిత్వం! అని ప్రశ్నించవచ్చు. నిజమే, ప్రతికవీ తనభావాన్నే పాడుకుంటాడు. తన హృదయాన్నే కవనంలో బయల్పరుస్తాడు. కాని, స్వానుభవాన్నే పాడుకునేకవి ప్రత్యక్షంగా తన జీవితంలో ప్రతిబింబించిన నగ్నసత్యాన్నే ఆరాధిస్తాడు. జీవితంలోని మెరకపల్లాలు వున్నవి వున్నట్లు అతని కవిత్వంలోనికి దిగుమతి ఆయిపోతవి. కనుకనే, యీ శ్రేణికి చెందిన కవిత్వానికి అనుభవం ప్రమాణం; రెండవదానికి కేవలము ఊహయే ఆధారభూతము!

బహుసున్నితమైన హృదయంకలవాడు ఒకడు ప్రళయకాలాభీల జీమూతపటలం ఒక్కసారి తన జీవితాన్ని ఆవరించి వేసిందంటే నిస్సహాయుడై, దిక్కుతోచక దుఃఖాన్నే కౌగిలించుకుంటాడు. కౌగిలించుకొని తన అనుభవాలనే పాడుకుంటాడు. అప్రయత్నంగా, అయాచితంగా అట్టివాని నోట పాట, పలుకుతుంది. అతనికి కవిత్వమే జీవితంలో చేదోడువాదోడుగా వుండిపోతుంది. అదివినా అతడికి బ్రతుకులేదు. ఆయా సంఘటనల్లో, ఆయావ్యక్తుల మనోవర్తనాలు ఎలావుంటవో ఊహించి ఒకడు కవిత్వంవ్రాస్తాడు. జీవితంలో దెబ్బతిని కవిగా పలికే వాడికిన్నీ, అనుభవంలేక అనుభవాన్ని వూహించుకొని, ఆఊహను ఊతగా దీసుకొని కవిత్వం వ్రాసే వాడికీ చాలా భేదం వుంటుంది. స్వానుభవపూరితమైన స్వానుభవప్రేరితమైన కవిత్వంలో జీవితంలోని చేదు తీపులు రెండూ పాదుకొనిపోతవి. అందుచే ఈ కవిత్వంలో జీవమూ, బలమూ వేళ్ళుపాదుకొనివుంటవి.

ఈ **Subjective poetry** నేటి ఆంధ్రకవిత్వం లో ప్రబలిపోతూవుంది. ఆంగ్లకవిత్వంలోని నీడలు మనకవిత్వంలో ప్రసరించడం కూడా కొంతవఱకు ఈ పరివర్తనకు కారణభూతమైంది.

ఈ శ్రేణికి చెందిన కవుల్లో శ్రీ దేవులపల్లి కృష్ణ శాస్త్రిగారిని ఎరగనివా రుండరు. అతని "కృష్ణ "పక్షము లోని గానామృతాన్ని ఆస్వాదించని వారు లేరు. కృష్ణశాస్త్రి ప్రేమరసైకమూర్తి; నిర్మల ప్రణయారాధనలో అతడు యీవిశాలప్రపంచాన్నే మరిచి పోయాడు. అతని రాగానికి అంతం లేదు! ప్రళయకాల ఝంఝానిలంలోకూడా అది ప్రాతరనిలంలా ప్రసరిస్తూనే వుంటుంది. సున్నితమైన భావాన్ని, చక్కని వాజాలు అయినపదాల్లో అమర్చడంలో సిద్ధహస్తుడు. ఇతని పాటీలో కలిసల్పేందుకు మధురాతిమధురశబ్దములన్నీ పంతంమీద తరలివస్తూన్నవి తెరలు తెరలుగా, చూడండి!

"ఎలఁదేటి చిఱుపాట సెలయేటి కెరటాలఁ
బడిపోవు విరికన్నె వలపువోలె,
తీయని మల్లెపూదేనె సోనలపైని
తూగాడు తలిరాకు దోనెవోలె,
తొలిప్రొద్దు తెమ్మెర త్రోవలోఁ బయనమై
పరువెత్తు కోయిల పాటవోలె,
*　　*　　*
*　　*　　*
చిఱుతతొలకరివానగాఁ జిన్నిపావగఁ
బొంగి పొరలెడు కాల్వగా, నింగికెగయు
కడలిగాఁ బిల్లగ్రోవిని వెడలు వింత
తీయఁదనముల లీనమై పోయెనెడద!"

శబ్దసౌందర్యములో భావ సౌకుమార్యం చక్కగా తయ్యమ అమర్చుకోవడమనేది కృష్ణశాస్త్రి కవిత్వంలో ఒక ప్రత్యేకత! చాచిన హస్తాలకు ప్రేమ అందక పోయినా అనంతమైన అన్వేషణలోనే సంతృప్తి పొందుతూన్న ప్రేమపిపాసువు. అందని ప్రేమ దుఃఖంతో చెలిమి గూర్చింది యితనికి; దుఃఖం దుర్భరమైంది; క్రుంగి కృశించి నిలువునా నీరైపోతూన్న యీ ఆదర్శప్రణయమూర్తిని కవితాకన్య తన శీతల పరిష్వంగంలోనికి అందుకుంది; ఆమె ఔదార్యంలో ప్రణయగీతాలను పాడుకున్నాడు. ప్రేమ కొఱకు తన యాత్రను సాగిస్తూనే వున్నాడు; ఆ యాత్రకు అంతము వున్నదా?

"ఈప్రవాస యాత్రారతి నిటులె నేను
కదలి పోవుదు నాశావకాశములను
ఒక్క నిట్టూర్పువోలిక, ఒక్క మూన
బాష్పకణమటు, ఒక గాఢవాంఛ పగిది."

శ్రీ కృష్ణశాస్త్రి శ్రేణికి చెందిన కవుల్లో ఎన్న దగ్గవాడు శ్రీశివశంకరశాస్త్రి. శివశంకరశాస్త్రి మహాకవి; కాదు, కాదు. ఇతడే కవిత్వం, యితడే ఒకనిర్మల ప్రణయగీతం. ఆధునికకవిత్వానికి యితని "హృదయేశ్వరి" వెలలేనికానుక; అది మహాకావ్యం; అందు యితని భగ్నహృదయం ఆలపిస్తూన్న ఒక్కొక్కగీతం ఒక్కొక్కపిడుగులా కొండలాంటి గుండెనుగూడా తొలుస్తూవుంటుంది. ప్రియురాలిని వీడి తనకు దర్శనమిచ్చిన "పుష్యపూర్ణిమ"ను వుద్దేశించి, స్మృతి దుర్భరం కాగా యిలా అంటువ్నాడు.

"పుట్టినదా మెదొమావిమల
పూర్ణిమనే హృదయంబునందుచే
పట్టిన దస్మదీయమృదు
పాణిని మత్కరపల్లవంబునం
బెట్టె గతించిపోయె హృద
యేశ్వరి దివ్యవయోవిలాస మి
ప్పట్టున ఘోరమై మిగిలె
ప్రాణవిశోషకదుఃఖకీలియే."
"ఆయమ రొట్టెదో రెఱుగ
కక్కట! యొక్క నిమేషమేనియుం
బాయక నన్ను ఛాయవలె,
బాహు యుగమ్ము సమాశ్రయింపదే!
నీయుదరంబునందున జ
నించినదానిని నీకుమారికన్
న్యాయమె వీడి నీ విటులు
నాకు గనంబడ పుష్యపూర్ణిమా!"

ఈప్రపంచంలో అత్యంతసుకుమారు లయిన వారికే దుర్భరమైన వేదనలు ...

శే. బసవరాజు అప్పారావుగారు దీనికి వుదాహరణము. ఎంత సున్నితహృదయం గలవాడు! కాని, జీవితంలో అడుగు అడుగునకూ అతనిహృదయం గాయపడ్డది! దుఃఖానికే ప్రతికాదా? అనిపిస్తుంది. చుట్టూ ప్రళయంలా కష్టంమీద కష్టం కమ్ముకువచ్చింది; వికటాట్టహాసం చేసింది. ఓర్పూ, సహనమూ తెంచుకు పారిపోయినై. దుఃఖాతిశయం పొంగిపొరలి పెదిమల మీదకు వచ్చింది; అదే పాటగా మారింది; అది అతడికి భరింపలేనికష్టం ప్రసాదించిన ఉన్మాదావస్థ. దాన్నే మనం కవిత్వ మంటున్నాము. అతనిగీతాల్లో కాపురం పెట్టింది దుఃఖం; అతని గీతాల్లోని ఔన్నత్యానికి, ఔచిత్యానికి రసజ్ఞుని కన్నీరే ప్రమాణం!

ఉదాహరణకు యీగీతాన్ని అనుభవించిచూడండి:—

"కోయిలా కోయిలా
కూయబోకే,
సందెలూ బద్దలూ
చేయబోకే!
కోయిలా కోయిలా
కూయబోకే,
తీయని రాగాలు
తీయబోకే,
తీపితో నా మనసు
కోయబోకే!
కోయిలా కోయిలా
కూయబోకే,
చిట్టినీ జ్ఞాపకం
చేయబోకే,
చింతతో ప్రాణాలు
తీయబోకే!
కోయిలా కోయిలా
కూయబోకే!"

భరింపరానిదుఃఖం బరువైన పదాలు మోయలేదు అనేందుకు యీయనగీతాలు నిదర్శనం!

తమ అనుభవాలను పాడుకొన్నకవుల్లో శ్రీరామచంద్రప్పారావుగా రొకరు. సున్నితంగా భావిస్తాడు. భావించినదాన్ని జాగ్రత్తగా వ్యక్తపరుస్తాడు. ఈయన కవిత్వానికి అనుభవం జీవాన్ని పోస్తుంది. భాషలో గమనించవలసింది సౌందర్య సౌకుమార్యాలు!!

ఇంక శ్రీ వేదుల సత్యనారాయణగారు, అనుకున్న విషయాన్ని అనుకున్నట్లు రసజ్ఞునికి పాడి వినిపించడంలో యీయన నైపుణ్యం యిమిడివున్నది. తడితరులకు మల్లే యీయనా అనుభవాన్ని కవిత్వానికి పునాదిగా మార్చుకున్నాడు.

కష్టసుఖాలనుదాటి కవిత్వము తొంగిచూసింది శ్రీ ఊటుకూరు సత్యనారాయణరావుగారిని. జీవితంలోని చేదును రుచిజూచాడు; కవిత్వంలోని తీపును మనకు చూపాడు!

ఈవిధంగా అనుభవాన్ని పాడుకోవడమనేది ఆధునిక కవికి పరిపాటి అయిపోయింది. ఇది నేటి కవిత్వపు క్రొత్తపోకడగా!

సృష్టిసౌందర్యాన్ని, కర్షకవైభవాన్ని గానం చేయడం మూడవ పరివర్తన. దీనికి మార్గదర్శకులు శ్రీ దువ్వూరి రామిరెడ్డిగారు. భారతదేశానికి రైతు ప్రాణంవంటివాడు. పచ్చనిపైరు జూస్తే, ప్రతిభారతీయుడికీ ప్రాణం లేచివస్తుంది. ఎడ్లమెడలలోని మువ్వల గణగణలతో శ్రుతికల్పి పాడని కర్షకుడు లేడు మనదేశంలో. భూదేవిని ఉపాసించడంలో మనం అగ్రగణ్యులము; మనవృత్తి, మనబ్రతుకు అంతా వ్యవసాయమే. వ్యవసాయాన్నే కళగా ఎంచుకుంటాడు కర్షకుడు. అట్టికర్షకజీవితాన్ని అద్దంలోవలె చూపెట్టింది శ్రీ రామిరెడ్డిగారి "కృషీవలుడు". పచ్చనిపైరు అందజేసిన సందేశంలో రసావేశం పొందిన వారిలో అగ్రగణ్యులు రామిరెడ్డిగారు.

ఆధునిక కవిత్వంలో "ఎంకిపాటలు" ఒక్కటే ఒక్కతరగతికి చెందినవి. పాండిత్యానికీ, కవిత్వానికీ వున్న భేదాన్ని చూపడంలో, రెంటిపాలిమేరలు నిర్ణయించడంలో "ఎంకిపాటల" ఔన్నత్యం బోధపడుతుంది. ఎంకి — నాయుడుబావల ప్రణయతత్త్వాన్ని ఎంతసున్నితంగా ఆలపించినాడు శ్రీ నండూరి సుబ్బారావు! నాయుడుబావకి యీ ప్రపంచంలో ఎంకి ఒకభాగం గాదు; యీ ప్రపంచ మంతా కేరి

ఎంకిలో అణుమాత్రం. ఎంకి ఎలా కనబడుతూవుంది అతనికంటికి? శరజ్జ్యోత్స్నలోని ధావళ్యాన్ని, చల్లదనాన్ని, ప్రాతరనిలంలోని మృదుత్వాన్ని, మురిపేన్ని, ఉత్తుంగసముద్రతరంగోద్ధూతతుషారంలోని నైర్మల్యాన్ని, లఘుత్వాన్ని, కాదంబినిలోని తేజస్సును, గాంభీర్యాన్ని, శారికాకీరపంక్తిలోని సౌందర్యాన్ని సంగీతాన్ని—వీటి నన్నిటినీ ప్రోగుచేసుకొని నవనవోజ్జ్వలంగా ప్రకాశిస్తూ వున్న ఆదర్శప్రణయ స్వరూపిణిలా ఎంకి నాయుడుబావకి దర్శనమిస్తోంది!

"ఎంకిపాటలు" మన కవిత్వంలో యింకొక అంశాన్ని చక్కగా నిరూపించినవి. పొంగిపొరలుతూన్న ప్రేమగాని, క్రుంగదీసి కృశింపజేసే దుఃఖంగానీ కఠినపద బంధాలను ఓర్వలేవు. ప్రణయాన్నిగాని, దుఃఖాన్నిగాని ఒప్పించగల కవి హృదయంలోకి చూస్తూ కవనాన్ని అల్లుతాడేగాని, నిఘంటువులో జూచి పదాల్ని ఏరుకోడు. కవిత్వంలో ప్రతిబింబించే సౌందర్య సౌకుమార్యాలు మృదులస్వాదువచో వైఖరిచే కలితా ఆహ్వానిస్తవిగాని, రసాస్వాదనలో పానకంలో పుడకలా గొంతుపట్టుకునే పదాలకు వీలైనంతదూరంలోనే వుంటవి. కవికి ప్రప్రథమంలో సాక్షాత్కరించేది మహావేశం. తనగుండెను దడచెడుతూన్న ఆ ఆవేశానికి ఒక స్వరూపం యివ్వాలిగదా! అప్పుడుగాని కవికి భాష అవసరంరాదు. కాబట్టి, కవి తాను వాడుతూన్న భాషను దాటి తనకు ప్రథమంలో అప్రయత్నంగా, అయాచితంగా ప్రసన్నమయిన సున్నితభావావేశంమీదనే చూపులను కేంద్రీకరింప జేస్తాడు. అలా స్థూలమైనభాష సూక్ష్మాతిసూక్ష్మమైన భావానికి నీడలాంటి దని మాత్రమే చెప్పవచ్చు. జీవమూ, బలమూలేని భావాన్ని ఆడంబరమయిన శబ్దసముదాయంలో ఇమిడ్చ నేర్చినవాడు ఒక్కనాటికీ కవి అనిపించుకోడు. సరిగ్గా 'ఎంకి పాటల్లో' ప్రత్యక్ష మయ్యేది యీసత్యమే. శబ్దాడంబరానికి కవిత్వంలో స్థానంలేదని తెలుసుకున్నాడు శ్రీ నండూరి; కవికి సాక్షాత్కరించే దివ్యజ్యోతిని తదితరులకు కూడా చూపేందుకు కవి భాషను ఊతగా తీసుకుంటాడు. ఈ భాష అనే కిటికీ ద్వారా ఆ జ్యోతిని మనం మసగమసగ్గా మాత్రమే దర్శించగలం. సందు జేసుకొని సావకాశంగా కవి పొందిన మహావేశంలోకి చొరబడకపోతే మనం కవియొక్క భావనాపటిమను అనుభవించి, ఆనందించలేము! అలా పొలాలు దాటి పోతూన్న ఆపల్లెపడుచు, వ్యవసాయోద్యోగంలో పొలంలో అడుగు వెడుతూన్న ఆ కృషీవలుడు, ప్రవాసంలోనుండి ప్రియురాలి సందర్శనార్థం త్వరత్వరగా యింటిమొహం పెట్టి అడుగులు వేస్తూన్న ఆ బాటసారి — వీరందరూ కూడా "ఎంకి పాటల"ను పాడి, పాడించుకొని అందులోని అమృతఝురులను ఆస్వాదించగలరు.

"తీవ లెగలాగి బిగలాగి తీవరించు
నైణికులకున్, చిరంతనాభ్యాసపటిమ
స్వరములను ప్రస్తరించెడు పాటకులకు"
అబ్బవటువంటి
"అమృత సదృశమ్మయినగీతి"

నండూరివారి ఎంకికి అబ్బిందంటే ఆశ్చర్యమేముంది?

"ఎంకి పాటల" నుండి ఒక్క ఉదాహరణం—

ఎంకి — నాయుడుబావల సంభాషణయొక్క వైఖరిని పరిశీలించండి:—

"నీతో నె వుంటాను నాయుడుబావా!
నీమాటె యింటాను నాయుడుబావా!"
"సరుకు లేమి కావాలె సంతనపిల్లా?"
"నువ్వు
మరమమిడిసి మనసియ్యి నాయుడుబావా!"
"సక్కదనము కేమిత్తు సంతనపిల్లా?"
"నువ్వు
సల్లగుండు పద్దాక నాయుడుబావా!"
"యేడనే నీకాపురమొ రెల్లురుపిల్లా?"
"నీ
నీడలోనె మేడకడతా నాయుడుబావా!"
"నీతో నె వుంటాను నాయుడుబావా!
నీమాటె యింటాను నాయుడుబావా!"

ఆధునికకవుల్లో కరుణరసం ఒప్పించేపట్ల శ్రీ జాషువాది అగ్రతాంబూలం. జాషువాకవిత్వం నవం

నవనీతసమానము. భావమూ నవనీతంలాంటిదే; భాషా నవనీతంలాంటిదే! దానికీ, పూవుకూవలె భావానికీ, భాషకీ అవినాభావసంబంధం కుదిరిపోయింది యీ యువకకవిత్వంలో. మధురమైన భావానికి మధురమైన శబ్దాన్నే ఏరుకుంటాడు. ఈ యుగంలోని పరివర్తనలను సున్నితంగా గ్రహించాడు; పూర్వపుకవుల్లోని మంచిని తనదిగా చేసుకున్నాడు. అలా యీయన కవిత్వం, "క్రొత్తప్రాతల మేలుకలయిక."

ఈయనహృదయం ఆలపిస్తూన్న భావం ఏ శ్రుతిలో మోగుతుందో ఈయన పాళీనుండి స్రవించే భాష అదేశ్రుతిని అందుకొని, కవిత్వాన్ని ఒడుదుడుకులు లేకుండా నడిపిస్తుంది. భావానికీ భాషకూ యిలా పొందిక కుదిరిపోవడమన్నది అంత సునాయాసమైంది గాదు. కవులు చాలామంది తడబడేది యీ ఘట్టంలోనే. జీవంలేనిభాష భావాన్నీ, ఆభావాన్ని నడిపించే మహావేశాన్నీ చంపి తాను చచ్చిపూరుకుంటుంది. కవిభాగ్యరేఖ అలా తోసుకువస్తేనేగాని యిది కుదరడం దుర్లభం. దీర్ఘసాధనవల్ల రాదనడానికి వీల్లేదుగాని, అది సాధనలాగే వుండి సహజత్వాన్ని కోల్పోతుంది. పూర్వపు జన్మవాసన తఱుముకువస్తేనే నిజమైన కవి కాగలడనేందుకు జాషువాకవి నిదర్శనం. కవికి మేధస్సూ, ఛందస్సూ అవసరమే, కాని యీరెండూ వుండికూడా ఒకడు కవి కాలేకపోవచ్చును. కారణం, ఛందస్సు రూపంయిచ్చినా, మేధస్సు పాండిత్యం యిచ్చినా, కవితకు అనివార్యం హృదయం. జాషువా కవితాకన్య కోమలకుసుమగాత్రి; సౌందర్యంలో, సౌకుమార్యంలో, సౌరభంలో — అన్నిటాకూడా పువ్వులాంటిదే! కఠినపదాలకేసి, దీర్ఘసమాసాలకేసి, బెదురుచూపులు చూస్తుంది. మృదూక్తులకు మురిసిపోయి మురిపిస్తుంది. ఆ అనంత సౌందర్యలహరిలో యీనిరంతరవ్యథాకలితజీవితాన్ని క్షణమాత్రం మఱచిపోయేవాడే ధన్యుడు, రసజ్ఞుడు!

పువ్వుయొక్క సౌందర్య సౌకుమార్యాలు అది చెట్టుమీద వున్నంతవఱకే! చెట్టునుండి కోసిన మఱుక్షణంనుండీ వాడిపోతుంది. జాషువా కవితాకన్యకూడా యిలాంటిదే. కోమలకుసుమగాత్రి అవడంచేత కఠినమైన స్పర్శను ఓర్వలేదు; కందిపోతుంది. పదం తీసి, పదం వేస్తే రూపంపోయి, రూపం వస్తుంది. అసలు భావం మాటుపడి దానిస్థానే మఱొకభావం వచ్చి కూర్చుంటుంది. జాషువా అన్వయం అంత బిగువైనది; అంత గంభీరమైనది; అంత పరిపూర్ణమైనది. జాషువా కవిత్వంలో పాండిత్యముకొరకు వెదికితే నైరాశ్యం మిగులుతుంది; కళకొరకు చూస్తే, తన్మయత్వం కుదురుతుంది!

ఈకవి రాగం అనురాగం; యితని కవిత్వంలో కరుణరసం సమృద్ధిగా ప్రవహిస్తూవుంటుంది. ఇతడు పలుకునది తేనెలకురియు జాను తెనుగున. ఆధునిక కావ్యాల్లో మహాకావ్యం అయిన "పిరదౌసి"ని పాడుకొంటూ, కరుణరసభూయిష్ఠమైన ఆ కావ్యంమీద ఎందరు రసజ్ఞులు కన్నీరు చిందింపలేదు? ఈకవి ప్రతిభకు ఆ రసజ్ఞులకన్నీరే ప్రమాణం. కవికి అంతకు మించి కావలసినది ఏమున్నది? రసజ్ఞుడు తల వూపితే కవిహృదయము చల్లబడుతుంది! కవికడుపు మాడ్చుకొని అయినా, గుండెనింపుకుంటాడు!!

ఇక యితని "పిరదౌసి"నుండి ఉదాహరణలు రెండు చూతాము. పిరదౌసీకవి అడవులబడి పోతూన్న ఘట్టములో యితని కవితాధార అనర్గళంగా ప్రవహించింది. సృష్టిలోని ప్రతివస్తువులో కూడా పిరదౌసీకవి సృష్టికర్తను చూడగల్గుతున్నాడు; మాచి రక్షించమని వేడుకుంటున్నాడు దీనంగా. ఈ ఘట్టంలో జాషువాకవి భావనాశక్తి యెట్లు పరువిడుతున్నదో యీ పద్యం చూడండి:—

"ఆగడపుమబ్బుశయ్యల నపరశిఖరి
బుడుతచంద్రుఁడు నిద్దుర వోవుచుండె
ఈ చెఱువునీట నతని కుయ్యెలలు కట్టి
జోలపాడుచు నావంకఁ జూడవేమె?"

ఆకాశంలో ప్రయాణమై పోతూవున్న యీ చంద్రుడు మబ్బులనే శయ్యగా అమర్చుకున్నాడట! అంతటితో ఆగలేదు. ఈ కవినేత్రానికి చెఱువు నీటిలో ఆ చంద్రుని ప్రతిబింబము, చంద్రుడు మబ్బుశయ్యలలో పండుకొని యీ చెఱువునీరు అనే ఉయ్యెలలో ఊగుతున్నట్లు కనబడుతూ

వున్నది. కదలుతూవున్న నీరు ఉయ్యాల ఊగుతూన్నట్టు కవికి కనిపించడంలో ఎంత భావనాశక్తి వున్నదో చూడండి! మరి, యీ వుయ్యాలకు రజ్జువు లేవి? నీటికీ, ఆకాశానికీ మధ్య ప్రసరిస్తూన్న ఆశీతలమయూఖపరంపరయే! ఈ వుయ్యాలను ఊపువారెవరు? మనకు కనబడక సృష్టినంతటినీ నడుపుతున్న అమృతహస్తమే యీ వుయ్యాలను వూపుతున్నది. ఆహా యిట్టిభావౌన్నత్యానికి ప్రతికవీ అర్రులు చాచగలడా? పిరదౌసిలో యిట్టిపద్యాలు వందలూ, వేలు.

ఇంకా యెందరో వున్నారు చక్కగా వ్రాయగల ఆధునిక కవులు. శ్రీ కొడాలి ఆంజనేయులు గారు మృదుపదాలతో కవనాన్ని అల్లడంలో నిపుణులు. వీరి కవితాకన్యకు గంభీరమైన ఒక మందగమనం వన్నెగూరుస్తూ వుంటుంది.

ఇలా ఆధునిక ఆంధ్రకవిత్వము వివిధములైన అందచందాలతో అలరారుతూవున్నది. శరచ్చంద్ర సముజ్జ్వల జ్యోత్స్నాప్రసరంలో ఆనందించలేక చందురునిలోని మచ్చను జూపేవారు రసజ్ఞులనిపించుకుంటారా? వారు కవిత్వానికి వీలైనంత దూరంలో వుంటేనే మంచిది. కవితామాధ్వీకరసాస్వాదన సంజనితతన్మయసుషుప్తిలో ఆనందమయస్వప్నాలు గననివారు వుంటారా?

గతించిన భూతమంతా దివ్యమనిన్నీ, జరుగుతూన్న వర్తమాన మంతా వ్యర్థ మనిన్నీ తలచూ మనం భావిస్తూవుంటాము. పూర్వపుకవుల్ని పూజించవలసిందే! కాని, సమకాలికులను చులకనజేయరాదు; గడచినదాన్ని ప్రశంసిస్తూవుండడం, ప్రస్తుతాన్ని నిరసించడమనేది స్వభావసిద్ధంగా మానవుడుపడే అపోహ.

కాబట్టి కవి ప్రశంసకొఱకు వేచియుండ నవసరం లేదు; కవికి కవిత్వమే బ్రతుకు; పాడుకుంటేనే గాని అతనిగుండె కుదుటబడదు; అతడు నిరుత్సాహపడకూడదు. లోకంలో రసజ్ఞులు లేకపోలేదు.

ఈవిధంగా, కృష్ణశాస్త్రి పాటలోని సొంపులతో నాట్యభంగిమాలు అభ్యసిస్తూ, జాషువా అందిస్తూన్న కరుణరసంతో పెదవులు తడిజేసుకుంటూ, పచ్చనిపైరుతో పరిచయంజేసుకున్న రామిరెడ్డిపాళీ సౌందర్యరేఖలు దిద్దుతూవుండగా, రాయప్రోలు 'జడకుచ్చులు' సవరింపగా విశ్వనాథునిపాళీని తళుకు వచ్చిన "హీరకోటి బాహాసముదీర్ణ ఖడ్గగళితాంచితకాంతుల"తో చెలిమిజేసుకుంటూ, నండూరి వారియెంకికి మరమమిడిసి. మనకిచ్చిన నాయుడుబావ నిర్మల ప్రణయరాగానికి తన హృదయస్పందనతో తాళంవేస్తూ, అదృశ్య సౌందర్యోపాసకులై, ఆదర్శ ప్రణయమూర్తులై, సౌదామనీ ప్రభాకలితులై అలరారుతూవున్న ఆంధ్రకవితాకన్యకు జోహారులు!!

"ఓరిబాలక నీదు మురళీరవంబు
వ్యర్థమావని చిత్తతాపంబు వలదు
రాగపరిచితు డెవ్వడో రమ్యగీతి
వినియెయుండు నానందంబు వెల్లివిరియ."

సుగాలిపిల్ల

శ్రీ గుత్తి హెచ్. శంకరరెడ్డి.

౧

జిలుఁగుటొందెలు లేఁతచిన్ని కాళ్లకు మధుస్వనము లీనుచుఁ గొంత సందడింప
తళ్కులఁ జిందు పెద్దాటంకయుగళి వీనులఁ గౌఁకళింపుచు నలరుచుండ
గాలికిఁ దూఁగాడు క్రమపు ముంగురుల్ ముఖమండలంబున ముద్దు లొలుక
సౌదామినీలతల్ జాల్వారుతీరునఁ జాలుకుచూఁపులు ముందు నులుకుచుండ

నగము కప్పిన పయ్యెద జాఱుచుండ
పాదముల్ సంభ్రమింపఁగ భారమైన
కాష్ఠబంధంబు తలనిడి ఘననితంబ
యుగళ మసియూడవచ్చుచునుంటి వబల.

౨

సుందరి! నీకపోలములె సూప ససంస్కృతి వెల్గిదాన! నీ
పందపురూపు యిట్టిదని యైన నెఱుంగవు నించుకంత యుం
దందు విహారముల్ సలుప ధాత్రిపరాగము పూఁతయయ్యె మా
కందె విచారజాల మతి గాఢములైనవి మామకవ్యథల్.

3

పదియు నాతేండ్ల ప్రాయము వదలిలేదు
లేఁతబుగ్గల మిసిమికిఁ గొఱతలేదు
పట్టి యదిమిన పాల్గారు బాల, నిన్ను
కఠిను డెవ్వఁడు పంపె నీ కార్యమునకు.

వ్యావహారిక భాషావశ్యకత

శ్రీ వేదుల వెంకటనరసింహశాస్త్రి

జనులు పరస్పరము వారివారి యాశయములను ప్రకటన చేసికొనుటకు ముఖ్యసాధనము భాష. పూర్వమందు పరస్పరభావములను సంజ్ఞలవలననే ప్రకటన చేసికొనుచుండెడివారు. ఇట్లుండ కొంతకాలమున కవ్యక్తమగు శబ్దము బయలువెడలెను. అట్టి శబ్దముచే కొంతవఱకు సంజ్ఞ యక్కరలేకుండనే అన్యోన్య భావప్రకటన కాజొచ్చెను. నేడుగూడ మూగవారి భాష కొంతవఱకు గ్రాహ్యమే. ఇట్లు బయలుదేరిన యవ్యక్తమగు శబ్దము మరికొంత కాలమునకు కొంత స్పష్టము గాజొచ్చెను. అది ప్రస్తుతము నేడు కొంతమంది జనులు మాట్లాడు ముద్దుమాటగా నుండియుండును. ఇట్లే (అనగ ననగ రాగ మతిశయిల్లుచు నుండు) ననునట్లు భాష స్పష్టముగాను, విశదముగాను బయలుదేరెను. భాష మున్ముందు వాగ్రూపముగానే యుండినది గాని లిఖితరూపమును బొందలేదు. కొంతకాలమున కవ్యక్తమగు ధ్వని సువ్యక్త మగున ట్లేతీరున మారెనో యదేవిధమున భాష లిఖితరూపమును దాల్చవలసివచ్చెను. కొన బుద్ధిశాలులగు పండితు లా భాషయొక్క ధ్వని ననుసరించి యక్కరములను సృజించిరి. దానిమూలమున క్రమక్రమముగా నభివృద్ధి జెంది భాష లిఖితరూపముగాను, వాగ్రూపముగాను మారెను. అట్టి భాషే క్రమక్రమముగా గ్రంథములందు ప్రవేశించెను. మున్ముందు సంస్కృత వాఙ్మయమునందు వాడుకలోనున్న పదములే వాల్మీకిచే రచింపబడిన యాదికావ్య మను రామాయణమునందు వాడబడెను. పిమ్మట సంస్కృతవాఙ్మయమునందు జాలవఱకు గ్రంథజాలము వెల్వడెను. అందలిభాష యానాటి వ్యావహారికభాషయే. తరువాత లక్షణగ్రంథములు బయలుదేరినవి. ఏ వాఙ్మయమందైనను లక్ష్యమున్న పిదప లక్షణము బయలుదేరును. అట్లే సంస్కృత వాఙ్మయమందును లక్ష్యజాల మెక్కుడు గాజొచ్చిన పిదపనే లక్షణగ్రంథములు బయలుదేరినవి. అందు చంద్రవ్యాకరణ మరియు, మార్యవ్యాకరణ మనియు మున్నగునవి చాలవఱకు బయలుదేరెను. అందలి విషయ మంతయు శబ్దముల సాధుత్వాసాధుత్వ ప్రకటనమూ, శబ్దోత్పత్తిక్రమమూ, శబ్దముల మార్పునై యుండును. రానురా నాభాషయంతయు పాణినినాటికి సంస్కారమును గోరియుండెను. అత డట్లు సంస్కరించి వైయాకరణు డని పిలువబడి నేటికిని పాణి న్యాచార్యు లని పూజ్యమగు నాచార్యపదముచే జనుల మన్నలను బొందుచున్నాడు.

ఇది యిట్లుండ నాతనికాలమునకు పిదప వాఙ్మయము మారజొచ్చెను. ఎట్లన? పాణిని "దామహాయనా న్తాచ్చ"యని లక్షణ మొనర్చి 'ద్విహాయనీ' మున్నగు ప్రయోగముల సాధించెను. కాలవశముచే త్రిహాయణీ మున్నగునవి కొన్ని నకారస్థానమందు ణకారముతో గలసి యుచ్చరింపబడుచుండెను. అట్టి వానిని పరిశీలించి వృత్తికారుడగు వామనాచార్యుల వారు వీనికిగూడ సాధుత్వమును గల్పించుచు "త్రిచతుర్భ్యాం హాయనస్య ణత్వం వాచ్య"మ్మని వార్తికమును గావించెను. అందువలన నాతనికాలమందు వ్యవహరింపబడుచున్న త్రిహాయణీ, చతుర్హాయణీ మున్నగునవి సాధువులాయెను. ఇదియేగాక పాణిని నాటికే ఒకశబ్దము రెండు, మూడురూపములతోగూడ వ్యవహరింపబడుచుండెను. అందులకే యాతడు "మనోరావా" యను లక్షణముచే మనుశబ్దముయొక్క రూపత్రయమును సాధించెను. మనావీ యనునది మనాయీ యనిగాని, మనాయీ యనునది మనావీ యనిగాని మారియుండును. ఆమార్పు నంగీకరించినట్లు పైచెప్పిన సూత్రమే యాధారము. ఇట్లే పాణిని లాక్షారోచనశబ్దములకంటె "తేన రక్త"మ్మను (దానిచే రంగు వేయబడినది) నర్థములో "లాక్షారోచనాట్

అని కక్ ప్రత్యయమును విధించెను. వార్త్తికకారుని కాలము నాటికి కక్ప్రత్యయము వచ్చిన సిద్ధించు రూపములవంటివి మరికొన్ని వాఙ్మయమందు బయలు దేరుటచే నాత డాశబ్దములను ప్రయోగదృష్టితో జూచి యందలి నిజానిజముల పరిశీలించి "శకలకర్దమాభ్యాముపసంఖ్యాన" మ్మని పూరించెను. ఈపై విషయముల నన్నింటిని బరిశీలించినచో వాఙ్మయము మారుట, అట్టి మారిన వాఙ్మయమును సంస్కరించు కొనునట్టి యావశ్యకతయు గలదని తెలియుచున్నది.

ఆవిధముననే నన్నయకాలమునాటికి ఆంధ్ర వాఙ్మయ మభివృద్ధి బొందుచున్నది. అట్లనుట కాతని దనబడు లక్షణగ్రంథమే ప్రమాణము. అది సంస్కృత భాషాఘటితమని చెప్పవచ్చును. లక్షణ మనునది లేనిచో లక్ష్యమందనాదరము బయలుదేరును. అందువలనే ప్రతి వాఙ్మయమునందును లక్షణములు బయలు వెడలినవి. చింతామణిలో నర్ధబిందు వెట నుండవలయునో, పూర్ణబిందు వెట నుండవలెనో నిర్ణయించుపట్టున నున్న సూత్రములను బరికింపవలసియున్నది. అందు మూలముననే "హ్రస్వాత్పూర్ణో౽పి భవేత్" అని చెప్పి "దీర్ఘాచ్చేత్ ఖండ ఏవ స క్షేయ" యని విధించెను. హ్రస్వముమీద నున్న యరసున్న పూర్ణబిందువుగా గూడ మారుననియు, నదియే దీర్ఘముమీద నున్నచో లక్షణమువలన బూర్ణబిందువు చేయరా దనియు చెప్పెను. అనగా నంతకుబూర్వము వాండు, వీండు, లేండు, తేండు, మున్నగు పూర్ణబిందువులు వాడుకయందున్న వని దెలిసికొనవలయును. వానిని పామరుల వ్యవహారమందు మిక్కిలి చూచుచుండెడివారు. ఇది యునుగాక సామాన్యజను లెవరైన నట్టివి వాడినచో నవి శిష్టజనవ్యవహృతములు గామియు సూత్రముచే నిషేధించె నని తెల్లము. ఆలాగే "లుక్ సంశ్లేషౌ నాచి ద్రుతస్య" యని ద్రుతమున కచ్చు పరముగానున్నపుడు ద్రుతమునకు లోపసంశ్లేషముల నిషేధించియు దాను ప్రయోగించియుండెను. అచట పరమార్థమే మన వాఙ్మయమునం దిట్టిరూపములు మెండుగా నుండరాదనియు దాను ప్రయోగించుటచే శేషైన కొలది రూపములు శిష్టజనవ్యవహృతము లన్నచో గ్రహింప దగు ననియు నన్నయయాశయము గానోపు. అదిగూడ మారుచుండె ననుటకు దరువాత బయలుదేరిన అహోబలపండితీయము, అథర్వణకారిక మున్నగు వ్యాకరణములే ప్రబలములగు ప్రమాణములు. ఈవ్యాకృతులు సంస్కృతమందువలెనే మఱికొన్ని శిష్ట జన వ్యవహృతములగు పదములకు సాధుత్వమును గల్పించినవి. పిదపగూడ నాంధ్రవాఙ్మయమున లక్షణగ్రంథములు బయలుదేరెను. అందు నేడు ముఖ్యముగా నాదరణీయమును, ఆచరణలో గలదియు నగునది బాలవ్యాకరణము. దీనిని రచించినవాడు పరవస్తు చిన్నయసూరి. అందు కూతురను, కూతురిని, కూతురులు, మున్నగునవి యసాధువు లని చెప్పబడెను. అంత మాత్రముచే పూర్వవ్యాకరణము గాజాలదుగదా? ఇక పూర్వవ్యాకరణానుసారము వ్రాసె ననిగాని, కొలది నుండి మహాకవుల ప్రయోగములను సంస్కరించు దృష్టితో వ్రాసెననిగాని చెప్పికొనవలసియున్నది. ఆమహాకవు లయినను, విశేషముగా దనప్రణాళిక కనువనునట్టి ప్రయోగములను జేసినవారినే గ్రహించినట్లు తెల్లమగును. అందును "చలిమలవల్ల నల్ల సిలు చల్లదనంబును నూనకుండినన్" అను మనుచరిత్రప్రయోగమును సాధించనేలేదు. పోనీ మనుచరిత్రను ప్రమాణగ్రంథముగా గైకొనలే దంటుమా యది యసంబద్ధము. "కర్మధారయంబునందు పేదాదులకాలుశబ్దముపరమగునపుడు రుగాగమం బగు"నని సూత్రించి దానిక్రింది వివరణయందు "ఇందు జవ్వనిశబ్దమునకు జవాదేశంబగు నని యెఱుంగునది" యని చెప్పి "ఏకాంతమునందున్న జవరాండ్ర"నని యాతని ప్రయోగమునే లక్ష్యముగా జూపెను. కావ నిట్టివానిని బరిశీలించినచో సూరి తన కనువగునట్టి ప్రయోగములనే సాధింపబూనె ననుట నిర్వివాదాంశము—

లక్షణకర్త స్వతంత్రుడై యుండవలెను. వాని కనుకరణము పనికిరాదు. స్వతంత్రత యనగా ప్రాచీన లక్షణకర్తల యాశయమునే యనుసరించి, యాతని నాటికి వాఙ్మయము నందున్న నూతన ప్రయోగములను గూడ సంస్కరింపబూనుట. అట్లు గాకుండ ప్రాచీనానుసారముగా నాయా వ్యాకృతు లందలి సూత్రముల ననుసరించినమాత్రముననూ, నాకాళించిన లక్షణము

నన్నయాదులకును సమ్మతమే యని యే బహుళగ్రహణముచేతనో ఈవిషయమును నన్నయయే ప్రకటించె ననుటయు జేసిన లక్షణకర్త గాజాలడు. అట్టివాడు లాక్షణికపదముచే వ్యవహరింపబడును. అట్లు లాక్షణికపదముచేగాని, వైయాకరణపదముచే గాని వాడు వ్యవహరింపబడవలయును. కాని వ్యాకర్త యనుట పొసగదు. అట్లయినచో నేడు సూరికి వ్యాకర్త యను పద ముండరాదని తలచరాదు. తెనుఁగు నానాటికి వృద్ధి బొందుచున్నది. కాన నేడు తెనుగున వ్యవహరింపబడు వానినికూడ సాధింపవలయును. అట్లు సాధించి ప్రయోగములనుగూడ జూడవలయును. కాని వాడు భాష యభివృద్ధి బొందజాలదు. భాషాభివృద్ధి లేనినాడది మృతభాష యనబడును. అందులకే నేడు కొందఱు ఆర్యభాషయగు సంస్కృతమును మృతభాష యనుపదముచే వ్యవహరించుచున్నారు.

భాష వ్యాప్తిపొందినది. ప్రయోగముల ననుసరించి వ్యాకృతులు బయలుదేరె నని పైని వివరింపబడియేయున్నది. అందును దెనుగు ముఖ్యముగా నా సూత్రమునే యాధారముగా గొనియున్నదనుట నిర్వివాదాంశము. అట్టి ప్రయోగదృష్టమగు భాషనే గ్రాంథికాంధ్రమందురు. ఆగ్రాంథిక భాష శిష్టజనవ్యవహారమూలకము. శిష్టులనగా విద్యావంతులు. ఆపండితులు వ్యవహరించుమాటలన్నియును గ్రాంథికమున జేర్పవచ్చును. అట్టిదానికే నేడనుశాసన మావశ్యకము. పూర్వము గూడ నట్లే యనుశాసనమును జేసిరని యాయాగ్రంథములవలన దెలియనగును.

భాషయనునది ప్రవాహరూపముగా నుండును. ప్రవాహమున కిరుప్రక్కల గట్టు లుండునట్లే వాఙ్మయమున కిరువైపులను ఛందోవ్యాకరణము లను తీరములున్నవి. గట్లకు లోనయి ప్రవాహ మేతీరున విచ్చలవిడిగ ప్రవహింపనేరదో, అదేవిధమున ఛందోవ్యాకరణము లను గట్లచే నిరోధింపబడు వాఙ్మయలహరియును విజృంభింపనేరదు. కాన వాఙ్మయమునకు లక్షణనిరోధము పనికిరాదనకూడదు. కాలానుగుణముగా నేవిధమున ప్రవాహవేగముచే గట్లుకొట్టుకొనిపోవునో యదేవిధమున గొన్ని కొన్ని స్థలములందు వాఙ్మయ ప్రవాహము లాక్షణిక జన్యమగు నవరోధమును బోగొట్టినను తప్పిదము గానేరదు. ఆ ప్రవాహము కొట్టుకొని పోవుచుండ కొన్ని కొన్నిచోట్ల గ్రామాదులకు నష్టము గల్గుట లోకవిదితము. అపుడు దానికి కట్టడములు గట్టుటయు విశదమే. అదేతీరున వాఙ్మయము కుమార్గముల బెంబడి పోయి యపకారకారి యగుచో నట్టిచోట్ల లక్షణము నతిక్రమింప వచ్చును. మంచిమార్గముల నేకరించవచ్చును. అందుల కుదాహరణములు చూపవచ్చును. చిన్నయసూరి "ప్రథమేతరవిభక్తి శత్రర్థంబులంగున్న యుకారంబునకు సంధి వైకల్పికముగా నగును" అని సూత్రించెను. ఆలక్షణముచే నిపుడు భిక్షుకున్ + ఈక్షించె నని యుండ సంధిజేసినచో "భిక్షుకీక్షించె"నని రూప మేర్పడి ద్వితీయార్థప్రతీతి కలుగనేరదు. ప్రథమార్థప్రతీతియే గల్గును. అచటనే గాక - పందెము + ఒడ్డన్ అని యుండ నిత్యప్రవృత్తియగు "ఉత్తున కచ్చు పరమగునపుడు సంధి యగు"నను సూత్రముచే సంధిచేసినచో నశ్లీలార్థప్రతీతి గల్గును. గాన దానిని విడువ వలయును. కాన నిట్టిస్థలములందు లక్షణతిరస్కార మవశ్యము చేయవలసి యుండుటచే నిత్యసూత్రముగదా యని లక్షణమును ప్రవర్తింపరాదు. కనుక నెచట సంధిచేయుచో నర్థప్రతీతి చెడునో, ఎచటనశ్లీలార్థ స్ఫూర్తి కలుగునో, ఎచట బాగుండదో, ఎచట మఱియొక యర్థము స్ఫురించునో యచ్చట లక్షణనిరోధము నతిక్రమింపవలయును. అదే శరణ్యమయినట్లు నేటి రాజకీయపరిస్థితులవలన గూడ దెలియుచున్నది. రాజకీయ వ్యవహారము లెచట విషమించుచున్నవో అచట శాసనోల్లంఘనము జరుగుచునే యున్నది. అట్లే భాషకుగూడ శాసనోల్లంఘనము కొలదిస్థలములం దావశ్యకమై యున్నదనిన లాక్షణికులకు కినుక జనించరాదు. అట్లతిక్రమించవచ్చునని లాక్షణికులు గూడ నభ్యనుజ్ఞ నిచ్చియున్నారు. కనుకనే "అచ్ఛికసమాసంబులం దఱచుగ వర్గలోపాగమాదేశలోపంబులు పెక్కు తెఱంగుల గానంబడియెడి" ననునట్టివి లాక్షణికులచే పేర్కొనబడెను. కూతురు మున్నగు ప్రయోగములు పెక్కుకవులచే వాడబడినవి. అట్టికవులను నేడు కొందఱు లాక్షణికు లనరు. అంగీకరింపరనుటకు మనము [illegible]

కొందరు శ్రీమదాంధ్ర భాగవతకర్తయయిన బమ్మెర పోతనామాత్యునే లాక్షణికుడు గాడని నిరసించుచున్నారు. ఇట్టివా రెట్టికార్యములను జేయుటకును వెనుదీయ రనుటలో సందియ ముండరాదు.

పూర్వకాలమందలి శిష్టభాషయే నన్నయాదుల గ్రాంథికభాష. వారు గ్రాంథికమున కని యొకతీరునను, వ్యావహారికమున కని వేరొకతీరునను వాఙ్మయమును రెండు విధములుగా నొనరించియుండలేదు. అపుడు వస్తాఁడు, తెస్తాఁడు మున్నగునవి శిష్టులు వ్యవహరించియుండరు. కాన నది యాకాలమందు గ్రామ్య మాయెను. అంతియగాక సూరిగూడ గ్రామ్యభాషను లక్షణబద్ధ మొనరించుచు "ఆర్యవ్యవహారంబుల దుష్టంబు గ్రాహ్యం"బని చెప్పియున్నాడు. కాన గ్రామ్యభాష యయినను శిష్టు లుచ్చరించిన నైనచో దప్పక గ్రహించి గ్రంథములందును వాడవచ్చునని చెప్పెను. కాన నాకాలమందువలె నేడు గూడ శిష్టజనవ్యవహారయోగ్యమగు భాషను గ్రంథబద్ధము చేయుటకు ఆటంకపరుచుట న్యాయము కానేరదు. భాష పల్కుబడినిబట్టి మారి యీయపభ్రంశరూపములు గల్గియుండవచ్చును.

భాష మారుట కనేక కారణము లున్నవి. అందు దేశకాలములు, వాతావరణము, అవయవ వ్యత్యాసము, మండలభేదము మున్నగునవి ముఖ్యములు. అందు దేశభేదముచే మారుననుట కుదాహరణము:—మనము (ఆంధ్రులము) యకారమును బల్కుచోట బెంగాలు దేశీయులు జకారమును బల్కుదురు. యథా యనుటకు జథ యందురు. వకారము నుచ్చరింపవలసినచోట బెంగాలు దేశీయులు బకారమును బల్కుదురు. ఇట్టివి దేశభేదముచే గల్గినవి.

కాలమువలన మారు ననుటకు:—ఒకకాలమం దొకవిధముగా నుండుభాష నేడు మరియొక విధముగా నున్నది. నన్నయకుపూర్వము వాండు మున్నగునవి యున్నను నన్నయనాటికి అర్ధబిందుఘటితములే యుండెను. అది చింతామణివలన విశదమే. సందేహ ముండరాదు.

వాతావరణముచే మారు ననుటకు:—శబ్దము గాలివలన విస్తృతి నందుననుట నేటి పరిశీలకులకు విశదమే. అట్టిది వాయుప్రసారముచే గల్గును. ఒకడు కొంతదూరమం దుండి యొకనిని, రామయ్యా, యని పిలిచినచో నది కామయ్యా యన్నట్లుగాని, సోమయ్యా యనునట్లుగాని వినిపించుట యందరకును విశదమే.

శీతోష్ణస్థితిచే మారు ననుటకు:— మన మొక మాట మాట్లాడునపుడు శీతలబాధచే వడకుచుండినచో నయ్యది వినువారికి వేరుగ వినబడును. అదేశబ్ద మున్ష్ణదేశమం దున్నవారు వేర్వేరుగా నుచ్చరింతురు. అవయవాదులచే మారు ననుటకు:— నత్తిగలవాడుగాని, చెవిటివాడుగాని మాట్లాడునపుడు వేర్వేరుగను మనకు బొడగట్టును. నత్తికలవాడు మాట్లాడునపుడు కొన్నికొన్ని లోపించును. కృష్ణుడు అనుచో నత్తిగలవానికి వాలిక స్వాధీనము గాక కుట్టుడనిగాని కుష్ణుడనిగాని యనుట మనకు విశదమే. చెవిటివాడు మాట్లాడునపుడు వానికి శ్రోత్రేంద్రియము వలన గొలదిలోపము గల్గును. ఇట్లే నేటి దేశనాయకులలో ననగా నితరదేశపువారు **"But"** యను దానిని మన ముచ్చరించునట్లు బట్ - అనిగాక - బత్ అనుట విశదము. పామరులుగూడ లక్ష్మియనుటకు నచ్చియని పల్కుదురు. ఇట్లే వారి భాషలో లకారములు నకారములుగను, నకారములు లకారములుగను మార్పునందుచున్నవి. కేవలము పామరులే గాక యితరులును "సైంధవునద్దు" అనుచో "సైంధవలద్దు" అనుట విశదమే, బాలురు "రాముఁ"డనుటకు బదులు "లాము"లనియును, రా, యనుటకు బదులు - లా-యనియును వ్యవహరింతురు - ఇది వయస్సుచే మారెననుటకు నిదర్శనము. ఈపై జూపిన యుదాహరణములచే భాష మారుననుట కావంతయు సందియ ముండరాదు. ఇవియేగాక యన్యదేశ్యములగు "డాక్టర్, కలక్టర్" మున్నగునవి పామరులు మాట్లాడునపుడు—డాగుదో రనియు, కలకటే రనియు నందురు. అచట వారికి వాగింద్రియము స్వాధీనము కాకపోవుటయే హేతువు.

మన యాంధ్రవాఙ్మయమునందు కేవల మచ్చ తెనుంగుపదములు (దేశ్యశబ్దములు) యిల్లు, ముల్లు,

ఊరు, పేరు, మున్నగునవి కొలదిగా లెక్కకు సరిపోయినవి గలవు. కనుక భాషయభివృద్ధి బొందనేరదు. అందులకే విశేషముగా నేడు సంస్కృతాదిశబ్దములు తెనుగునందు తత్సమ తద్భవరూపములుగా నున్నవి. అట్టి భాషనే గ్రాంథికమందు వాడియున్నారు. కేవలము తెనుగుశబ్దములు తక్కువనుటకు నచ్చతెనుగుకావ్యములు ఆంధ్రవాఙ్మయమందు కొలదిగా నుండుట కారణమగును. ఆనాడు సంస్కృతవాఙ్మయము ప్రబలియుంటచే నాంధ్రమందు సంస్కృతాది పదములు మెండుగా గలవు. కృష్ణదేవరాయల కాలమునాటికి ఆంధ్రవాఙ్మయమందు తురకభాషాపదములు ప్రవేశించెను. పెద్దన్నయే ప్రయోగించెను. నంది తిమ్మన గూడ నిట్టి తురకపదములను ప్రయోగించెను. అలాగుననే భాషయొక్క వృద్ధియగును. ఆకాలమందే, మునసబు, తహశీల్దారు, మున్నగు తురకపదములు వాఙ్మయమం దుండియున్నవి. అట్లే నేడు మనదేశమునకు నన్యదేశమునకును సంబంధము పాలనాద్యనేకవ్యాపారములందుండుటచే నాయాంగ్లపదములు **Glass, Light, Lamp, Bench, Chair** మున్నగునవి యనేకపదములు తెనుగునందు గలవు. అవి విరళముగా గ్రంథములందును గన్పట్టుచున్నవి. మహాకవి, కళాప్రపూర్ణాదిబిరుదుల నొందినవారుగూడ "పేపరునందు" మున్నగునవి వాడియున్నారు. అట్టివారు వ్యవహరించిన భాషకు మనము లక్షణమును గల్పించుకొనవలసినదేగాని యవి సహజము గాదని దానిని నిరసించరాదు. నిరసించినచో నట్టివానిని మనము పోనొట్టుకొనినవార మగుదుము. కాన దానిని సంస్కరించి మనము గ్రహింపవలయును. పోతనాదులు తావున్నగు నన్యదేశ్యములనుగూడ వాడినారు. అయినను బహుళముగా లేదు. కాన నిట్టివానిని విరళముగా బ్రయోగించుటకు ననుమతి నీయవలెను. నన్నయాదులుగూడ విరళప్రయోగ మున్నదని కొన్ని సూత్రరచనాసమయములందు వెలిబుచ్చిరని పైన దెలుపబడినది. సంస్కృతాంధ్రములు గలసిన శైలిని మణిప్రవాళశైలి యనిరి. అట్లే దీనికిగూడ నవగా సాంధ్రాంగ్లేయమిశ్ర మనునట్టి దానికి నేదియో పేరిడుకొని దానిని మనము గ్రహింపవలసియున్నది. వాఙ్మయము నభివృద్ధి పఱచుకొనవలెననిన నివన్నియు సాధనములగును. ఇట్టివానిని దోసములని త్రోసిపుచ్చరాదు. ఇట్లెఱింగియు గొందఱు పండితులు దానికి స్థాన మిచ్చుటలేదు. కేవలము గ్రాంథిక భాష యనబడునది సర్వజనవిదితము గానేరదు. వ్యవహారమునందలి భాష యనినచో పండిత పామర సామాన్యులకు నందఱకును సామాన్యముగా విదితముగాగలదు. కావున దీనికి లక్షణమును గల్పించి కొందఱు లోకమునందజ్ఞానమును బారద్రోల నారంభించిరి. ఆద్యులనగా నా కాలమందు నన్నయాదులవలెనే నేడును అనేకులు గలరు. వారి భాషనంతయు గ్రహింపవలయును. అంతియగాక మనము నిత్యము వ్యవహరించునట్టిభాష వాడినట్లయితే సహజముగా నుండునుగాని లేనిచో బరులు, తెచ్చికొన్నట్లుండును. ఇట్టిదాని నాదరించి లక్షణమును గల్పించుకొని కృతార్థులయి భాషకు, దేశమునకు మేలుచేయుట మంచిది. సంఘమందు మార్పులను గల్పించుట సంఘమునకు శ్రేయోదాయకములే యని తెలిసియు పూర్వమునుంచి వచ్చుచున్నదానిని మార్పరాదనే యాశయముతోనో, మరియెందులకో దానిని నిరోధింతురు. అలాగుననే నేడు వ్యావహారిక భాష పత్రికలందును పనికిరాదని తలచుచున్నారు. అట్టివారు భాషానిరోధకులేగాని పోషకులు గారు. కావున భాషాభివృద్ధిని గోరిన ప్రతిమానవుడు కవులును, శిష్టజనులును వ్యవహారమందు వాడుచున్న భాషను గూడ గ్రాంథికమందు జొప్పించుటకు ప్రయత్నించి యితోధికముగా మాతృభాషను వృద్ధిపొందించుటకు ప్రయత్నించవలెను. అట్లు చేసినచో మాతృదేశమునకు మాతృభాషకు ఋణము దీర్చుకొనినవార మగుదుమనుటకు సందియము లేదు.

సందేహము

శ్రీ మాచిరాజు వెంకటసుబ్బారావు

౧

తోవలరాయిడికాని
తో నేస్తమది యెట్లు
తోవల సంగాతకాఁ
డవు నీకుఁ గల్గెనో!
సందెమేలము లేలరా!
ఓ శశీ!
సందేహమును బాపరా.

౨

చలిమలపైఁ బుట్టి
సంద్రాన్ని చేపట్టి
చలిమలపై పేని
మలఁగి చూడవుగదా!
పుట్టింటిపై ప్రేమ లేదా?
ఓ గంగ!
గట్టివాయివి నీవు గాదా?

౩

కొడుకువాహనము నీ
యొడలి నగలను మ్రింగు
పడఁతివాహనము నీ
బసవణ్ణి దిగమ్రింగు
ఎటు కాపురము సేతువోయీ?
ఓ శివా!
ఏలీల వర్తింతువోయీ?

౪

నీవు చెట్టునఁ బుట్ట
నీలోన బుట్టుచె
ట్టీ వింత సంబంధ
మేరీతి వెలసెనో!
ఊహకందని సూత్రమా?
పుష్పమా!
స్నేహమందలి చిత్రమా?

౫

సెలయేళ్లు మృదుగీతి
కలఁ బాడి జోకొట్ట
నొడలు మఱచి సుషుప్తి
నొందఁజాల వదేల!
ఏదేని యారాటమా?
జక్కవా!
కాదేని చర్లాటమా?

౬

పాలసంద్రముఁ జిల్క
హాలాహలము నీదు
పాలఁబడ నాశౌరి
పాలఁబడె నాలచ్చి
ఏటిదౌర్భాగ్యమోయీ?
ఓహరా!
మాట లింకేటికోయీ.

౭

డోలికలలో నుంచి
జోలపాటలు బాడ
నిదురలో నవ్వేవు
నిదురలో నేడ్చేవు
ఏటి యానందమోయీ?
అర్భకా!
ఏటి సంతాపమోయీ?

౮

తరు లెల్ల సొక్కి చి
త్తరువులావలె నిల్వ
హొరువుమీరఁగ రాగ
మాలపించెడి నీకు
గురు వెవండేని గలఁడా?
కోయిలా!
గురువిట్లు పాడఁగలఁడా?

౯

మేఘాలలో సుకవి
రాగాలఁ దీయ గవిఁ
తాగానఝరిఁ దేలి
తూఁగాడుభాగ్య మది
యోగాలచేఁ గల్గునా?
లేక,
భోగాలచేఁ గల్గునా?

౧౦

దివి మెఱుంగని యద్ది
భువి మెఱుంగని యద్ది
కవి మెఱుంగు నటంద్రు
సందెమేలము లేలనోయీ!
ఓ కవీ!
సందేహములఁ బాపవోయీ.

సంజయుఁ డెవఁడు?

శ్రీ రావూరి దొరసామిశర్మ

భారతీయ మహేతిహాసంబును, సమస్త నిస్తుల ప్రశస్త ధర్మ కర్మ ప్రతిపాదకంబును, పురుషార్థ చతుష్టయ సాధనంబును, చతుర్వేద సారంబును, పంచమవేదంబు నగు మహాభారతమందు విలసిల్లునదియు, నాసేతు హిమాచలము సర్వజన ప్రత్యహ పఠనీయంబును, సర్వోపనిషత్సార బ్రహ్మవిద్యయు, హైందవాశేష భాషలందుం దేకాక పాశ్చాత్య దేశభాషలయందు సైతము పరివర్తింపఁ బడినదియు నగు భగవద్గీతలోని ప్రథమ శ్లోక మగు 'కిమకుర్వత సంజయ' యందలి సంజయుఁ డెవఁడో, యతని జన్మాదికం బెట్టిదో పేర్కొనఁబడినదిగాదు. సంజయుని తండ్రి యగస్త్యభ్రాతగా నున్నవాఁడు గాఁబోలు!

సంజయుఁడు సూతనందనుఁ డని భారతంబునఁ గలదుగాని యితని జన్మవిషయం బందుఁ గానఁబడదు. భారతమున సంజయుని స్థానంబును విమర్శించి యతఁ డెవఁడుగా నుండనోపునో యని కొంత యిందుఁ జర్చించుట ప్రకృతము మనకుఁ గర్తవ్యము.

పునర్ద్యూతంబునఁ బరాజితులై సమయ ప్రకారముగ వనంబునకు నరిగిన పాండవుల తెఱంగెఱింగి ధర్మాత్ములగు పాండవులతోడి వైరము ప్రజాక్షయకారణ మని విచారించు ధృతరాష్ట్రుం గనుంగొని సంజయుండు క్రింది సూక్తులం జెప్పి తన ప్రథమ దృశ్యమును జూపుచున్నాఁడు చూడుఁడు.

పాండుకుమారులఁ బరమధార్మికు లని
    పగవక రాష్ట్రంబువలనఁ బాపి
వసుపూర్ణమైన యివ్వసుమతి నేకొంటి
    వసుధేశ నీ కింక వగవ నేల
కలశజ విదుర గంగాసుత ప్రభృతులు
    వారింప వారింప వశముగాక
కర్ణ గాంధారుల కఱపులు విని వారి
    కపకారి యయ్యె నీ యాత్మజుండు
పగవ కధికులైన వారితో వైరంబు
నేలకొంటి కరము చెట్ట యనక
నీవు నీసుతుండు నేర్తురుగా కొరు
లేమి సేయ నేర్తు రిందుకులుండ.

—సభా-ద్వి. 303.

శిక్షా వ్యాకరణచ్ఛందో నిరుక్త జ్యోతిష కల్పంబులతోను, షడ్దర్శనంబులతోడను వేదాధ్యయనంబు సేసి యర్థశాస్త్రంబునఁ గృతనిశ్చయుండై, బలోపేతుండై కౌరవరాజ్యం బేకచ్ఛత్రాధిపత్యమునఁ బరిపాలించుచుండిన ధృతరాష్ట్రునితో శంకాతంకంబులు లేక యిట్లు వక్కాణించుటయు, మీఁదు మిక్కిలి 'దేవర, చిత్త' మిత్యాది గౌరవవాక్యంబులు మాని సామాన్యహితుని సంబోధించు తెఱంగున 'నీకు, నీ యాత్మజుఁడు, నీవు, నీసుతుఁ' డని మధ్యమపురుషైకవచనంబుగ భాషించుటలో సంజయుని చిరపరిచయము, కౌరవ కులములోనిచనవు చెప్పక చెప్పుచున్నవి.

ఇట్లు నిర్భీతితో ధృతరాష్ట్రునకు విదురుఁడొక్కఁడు చెప్ప వలంతియగువాఁ డని భారతమునఁ దెల్లమగుచున్నది.

ఇట్టికార్యమునకు నే నవశ్యంబును
నొడఁబడంగనోప నక్కావమున
సుతులతోడ నేల సుతులకు భేదంబు
సేయఁగడఁగి తిదియ చెట్టయనక.
—సభా-ద్వితీయ ౧౩౦.

మొనపి యధర్మమూలం,
బున భేదము పుట్టెఁ బాండుపుత్రులకును నీ
తనయులకని మును చెప్పిన,
విన నొల్లక కొడుకుపలుకు వింటివి కడఁకన్.
—అరణ్య-ప్రథమ ౪౪

పై పద్యములవలన సంజయునివాక్యము విదురోక్తింబలెఁ బ్రత్యంశమున నున్నదని పల్కుట పౌనఃపున్యము గానోపును.

పాండవప్రేషితుఁడై దూతగా వచ్చిన ద్రుపదపురోహితుని సముచిత/ సత్కారంబుల మన్నించి పుచ్చి, తమ సందేశమును జెప్పి పంప ధృతరాష్ట్రుఁడు సంజయుని రావించెను. ధర్మజుని దూత్యార్థము దోడ్కొనివచ్చుట మున్నగు సమయముల నీతివిదురుండగు విదురునిఁ బంపుచుఁ దగినట్లు పాండవులతోఁ బల్కుటకై విదురుని మాని సంజయుని సూతనందనుని బుత్తెంచుటలో సంజయుని ప్రాముఖ్యము విశదమగుచున్నది గదా!

'పాండునరపాలసుతు లుపప్లావ్యమునకు
వచ్చియున్నారు నీ వేగి వాసుదేవ
సహితముగ వారిఁ గని శిద్వపాద మేమి
భంగి మాను నమ్మెయిఁ దగఁ బలుకవలయు'
—ఉద్యోగ-ప్రథమ ౨౫౯

అని ధృతరాష్ట్రుఁడు సంజయునితో వచించుటచే సంజయునకు విదురాదులవలెఁ జొరవ, సమయస్ఫూర్తి, సమయోపాయము గల వనియు గోచరించును.

ఉపప్లావ్యమున సుతులుసైతము చేరని చెందనిచోట నభ్యంతరవినోదంబుల సత్యభామాకృష్ణులు, ద్రౌపదీ విజయులు వెలయుచుండియుఁ గృష్ణునిచే నాహూతుండై ప్రవేశించిన సంజయునకు సంకలి యిద్దఱు ముద్దియలు కనకరత్నమయంబగు శౌరిపాదపీఠం బాసనార్థ మొసంగిరి. సామాన్యదూతయు, సూతనందనుండగు సంజయునకు నంతఃపుర ప్రవేశము, మీఁదుమిక్కిలి కనకరత్నపీఠము నొసంగుట పొసంగునా? దీనంజేసి సంజయునకుఁగల గౌరవంబు తదీయోపాస్థ్యస్థితిని వేనోళ్లఁ జాటుచున్నదిగాదా!

రాయబారమున ధర్మజాదులకు విదురుంబలె హితంబు గఱపుచున్నవాఁడు. వెండియు ధృతరాష్ట్రసంతతివానినే నీ వను వాఁడు ధర్మరాజు నట్లు సంబోధింపకుండునా?

'పాందొందఁగఁ దలచితి నీ
విందుశిశిరమైన విమల హృదయంబున -
—ఉద్యోగ-ప్ర. ౨౭౩.

అంతియకాక

'మడుఁగుఁజీరయందు మసి వాకినట్లు మీ
సత్కులమునఁ గల్మషంబు గౌర
వేంద్రుకతనఁ బొందె నింతయుఁ బాపంగ
నీవె నేర్తు కార్యకరణ హృదయ'
—ఉద్యోగ-ప్ర. ౨౯౫.

అని నుడువుటచే సంజయుఁడు పాండవపక్షపాతియై విదురునిం బురడించుచున్నాఁడు.

అత్యాభీలాహవరంగమునఁ గౌరవవంశంబుం దునిమి గ్రహించు రుధిరాన్నంబు కన్న భిక్షాన్నంబ నుత్తమం బని సహేతుకముగా నిర్వచించిన సంజయునితోఁ గౌంతేయాగ్రజుఁడు 'నీపలికినట్టిద ధర్మ' వని యేవార్థకంబుగా నుత్తర మిచ్చుటంజేసియు,

క. 'నీ వొండె విదురుఁ డొండెను
గావలయుం గాక యిట్టికార్యంబులకుఁ
రా వేఱ కలరె తనవా
రీ వినయము నేర్పుకలదె యితరుల కెందుఁ.'
—ఉద్యోగ-ప్ర. ౩౬౪.

అని పల్కుటంజేసియు, సంజయుఁడు ధర్మవేత్త, విదురసంకాశస్థానపవానుం డని తేటపడుచున్నది. సంజయునకు సపరివారంబుగా సముచితప్రకారంబున మజ్జన భోజనములు, మాల్యానులేపనాద్యుపచారములు సేయించి మణిభూషణ చిత్రాంబరంబు లొసంగి ధర్మజుఁడు వీడుకొల్పియున్నవాఁడు.

సంజయుఁడు పాండవుల వీడ్కొని హాస్తిపురి కరుదెంచి ధృతరాష్ట్రునితో ములుకులం బోలు నిష్ఠురంబులు పలుకుచున్నాఁడు. 'నీవు నీ సూనువశంబ కాని యొకచో స్వతలంపవు, కర్ణసౌబలాధీనము కార్యనిశ్చయము.

కొడుకులఁ గావరే నృపు ల
కుంఠితరేఖల నెందు నిమ్మెయిం
జెకుతెరు వైనచోఁ దగవు
నెప్పక యొప్పరికించి చూతురే,
పుడమిజనంబు లెల్ల నినుఁ
బ్రువ్వఁగఁ దిట్టఁగ వించుమన్కి నొ
చ్చెడు మది యొప్పదుం జెవులఁ
జీములు గట్టెడుఁ గౌరవేశ్వరా!.
—ఉద్యోగ-ద్వి. ౭-౧౪.

దన్నసేనసౌబలులచేత బొమ్మలక్రియ నీవు నీసుయోధనుఁ డాడుచున్నవారలుగాని పాండవు లెత్తివచ్చిన నీచలము, బలము, కులము చక్క సేయఁబడుసుమా! జూదమున నాపద ప్రాప్తించె నందులకు నీ యుపేక్షయే కారణము.'

వెండియు, "నన్ను దూఱిందలంచితేని నాచేయునది ధర్మం బధర్మం బని నిరూపించి మఱిదూఱుము. కోపంబు నివారింపందగు"నని (సంజయునకు) ధర్మజునిచేతను, "పాండురాజసుతులపాలికిఁ జని యిప్డు సంజయుండు వచ్చి సమ్ముఖమున నన్నుఁ జాల దూఱి నాకు రేపచ్చటిపనులు సెప్పవాఁడననుచుఁ "జనియె (ఉద్యోగ-ద్వితీయ-౧౮) అని విదురునకు ధృతరాష్ట్రునిచేతను, సంజయుని రాయబారపు సందర్భమునఁ జెప్పఁబడుటచేఁ గౌరవ రాజులగు ధర్మజ ధృతరాష్ట్రులను దూఱు నట్టి స్వతంత్రతగూడ సంజయునకుఁ గల దనుట స్పష్టము.

పాండవపక్షమునఁ గౌరవులకడకు రాయబారిగ నరుగుటకు శ్రీకృష్ణమూర్తి దగినట్లు, కౌరవపక్షమునఁ బాండవులకడకు రాయబారిగ నేగుటకు సంజయుఁడు దగియుండుటంబట్టి, సంజయుఁడు శ్రీకృష్ణునితో సమానుఁడై యున్నవాఁడు.

ఇరుబలగంబుల తారతమ్యంబులఁ దెల్పఁగోరిన ధృతరాష్ట్రునకు సంజయుండు

'నన్నడిగెదవే నొంటి యడుగవలదు,
మీయయ్య సాత్యవతేయుఁ డీయెడకు వేం
చేయునట్లుగ భక్తిఁజేసి తలఁపు;
పిలువఁబంపు గాంధారి, వారలు వినీత
రతులు నిశ్చయవిదులు ధర్మజ్ఞచిత్తు'

లని నుడువుటచే నితఁడు విదురునికైవడిఁ గౌరవకులమందలి యాంతరంగికవిషయములు సాకల్యముగా నెఱింగినవాఁడనియేర్పడుచున్నది.

ధృతరాష్ట్రుఁడు స్మరింపఁగా విజయుం చేసిన సాత్వతేయుఁడు సంజయునితో —

'నీవు సమస్తము నెఱుఁగుదు,
గావున నీ కూరకుండఁగాఁ దగదు ధరి
శ్రీవల్లభుఁ డడిగినపని,
యీవిధమని తెలియఁబలుకు మేము వినంగన్.'

—ఉద్యోగ-ద్వితీయ ౩౦౭.

అని వక్కాణించుటవలన వ్యాసమహర్షి భంగి సంజయుఁడు ధృతరాష్ట్రునకు హితబోధకుఁడనియుఁ, గార్య నిశ్చయకరుఁడనియు దత్కాల సమస్త వ్యవహారవిదుం డనియుఁ దేలుచున్నది.

మీఁదుమిక్కిలి వ్యాసుని సమక్షంబున ధృతరాష్ట్రునికి హరిమహత్త్వంబును, దత్త్వజ్ఞానంబును విపులంబుగ వివరించుటంబట్టి సంజయుండు భగవద్భక్తి బ్రహ్మజ్ఞానముల యందు విదురునితోఁ దుల్యుండని పేర్కొనుట నిర్వివాదాంశము.

ధృతరాష్ట్రుఁడు దుర్యోధనునితో

'మనకాప్తుఁడు సంజయుఁ డీ
తని యుపదేశంబు వట్టి ధర్మమున ముకుం
దుని నాశ్రయింపవయ్య'

యనియుఁ, గృష్ణ ద్వైపాయనుఁడు ధృతరాష్ట్రునితో 'నీవుం బరమాప్తుండైన సంజయు నతని పాలికింబుచ్చి తదితెన్నకార్యం బయ్యె; వీఁడును నిమ్మహానుభావు (కృష్ణుని) మహనీయ ప్రభావం బున్నరూ పెఱుంగు; వీనిబుద్ధి విని యద్దేవు నాశ్రయింపు' మనియు వాక్రుచ్చుటంజేసి సంజయుఁడు కౌరవులకుఁ బరమాప్తుఁ డని తెలియవచ్చెడు. ఆప్తుఁడు (ఆప్నోతి రహస్యమిత్యాప్తః, ఆప్-శ-వ్యాప్తౌ) రహస్యమును బొందువాఁడు గాన సంజయుఁడు కౌరవకుల రహస్యవేది. 'ఆప్తౌ ప్రత్యయితౌ సమౌ' అను నిఘంటువాక్యంబు సరణి (ప్రత్యయో విశ్వాసోఽస్య సంజాతః ప్రత్యయితః)విశ్వాస మితనియందుఁ బుట్టును గాన సంజయుఁడు కౌరవులకు విశ్వాసపాత్రుఁ డనుటనిశ్చయము.

సంధిపొందెఁ గృష్ణుఁడు కుశస్థలి కరుదెంచి విడిసిన

వార్త విని యాతఁడును కౌరవక్షితీశ్వ
రుండు గాంగేయ గురువిదురులను బుత్రు
సంజయుని గర్ణ సైంధవు శకునిఁ బిలువఁ
బనిచి తా నిట్టు లనిరెను సంధమునితోడ.

ఇందు భీష్మ ద్రోణ విదురాదులతో సంజయుఁడు పేర్కొనఁబడుటచే నితఁడుసామాన్య సూతనందనుఁడుగాక రాజకీయవ్యవహార వివేచనాదక్షులలోఁ గౌరవులకు విదురునిపోల్కి నొక్కరుఁడని నిక్కముగ నొక్కి వక్కాణింపవచ్చును.

కృష్ణమూర్తి కురురాజు మందిరంబున కరుగుదెంచు నవసరంబున 'భీష్మ ద్రోణ ప్రముఖులగు వారలు ధృతరాష్ట్రునిం బొడఁవ నతండు ప్రత్యుత్థానంబునేసి విదుర సంజయ సహితంబుగా నెదుర్కొనంజేరి యతనిఁ గౌఁగిలించి యచ్చటఁగల విదురాది శిష్టజనుల నాదరార్ద్రబంధుదృష్టిఁ జూచి పరిరంభసంభావనము లొనర్చి శౌరి ప్రమద మెసఁగ వారల నందఱకును సాత్యకిని దగిన సమాచారంబులునడుపంబని చెనవియున్నది. ఇందు విదుర సంజయసహితంబుగా నను విశేషణము సంజయుఁడు విదురతుల్యుఁ డనియు, విదురాదిశిష్టజనులను సమస్తపదము సంజయుఁడు శిష్టులలో నొక్కఁ డనియుఁ దెల్పుచున్నవి.

ఇంతియకాక దుర్యోధనుఁడు తన్నుఁ జెఱఁబట్టఁ బ్రయత్నించు నెడ నెఱింగి విశ్వరూపంబుఁ గానఁబఱచు సందర్భమున 'దుర్నిరీక్ష్యంబగు నత్తేజోరూపంబు గనుంగొనం గోలఁదిగాక సకలజనంబులు నయనంబులు మొగిడ్చి యద్భుత భయానకరసంబుల జొత్తిల్లు చిత్తంబులతోడం గదలకుండ నప్పుండరీకాక్షుండు నారదాది మహామునుల వలన భీష్మవిదురద్రోణ సంజయులయందును గరుణాతరంగితంబగు కటాక్షవీక్షణంబులయి వారలకు దివ్యదృష్టి యొసంగిన నా పుణ్యపురుషులు సాంద్రానందంబునఁ దేలుచుండిరి' యను పట్టున భగవత్కటాక్షవీక్షణములకు నర్హులగు నారదాది మునులతోడను భీష్మద్రోణవిదురులతోడను సంజయుండు పాల్గొనియెడు. ఆ పుణ్యపురుషులను విశేషణంబున మన సంజయునకు నొక భాగంబు తప్పక యున్నదిగదా ? సాధారణ సూతనందనుఁ డైనచో మన సంజయునకుఁ గృపబాహ్లికభూరిశ్రవస్సోమదత్తాదులకుఁ గలుగని దివ్యదృష్టి హరి యొసంగుటయు, ధృతరాష్ట్రునకుఁ గయ్యంబు తెఱంగు వినిపింప వ్యాసమౌని యాసంజయుని నియమించి, యా రెండు తెఱంగులవారి దివారాత్ర ప్రవర్తనంబులఁ గనునట్లును, రహస్యప్రకార భాషణంబులు వినునట్లును, మనోవృత్తంబు లెఱుంగునట్లునుంగా వర మిచ్చి, యతిశీఘ్రగమనంబు నొసంగి, భారతసమరధరణిం దిరిగినను శస్త్రాస్త్రంబు లెవ్వియుం దాఁకకుండునట్టి ప్రభావంబు ప్రసాదించి, దివ్యులయాలాపంబులు, రూపంబులు, దలంపులుం దేటపడునట్టి మహనీయబోధంబును గలుగ ననుగ్రహించుటయుఁ బరికింప (శ్రీ) కృష్ణకృష్ణద్వైపాయనుల యనుగ్రహానుగ్రహంబులు సంజయునిపైఁ బ్రసరించుట యతఁడు సామాన్య సూతసూతి యనఁదగినవాఁడుగాఁ దోఁచకున్నది.

ఈ భారత యుద్ధవ్యాజంబున సర్వోపనిషత్సారభూతంబగు భగవద్గీత సంజయునిచే ధృతరాష్ట్రునకుఁ దెల్పఁబడినదై యుండఁగా సంజయుని యుత్కృష్టత యెట్టిదో తద్జ్ఞులే విచారింప నర్హులు.

ఇట్టి యనిర్వాచ్యవినుత విమలయోగ్యతా మహత్వేంద్రియ సంజయుండగు సంజయుండు సామాన్యసూతకుల సంజాతుండుగాక యే మహర్షి తేజంబుననో యుద్భవిల్లినవాఁడుగా నుండక తప్పఁడు. వెండియు సంజయుఁడు సకలవిధముల విదురు ననుకరించుటం బట్టి విదురసంజయులకు సామ్యము పొడఁగట్టుచున్నది.

దీని కుపబలముగా నా కీ క్రిందియూహలు పొడముచున్నవి — విచిత్రవీర్యుఁ డపత్యరాహిత్యుఁడై గతించిన తరువాతఁ దన కోడండ్రగు నంబికాంబాలికలకు భీష్ముని యనుమతిమై సత్యవతి కృష్ణద్వైపాయనుం బిలిపించి క్షేత్రజులఁ గలిగింప నియోగించె. అందు మాతృదోషంబున నాంబికేయుఁడు జాత్యంధుఁడుగను, నాంబాలికేయుఁడు పాండుదేహుఁడుగనుఁ బుట్టినఁ గ్రమ్మఱఁ బారాశర్యు నంబికకుఁ బుత్త్రి వేఁడిన నది మానిం బొందు రోసి, తనదాసి నలంకృతంజేసి పనుపదానికి విదురుండుపుట్టె. అవ్విదురుండు శూద్రస్త్రీ సంజాతుం డగుట యెఱింగి వెండియు

నొకదాసిం బనుప సంజయుం డుదయించి యుండును. విదురసంజయు లిర్వురు రాజ్యార్హులు గానందున ధృతరాష్ట్రపాండురాజులే రాజ్యము వహించిరి. విదురుండు కార్యఖడ్గంబులందును, సంజయుండు గృహనిర్వాహమునందును నియోగింపంబడియుండురు.

సంజయుఁడు వ్యాసునివలన నంబాలికా చేటికి జన్మించినవాఁ డని యింతకుముందు నిరూపింపఁబడినది. అంబాలికాచేటి యు, నామెభర్తయు రాజకుటుంబమున బానిసలై యుండురు. అంబాలికా చేటీభర్త కులము చేతనొండె, వృత్తిచేతనొండె సూతుఁడై యుండును. ఆ సూతుని క్షేత్రజుఁడగుటచే సంజయుఁడు సూతనందనుఁ డని పేర్కొనఁబడియుండు ననితోఁచెడు. వైవస్వతమన్వంతరమున గణింపఁబడిన యష్టావింశద్వ్యాసులలో సంజయుఁ డొక్కఁ డున్నవాఁడు. వ్యాసబిరుదముగల సంజయుఁడు మన సంజయుఁడేమో యూహింపఁ దరముగాకున్నది. ఇది కారణముగఁ గాఁబోలు విదురసంజయులు సమానస్థానము వహించి, సత్కర్మముల ననుష్ఠించి, భగవద్భక్తిని మించి, బ్రహ్మజ్ఞానమున నతిశయించి, రాజ్యతంత్రములఁ బచరించుచుఁ గురురాజుచే మన్ననలొందుచుండిరి యని తోఁచుచున్నది.

భారతమున సంజయుని జననమరణములు గానరాకుండుటం బట్టి మున్నొకప్పుడు మాపితామహుఁడు మాతండ్రితో గుణవర్తనంబులఁ బరికింప సంజయుఁడు విదురునివలె నంబాలికాచేటికి వ్యాసునివలనఁ బుట్టినవాఁ డని చెప్పిరఁట.

ఈ యంశమునే మత్కృత భారత సంగ్రహమునను, వ్యాసచరిత్ర యందును వ్రాయుటకు సాహసించితిని.

భారత సంగ్రహము

తమ్ముని సకులకు ముని దా
సమ్మతిఁ గలిగించె సుతుల జనకీకృతదో
షమ్మున జాత్యంధుండును
గ్రమ్మన పాండురపుఁదనుఁడుగా నవ్వేళన్.
అత్తెఱఁగుఁ గాంచి క్రమ్మఱ
నత్తాపసికడకు నంబికాంబాలికలన్
బుత్తెంచిన వారలు చెలి
క త్తియలం దమకు మాఱుగాఁ బనుపంగన్.
ముదమొదవఁ దపసిఁ గొలిచినఁ
బదపడి గలిగింప మౌని ప్రజ్ఞాన్వితులై
సదమలగుణసంపదలన్
విదురుఁడు సంజయుఁడు నాఁగ వెలసిరి భువిలోన్

వ్యాసచరిత్ర

అంబికాసతికి జాత్యంధుండు ధృతరాష్ట్రుఁ
డుదయించి కరిపురి కొడయఁడయ్యె
అంబాలికకుఁ బాండుఁ డక్షిలి జనియించి
రాజ్యభారాది కార్యములఁ దాల్చె
అంబికాచేటికి నంతట విదురుండు
ప్రభవించి సచివుఁడై పరిఢవిల్లె
అంబాలికాచేటి కల సంజయుఁడు పుట్టి
యాంతరంగికమంత్రియై తనర్చె
ఇట్లు కరినగరంబు సహీనపటిమ
నీతికలితంబుగాఁగ ననీతియుక్తి
విదిత ధృతరాష్ట్ర పాండురాడ్విదుర సంజ
యులు త్రిశక్తుల నేలిరి లలితకీర్తి"

ఈ సంజయ జన్మవిమర్శనము మాపితామహునివాక్కు నుపపత్తిగాఁ గొని హేతువుల నూహించి యిందలి యాథార్థ్యమెఱుంగఁ గోరి రచించినాఁడం గాన విజ్ఞులు దమ యభిప్రాయంబు ప్రకటింతురుగాక.

త్యాగజీవి

శ్రీ మేకిపల్లి లక్ష్మీకాంతం

౧

హిందు దేశంబునఁ జనియించినాఁడ
తరతరంబులనుండి హైందవుఁడ నేను
మాతృదేశంబుపై నెంతో మమత గలదు
జననిదాస్యవిముక్తికై జంక నెపుడు.

౨

ఆలుబిడ్డలఁ బోషింప నలవి కాక,
అమ్ముకొంటిని చెక్కల నదియు వృథయె,
చెక్కలాశియు నిండవు డొక్క లకట,
వేఱుగతి యేది బ్రదుక నీ విశ్వమందు!

౩

ఇదుగో! రెండడుగులభూమి యిచట నాకు
గల దటంచు నిర్భీతిని నిలువఁజాల
ఇల్లు వాకిళ్లు నేల? నేఁ ద్రుళ్లియున్న
దహనభూమియు దొరక దీ తనువునకును

౪

ఏ నొనర్చెడి పని సేయ నేనవలయు
పరులు సుఖియింత్రు నాపడుపాటువలన
మాకుగా వండి తినుటయె మాకుఁ జాలు
నదియు నోర్చరు ధనికు లీ యదనున కట!

౫

ధారవోయుదు నసువు లీ ధరణికొఱకు
దాని ఫల మంది సుఖయింత్రు ధనికు లంతె!
పిల్ల లిల్లాలు జోలెతో వీథివీథిఁ
దిరుగ నేయమ్మహృదయంబు గరుగునొక్కో!

జాతీయత - వాఙ్మయము

శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం

వాఙ్మయము వాక్ప్రపంచమునకు సంబంధించినది. వాగర్థములు రెండును దానికి విషయములే. 'వాగర్థావివ సంపృక్తౌ' అని పార్వతీపరమేశ్వరులను మహాకవి కాళిదాసు స్తుతించెను. వాఙ్మయమునందు పావిత్ర్యము, ఔన్నత్యము తరంగించుచుండును. త్రివిధములైన తపస్సులను వర్ణించుచు భగవద్గీత వాఙ్మయ తపస్సు నీవిధముగ నిర్వచించినది.

అనుద్వేగకరం వాక్యం
సత్యం ప్రియహితంచ యత్
స్వాధ్యాయాభ్యసనం చైవ
వాఙ్మయం తప ఉచ్యతే.

ఇందలి పూర్వార్థము పారమార్థికవాఙ్మయమైన పురాణాదులకే కాక ఆహ్లాదప్రయోజనమైన కావ్య వాఙ్మయమునకుకూడ అన్వయించును. విమర్శకాగ్రేసరులైన ఆలంకారికులుకూడ నిదేమార్గమును త్రొక్కినారు. కావ్యము 'ఇష్టార్థవ్యవచ్ఛిన్న పదావళి' యని దండి యూహించినాడు. కావ్యసుమమునందొక మనోహరసౌభాగ్య ముండు ననియు, ఆసుకుమార సౌభాగ్యమునకు ఉద్వేజనము కలిగించునంశములు ఏవగింపు కలిగించు ననియు ఆతనిమతము. ఇట్లే జగన్నాథపండితరాయలు 'రమణీయార్థ ప్రతిపాదకశబ్దః కావ్యం' అని సిద్ధాంతముచేసినాడు. కేవలశబ్దమునందు కావ్యలక్షణ ముండ దనియే యీతనిమతము. ఎచ్చట రమణీయమైన రసభావాలంకారములు పల్లవించుచుండునో అదియే కావ్యము. లౌకికమగు ఆనందమే కావ్యముయొక్క పరమప్రయోజనమని ఈయాలంకారికులు విశ్వసించినట్లు తేలినది.

మరికొందరు మహనీయులు కావ్యప్రయోజనము ఆనందమే యైనను అంతమాత్రము చాలదు. మానవుని ఉత్తమప్రవృత్తులకు దోహదమొసంగి ఆతని మనోమాలిన్యమును క్షాళనముచేసి అతనిని దివ్యసదృశునిగ జేయుటకూడ కావ్యప్రయోజనములలో నొకటి యని నమ్ముదురు. రామాయణము, మహాభారతము మున్నగు కావ్యములు కల్పాంతస్థాయు లగుటకిదియే కారణము. అవి సద్యఃపరనిర్వృతిని కల్గించుచు ఉపదేశదాయకములై ఉన్నవి. మనుష్య హృదయములో శాశ్వతస్థానమును పొందిన కరుణారసము వీనికి ఉపజీవికయైనది. వ్యాసవాల్మీకులును వారికి ప్రియశిష్యుడైన భవభూతియు ఏకోరసః కరుణవాదులు. వాఙ్మయ ప్రయోజనమును గ్రీకువారు మరియొక విధముగ తిలకింతురు. వారు ఉపదేశమునే ప్రధానలక్షణముగా నిడికొని కావ్యము పాపపంకిలమైన హృదయకర్దమమందు సౌజన్యాంబుజమును వికసింప జేయవలయునని తలంచిరి. అరిస్టాటిలు అను గ్రీకుఆలంకారికుడు దుఃఖాంత నాటక లక్ష్యము నిట్లు నిర్వచించినాడు

'To purge the feelings through pity and fear'

బీభత్స కరుణరసముల మేళనముచే మనుష్యుని యహంభావదళన మొనర్చి, హృదయమును దయాక్షాళిత మొనర్చి దివ్యవిభూతిని స్ఫురించునట్లు కావించుటయే కావ్య ప్రయోజనము. షేక్స్పియరు మహాకవి లక్ష్యము ప్రకృతికి అద్దముపట్టి (**To hold up the mirror to nature**) విశ్వవైవిధ్యమును ప్రతిఫలింప జేయుట. అతనిభావనాశక్తి యనన్యసామాన్యము. సృష్టివైవిధ్యము నాతడు స్ఫురించినట్లు మరేమహాకవియు స్ఫురింపలేదు. సృష్టిలోని అనేకత్వమునం దాతడు ఏకత్వమును, అద్వైతమును ఉపలక్షింప గల్గినచో నాతడు ఋషి యనబరగియుండును. జీవితప్రబంధాంతమున సుఖదుఃఖాంత నాటకత్రయమును రచించి

యీతఁడు ద్వైతమునుమాత్రము చేరగల్గెను. మనుష్యుఁడొకయసహాయనౌక. జీవితము కడలేనిసముద్రము. అవిదితమహఃప్రవృత్తియను నొకమహాశక్తి మనుష్యనౌకను గభీరసముద్రతరంగములపై తరిమి దయ దలచి తుదకు సుఖపురేవులోనికే తెచ్చి విడచును. షేక్స్పియరు యొక్క చరమనాటకము లనబడు టెంపెస్టు (Tempest) సింబెలైన్ (Cymbeline) వింటర్స్ టేల్ (Winters Tale) మున్నగు వానిసారాంశ మిదియే. షేక్స్పియరు మరికొంతముందునకేగి యీ నావికునకును, వానిపాలిటి దైవతమునకును నడుమ నేకత్వము ననుసంధించుట మేలయ్యెడిది. కాని యీతనిదృష్టి చిరకాల మనేకత్వమునందు లగ్నమగుటచే నాతనిప్రతిభ డస్సెను. రంగమునందు వరుసగా వివిధ భూమికలను ధరించిన నటకుడు శ్రమచెంది రంగుబట్టలతోనే నేపథ్యమునందు కూలబడినట్లు షేక్స్పియరు అద్వైతము చేరకుండగనే యలసిపోయెనని మన మూహింపవలసి యుండును.

వాఙ్మయమును తపస్సుగ విశ్వసించిన మహాత్ములను పేర్కొనవలసినప్పుడు ఆంగ్లేయులలో మిల్టను కవివరేణ్యునికిని, మనలో తిక్కన, పోతన, తరిగొండ వెంకమ్మ మున్నగు వారికిని చేయెత్తి మ్రొక్కవలసి యుండును. మిల్టనుకవి భగవదారాధనతత్పరుడు. తనయిష్టదైవతమునకు కవితాప్రతిభను నివేదన చేయవలయునని చిన్ననాటనుండియు నాతని కభిలాష కలదు. మిల్టనువంటి దీక్షాపరునకు గూడ సాధన సిద్ధి కారణాంతరములచే ఆలస్యమైనది. జీవితభానుడు వాటారుప్రొద్దునకు మరలినాడు. వార్ధక్యసంధ్యారాగము త్రోసుకొని వచ్చుచున్నది. రేవు కనుచూపుమేరలో లేదు. అట్టియెడ నా మహాకవి పడిన నిర్వేదము, ఆలపించిన దీనగీతిక, సహృదయుల మనస్సుపై అంకితమై యుండిపోయినది.

తిక్కనమహాకవియు, బమ్మెరపోతనామాత్యుడును భగవద్భక్తిరసాయనము నాగళపూరితముగ త్రావిన కథ ఏ తెలుగుబాలునికి తెలియదు? భారతము రచించుట 'భవ్యపురుషార్థతరుపక్వఫలము గాదొ' యని తిక్కన నిశ్చయించుకొనెను.

మానవ ప్రవృత్తియందు ద్వైతభావము లేక పోలేదు. ఒకడు సుఖసంతోషములనే చింతింపగలడు. వేఱొకడు దుఃఖగీతినే యనుభవింపగలడు. మిల్టనుకవి ఈ రెండు దృక్పథములను చిత్రించుచు రెండు చక్కని ఖండకావ్యములు లిఎల్లెగ్రో 'L' Allegro, ఇల్ పెన్సరోసో Il Penseroso అనువానిని రచించెను. లిఎల్లెగ్రో 'L' Allegro యం దూహింపబడిన రసపిపాసువు మధురదృశ్యములలో తన్మయుఁ డగును. అతఁడు సుఖాంతనాటకములను మాత్రమే చదువగలుగును. పక్షులకలకలరావములతో లేచి జనసంకులములైన ప్రదేశములను చూచుచు, వారితో సంభాషించుచు ఆనందించును. వివాహము, ఆటపాటలు, నిత్యకళ్యాణము పచ్చతోరణము. ఇది ఈమధురజీవిజీవితపథము. ఇతని ప్రతిపక్షి ఇల్ పెన్సెరోసో Il Penseroso) అనువాఁడు ఏకాంతసేవ నభిలషించును. మితభాషి - నిరంతరగ్రంథపఠనశీలుఁడు. పదిమంది కలకలము నాతఁడు సహింపఁడు. అర్ధరాత్రమునందు మేల్కాంచి తత్త్వజిజ్ఞాసలో మునుంగును. ఇతఁడు దుఃఖాంతనాటకములు మాత్రమే నాటకనామమున కర్హము లని తలంచును.

యా నిశా సర్వభూతానాం
తస్యాం జాగర్తి సంయమీ
యస్యాం జాగ్రతి భూతాని
సా నిశా పశ్యతో మునేః.

చింతాభరుడైన ఇల్ పెన్సెరోసో (Il Penseroso) ఇట్టి మౌని యని చెప్పవచ్చును. రసపిపాసు చింతాభరులవలెనే కావ్యప్రపంచమునందు శృంగారరసవాదులు కరుణరసవాదులు కలరు. ఈద్వైతమును కాదని బ్రహ్మానందరసమే రసమని ప్రవచించు మహనీయుల పాదచ్ఛాయల నంటిపోవుట సామాన్యమానవుల కసాధ్యము, అసంభవము. ఉపనిషత్తులు ఘోషించినట్లు,

'రసో వై సః రసగ్ం హ్యేవాయం లబ్ధ్వానందీభవతి'

అనువాక్యమును అక్షరాల అనుభవములోనికి తెచ్చుకొనగలిగిన తిక్కనాదులు వంద్యులు. సహృద

యుఁడు, శుద్ధకావ్యానందములో తన్మయముకాఁగల సమర్థుఁడు, ఈ బ్రహ్మానందరసము మెఱుపు మెరసినట్లు ద్యోతక మగునని చెప్పఁగల్గిన సాహసవిద్వాంసుఁడు అభినవగుప్తాచార్యుఁడు. స్థాయీభావము రసపరిణతినొంది, విభావానుభావసంచారీభావములు బుద్బుదములవలె నడఁగిపోయి విగళితవేద్యాంతరమై అవిద్యావరణము జారిపోయిన యోగికి బ్రహ్మానందము శాశ్వతముగ లభించునట్లే కావ్యోపాసకునకు క్షణికముగ బ్రహ్మానందతుల్యరసము అనుభవైకవేద్య మగునట.

వాఙ్మయమునకును జాతీయతకును సంబంధ మేమి? కవివాణి వాఙ్మయ మగుచున్నది. బహుజనవాణి అర్థశూన్యమైన కలవర మనిపించుకొనుచున్నది. కవిభావములకును అతఁడు కాకతాళీయముగ జనించిన జాతియందలి జనులభావములకు సమన్వయించు టెట్లు? జీవి దేహాద్యావరణముచే నెట్లు పరిచ్ఛిన్నుఁడగునో అట్లే కవికూడ బాహ్యలోకముచే పరిచ్ఛిన్నుఁడగును. అట్లు కానిచో నాతఁడు ముక్తుఁడో లేక ప్రపంచకవియో యగును. జీవన్ముక్తు లున్నట్లే ప్రపంచైకకవియగు వాఁడుకూడ నొకప్పుడు స్వేచ్ఛారతిచేతనే తనజాతిప్రత్యేకస్వర్ణశృంఖలములను ధరించి కులుకును. తిక్కన చెప్పినట్లు కవిసింహమునకును జాతివనమునకును అవినాభావసంబంధ ముండితీరును.

ధృతరాష్ట్రుండును పుత్రులున్ వనము కుం
 తీనందనుల్ సింహముల్
మతి నూహింప నసింహమైన వనము
 న్నర్దింతు రెందు న్వనా
వృతవృత్తంబులు గాని సింహములకు
 న్వేగంబ చేటొందుగా
న తగ న్బ్రోదుట కార్య మీయుభయముల్
 సంతుష్టి మై నున్కికిన్.

కవి మహామేధావియై ఒక్కొక్కసమయమున సమకాలీనులకు స్వప్నమందైన సాధ్యముగాని రంగములలోనికి తానేకాకియై చేత జెండాపుచ్చుకొని నడచిపోవును. వెరగుపడి లోకము ప్రయాసతో వానిని వెన్నంటిపోవును. ఎందులకీ శ్రమయని లోక ముదాసీనత వహింపజాలదు. మహాపురుషులయందలి ఆకర్షణశక్తి నిరోధముల నన్నిటిని త్రెంచివేసి అభిమతపదార్థమును తనవంకకు లాగుకొనును. వాల్మీకి కాలమందు పశుపక్ష్యాదుల హింస యెంత యుండెడిదో మనము నే డూహింపజాలము. వేటయనునది ఆ దినములలో మత్త రాజన్యకుమారులకు పరమవ్యసనముగ నుండెడిది. దశరథుఁడు దీని కుదాహరణము. కరుణాళువైన వాల్మీకి పక్షియెడ క్రౌర్యమును నిరసించుచు నొక్కశ్లోకమును జెప్పసరికి లోకము తనకండ్లను విప్పినది, 'అహింసా పరమోధర్మః' అన నేర్చినది.

ఆంధ్రవాఙ్మయమునకును ఆంధ్రజాతీయతకును పైన సూచించిన అవినాభావసంబంధము కలదు. లేనియెడల ఆంధ్రావళి దానివలన 'మోదముం బొరయ' జాలదు. ఆంధ్రుల ప్రశంస క్రీస్తుపూర్వము వేయిసంవత్సరములనుండి వినవచ్చుట సర్వజనవిదితము. ఆంధ్రభాషాలత తొడిగిన మొదటిమొగ్గ క్రీ. పూ. ౧౦౦౦ సంవత్సరములనాటిది. రమారమి ౨౦ శతాబ్దుల కాలము ఆంధ్రజాతి యేకీభావము వహించుట సందేహపరుల, కుతర్కములకు పట్టుకొమ్మ యైనది. క్రీస్తుశకారంభమునందలి యాంధ్రులు ఐతరేయ బ్రాహ్మణములో దండ నుచ్చబడిన మ్లేచ్ఛానార్యజాతులను అభివృద్ధి పందెములో దిగద్రొక్కిపోయిరి. మౌర్యచంద్రగుప్తుని నాటికే వారు ప్రబలప్రాభవవంతులై సామ్రాజ్యకాంక్షులై తమ యిల్లు చక్కబెట్టుకొనియుండిరి. మెగాస్తనీసు వ్రాతలనుబట్టి ఆంధ్రులకు లక్షకాల్బలము, వేయిఏనుగులు, ముప్పది దుర్గములును ఉండెను. క్రీ.పూ. ౨౭-వ సంవత్సరమున ఆంధ్రులు మగధరాజ్యమునుకూడ కబళించి నిస్సపత్నమగు సామ్రాజ్యమున కేలికలైరి. తూర్పుపశ్చిమసముద్రములు శాతకర్ణచక్రవర్తులు ఆచమనవిధులు నెఱవేర్చు పుణ్యతీర్థము లయ్యెను. పవిత్ర గంగానది ఆంధ్రసామ్రాజ్యలక్ష్మికి ముత్యాలకంఠహార మయ్యె. ఆంధ్రుల అదృష్టభానుఁడు నభోమధ్యస్థుఁడైయున్న యీ దినములలో ఆంధ్రభాషాప్రశంసయే లేదేమని మనము నిరుత్సాహపడుట సహజము. ఆంధ్రచక్రవర్తులు శక యవనాదులవలె మొఱకులుగారు. హాలుఁడను శాతవాహనాంధ్రచక్రవర్తి విక్రమార్క-భోజ కృష్ణరాయ సదృశుఁడైన రసికవిద్వాంసుఁడు. ఈతఁడు గాథాసప్తశతియను గ్రంథమును మహారాష్ట్రిప్రాకృత

మున రచించెను. ఇట్లే శాతవాహనమంత్రియగు గుణాఢ్యుడు పైశాచీప్రాకృతమునందు 'బృహత్కథ' యనుగ్రంథము వ్రాసెను. ఈగ్రంథము అనేక ఉత్తమకథలకు గనివంటిది. శాతవాహనాంధ్రులు ఖడ్గశూరులైనట్లే వాఙ్మయవీరులనికూడ రుజువైనది. ప్రత్యేకాంధ్ర సారస్వతమును సృజింపక వీరుఅన్యభాషల నాదరించుట యేలనని శంక జనించును. వాఙ్మయము నిర్మించుటకనువగు నాంధ్రభాష నాటికింకను బయలుదేరకుండవచ్చును. ఆంధ్రచక్రవర్తులు బౌద్ధమతాభిమానులుగకూడ కానవచ్చుచున్నారు. బౌద్ధులకు ప్రాకృత పాళీభాషలు వైదికమతస్థులకు సంస్కృతమువలెనే పూజార్హమైన దేవభాషలు. ఈ కాలమున వ్యవహారమునుండి దూరదూరమగుచున్న సంస్కృతభాషాస్థానమును ప్రాకృతములు ఆక్రమించుకొనుచుండుటచే ప్రాకృతకావ్యరచన సులభమును బహుజనాదర పాత్రమునై యుండెను. హాలుడుగాని, ఆతని ఆస్థానవిద్వాంసులుగాని విశిష్టజాతిభావము నింకను పెంచుకొనలేదు. పూవు పుట్టగనే పరిమళము తెలిసిపోవునట్లు ఆంధ్ర వాఙ్మయ మెట్టివాహినులలో ప్రవహించునో కొంతవరకు హాలునినాటనే ద్యోతకమయినది. ఆంధ్రులు వీరులు, ఉత్సాహవంతులు, విజయరమాప్రసన్న హాసచంద్రికల చకోరములవలె గ్రోలినవారు. దీని కనురూపముగ వీరశృంగారములు వారికభిమానకలశములుగ నుండునని యూహింపవచ్చును. ఆంధ్రులు మధురరస పిపాసువులుగాని చింతాభరదోదూయమానమానసులు కాజాలరని హాలచక్రవర్తి నాంద్యంతమున శుభాశంసలు చల్లి సూత్రధారియై రంజిల్లెను.

శాతవాహనాంధ్ర సామ్రాజ్యము విశిష్టాంధ్ర వాఙ్మయమును సృజించు పుణ్యమునకు నోచుకొనకముందే క్రీ. వె. మూడవ శతాబ్ద మధ్యమున కాలవాహినిలో నదృశ్యమయ్యెను. ఏడవశతాబ్దారంభమువరకును ఆంధ్రదేశము నేలిన ఆంధ్రుల భాగ్యవిధాతలైన పల్లవులు సనాతనమతావలంబులై సంస్కృతము నాదరించిరి. పల్లవచక్రవర్తు లశ్వమేధావభృథపూత శిరోమణులగు శిష్టులు. ఆంధ్రులపాలిటి కామధేనువైన తూర్పుచాళుక్య వంశము క్రీ. వె. ౬౧౫ ప్రాంతమున హర్షవిజేతయైన పులకేశిచక్రవర్తి సోదరుడు కుబ్జవిష్ణువర్ధనునిచే ప్రారంభింపబడెను. ఆర్యావర్తమునం దెవనిఖడ్గధార లకుంఠితములై వెలసెనో అట్టిహర్షవర్ధను నోడించుటయం దాంధ్రకుఠారములు పులకేశిచక్రవర్తికి తోడుపడియుండును గదా. వీరనిలయమగు వేంగిదేశమునకు ప్రభువై యుండియు సామంతుగ నుండనేలయని కుబ్జవిష్ణువర్ధనుడు స్వాతంత్ర్యము ప్రకటించెను. ఆతనివంశమునకు నాలుగున్నర శతాబ్దుల దీర్ఘకాలము స్వతంత్ర రాజ్యార్హతయు, ఆంధ్రులకు శాతవాహను లస్తమించిననాటనుండియు లేనివిశిష్టత్వమును ఈచాళుక్యప్రభువు సాధించెను. ఆంధ్రప్రాంతము ప్రత్యేకరాజ్యముగ నేర్పడుటతోడనే ఆంధ్రభాషకు గౌరవప్రపత్తులు లభించెను. శాసనములలో సంస్కృత ప్రాకృతములను తెనుగు క్రమముగా నిర్జించెను. నేడాంధ్రులు ప్రత్యేకరాష్ట్ర జయభేరిని చెవులు చిల్లులుపడునట్లు మ్రోగించుచున్నారనిన దానిలో నెంత విశేషముగలదో భావించుకొనవలెను. ప్రత్యేకాంధ్రరాష్ట్రము, ప్రభుత్వము, జీవదాంధ్రత్వము యొక్క స్ఫురత్కేతనములు. కుబ్జవిష్ణువర్ధనుడు క్రీ. వె. ౬౧౫ లో ఆంధ్రుల కీపెక్కువను ప్రసాదించెను. నాటినుండి ఆంధ్రరాజ్యము మూడు శతాబ్దములవరకు ప్రబలతరశత్రువులగు రాష్ట్రకూటులతో తన యస్తిత్వమునకై హోరాహోరిగ పెనగులాడుట తటస్థించెను. పశ్చిమచాళుక్యులను మ్రింగివేసిన రాష్ట్రకూటులకు తూర్పుచాళుక్య లొక లెక్కగాదు. కాని విధివిధానముచే ఏనుగు జారిపోయిన గొంతులోనుండి లేడి జారినదికాదు. చాళుక్యఖడ్గము పరశురాముని కుఠారమువంటిది. నిరంతర యుద్ధజీవితముచే సమరకర్కశులైన ఆంధ్రులకు వీరరసము ప్రాణానిలమై పోయినది. ౯౭౩ ప్రాంతముల రాష్ట్రకూట సామ్రాజ్యసౌధము కూలిపోయి చాళుక్యులకు సవతిపోరు తప్పినది. ఇంతలో గృహకల్లోలములు తలసూపకున్నచో ఆంధ్రవాఙ్మయ భానూదయము రాజరాజనరేంద్రుని వరకు ఆలసింపకపోయియుండెడిదేమో.

రాజరాజనరేంద్రుని నలుబది సంవత్సరముల శాంతియుతమైన పరిపాలనమున వేంగిదేశము నిమ్మళకు

నీరు వోసినట్లు చల్లబడినది. రాజరాజు ఖడ్గనాయకుడు. నన్నయ వాఙ్మయనాయకుడు. విమలాదిత్యతనూజుడు వీరగీతిప్రియుడు. కుమారిల సాంప్రదాయముల నడుమ పెరిగిన నన్నపార్యుడు వైదికమార్గాభిమాని. ఉభయ తారకముగ మహాభారతకథ లభించినది. నన్నయనాయక మైన వాఙ్మయమునందు వస్తుసమృద్ధి ప్రధానలక్ష్యము. 'ప్రసన్నకథ కలితార్థయుక్తిచే కవీంద్రులు మెచ్చ నట్లు రచింపవలెనని యాతని ఉబలాటము. దేవభాష విడిచి మనుష్యభాషలో కావ్యము నల్లుట చెరకుగడ విపరీతేసి చొప్పలెండు చప్పరించినట్లని ఆధిక్షేపించు వారికి 'అక్షరరమ్యత' నెరగ పారవేయదలంచెను నన్నయ. నవ్యనవనీత సమానమగు నిండుమనసుగల నన్నయ తొలునకు కథలు చెప్పుటయందు పరమశ్రద్ధ. మనోహరమగు కథను చక్కగ చవులూరునట్లు అతి శయోక్తులు లేకుండ చెప్పుట నన్నయ ఎరిగినట్లు ఆంధ్రకవులు మరెవ్వరును ఎరుగరు. పింగళి సూరన కూడ ఈవిద్య కొంతవరకు నేర్చెను కాని అడ్డగళ్ళు చాలవేసి మనలను తికమకపెట్టును. నన్నయకథ పచ్చ గడ్డి మొద్దులను ముద్దుకొనుచు తిన్నగపరుగెత్తు లేనె వాకవలె నడచును. పింగళి సూరనార్యుని కథ దూరదేశమున కేగు కొండవాగువలె వంకరలు తిరుగుచు ఉరుకును. నన్నయను కథలు చెప్పు వైపుణ్యములో ఆంగ్లకవి ఛాసరు(Chaucer)తో పోల్చ వచ్చును. ఛాసరు తనకాలపువారి హాస్యరసపూరితు లైన కొందరి బాలకునివలె చూచి నవ్వుపుట్టించు నట్లు వర్ణించును. నన్నయరచనలో ఉదంకునికథ, రురుడు ప్రమద్వర, కచదేవయానుల వృత్తాంతము, తపతీ సంవరణోపాఖ్యానము ఇట్లెన్నియో మనోహరవృత్తాం తములుకలవు. అతడు పరమనిష్ఠాపరుడయ్యు 'కావ్యా లాపాంశ్చవర్జయేత్' అనుశుష్కాంధస తుల్యమనస్కుడు కాడు. యువతీయువకుల ప్రణయోదంతములయం దాతనికి, తల్లిదండ్రులకు కుమారీ కుమారుల జవ్వనపు పాలపొంగుమీద గలసానుభూతియే చూపట్టును. వారి హృదయావేదనము నాతడు నిబిడ రససామగ్రితో భారగించక మాటిమాటలతో చెప్పివిడచును. దేవ యాని కచునితో తన హృదయము నిట్లు తెల్పినది.

నీవును బ్రహ్మచారివి వి
 నీతుడ వేమను కన్యక మహీ
దేవకులావతంస! రవి
 తేజ! వివాహము నీకు నాకు ముక్
భావజశక్తి నైనయది
 పన్నుగనన్ను పరిగ్రహింపు సం
జీవనితోడ శుక్రు దయ
 జేయును నాకు ప్రియంబు నావుడున్.

రాజరాజనరేంద్రునితో ఆంధ్రులకథ అడ్డము తిరిగినది. రాజరాజకుమారుడు కులోత్తుంగ చోళుడు ఆంధ్రుల దురదృష్టవశమున సామ్రాజ్య కాంక్షియై మాతామహరాజ్యమైన చోళమండలముపై కన్నుంచి వేగిరాజ్యమును క్రమముగ విడచిపెట్టెను. వీరనిలయ మైన వేంగిక్షేత్రమునుండి తమ కెట్టి యొత్తిడియు కలుగ కుండ పరమరాజనీతిజ్ఞులైన చోళ చక్రవర్తులు చాళుక్య నృపులతో వివాహసంబంధములు జేసి వారిఖడ్గములకు విశ్రాంతి నొసంగిరి. విమలాదిత్యుడు, రాజరాజు, కులో త్తుంగుడు వరుసగ మూడుపురుషాంతములవరకు చోళ మృగీదృశల కనుసన్నలలో మెలగజొచ్చిరి. తుదకు కులో త్తుంగుడు చోళరాకన్నెలనే కాక చోళమండలమునే వరించి యాంధ్రదేశమును తనప్రతినిధులచే పాలింప జేసెను. ఆంధ్రదేశము స్వతంత్రరాజ్యము గాక చోళ సామ్రాజ్యమునం దొక మండలతుల్యమయ్యెను. పల్లవుల నాటి పరిస్థితు లేర్పడెను. విశిష్టవాఙ్మయ ప్రవాహ మరణ్యగత మయ్యెను. చాళుక్యశిల్పుల ఉలులు మూల బడెను.

కాని కాలవాహిని దయాస్వరూపిణి యనుట లో సందియములేదు. ఒకవంక ఒడ్డువిరిచి దేశమును ముంచివేయుచున్నను మరియొకప్రక్క బంగారము పండు ఒండుమట్టిదీవులను తేల్చుచుండును. పూర్వాం ధ్రులవైభవము అస్తమించుచుండగనే పశ్చిమాంధ్రుల చంద్రోదయ మారంభించినది. కాకతీయఖడ్గములపై జయలక్ష్మి వ్రాలినది. పదుమూడవశతాబ్దపు ప్రథమార్ధ మునందే కాకతీయాంధ్రుల విజృంభణ సిద్ధినిమయ మాయెను. కాకతీయసామ్రాజ్యమునందు కవితావ్యా సంగముకంటె ఖడ్గవ్యాసంగమే యెక్కుడుగ నుండె

ననితోచుచున్నది. జైనశైవమత వైషమ్యములచే చక్రవర్తు లప్రమత్తులై యుండవలసి వచ్చెను. పల్లెటూరి కరణము మొదలుకొని మంత్రి దండనాథులవరకును అల్లుకొనిపోయిన జైనసాంప్రదాయకుల నిర్మూలించు మహాయజ్ఞము జరుగుచున్న దినములలో లలితగోష్ఠీ కలాపములకు తావెక్కడ? అదియుగాక గణపతిదేవుని సామ్రాజ్యమును స్థిరపరచి కవచము గోడకు తగిలించక పూర్వమే మహమ్మదీయుల తళ్లు దక్షిణముపై దిగ నారంభించినవి. ఈ యవకాశములోనే కాకతీయులు కవిఘంటమును కాకపోయినను శిల్పిఉలిని ప్రోత్సహించి జేగీయమానమైన హనుమకొండ, రామప్ప దేవాలయములను నిర్మింపించిరి. కాకతీయాంధ్రులు శుద్ధ వీరుల వలె మనోనేత్రములతోకన్న భౌతికనేత్రములతోనే ఎక్కువ చూడ నభిలషించెడివారేమో! ఎట్లైనను శిల్పమే వారి యభిమానకళగ దోచుచున్నది. కాకతీయ సామ్రాట్టులు ఆంధ్రమునందు కన్న సంస్కృతముపై నెక్కువ పూజ్యభావము కలవారేమో! విద్యానాథుని కృతియే ఈ ఊహకు మూలము.

ఈకాకతీయయుగము కాకతిఖడ్గనాయకము. కవిబ్రహ్మ తిక్కన వాఙ్మయనాయకుడు. కవిబ్రహ్మ నాటికి ఆంధ్రత్వము గడుసువారినది. భావములందే కాక పలుకులందునుకూడ శుద్ధతెనుగుదనమును కోరెడి దినములవి. జానుతెనుగే కాని ఆరూఢ పద్యగద్యమయమైన సంస్కృతబంధము మాకు వలదని పాల్కురికి సోమన, నన్నెచోడుడు మున్నగువారు ఢంకా బజాయించి వెడలిపోయిరి. చిక్కని శైవుడైనపాల్కురికి సోమనకు సంస్కృత వృత్తముకూడ పనికిరాదు. తెనుగువారి పూర్తిసొత్తైన ద్విపదయే వాఙ్మయవాహినికి తగినదని వాదించి ఆచరించి చూపెను. వీరశైవుల పట్టుదలవలన యుగములనుండి అవిచ్ఛిన్నముగ సాగి వచ్చుచున్న భారతీయసంస్కృతితంతువు తెగిపోయి మాండలికత అఖిలజాతీయతాస్థానము నాక్రమించునట్లు తోచెను. ఇంక గృహకల్లోలమునకు మేరయే లేదు. జైనశైవ వైష్ణవవివాదములను సుడిగుండములో దేశము చిక్కుకొని యుండ తిక్కనామాత్యుడు శాంతిదూతవలె నవతరించెను. హరిహరనాథుని కృతిపతిగా వరించిన తిక్కన శివకేశవవిభేదము లెంతయర్థరహితములో ఉదాహరణపూర్వకముగ సమకాలికులకు నిరూపించెను. కావ్యరచనమునందు తెలుగునుడికారమున కర్హస్థానము లభించుట అత్యవసరమని గుర్తించి నన్నయ తత్సమమార్గమునుండి కొంచెము ఓసరిల్లి ఆంధ్రావళికి మోదము గూర్చెను. అఖిలభారత జాతీయత యను గుత్తినుండి తెలుగుపింది రాలిపోకుండ మహాభారతరచనకు బూనుకొనెను. స్వాతంత్ర్యపు గాలినే నిత్యము పీల్చుచు సామ్రాజ్యనిర్వహణ భారము పూనిన ఆకాలపు ఆంధ్రులు గొప్పరాజనీతిజ్ఞులుగ నుండుట సహజము. అందును నెల్లూరు నెరజాణలకు ప్రసిద్ధి. పుంజీభూతమైన రాజనీతిజ్ఞత తిక్కన. సంజయరాయబారములోని నీతివేత్తలు తిక్కనామాత్యుని సమకాలీనుల ఛాయలని నా విశ్వాసము. ఆంధ్రుల సమరపాండిత్యము తిక్కనకు తండ్రి తాతలనుండి పారంపర్యముగ లభించిన యుద్ధవిద్యాపరిచయము అతని యుద్ధపంచకములో ప్రతిఫలించిన దని యొప్పుకొనక తీరదు. తిక్కనామాత్యుని భారతము చదువునప్పుడు తెలుగుదేశపు తోటలలో కూర్చుండి, తెలుగు కోయిలల పాటలు వినుచు, తెలుగు హంసలసొంపునడకల చూచుచు, తెలుగుబాలుర గీతములు వినుచు, అంతయు తెనుగు మయమైన వాతావరణములో నున్నట్లుతోచును.

ఆంధ్రులకు పరధనాసహిష్ణుత లేదు కాని పరకీర్తిసహిష్ణుత తక్కువ. కాకతీయుల నాటనే శౌర్యనిధులగు రెడ్డి వెలమనాయకులలో స్పర్ధలు చెలరేగినవి. ఈ బెబ్బులులను హద్దులో నుంచగల కాకతి సింహము పెద్దనిద్దుర పోయినతరువాత రెడ్లును వెలమలును ప్రత్యక్షశత్రుత్వమునకు బూనిరి. రాచకొండలో పద్మనాయకవెలమలును, అద్దంకి కొండవీడులలో రెడ్డిరాజులును స్వతంత్రరాజ్యములు నిర్మించుకొనిరి. ఇద్దరును శూరులే. ఇద్దరును గండరగండలే. ఇద్దరును ప్రజారంజకులే, రసికచక్రవర్తులే, కావ్యకలాభిమానులే. కాని కలసి విజృంభించుట దేశక్షేమదాయక మని ఒక్కరును తలంపకుండుట శోచనీయము. విచిత్రవృత్తిలో నుండిరో కాని వెలమలు, రెడ్లు ఓరుగంటి క్షత్రియులు, ఆనెగొందిరాజులు అందరు ఒకసా

యను ఏకమై ప్రతాపరుద్ర చక్రవర్తి కుమారుడు కృష్ణనాయకుని నాయకత్వమున ౧౩౪౪ లో మహమ్మదీయులతో ముష్కరయుద్ధము చేసి తురుష్కులను దేవగిరివరకు తరిమివేసిరి. అంతే తిరిగి ఆంధ్రులు అన్యోన్యహననక్రియలో మగ్నులైపోయిరి. రెడ్లును వెలమలును శౌర్యమునందే కాక భాషాభిమానమునందును, సరస్వత్యారాధనమునందునుకూడ స్పర్థించుట యాంధ్రుల అదృష్టమే. సజ్జనులకు విద్యయందే స్పర్థ చెప్పబడినది. రెడ్డివారు ఎఱ్ఱాప్రగడను శ్రీనాథుని పోషించి అజరామరకీర్తిని గడించిరి. గౌరనామాత్యుడు వెలమవారియొద్ద నుండి హరిశ్చంద్రకావ్యము నద్విపదగా రచించెను. పరమభాగవతుడు పోతనామాత్యుడు వెలమరాజ్యమునందే కవితాశాఖ నధివసించి భగవల్లీలను పాడుకొనెను. రెండు ధనవిద్యుత్ప్రవాహము లొక దాని కొకటి యతుకకనట్లు పోతనకును వెలమవారికిని ఏలకో పొసగలేదు. రెడ్లువిషయములోన దృష్టవంతులు. వారు కీర్తికాములు. శ్రీనాథుడు లక్ష్మీసేవకుడు. ఉభయుల మనఃప్రవృత్తులకును సరిపడినది. రెడ్డిరాజులలో కడపటివారు మహాభోగులు. రసికులు. ప్రతిసంవత్సరము వారు సలుపు వసంతోత్సవములు వారి భోగాభిలాషకు కల్పించిన నీటితూములు. అరత్నములు, అజిలుగువలువలు, కస్తూరి కుంకుమ హిమాంబు కాలాగరుసురభిళములగు నామందమారుతములు, ఆస్వర్గభోగము నేడు స్వర్గములో నుండునేమో? కోటీశ్వరుడైన అవచి దేవయతిప్పయసెట్టి తేనెబొట్టుకొరకు పువ్వుపువ్వుతిరుగు తుమ్మెదవలె కన్న కన్న దేశములు గాలించి భోగార్హమైన వస్తువులు కూర్చితెచ్చి రెడ్డిరాజుల వసంతోత్సవ సుగంధశాలాధ్యక్షుడై వెలసెను. హరవిలాసములోని ఈక్రిందిపద్యమువలన తిప్పయసెట్టి ఏయేదేశములతో వ్యాపారము చేసెడివాడో తెలియుచున్నది.

పంజాబు కర్పూరపాదపంబులు తెచ్చి
జలనోగి బంగారుమొలక తెచ్చి
సింహళంబున గంధసింధురంబులు తెచ్చి
హురుమంజిబలు తేజిహరులు దెచ్చి
గోవసంపద్ధ సంకుమద్రవ్యము దెచ్చి
యాపగ నాణిముత్యాలు దెచ్చి
చోటంగి కస్తూరికాటంకములు దెచ్చి
చీనిచీనాంబరశ్రేణి దెచ్చి

ఆంధ్రదేశములో దొరకని భోగపదార్థము లేదనిపించెను. ఈవాతావరణములో మహావేగముతో పరిభ్రమించిపోవుచున్న శ్రీనాథరేణువు 'కస్తూరికాభిక్షాదానము సేయరా' అని పాడక 'సత్కవుల్ హాలికులైననేమి' యని సత్యనిష్ఠురముగ గర్జించగలదా? ఇదివరలో వర్ణించిన (Allegro, Il Penseroso) లు కవిమానస మందేకాక భూమికి అవతరించి మూర్తీకరించిరి. రెడ్డిరాజులును వెలమభూపతులును కూడ ఆంధ్రవాణినేకాక గీర్వాణసరస్వతిని కూడ ఆరాధించిన పండితప్రకాండులు. వెలమవారు రసార్ణవసుధాకరాదిగ్రంథములను, రెడ్డివేమభూపాలుడు అమరుకవ్యాఖ్యయగు శృంగారదీపికయు, కాటయవేముడు కాళిదాసనాటకత్రయవ్యాఖ్యను రచించి సహృదయలోకమున వన్నెకెక్కిరి.

పిట్టపోరు పిల్లి తీర్చినట్లు అంతఃకలహములచే క్షీణశక్తములైన వెలమరెడ్డి రాజ్యములు ౧౫-వ శతాబ్దమధ్యమువనే బలవత్తరశత్రువులచే కబళింపబడెను. రాచకొండరాజ్యము గోల్కొండ నవాబుల పరమును, రెడ్డిరాజ్యశేషము గజపతుల కైవసము నై కీర్తిసౌరభముమాత్రము శేషించెను. ఆంధ్రుల పరాకాష్ఠ యెట్టిదో కాని వారింతటితో కాలగర్భమున విలీనమైపోక మరికొంత దక్షిణమునకు పోయి ఆంధ్రుల మూడవ సామ్రాజ్యవృక్షమును తుంగభద్రానదియొడ్డున నాటిరి. విజయనగర సింహాసనము నధిష్ఠించి, యవనార్ణవమునకు చెలియలికట్టగా నిల్చిన మూడు వంశములలో సాళువ తుళువ వంశములైనను ఆంధ్రరక్తపునీతములైన వని చరిత్రకారులు విశ్వసించుచున్నారు. ఆంధ్రకర్ణాటకులును వారిభావములును సన్నిహితసంబంధము కలవి యనువాదుక చిరకాలమునుండి లోకములో నుండెను కాని దానికి చారిత్రకాధారములు తక్కువ. తూర్పుచాళుక్యుల కాలములో రాష్ట్రకూటాధిపత్యము క్రింద కర్ణాటకులు వేగిదేశముపై దాడులు చేసినట్లు

చరిత్ర వాకొనుచున్నది. విజయనగరసామ్రాజ్యమునందు జనశ్రుతియే సిద్ధమై ఆంధ్రకర్ణాటులను స్వజాతిమత రక్షణమహాధ్వరమునందు అధ్వర్యులనుగా జేసినది. ఈ సామ్రాజ్యము ఆంధ్రభూపాలురకు లేజిక్కు వశమంత మగుటయు సామ్రాజ్య నిర్వహణకార్యము ఆంధ్ర వీరకుటుంబములపై నిలచుటయు జూడ తెలుగువా రిదే ఆకాలమున పైచేయి అయి యుండవచ్చు నని తోచుచున్నది. నాటి తెలుగువీరకుటుంబములలో ఈ క్రిందివారు ప్రసిద్ధు లని కృష్ణరాయవిజయములో వ్రాయబడినది.

చక్కెరవిలుకాని చక్కదనముకల్గి
  చొక్కపు వాక్పటి బుక్కరాజు,
సాకల్యముగ కీర్తి సర్వదిక్తటులందు
  ప్రాకటస్థితి మించు సాళువారు,
కంటకరాజన్య గర్వము లడగించి
  లీలచే మించు నంద్యాలవారు,
ధాటీనిరాఘాట ఘోటీహితవిరోధి
  కోటులై వెలయు వెల్గోటివారు,
చండతర శౌర్యులగు పెమ్మసానివారు
బూదహాళివారు మొదలైన భూమిపతులు
గొలువ పట్టాభిషిక్తుడై చెలువుమీరె
రమ్యగుణశాలి శ్రీకృష్ణరాయమౌళి.

సామ్రాజ్యము వ్రేళ్లుపారి పరభయంకరమైన కొలది భాగ్యభోగములు పెరుగజొచ్చెను. ఖండాంతర వాసులుకూడ విజయనగరైశ్వర్యమును బట్టలవలె పొగడుకొనజొచ్చిరి. విజయనగరవీథులలో కుప్పలుగ పోయని మహార్ఘరత్నములుకాని, లక్ష్మీప్రదములైన పుష్పరాసులుగాని, సుగంధ భాండారములుగాని వారి కెచ్చుటను కాన్పింపలేదట. ఐశ్వర్యసుఖసంతోషములు సామ్రాజ్యమునందలి మూలమూలలను, సామాన్యజనులలోను, కర్షకలోకమునందును వ్యాపించినవా యను సంశయము విచారణీయము. ఉన్నతతరగతులవా రింద్రభోగముల ననుభవించి రనుటకు సందేహము లేదు. వారి సుఖస్వప్నచంద్రోదయమున కవి చకోరములు మధురకూజితములను చేసినవి. ఆకాలపు సహృదయులు కవులకు బ్రహ్మరథము పట్టెడివారు. కవికులములు చక్కెర తిని తియ్యగా పాడుట కలవాటు పడినవి. ప్రబంధయుగమునకు ముందుగడచిన శ్రీనాథుని శృంగారాభినివేశము కవిమానసములను మిక్కిలి ఆకర్షించినది. పోతనభక్త్యావేశము అరణ్యగీతి యయ్యెను. విజయనగరము, భోగములు, పుష్పలావికలు, వేశ్యవాడలు, విలాసోద్యానములు, కేళీమహలు, ఇట్టివెన్నో ని మనోహరవస్తుసంచయములకు నెలవై వారికనులకు మిరుమిట్లు గొల్పుచుండెను. · ప్రవరాఖ్యునివంటి వైదికాచార సంపత్తిగల యువకుడు కనుగొలకుల నవ్వుతో తిలకింపబడెడి వాడేమో! అధర్మప్రవృత్తి పెచ్చుపెరిగెనని చెప్పుటకు వలనుపడదు. వేశ్యకాంతయగు కలభాషిణి యందే సతీత్వప్రతీతిని పింగళి సూరనార్యుడు చిత్రింప దలచినపుడు గృహస్థులమాట చెప్పనేల? సర్వతోముఖవిజయముచే గల్గిన సంతృప్తిచే ఆకాలపు వారు జీవితమధువును తనివితీరునట్లు గ్రోలదలచి రనుట సత్యమునకు సమీపముగ నుండును. భోగలాలసత కొంతవరకు ప్రమత్తతకును, విజయనగరపతనమునకును దారితీసి యుండకపోదు.

ప్రబంధయుగమునుగూర్చి చర్చించునపుడు రసిక హృదయులదృష్టి కావ్యము లందలి శృంగార రసముమీదనే పడుచున్నది. కాని యవి వీరరసమునకుకూడా పుట్టినిండ్లని సకృత్తుగ గ్రహింపబడుచున్నవి. కావ్యారంభమునందలి కృతిపతివంశాదికము అజాగళస్తనమువలె నిరర్థకముగ తలంపబడుచున్నది. చరిత్రకారులుమాత్రమే వానిని ఉపయోగించుచున్నారు. విజయనగరవీరుల కత్తివేడిని కథాచ్ఛలమున గాక ప్రత్యక్షముగనే వర్ణించిపెట్టి మనకవులు స్వధర్మము నెరవేర్చుకొనిరి. ఆవర్ణనముల మనము స్వీకరించి ప్రబంధకవులకు వీరరసావేశము లేదను అపవాదును తొలగించుట మనవిధి. శ్రీకృష్ణదేవరాయలవారి నిండోలగమున ఈ క్రిందిపద్యమును అల్లసాని పెద్దనకవి పర్వతము మీదనుండి దొర్లు రాయివలె గంభీరధ్వనితో చదువుచున్నప్పుడు ఏ ఆంధ్రవీరుని కరవాలము ఒరలోనుండి బుసకొట్టుచు లేవలేదు!

తొలుదొల్త నుదయాద్రిశిల దాకి తీండ్రించు
  నసిలోహమున వెచ్చనయి జనించె
మఱి కొండవీ డెక్కి మార్కొని నలినైన
  యలకసవాపాత్రు నంటి రాజె

నటు సాగి జమ్మిలోయ బడి వేగి దహించె
గోన బిట్టేర్చె గొట్టాన దగిలె
కనకగిరిమ్రగ్గ గరచె గౌతమి గ్రాచె
నవుల నా పొట్నూర రవులుకొనియె
మాడెములు ద్రేల్చె నొడ్డాది మసి యొనర్చె
గటకపురి గాల్చె గజరాజు గలగి పఱవ
దోకచిచ్చన నార యుద్ధురత కృష్ణ
రాయబాహుప్రతాపజాగ్రన్మహాగ్ని.

ప్రబంధకవిత్వము భోగైశ్వర్యవాతావరణమునే ప్రతిబింబించెను కాని జనసామాన్యము యొక్క నిరాడంబరజీవితమును కన్నెత్తియైన చూడలేదను విమర్శ కొంతవరకు నిజమైనను కృష్ణరాయలవా రీలోపమును స్వయముగ తొలగించిరి. దేవేంద్రతుల్యవైభవమున కధీశుడైన యీ ప్రభుశేఖరుడు దరిద్రుల పూరిండ్లను దూరి చూచినట్లు వారికష్టసుఖములను సత్యలేఖినితో నెట్లు చిత్రించగల్గెననుట ఆశ్చర్యకరము. కావుననే ఆముక్తమాల్యదను చక్రవర్తి స్వయముగ రచించలేదను జనశ్రుతి వ్యాపించినది. కాని విష్ణుచిత్తీయ మీ మహాచక్రవర్తి రచించిన దనుట యసంగతము కాదు. కృష్ణదేవరాయలవారిబాల్యము కష్టములలో గడచెనను ఐతిహ్యము కలదుగదా! మంత్రితిమ్మరుసుగా రీతనిని అన్నయైన వీరనరసింహరాయల యనూయనుండి కాపాడ వలసివచ్చెనట. ఆదినములలో రాయలవారు ప్రచ్ఛన్నవేషముతో ఏక్షుద్రగ్రామముననో, ఏపేదకర్షకుని యింటనో అల్ఫ్రిడ్‌ది గ్రేట్ అను ఆంగ్లరాజశేఖరుని వలె దాగియుండవచ్చును. అదిగాక రాయలవారి కాలములో విశేషము రణాంగణమునను, విజయసంచారమునందును గడచినది. గుఱ్ఱ మెక్కి దేశదేశములను విహరించిన చక్రవర్తికి పేదసంసారుల గృహచ్ఛిద్రములు ప్రతినిత్యమును అనుభవమునకు వచ్చియుండును. బహుశః రాయలవారు నివృత్తిహృదయులై యుండవచ్చును. విజయనగరము భోగపంకిలమై యుండుటచే ఆమహాపురుషుడు అకలుషితమైన గ్రామజీవనమును, వైష్ణవభక్తుల నిరాడంబర జీవితమును కావ్యజీవాతువులుగ గ్రహించి ఆంధ్రకవిత్వమునకు నూతనమైన రాచబాటను వేయుటకు సాహసించెను. ఈయంశమున రాయలవారిని కవిశూద్రకునితో పోల్చవచ్చును. రాజన్యుడైన శూద్రకునకు సంఘమునందలి నిమ్నశ్రేణిజనుల జీవితసుఖదుఃఖములు వర్ణనీయాంశములుగ దోచుటచేగదా మృచ్ఛకటికనాటకమునకు విశిష్టతయేర్పడినది. రాయలవారి మార్గము పింగళి సూరనకవి యందుమాత్రము రవంత ప్రతిఫలించినది. సుగాత్రీశాలీనుల చక్కనికథలో నిరాడంబరజీవితముపై కవికి గల యభిమానము వ్యక్తమగుచున్నది. కాని వసుచరిత్రము ముందర ఆముక్తమాల్యద నిలువలేకపోయినది. ఈకావ్యమునందలి కరుణారసము, స్వాభావికతయు దీనజనులకు మాత్రమే హృదయంగమముగా నుండును. ఇందలిభాష చాలకఠినముగా నుండుటచే బహుజనాదరణము పడయలేదు. వసుచరిత్రకూడ గాఢపాకము గలదైనను పండితుల మాత్రముల కనువుగ తీర్చిదిద్దబడిన దనుటచే దానికి వ్యాప్తియెక్కువ యయ్యెను. రాయలవారు వేసినబాట ఆధునిక యుగములో ఎక్కువ ఆదరణము వడయగలదు. అకృత్రిమజీవితమునే లక్ష్యముగా పెట్టుకొన్న నేటివారికి రాయలవారు కవితాగురువులు కాగలరు.

ముద్దులమూట

శ్రీ చిల్లరిగె సేతుమాధవరావు

ముద్దు లెన్నియొ జేర్చి - ముద్దుమూటనుగట్టి
ముద్దుగా నీ కీయ - ముద్దు నా కగునోయి
ముద్దుశ్రీకృష్ణ.

భక్తిభావము గన్న - భామ యా రుక్మిణికి
ప్రేమతో వెలుగొందు - ప్రేయసీసత్యకును
ప్రియము నీవగుటచే - ప్రీతిసేయుచునుండ
ముద్దు నీ వగుదువో - ముద్దుశ్రీకృష్ణ.

దేవకియు గన్నట్టి - దేవుడవు నీ వగుచు
తల్లి యశోదమ్మ - తనయుడవు నీ వగుచు
ఇరువురకు నింపుగా - నిహపరంబుల గూర్ప
ముద్దు నీ వగుదువో - ముద్దు శ్రీకృష్ణ.

రాధ నీ హృదయేశ్వ - రగునొండె కాదొండె
ఆత్మపరమాత్మలకు - నంతరంగంబుంట
ముక్తిదాయిని నీవు - మోక్ష మొసగుటజేసి
ముద్దు నీ వగుదువో - ముద్దుశ్రీకృష్ణ.

ఋషులు నీకొరకు పౌ - రుషములన్ విడనాడి
గోపికల్గా నొప్ప - గోవిందు నీవగుచు
సుందరాంగుల కెంతొ - విందు సేయుచునుండ
ముద్దు నీ వగుదువో - ముద్దు శ్రీకృష్ణ.

యమునానదీ సైక - తములందు గిరులందు
భవ్య బృందారణ్య - పరిసరంబులయందు
మ్రోడులే చిగిరింప - మ్రోగుచుండెడి నీదు
వేణుగానము వినగ - విందయౌచుంటచే
ముద్దు నీ వగుదువో - ముద్దుశ్రీకృష్ణ.

ఈగలు

చాలమంది నిపుణులు తాము పరిశీలించు ప్రత్యేక వస్తువులను గూర్చి ప్రజలకు అభిరుచి కలిగే విధముగా చెప్పలేరు. ఎవరన్నా క్రిములు మున్నగువాటిని గూర్చి పరిశీలన సల్పుతున్నారంటే, ఎప్పుడూ భూతద్దాలు మొదలైనవి పెట్టుకొని చూస్తూ కూర్చునే పిచ్చివాడని అభిప్రాయపడతారు.

క్రిమిపరిశీలనలో పేరుపొందింది బాల్టిమోర్ నందలి జాన్స్‌హాప్కిన్స్ విశ్వవిద్యాలయానికి చెందిన పాల్ హెగ్నర్. ఆయన ఈ మధ్యనే క్రిమిసముదాయాన్ని గూర్చి ఒక పుస్తకాన్ని రచించారు.

అది అమెరికానుండి వెలువడిన శాస్త్ర సంబంధములగు పుస్తకములలో చాల ఉల్లాసకరమైనది.

ఈ క్రిములు చాల శక్తివంతములు. సైన్యాలకంటె ఎక్కువ బలము కలవి. ఎంచేతనంటే, ఎంతమనిషికైనా రక్తనాళాలలో ప్రవేశించి, ఊపిరితిత్తులు మొదలైనవి పాడుచేసి అమాంతముగా క్రుంగతీస్తాయి.

ప్రొఫెసర్ హెగ్నర్‌గారు ఆ క్రిముల సంహారాన్ని గూర్చి ఏమీ చెప్పలేదు. అది డాక్టర్లకు వదలివేశారు.

కాని మలేరియా క్రిమిని గూర్చి మాత్రము విడువలేదు. అది అన్ని వ్యాధులకంటె ఎక్కువ విస్తారమై చాలమందిని బలిగొంటుంది కనుక,

పనామా కాలువ ప్రాంతములలోను, ఉష్ణదేశాలలోను క్వినైను మలేరియా విస్తరింపకుండా చేసిందని ఆయన తెల్పారు.

జాతిసమితి మలేరియా కమిషన్ వారు, జ్వరపుకాలములో రోజుకు 6 గ్రైనులున్నూ, జ్వర మున్నపుడు 5 నుండి 7 రోజులవరకు రోజుకు 15 లేక 20 గ్రైనుల క్వినైను తినుచుండవలెనని సూచించారు. క్వినైను అపాయకరము కాదని కూడ వారు తెల్పుచున్నారు.

హెగ్నరుగారు ఇంత ఉల్లాసవంతముగా వ్రాయుటచే పరిశోధకులంతా కేవలము రసవిహీనులుకారు అని మనము తెలుకోవచ్చు.

మల్లికార్జున పండితారాధ్యుడు

శ్రీ వావిలాల వెంకటేశ్వరశాస్త్రి

పన్నెండవ శతాబ్దికి జేరిన కవులలో నన్నెచోడునకు తర్వాతివాడు పండితారాధ్యుడు. ఈతని గ్రంథములలో శివతత్త్వసార మొకటిమాత్రము లభ్యమై యున్నది. పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రమున నీకవి "రుద్రమహిమ గణసహస్రమాల, అమరేశ్వరాష్టకము, పర్వత వర్ణనము, లింగోద్భవ దేవుగద్యము"—అను సంస్కృతాంధ్ర గ్రంథములను, ప్రభులింగ స్తోత్రము, బసవగీత అను కర్నాటక గ్రంథములను వ్రాసియున్నాడని తెల్పియున్నాడు. కాని, శివతత్త్వసారము తప్ప తక్కినవి ప్రస్తుత మలభ్యములు. ఇందు లింగోద్భవ దేవు గద్యమనునది తెనుఁగు గ్రంథమే యైనయెడల ప్రత్యేక గద్యకావ్యము లానాడే వెలసియుండెనని మనము సంతోషింపవచ్చును. ఇటీవల వే. ప్ర. శాస్త్రిగారు శ్రీముఖగద్యమను నీకవి రచితగ్రంథమును సేకరించిరి. అది యుదాహృతమైనంతవరకు దెలుగుగద్యమే. కావున లింగోద్భవ దేవు గద్య తెనుగురచనమై యుండవచ్చును.

పండితారాధ్యునికాలము

ఇత డించుమించు నన్నెచోడునికాలపువాడు. అతనితో సమానవయస్కుఁడు కాకపోయినను అతనికి సమకాలికుడై యుండెననుట సిద్ధము. పండితారాధ్యచరిత్రమును బట్టి యితడు బసవేశ్వరుని దర్శింపబోవుచుండ త్రోవలో నతని మరణవార్త విని మిక్కిలి విలపించి శ్రీశైలప్రాంతమున నివాస మేర్పరుచుకొని తరువాత కొలది కాలముననే పరమపదించె నని తెలియుచున్నది.

బసవేశ్వరుడు లింగైక్య మొందినది ౧౧౬౮-వ సం॥న. పిమ్మట రెండుమూడు సంవత్సరములకు బండితారాధ్యుడుగూడ దేహమును చాలించుకొనె నని చెప్పుకొనిన నతడు ౧౧౭౦ వరకు జీవించిన ట్లగును. అప్పటి కీతడు కడువృద్ధుడు. కన్నులు లేవు. శ్రీశైల మెక్కలేక తనభక్తిని స్వామి కర్పింపు మని తనశిష్యుని పరముగ బంపినాడు, ఈ హేతువునుబట్టి యతడు సుమారు ౭౦ సం॥లు జీవించియుండెనని నిశ్చయించిన నతఁడు నన్నెచోడునకు సమకాలికు డగును. సమానవయస్కుఁడుమాత్రము కాడు.

వెల్నాటి చోడునికాలము: రెండవ నిదర్శనము

వెల్నాటి చోడు లిరువురు గలరు. మొదటివాడు ౧౧౧౫ నుండి ౧౧౩౬ వరకును, రెండవవాడు ౧౧౬౩ నుండి ౧౧౮౦ వరకును చందవోలు రాజధానిగా తెలుగు దేశపు నొకభాగము నేలుచుండిరి. పండితారాధ్యుడు వెల్నాటి చోడుని యాస్థానమున కేగి యచటి బౌద్ధులను వాదమున నోడించి రాజుకినుకకు పాత్రమై తనకన్నులు పోగొట్టుకొనెనని పండితారాధ్యచరిత్రవలన దెలియుచున్నది. ఈ విషయమును కొందరు [illegible]

తో చందవోలుకై క్షీయత్తన కలదు. (మార్పు కండ్లతీయించినవాడు రాజబావమఱ దని). కొండపచోడునియాస్థానమునకే ఇత డేగి యుండు నని నిశ్చయింపదగును. మొదటి చోడుని కాలమునకు దరుణవయస్కుఁడగు పండితుడు ఇంతపనికి చాలియుండ డని తోఁచుచున్నది.

ఇతని మతగ్రంథరచన శివతత్త్వసారము. ఇది శతక మని పేరేకాని అన్వర్థనామముగాదు. సంప్రదాయమునుబట్టి ౧౦౦ పద్యములుగల ఖండకావ్యమునకు శతకమని పేరు. ఇం దించుమించు యేనూరుపద్యములు గలవు. శతకములయం దన్నిపద్యముల చివరను యేకవిధసంబోధన యుండును. ఇం దానియమము లేదు. దీనికి శతకమనుపేరు పాల్కురికి సోమనాథునినాడే రూఢమైనది.

"శతకంబు శివతత్త్వసారంబుదీప,
కళికమహానాటకము నుదాహరణ
(పండితారాధ్య చరిత్ర.)

శతకనియమములు లేకున్నను దానికా పేరు రూఢమైనదికాన మన మెరిగియున్నంతలో దెలుగున నిదియే యాదిశతక మని గ్రహింపవచ్చును. కాగా — ఆంధ్రవాఙ్మయమున యితడే ప్రథమశతకకర్త యనియు, ప్రథమరచయిత యనియు మనము వర్ణింపవచ్చును.

కావ్యవస్తువు: కవిత్వము :

ఈతని గ్రంథమున పరమతనిరసనము, స్వమతస్థాపనము అను యంశములు తప్ప కథాంశమేమియు లేదు. వేదబాహ్యములైన బౌద్ధాదిమతములు ఇందు నిర్దయముగ ఖండింపబడినవి. శివపారమ్యము తద్భక్తలయు, గద్దాదులయు మహిమలు మిక్కిలిగా స్తుతింపబడినవి. కవి శివునకు తన్నుతా నర్పించుకొను భక్తిగీతములను బాడియున్నాడు. ౪౦౦ పద్యము లున్నను గ్రంథ మసమగ్రముగ గానంబడుచున్నది. అన్యమతనిరసనమున కీపద్యము లుదాహరణములు:

"స్వేచ్ఛాచారులు మిథ్యా
విచ్ఛేదనవేదశాస్త్రవిప్లవవాదుల్
ప్రచ్ఛన్నదోష లజ్జా
నాచ్ఛాదితదుష్టచిత్తు లద్వైతు లజా.

నరసింహుని కంఠంబున
నరుణజటాకేసరంబు లంటికపాదాం
బురుహాపుక్షీతమునం బో
ల్పరుదుగ రచియించు నొకగణాధీశుఁ డజా."

ఇందలి భాషాశయ్యలు :

నన్నయపద్యముల కీతనివి కేవలము అనుకృతులు. సంస్కృతజటిల మయ్యును సుబోధకత్వమును, వాక్యములందలి సమతాగుణమును, భావగాంభీర్యమునకు అనుగుణమైన దుందుభిధ్వానమువంటి శబ్దాడంబరమును లోనగు భాషాలక్షణము లన్నిటిని నీకవి నన్నయనుండి యెరువు తెచ్చుకొనెను.

క. "అతిమూర్ఖుం డతిపతితుఁడు
అతికుత్సనుఁ డనఁగవలవ దతిశయభక్తి
స్థితి సెగడెసేని వాతం
డతిపండితుఁ డతిపవిత్రుఁ డతిసుజనుఁ డజా.!"

మరియు నన్నెచోడునివలె నొకటి రెండుచోట్ల కన్నడపదములను బ్రయోగించి యున్నాఁడు.

"హరి నీభక్తిని పేదక
చరితలు పోవిడిచి నిన్నె చనఁ గొలిచి నిరం
తరభక్తుఁడై శివైక్యుఁడు
నిరణంబగు పసిడివోలె నిలువఁగవలయున్.

నిరణమన మలినము లేనియని యర్థము.

దేవా సంసారాంబుధి
లో వెలువడఁజేసి ప్రమథలోకం బెఱుఁగ
న్నావాఁడు వీఁడు సుండీ
నావే నన్నుంపవే గణంబులనడుమన్.

స సముద్ర ద్వీపాచల
వసుమతి నడిమీఁది కొనగనైచి స నక్ష
త్రసురావాసాకాశము,
వెసఁ గిందికి దివుచు ప్రమథవిభుఁ డొకఁడు శివా."

తెలుగుకవులలో గవిత్వము మతోపదేశమునకై వినియోగించినవారిలో నితడే యగ్రగణ్యు డని తేలుచున్నది. ఈ ధర్మసంగ్రహత్వమే ఇతనివాక్కున కతీక్ష్ణత్వము నాపాదించినది. ఇతఁడు వేదవేదాంగ విద్యానిపుణుడు. అనాయాసముగ శ్రుతివాక్యములను బెక్కింటిని స్వమతప్రమాణార్థమై కందపద్యములలో జొప్పించిన చతురుడు.

పండితారాధ్యచరిత్రమం దితని అలౌకిక మహిమలు పెక్కులు వర్ణింపబడియున్నవి. అతిశయోక్తులుగా వానిలో నెన్నిటిని తీసివైచినను ఇతని కీశ్వరానుగ్రహము లభించినట్లును తద్భక్తియే యితనికి దరుణోపాయమైనట్లును దన్మూలమున నాత్మరక్షణమే కాక యితరప్రాణిరక్షణార్థమై యితని ప్రవృత్తి ధర్మమున నెగడినట్లును, అంగీకరింపక తీరదు. ఈగ్రంథ మీ లక్షణములచేత నే ముద్రితమై యున్నది. కాని ఇది విశ్వసనీయము కాక పోవుటకుఁ గవికిఁ గావ్యతాదృష్టి లేకుండుటయే కావున దీనిని కావ్య మనుటకంటె శైవశ్రుతి యనుట సమంజసము.

తాత్కాలిక లోకప్రవృత్తి

బౌద్ధజైనాది వేదబాహ్యమతములు నష్టప్రాయములై ప్రచారమున లేకున్నను అచ్చటచ్చట శైవుల కుపద్రవముకల్గించు చునే యున్నవి.

"శ్రుతిబాహ్యంబులు కావున
సతతంబును జైనబౌద్ధచార్వాకుల దు
ర్మతములు పట్టక బట్టితి
శ్రుతిసార శివన్మతంబు సుమతిమహేశా."

అద్వైతమతము శైవమతమును నిర్మూలింప యత్నించుచున్నదనియు నాటిచరిత్రల వలననేకాక శైవగ్రంథములవలన సైతము తెలియవచ్చుచున్నది. ఈకవి యింత అభినివేశముతో అద్వైతమతఖండనముచేయుట జూడ దానితాకిడికి వీరు బొత్తిగ దాళలేకున్నారనుట స్పష్టము. శైవుల దర్శనస్పర్శనాదులుసైత మొల్లని పట్టుదలతో దమ దీక్షను నిర్వహించుకొనుచున్నట్లును దీని వలననే తెలియుచున్నది.

అతనిమతము

శైవులలో కాలముఖులకువలెనే పాశుపతులను నింకొక భిన్నశాఖగలదు. ఈతడా శాఖకు జెందినవాడు. ఈ శాఖలను సూక్ష్మభేదములను స్పష్టముగ గనుగొనుటకు బలవత్తరములైన యాధారము లేవియును లేవు. కాని గ్రంథస్థ నిదర్శనములబట్టి కొంత భేదము నిర్దేశింప వచ్చును.

పాశుపతమున బ్రహ్మాది పిపీలికపర్యంతమును సమస్తజీవులు పశువులు. భేదమే పాశము. సమస్తపశురాశికి పతియగు శివుడు పశుపతిభక్తులకు దత్పాశచ్ఛేదముగావించి ముక్తి నొసంగును. ఇదియే యీ మతము నందలిసారము.

భక్తిజ్ఞానకర్మలనెడి మార్గత్రయములో భక్తి వీరిరాచబాట. జ్ఞానపథమును తిరస్కరింపరుగాని, దానికి భక్తికి నిచ్చునంతటి ప్రాధాన్యము నీయరు. కేవలము భక్తివశమున సిద్ధిజెందిన మహానీయుల పేరెని...

గ్రంథమున నుద్ధృతము లైనవి. కాలముఖుల వలెనే వీరును వర్ణవ్యవస్థ నంగీకరింతురు. వారిశక్తిపూజ యిందు చేర్కొ-న బడలేదు. మండలావర్తవిధానమును లేదు. వారివలె వీరికిని వేదములే ప్రమాణము. ఈతడు వర్ణవ్యవస్థ నంగీకరించియు, నంగీకరింపని నంశయాత్మకుగ దోచుచున్నాడు.

పండితారాధ్యుఁడు వీరశైవమునకును బ్రాహ్మణశైవమునకును సామరస్యము కల్పింప యత్నించియు గల్పింపలేనివాడుగ గన్పట్టుచున్నాడు. ఈ విషయమై ఇతను బసవేశ్వరునితో వాదముచేయుటకు వెడలు నపుడే యతడు చనిపోయెనని విని వెనుకకు దిరిగివచ్చెను. శివదీక్షాచిహ్నములుగ నితడు శాసించినవానిలో లింగధారణము లేదు. విభూతిమాత్రము నిర్దిష్టమైనది. హింసాత్మకమైన యాచారము కాలముఖుల కున్నట్లు లేదు. వీరశైవులకిది ప్రధానాధారము.

అద్వైతమతమును ఖండించుటలో రామానుజు డేయుక్తులను స్వీకరించెనో నితనికి నవియే నాధారములైనవి. వాదము మాత్రము ద్వైతవాదము. ప్రపంచము సత్యమనుట, జీవాత్మ పరమాత్మ లొక్కటిగాదనుట, కేవల జ్ఞానమువలన ముక్తిరాదనుట. కుమారసంభవమునుబట్టి కాలముఖులకు సన్న్యాసమంగీకారమైనట్లు తెలియుచున్నది. దానినిబట్టి పాశుపతులకది యంగీకారముకానట్లు తోచుచున్నది.

క. ప్రాజ్ఞులు దేవజ్ఞులు లో
కజ్ఞులు చేకొండ్రె గరశిఖాగాయత్రీ
యజ్ఞోపవీత నాస్తిరు
లజ్ఞులు చేకొండ్రుగాక అద్వైతమజా.

తిక్కన ప్రశంస

శ్రీ దరిమడుగు రామయ్య

నట్టడవి డించి నన్నయ
భట్టారకుఁ డరుగఁ దెలుఁగుబలుకుఁబడంతిం
జిట్టితనంబున సాకిన
దిట్టవు నిను బొగడఁదరమె తిక్కకవీంద్రా!

వందలమీఁది తెల్గునఁ బ్రబంధముల న్వెలయించి సాహితీ
సుందరికిం గరంబలరు సొమ్ములు పెట్టిరిగాని, కూపుగ
న్విందుగఁదీర్చి నెన్నడలు నేర్పనలంతులె? ఆంధ్రవాఙ్మయం
బందు భవద్విభాగ మరయంగ మొగంబున ముక్కువంటిదా!

తెలుఁగుఁబలుకుల చలువరా లెలమిఁగూర్చి
తనరఁజేసితి భారతతాజమహాలు
సుకవిమాత్రుండవే నీవు సోమయాజి!
అదుకుదోఁపని యాశిల్ప మద్భుతంబు.

కవితారసాంభోధి నవగాహన మొనర్చి లలితరత్నాలు వెల్వఱిచినావు
సకలాంధ్రజాతీయశబ్దముక్తాళి నర్మిలి సరమ్ముగ వినిర్మించినావు
మూలంపుఁబటమున ముద్దురంగుల నద్ది తెలుఁగుఁజీరకు వన్నె దెచ్చినావు
అరగొరగానున్న యనుఁగుందెలుఁగుఁదోట నందనవనమ ట్లొనర్చినావు
మనుమసిద్ధివిభుండు మామా యనంగ
సుకవినికరంబు మార్గదర్శకుఁ డనంగ
సఖిలవైదికతతి సోమయాజి యనఁగ
గణనకెక్కితి తిక్కనకవివతంస.

తనయొడిఁ దాల్పనోచినకతమ్మున సింహపురీలలామ పా
వనమగు నీయశోలతకుఁ బాదుగ ధన్యచరిత్రయై తన
ర్చినది మహాకవీ! యిఁక విశేషములేల ప్రశంస లాంధ్రస
జ్జను లిల నున్నచో మఱవఁజాలరు నిన్ను యుగాల మాటిసట.

అమ్మదగ్గరకు

"జీవన ప్రభాత్"

రాధిక ఆరుసంవత్సరాల బాలిక. ఆమె చక్కని నయనాలు ఎందరినో ఆకర్షించేవి. అందరూ తళతళ మంటూవున్న ఆమె చిరునవ్వుముఖాన ముద్దులవర్షాలు కురిపించేవారు. ... రాధిక నెరగనివా రెవరూ ఆ గ్రామంలో లేరు. తోటిపిల్లలతో ఎల్లప్పుడూ ఆడుతూ కనపడేది—రాధిక.

రాధికకు తల్లీ దండ్రీ లేరు. పసిపిల్లగా నున్నప్పుడే వారు చనిపోయేరు. ఆ చంటిపిల్లను పెంచుటకు అమ్మమ్మ మాత్రమే బ్రతికివున్నది. అమ్మమ్మనే 'అమ్మా' అని పిలుస్తూ తల్లి లేనికొరత తీర్చుకుంటోంది రాధిక.

ఆవీధిలోనివన్నీ పూరిళ్లు. అసలు ఆగ్రామంలో ఉన్న పెంకుటిండ్లు అన్నీ మూడు. బ్రాహ్మణవీధి కల్లా కరణంగారి ఇల్లొకటే గొప్పది — పెంకుటిల్లు కాబట్టి! ఆప్రక్కవీధిలో మిగిలిన పెద్దకులాలవా రున్నారు. బ్రాహ్మణవీధికి చివరనే పాఠశాల వున్నది. దానికి ఎదురుగనే పంతులుగారు నివసిస్తున్నారు.

రాధికను బడిలోనికి వెళ్లమని రోజూ అమ్మమ్మ పోరుతూనే వుండేది. కాని, ఆ బాలికకు ఆటలమీద నున్నదృష్టి బడిమీద నున్నట్లే కనపడదు. ఒక్కొక్క రోజు అమ్మమ్మపోరు పడలేక కళ్లనీళ్లు తిరుగగా, కాళ్లు తడబాటుతో వెనుకకు పెట్టుతూవుండగా తిరిగి తిరిగి అమ్మమ్మనీ, ఆపూరింటినీ జాలిచూపుల చూస్తూ, బడియాత్రకు బయలుదేరేది. అటువంటి సమయాలలో అమ్మమ్మమనస్సు చివుక్కుమనేది — ఆవిధంగా ఏడుస్తూ బడికిపోయేబాలికకు చదువువస్తుందా? అసలు చదువుమీదకు దృష్టి వెడుతుందా? చంటిపిల్లలకు ఉత్సాహంపుట్టి తమంతతాము చదువుకుంటేనే చదువబ్బుతుందికాని—బలవంతంచేస్తే...ఎంతకని? ఈసంగతులన్నీ అమ్మమ్మకు తెలుసు. కాని ఏంచేస్తుంది? పిల్లకు ఏదోవిధంగా నాల్గుముక్కలు వంటబడితే బాగుపడుతుందనీ—ఏదోనడ్డిలో మెల్లలాగ తమలాంటి బీదవారికి ...కొంచెం మంచిసంబంధం వస్తుందనీ—ఆమె యాశ!

రాధిక బడికి వెళ్లేది. అంతే — పంతులుగారు వచ్చేవరకూ అందరుపిల్లలమాదిరిగనే గంతులు వేసేది. మొదటి రోజుల్లో బడిగదిలోనికి వెళ్లిన దగ్గరనుంచీ పిల్లి మాదిరి కూర్చొనేది, అదొకవిధమైన భయంచేత. కాని రానురాను, ఆమెకు బడిపని పూర్తిగా తెలిసింది. అందరికంటె ఎక్కువగానే అల్లరిచేసేది.

పంతులుగారు రావడమే తరవాయిగా అందరూ బల్లో పుస్తకమో చేత బట్టుకొనేవారు. రాధిక దృష్టిమాత్రము ఇంటివైపు మరలేది. కళ్లు తెరచేవుండేవి, కాళ్లమీద పలక వుండేది, కళ్లు 'అ ఆ'లను చూస్తూనే వుండేవి...కాని—ఆమెతలలో ఇల్లు కనపడేది—అమ్మమ్మ, తడిబట్టలతో నీళ్లుతేవడమూ, మడి గట్టుకోవడమూ, అన్నంవండడమూ — మొదలయిన దినచర్య యావత్తూ విపులంగా కనపడేది. అందరు పిల్లలకంటే ఎక్కువ వినయంగా, భయభక్తులతోనే కూర్చొనేది—కాని, ఆమెమనస్సు విశ్వవిహారం చేసేది.

పంతులుగారు "అక్షరాలు దిద్దు" అని గద్దించి పలికినప్పుడు ఆమె ఉలిక్కిపడి, కళ్లనీళ్లు చిమ్మగా, కాళ్లు పర్చుకొని కూర్చుని, బలపము తిన్నగా పట్టుకొనేది. ఆమె ఇంకనూ అక్షరాలు దిద్దడము లేదని తెలుసుకొని, పంతులుగా రామె ప్రక్కను కూర్చుంటే ఆమె భయంతో కొంచెం కళ్లెత్తి చూసి, గజ గజ వణకుతూ అక్షరాలు తప్పుగా దిద్దేది.

పంతులుగారు శాంతంతో ఆమెను బుజ్జగిస్తూ, "అమ్మాయీ! అలా కాదమ్మా—ఇలాగ", అంటూ

ఆమె చెయ్యి పట్టుకొని దిద్దించేవారు. ఆమె దిద్దేది. ఆయన లేచేవారు. "ఈమాటు సరిగ్గా దిద్దూ!" అని గట్టిగా అనేవారు.

ఆమె కళ్లనీళ్లు తుడుచుకొంటూ, ఊపిరి ఎగపీలుస్తూ, తలవూపుతూ, కళ్లల్లో పడుతూన్న ముంగురులను సరితీసుకొంటూ, ఎదురుగా ఆయనముఖం చూసేది. ఆమెవయవాల తళుకుందనాలు పంతులుగారిని ఆకర్షించేవి. ఆయన దగ్గరకు వచ్చి ప్రేమతో ఆమె తల నిమురుతూ "బుద్ధిగా చదువుకో-చిట్టితల్లీ" అనేవారు.

ఒకరోజున పంతులుగారు గట్టిగా కోపించారు. ఆమె ఏడ్వసాగింది. "అమ్మ కావాలి—వెళ్లిపోతా" నని మారాం పెట్టింది. ఇంక నామెతో వేగలేక వేరొక బాలిక నామెకు తోడిచ్చి ఇంటికి సాగనంపారు పంతులుగారు.

ఆమె సులువుగా నేర్వగలదనేవిషయం పంతులుగారు త్వరగానే తెలుసుకున్నారు. నాటినుండీ ఆమెను యథేచ్ఛగా ఆడుకోనిచ్చేవారు.

పేరుకుమాత్రమే రాధిక బడికి వెళ్లేది — కాని ఎప్పుడూ ఆడుకొంటూనేవుండేది! ఆమెకు బూడిద అంటే మహాయిష్టము. ఎల్లకాలమూ బూడిదలో మునిగి తేలుతూవుండేది. శరీరమంతా బూడిద పులుముకుని, వైరాగిని అనుకరిస్తూ ఇంటికి తిరిగివచ్చేది.— రోజూ! ఈబూడిదపూసుకోవడంమూలాన అమ్మమ్మకు రెట్టింపుపని కలిగేది.

"ఈబూడిద లేకుండానైనా చేశావా — దిక్కుమాలిన దేవుడు!" అనేది పాపం! అమ్మమ్మ.

* * *

రాధిక మేనత్త తన యిద్దరుపిల్లలతోటీ ముసలమ్మను చూచిపోదామని వచ్చింది. బంధువులు వచ్చేరన్న సంతోషంతో ఆరోజుకు బడికి వెళ్లలేదు రాధిక. అమ్మమ్మ వెళ్లమననూ లేదు—ఆ మరునాడు కూడా బడిముఖం చూడలేదు.

బడికి వెళ్లకపోవడం మూలాన ఆమెకు పెద్ద ప్రతిబంధకం తీరినట్లు తోచింది. బడిలోకంటె ఇంట్లోనూ, ఇంట్లోకంటె వీధి దుమ్ములోనూ ఆమె కెక్కువ స్వేచ్ఛ కనపడింది.

రాధిక స్వేచ్ఛాపిపాసిని. స్వేచ్ఛాపిపాసు లందరూ విప్లవనాయకులై లోకాన్నంతటినీ తమ మార్గంలోనికి త్రిప్పేవిధంగానే రాధికకూడా తన మార్గంలోనికి తన మేనత్త బిడ్డల నిద్దరినీ త్రిప్పింది. త్రికాలాలూ దుమ్ములో మునిగి తేలుతూవుండేవారు. ఇప్పుడు త్రిమూర్తు లయ్యేరు. రాధిక మేనత్త సత్యవతమ్మ-ఎంతో కినిసింది. తనపిల్లలకు దుమ్ములో నాటలు ఇదివరకు రావన్నది. ఈపాడుపిల్ల రాధికవల్లనే నేర్చుకొన్నా రన్నది—ఆ దెప్పిపొడుపుమాటలకి అమ్మమ్మకి 'ఉడుకుబోతు తనం' వచ్చింది. "పిల్ల లయిన తర్వాత దుమ్ములో ఆడకుండా వుంటారా?" అని సణిగింది.

"ఏమో నమ్మా! మాపిల్లల కిలాటి పాడుఆటలు తెలియనే తెలియవు" అని సత్యవతమ్మ జవాబు.

ఆమాటలకు జవాబు చెప్పలేకపోయింది అమ్మమ్మ. ఆకోపం రాధికమీద చూపింది. ఆమె రెండు బుగ్గలూ గట్టిగా నులిమింది. "పాడుముండా!—నీ మూలాన అప్రతిష్ఠకూడాను!" అని విసుక్కుంది. రాధిక యేడుస్తోంటే మిగిలిన యిద్దరుపిల్లలకూ భయం వేసింది. ఏమీ యెరుగనట్లు పిల్లల్లాగ తల్లి ప్రక్క జేరేరు. ఆ మరుక్షణంలోనే అమ్మమ్మ యింట్లోనికి వెళ్లింది. రాధిక వీధులోని కురుకింది!

అనవసరంగా ఆడుకుంటూన్న పిల్లను కొట్టినందుకు అమ్మమ్మ చాలా విచారించింది—కాని మళ్లీ రాధిక మిగిలిన పిల్లలతో దుమ్ములో కనపడసాగింది. ఈమాటు అమ్మమ్మ గట్టిగా కోప్పడింది...రాధిక కళ్లనీళ్లుకారడం, అమ్మమ్మ హృదయం నీరవడం ఒక్కసారి జరిగేయి. వేళ్లు గిల్లుకుంటూ, మూతిముడుచుకొని, విచారంతో క్రిందికి చూస్తూ, ఏమీ అనలేకపోయింది. రాధిక కంటినీరు ఆమె హృదయాన్ని కలచివేస్తుంది మరి! — అమ్మమ్మ, "ఇంకెప్పుడూ దుమ్ములో ఆడకూ —" అంది గద్గద స్వరంతో!

రాధిక తల వూపుతుంది. అమ్మమ్మ రాధికతలను ప్రేమతో నిమురుతూ —

కున్నావా మరి — తలంతా దుమ్మయిపోయింది. మళ్లీ దువ్వగలనా చెప్పు? ముసలిముండనీ! ఇంకెప్పుడూ ఇసికలో ఆడుకోకేం — బుద్ధిగా చదువుకో తల్లీ! మాసినగుడ్డలా వున్నావు తలంటు పొయ్యాలి...అల్లరి పిల్లంటారు, అందరూ...ఆనక జడవేస్తాలే—" అంటుంది పాపం!

ఆమె లోనికి వెడుతుంది. రాధిక ఇటూ అటూ చూసి, కళ్లు పరికిణీగుడ్డతో తుడుచుకొంటుంది. కళ్ల కాటుక బుగ్గలదాకా ప్రాకి పరికిణీమీద ముద్రలుగా పడుతుంది. కాటుకమరకలు చూసి అమ్మమ్మ తిడుతుందేమోనని భయపడుతుంది. కాని ఆభయం క్షణికం. రివ్వున వీధులోనికి పరుగెడుతుంది...

మేనత్తా పిల్లలూ వెళ్లిపోయేరు. కాని, రాధిక మాత్రం బడికి వెళ్లేనేలేదు...ఆమె మేనత్తను మరువనే లేదు, కాని బడినిమాత్రం ఇట్టే మరిచిపోయింది. మధ్యమధ్య అమ్మమ్మ జ్ఞాపకంచేస్తే "అల్లాగే"అని వూరుకోజొచ్చింది రాధిక.

ఆరోజున బడినుంచి కరణంగారికృష్ణ పంతులు గారు పంపగా రాధికకోసం వచ్చేడు. కృష్ణ రాధికకంటే మూడేళ్లు పెద్ద, నాల్గుక్లాసు లెక్కువ.

"ఏం కృష్ణా! ఇలాగ వచ్చేవేం?"

"చూడండి మీ అమ్మాయి అసలు బడికి రావడం లేదండీ — పంతులుగారు పంపించేరు — ఈడ్చుకు రమ్మన్నారు."

ఆ మాటలు వింటోన్న రాధికగుండె నీరయింది. కృష్ణముఖం చూచేసరికే బడీ, అక్కడిపిల్లలూ, ఆలోకం... అన్నీ కళ్లకి కనపడజొచ్చేయి! వెంటనే ఆమె కళ్లనీళ్లు తిరిగేయి. కృష్ణ — వేగంగా రమ్మని — గదమాయించి చూచేడు. వెళ్లమని చెపుదా మనుకున్న అమ్మమ్మనోట మాట లాగిపోయేయి!

"కృష్ణా! ఈవేళకివెళ్లు. రేపటినుంచి వొస్తుందిలే. దాని మేనత్తావాళ్లూ వొచ్చేరు — అందు మూలాని రాలేదు — నేనే వెళ్లొద్దన్నాను — పంతులుగారితో చెప్పు నాయనా!" అని తప్పంతా తనమీదనే వేసుకుంది.

రాధికముఖం తేటపడింది...ఏదో పెద్దభారం తీరినట్లు భుజా లెగరవేసుకుంటూ వీధులోని కురికేడు కృష్ణ.

అమ్మమ్మ ఇటూ అటూ చూస్తోవుంటే, చేతులు గిర్రున త్రిప్పుకుంటూ తుర్రుమంది—రాధిక!

* * *

ఇంకో రెండురోజులు గడచేయి. కృష్ణ మళ్లీ రాధికకోసం వచ్చేడు. ఏవిధంగానైనా పిల్లను బడికి పంపాలని నిశ్చయించుకుంది అమ్మమ్మ. వెళ్లమని గదమాయించింది రాధికను. ఇంక ఏడ్చినా లాభం లేదనే సంగతి గ్రహించి పలక పుచ్చుకుంది రాధిక, దుఃఖంతో. బలపం కనపడలేదని, 'నే వెళ్ల'నంది.

"నీక్కావలసినన్ని బలపాలు— చిన్నవీ పెద్దవీ— నే నిస్తాను," అన్నాడు కృష్ణ.

చొక్కా కనపడలేదని వంక పెట్టి ఏడవనారంభించింది. పాపం—అమ్మమ్మ మడిబట్ట వదలి వేరొక తడిబట్ట కట్టుకుని — చొక్కా తొడగజొచ్చింది... రాధిక ఏడుపుముఖం పెట్టి—

"అందరికీ ఎన్నో పుస్తకా లున్నాయిఁ— నాకు ఒక్కటీలేదుఁ—" అంటూ దింకులు ప్రారంభించింది.

"నీకు పేర్లు చదవడం వొచ్చింతర్వాత ఎన్నో పుస్తకాలు కొంటాన్లే. ఇవ్వాళకి వెళ్లు తల్లీ" అని బ్రతిమాలుకుంది అమ్మమ్మ.

"నే వెళ్లన. పుస్తకాలు కావాలి."

"మరి నువ్వు చదవలేవుకదా?"

"అందరూ చదవగలిగే తెచ్చుకొంటున్నారా? వాళ్లసుశీల 'అఆ'లు దిద్దుకుంటోంది—ఇన్ని పుస్తకాలు తెచ్చుకుంటుందిఁ—నాకు ఒక్క పుస్తకమూ లేదు..."

ఆమాటలకు కృష్ణ: "నీకు పుస్తకాలిస్తే బడి కొస్తావూ?"

"ఆఁ—ఒస్తా" అని గొణిగింది.

"మా నాన్నదగ్గిర ఎన్నో పుస్తకా లున్నాయి. నీకు కావలసినవన్నీ, మొయ్యగలిగినన్నీ—రకరకాలు— ఇస్తాను బడికి రా."

ఆమెఏడుపు పోయింది...అన్నిపుస్తకాలే!—సంతోషంతో గంతింది. ఆమెకళ్లు తళుక్కున మెరిసేయి.

"ఇప్పు డిస్తావా?"

"ఇప్పు డెలాగ? బడికివెళ్లకపోతే పంతులుగారు పెళ్లి చేస్తారు!అందాకా బళ్లోవున్న పుస్తకం ఓటేస్తాను. ఆతర్వాత ఇంటికొచ్చింతర్వాత కావలసినన్ని..." అందుకు ఒప్పుకొని ప్రయాణమయింది రాధిక.

"కృష్ణా ! రోజూ అమ్మాయిని బడికి తీసికెళ్లూ—?"

"ఓ—అలాగే—" అంటూ రాధిక చెయ్యి పట్టుకుని వీధిలోని వురికేడు కృష్ణ.

* * *

కరణంగారి పాతపుస్తకాలూ, ఎందుకూ పనికిరానివి కావలసినన్నీ—రాధిక మొయ్యగలిగినన్నీ కృష్ణ యిచ్చేడు. వాటితో తృప్తిపడక ఇంకా కొన్ని ఏరి వేరే పెట్టింది రాధిక. అవి కృష్ణ పుచ్చుకొన్నాడు. ఇద్దరూ బయలుదేరేరు.

ఆపుస్తకాలు తీసుకువస్తూ వుంటే రాధిక సంతోషం ఏం చెప్పను? అంతచదువూ తనకే వచ్చేసినట్లు, అన్నివిద్యలూ తన కప్పుడే అబ్బినట్లు తలచసాగింది రాధిక...కృష్ణ ఆమెకు ప్రాణమిత్రుడయ్యేడు—మరి తన కన్ని పుస్తకాలిచ్చేడుకదా!

ఆపుస్తకాలు తనేం చేసుకుంటుందో? అసలు అవి తన కెంతవరకూ పనికి వస్తాయో—పాపం! ఆమె కేమీ తెలియదు; ఆమె కావిషయం అక్కర్లేదు—వట్టి అమాయకురాలు!

* * *

పిల్లలకు ముఖ్యంగా చదువువిషయంలో ఎవరో ఒకరు తోడువుండాలి. అప్పుడే వారికి చదువుమీద దీక్ష కుదురుతుంది. రాధికకు చదువువిషయంలో కాకపోయినా బడికి వెళ్లడంవిషయంలో మాత్రం ఇప్పటికి దీక్ష కుదిరింది. రోజూ కృష్ణ వచ్చి ఆమెను బడికి తీసుకు వెడుతున్నాడు—బడినుండి తీసుకు వస్తున్నాడు.

ఇప్పుడు దుమ్ములో ఆటలు తగ్గించింది రాధిక. బడినుండి వచ్చిన తర్వాత కృష్ణగారింటికి ఆడుకొనే అందుకు వెళ్లేది.

అమ్మాయి మునపటంతటి అల్లరిచిల్లరగా తిరగడం లేదని అమ్మమ్మ ఎంతో సంతోషించేది.

బడిలో మునుపటిమాదిరిగా రాధికకు ఆదరణ జరగడంలేదు. రోజూ పంతులుగారు మంగళహారతులిస్తూనేవున్నారు. ఆమెకంటే ఎంతో వెనకవచ్చిన పిల్లలందరూ ఎంతో ముందుకు వచ్చేరు. ఇంకా మన 'మొద్దమ్మాయి' 'కాఖా'లలోనే వుంది అనేవారు.

"నీకు 'అఆ'లు ఎలా వచ్చాయా అని ఆశ్చర్యంవేస్తోంది—మొద్దమ్మాయీ!" అన్నారు పంతులుగారు.

మరి ఆశ్చర్యంకాక? ఎప్పుడేనా అక్షరాలు దిద్దితేకద!

పంతులుగారిమాట లందుకుని మిగిలినపిల్లలందరూ రాధికను వెక్కిరించసాగేరు. "మొద్దమ్మాయీ! మొద్దమ్మాయీ!" అని ఏపిల్లనోట్లో చూసినా—! రాధికకు సిగ్గువేసింది. ఉడుకుబోతుతనం ఆమె నావేశించింది. చిన్నబోయినముఖంతో, ఒంటరిగా ఇంటికి తిరిగివచ్చింది. వీధిపొడుగునా 'మొద్దమ్మాయి' అనే పదం ఆమెకర్ణాలకు తగులుతూనేవుంది.

కలకల లాడుతూవుండవలసిన రాధికముఖం కలకబారివుండడం అమ్మమ్మకు ఆశ్చర్యంకలిగించింది. పంతులుగారు కూకలేశారు కాబోలనుకుంది. ఆవిధంగానైనా కొంచెం భయమూ భక్తీ పంతులుగారివల్ల ప్రసాదింపబడితే చాలనుకుంది!

రాధిక పలకా బలపమూ పుచ్చుకుని వంటయింట్లో వున్న అమ్మమ్మ వద్దకు వచ్చింది. అమ్మమ్మలోన సంతోషం పొంగు—తోవున్నా—చూసీ చూడనట్లూరుకుంది.

"అమ్మా! కాఖాలు నేర్పవూ?" అని కుమిలిపోతూ అడిగింది రాధిక.

ఈమాటు అమ్మమ్మ క్రుంగిపోయింది...తనకు చదువురాదు.

చదువులేమీ లేవు. చిన్నపిల్ల—ఎన్నడూ చదువుకోని పిల్ల—తన్ను చదువు చెప్పమంటోంది – ఎన్నడూ లేని శ్రద్ధతో బుద్ధిగా కూర్చుని చదువు చెప్ప మంటోంది—తను చెప్పలేకపోతోంది! పిల్లకే చదువు వచ్చి, తనలాగ తీరుబడిగలదైవుంటే, చంటిపిల్లను ఏడిపిస్తూ బడికి పంపిస్తుందీ?...తా నా బాలిక కోర్కెలాగ తీరుస్తుంది?

రాధిక మళ్లీ అడిగింది.

అమ్మమ్మ తలెత్తిచూసింది. రాధికకళ్లల్లో నీళ్లు తాండవమాడుతున్నాయి; అమ్మమ్మకళ్లల్లో కూడా నీళ్లు తిరిగాయి!

"తల్లీ! నాకు చదువురాదమ్మా! కృష్ణదగ్గిర కెళ్లి దిద్దుకో—"

"నేనక్కడికెళ్లను...అంతా వెక్కిరిస్తారు—"

"...ఎవ్వళ్లూ వెక్కిరించరు - వెక్కిరిస్తే మళ్లీ వెక్కిరించు."

"నే నసలు అక్కడికి వెళ్లనే వెళ్లను—"

"పోనీ కృష్ణని ఇక్కడికి రమ్మను. నే రమ్మన మన్నానని చెప్పు."

రాధిక మరుమాటాడకుండా వెళ్లిపోయింది. ఆమె కృష్ణకోసం వెళ్లలేదు—అసలు కృష్ణని తలచు కొననేలేదు. బడిలో అందరితోపాటు కృష్ణకూడా తన్ను పరిహసించాడుకదూ......

రోజూ ఆటకు వచ్చే రాధిక ఆరోజు రాక పోయేసరికి కృష్ణకు ఏమీతోచలేదు. అతనిపాదాలు రాధిక కోసమై తీసుకుపోజొచ్చేయి. మామూలు ప్రకారం రాధిక ఎదురురాలేదు. అమ్మమ్మకనపడింది.

అమ్మమ్మ అతన్నిపిలిచి, "అమ్మాయి ఈవేళ ఏడుస్తోందేం?"

"బళ్లో అందరూ ఏడిపించేరు — మొద్దమ్మా యని పేరెట్టేరు."

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? ఎప్పుడూ అక్షరాలు దిద్దనే దిద్దదు. వెనకపిల్లలందరూ ముందుకి వొచ్చారు—అంతా బాలశిక్ష చదువుతున్నారు—పంతులుగారు మొద్దమ్మా యని పేరెట్టేరు," అని కిలకిల నవ్వసాగాడు.

అమ్మమ్మకు సంగతంతా తెలిసింది.

"కృష్ణా! అమ్మాయికి కొఖాలు నేర్పు నాయనా... ఎలాగేనా — బతిమాలేనా ... ఎక్కడుందో వెతుకు తండ్రీ."

కృష్ణ రాధికదగ్గిరికి వెళ్లాడు.... అతికష్టంమీద అక్షరాలు దిద్దడానికి వప్పుకొంది రాధిక.

* * *

రాధికకు తగినశ్రద్ధ బాగాకుదిరింది. పట్టుదలతో చదువు కొనసాగింది. కృష్ణ అన్నీ చెప్పడం...ఆమెకు సహజంగా తెలివితేట లున్నాయి. అవి ఇన్నాళ్లూ సరైన విధంగా వినియోగపడలేదు.

ఆమెలోని మార్పు — పంతులుగారినీ, బడి పిల్లలనీ — అందరినీ ఆశ్చర్యంలో ముంచింది. ఆమె శ్రద్ధకూ, చురుకుదనానికీ వింతపడరా పడిపోయారు పంతులుగారు. వారంరోజులు మించకుండానే తోటి పిల్లలను మించిపోయింది రాధిక!

మొద్దమ్మాయి — ఆమె కాదు. ఇప్పుడు బడి పిల్లలందరూ మొద్దమ్మాయిలు!

అమ్మమ్మ రాధికను చూసి నిజంగా గర్వపడు తుంది...తన ఊహలన్నీ ఆ చిట్టిపాపవలన ఎప్పటికైనా నెరవేరుతాయీ అని ఆశతో తనజీవితంలోని ముందు రోజులను చూస్తుంది...

* * *

"ఎక్కడ బాబూ?"

"అదిగోనండి — బ్రాహ్మణ వీధిలోనండి—"

"నాన్నా! మనింటి దగ్గిరేనేమో!"

"బాబూ! మీయింటిదగ్గిర కాదండి — వీధి మధ్యలో అయివుంటుంది—"

"అయ్యో! నాన్నా! రాధిక-ఇల్లు-కాదు-కదా"

"అబ్బాయీ! పరిగెత్తకు — ఒస్తున్నా..."

"నువ్వు త్వరగా రా..."

కృష్ణ పరుగందుకున్నాడు. కరణం గబగబా నడక సాగించాడు. తండ్రిమాటలు కృష్ణ వినిపించుకో లేదు. ఇంతలో తండ్రికి చూపుమేర దాటిపోయాడు.

ఆకాశ మంతా పొగలు క్రమ్ముకుపోయింది. మధ్య మధ్య నిప్పుమని ఎర్రని మంటలు చెట్లపైనుంచి ఎగురుతూ కనపడుతున్నాయి. ఫెళ ఫెళ ధ్వనులు — పక్షులు హాహాకారాలతో కలసి పోతున్నాయి... దారి వెంబడి ఇండ్లు కాలిపోతూన్న స్థలానికి వసుర్చు కొంటూ వందలు వేదలు పోతున్నారు. తమ ఇళ్లకేంముప్పు వస్తుందో అని పనిపాటలు చేసు కొంటూ వున్న కూలీలు పిల్లల్ని వదలి ముందు జాగ్రత్తకై పోతున్నారు...

కృష్ణ — కళ్లు కనపడకపోతూన్నా — అడుగులు తడబడుతూన్నా — శ్వాసకష్ట మవుతూన్నా — మనస్సుతో ఎగిరి పరుగెడుతున్నాడు...

జనం!......మంటల నార్పేవారు కొందరు — నీళ్లందిచ్చేవారు కొందరు — లోపలినుంచి సామాను లాక్కొచ్చి ఈవల పారేసేవారు కొందరు ... అనేకులు వింతమాస్తూ నిలుచున్న వారే!...రాధిక ఇల్లు — ఇంకా రెండుమూడు ఇళ్లు — అగ్నిహోత్రుడికి ఆహుతి అవుతున్నాయి.

జనాన్ని త్రోసుకుని ప్రవేశించేడు కృష్ణ. అతని ఆతురత ఎక్కువ గాజొచ్చింది. రాధికగాని, అమ్మమ్మ గాని ఎక్కడా కనపడరు. ఎవరో ముగ్గురు నలుగురు తెగించి ఇంట్లోనికి దూరారు...

జనం విరుచుకు పడిపోతున్నారు. ఒకరి మీద నొకరు — చిందులాడి పోతున్నారు. ఆ జనం క్రింద పడి నలిగిపోతూ ఏడుస్తూవుంది ఒక బాలిక...ఎల్లాగో తప్పించుకుని దూరంగాపోయి "అమ్మా" అని ఏడుస్తూ వుంది. కాని ఆ మహా గందరగోళంలో ఆ సన్నని ఏడ్పు వినేవా రెవరు...

కాని — ఎక్కడో మూకలో మధ్య మునిగి వున్న కృష్ణ చెవులకు "అమ్మా" అనే ధ్వని వినపడింది. కంగారుతో ధ్వనికోసం వెదకజొచ్చాడు.

ఆఖరికి జనాన్ని వదలి ఈవల పడ్డాడు...ఏడ్పు వినపడుతూ వుంది...

కృష్ణని చూసేసరికి రాధికయేడ్పు మితిమీరి పోయింది. వెక్కుతూ — "అమ్మ — అమ్మకా — లిపో — తోంది ... మంటల్లో వుంది — అమ్మ — "

" మీ అమ్మని ఎవ్వరూ —? "

" లేదు — "

ఆ సమయానికే ఇందాకా ఇంట్లోనికి వెళ్లిన మనుష్యులు తెలివి తప్పిపడివున్న అమ్మమ్మని మోసుకు వచ్చేరు. ఆమె శరీరము కాల్పులకు గురి అయింది. అప్పుడే వచ్చిన కరణంగారు ఆమెస్థితిని చూచి, కొందరి మనుష్యుల సహాయ్యం మీద దగ్గర్లోనేవున్న పట్టణం ఆసుపత్రికి ఆమెను పంపించ నియోగించారు...

తల్లిని అనేకమార్లు పిలిచింది — తట్టి చూసింది — కాని ఎంతకూ మాట్లాడదు తల్లి — ఆమెమీద పడి పొర్లి పొర్లి ఏడ్వసాగింది రాధిక ...ఆమెను అమ్మమ్మ దగ్గరనుండి విడదీసే అందుకు చాలా కష్టపడవలసి వచ్చింది...

కరణంగారింటికి రాధికను తీసుకు పోయారు. ఆమె ఎంతకూ వూరుకోదు. కృష్ణప్రయత్నా లన్నీ నిష్ఫలమయ్యాయి. ఆఖరికి నీరసంచేత సొమ్మసిల్లి — నిద్రపోయింది...

* * *

ఆ రాత్రి రాధికకు తీవ్రజ్వరం వచ్చింది. కృష్ణ ఆమెచెంతనే కాచుకు కూర్చున్నాడు. రాత్రి తెల్లవార్లూ అమ్మమ్మకోసం పలవరిస్తూనే వున్నది.

ఆ మరునాడు మునపటికంటే ఎక్కువ జ్వరం వచ్చింది. కరణంగారూ, ఆయనభార్యా ఎంతో భయపడజొచ్చేరు...

"మా అమ్మేది — వొచ్చిందీ? " అని ఆత్రుతతో రాధిక ప్రశ్నించింది

"రాధా! మీ అమ్మ వొస్తుందమ్మా" అన్నాడు కృష్ణ.

రాధిక కొంచెం తెలివితో ప్రశ్నించింది, "అమ్మకి ఎలా వుంది?"

"చాలావరకూ తగ్గింది. ఇంకా స్పృహ రావటంలేదు... పొద్దుట పన్నెండింటికి కోలుకొంటుందిట"

—————

"చాలావరకూ తగ్గింది. ఇంకొన్నేపటికి వొస్తుందిట"

మళ్లీ ఆమెకు స్మృతి తప్పింది —

"అమ్మకావాలి — అమ్మదగ్గిరికి తీసికెళ్లండి నన్ను — ఊఁ — తీసికెళ్ల మంటే! ...... అమ్మ కావాలంటే ... "

మధ్యాహ్నం మూడు గంటలయింది. పట్టణం నుంచి మనిషి వచ్చి "అమ్మమ్మ" మరణవార్త చెప్పాడు. ఈ విషయంమాత్రం రాధిక చెవిని పడకుండా తగిన యేర్పాటులు చేశారు.

చీకటిపడింది. కృష్ణ ఈ రెండు రోజుల నుంచీ తిండి కూడా తినడంలేదు, రాధిక పక్కనే వుంటున్నాడు.

"మా అమ్మేది?" వెర్రిగా కేక వేసింది.

ఆమె లేచి నిలబడకుండా దగ్గరున్న వారు పట్టుకొన్నారు.

వెర్రిగా చూస్తూ, "అమ్మ కావాలి— అమ్మ దగ్గిరికి పోతాను..."

ఆమె వెనక్కువాలింది ఏదో మెల్లగా అన జొచ్చింది. కృష్ణ ఆమె మీదకు వాలాడు. రాధిక కళ్లుమూసుకుంది. ఆమె పెదిమలు కదులుతున్నాయి— "అమ్మదగ్గిరికి — "

రామ్ ఘర్ కాంగ్రెసు

శ్రీ తెన్నేటి విశ్వనాథం

మహాసభ కాబోయే ముందు

మెరుపులు మెరుపులు మెరుపులు
తిన్నని మెరుపులు
వంకర మెరుపులు
తీగల్లాంటి మెరుపులు
నల్లని మేఘాల్లో మెరుపులు
చల్లనిగాలుల్లో మెరుపులు
ఝల్లనుచిన్కుల్లో మెరుపులు
చిన్కుల్లో నీరెక్కి
మెరుపుల్లో మెరుగెక్కి
మెలతలముఖాల్లో మెరుపులు
మీదా మెరుపులు కిందా మెరుపులు
మెరుపులు, మెరుపులు, మెరుపులు,

వర్షం ఆరంభించిన తరువాత

వరదలు వరదలు వరదలు
తరులంటా గిరులంటా
శిరమంటా కురులంటా వరదలు
నాయకవేదిక అంతా వరదలు
వేదిక వేడుకలంతా వరదలు
సభాప్రదేశము అంతా వరదలు
సభ్యులనిండా వరదలు
అటుజూచిన వరదలు
ఇటుజూచిన వరదలు
ఎటుజూచిన వరదలు
వరదలు, వరదలు, వరదలు.

తరువాత

బురదలు బురదలు బురదలు
కాళ్లా బురదలు కాయము బురదలు
పంచలుబురదలు చీరలుబురదలు
పయిని ధరించిన గుడ్డలు బురదలు
పైటకొంగులంతా బురదలు
భోజనాపందిళ్లా బురదలు
భోజనమంతా బురదలు
పాలూ బురదలు నీరూ బురదలు
కూర్చుంటే బురదలు నిల్చుంటే బురదలు
పక్కంతా బురదలు పక్కక్రింద బురదలు
బురదలు, బురదలు, బురదలు.

తరువాత, మర్నాడు

మాటలు మాటలు మాటలు
చిన్కుచిన్కుకూ మాటలు
చీకటిఅంతా మాటలు
యువకులమాటలు
యువతులమాటలు
యువతీయువకుల మూలల మాటలు
పెద్దలమాటలు పిన్నలమాటలు
ఝండావేదికపై మాటలు
వేదికకిందను సభలో మాటలు
గాంధీజీ మాటలు
ప్రజాల మాటలు

సభకవతల మాటలు
సభకివతల మాటలు
మాటలు, మాటలు, మాటలు.

ఎంత వర్షమైనా

వేడి వేడి వేడి
అసలా రక్తంలో వేడి
చేసినకార్యంలో వేడి
మౌనంలో వేడి మాటల్లో వేడి
భావంలో వేడి బాహాటమైన వేడి
వారిమాటలూ వేడి వీరిమాటలూ వేడి
అందరిమాటలు వేడి
వేడి వేడి వేడి.

మొత్తంవైఖరి

సంతోషం సంతోషం సంతోషం
నీలమైన ఆకాశంలో సంతోషం
నీటిప్రవాహాల్లో సంతోషం
చెట్టుకొనల్లో సంతోషం
చుట్టూప్రకృతిలో సంతోషం
ఎగిరే ఝండాలో సంతోషం
తిరిగేజనాల్లో సంతోషం
అటుజూచిన సంతోషం
ఇటుజూచిన సంతోషం
ఎటుజూచిన సంతోషం
స్వతంత్రభావంలో సంతోషం
స్వతంత్రసమరంలో సంతోషం
సంతోషం, సంతోషం, సంతోషం.

మంత్రములు ప్రకృతిశక్తులు

శ్రీ వసంతరావు వెంకటరావు

విజ్ఞానం సర్వతోముఖంగా వ్యాపిస్తూ ఉన్న ఈ రోజులలో, మానవదృష్టి విశ్వాన్ని మూలమూలల శోధిస్తూన్న ఈ కాలంలో, అండపిండబ్రహ్మాండాల తత్వం గ్రహించడానికి మహామేధావులు ప్రబలప్రయత్నాలు చేస్తూన్న ఈశకంలో, ప్రాచీన భారతీయ విజ్ఞానం నిజస్థానభ్రష్టమొంది అవమతిపాలైచుచు, ఊడిగంతో చితికిపోతూంటే ఏ భారతీయుని హృదయార్ణవం ఉత్తుంగదుఃఖతరంగాలతో అల్లకల్లోలం కాదు? ఏ భారతీయుని శరీరం కంపించదు? ఏ భారతీయుని నేత్రకవాటాలు పగిలి సంతతధారాపాతంగా మాతృప్రేమాశ్రువులు ప్రవహింపవు?

అతిప్రాచీనవిజ్ఞానాలలో భారతీయవిజ్ఞానమొకటి. అఖిలభారతవైజ్ఞానిక మహాసభా రజతోత్సవసమావేశంలో కలకత్తా విశ్వవిద్యాలయకులపతి యగు శ్యామప్రసాద్ ముఖర్జీగారు భారతీయవిజ్ఞానాన్ని ఈవిధంగా వర్ణించారు.

"భారతీయులు ఆధ్యాత్మికచింతనాపరులనియు, ప్రత్యక్షవిజ్ఞానంలో వారిసేవ స్వల్పమనియు ప్రబలియున్న భావము భారతీయ చారిత్రకవిషయములపై పూర్తిగా నాధారపడినది కాదు. భారతదేశము కేవలస్వప్నప్రవృత్తిలో నుండలేదు. ఉన్నతదశయందుండినపుడు భారతీయరాజ్యములు స్థాపింపబడినవి. ధర్మప్రబోధకులు పరరాజ్యములకేగి భారతీయవిజ్ఞానరశ్మిని ప్రసరింపజేసిరి. చరక, సుశ్రుత, నాగార్జున, భాస్కరాచార్య, ఆర్యభట్టాది మహామహులు సృష్టిరహస్యముల వెల్లగించి పెంపొందించిన విజ్ఞానమే పునాదైనది."

నిజమే. ఆధ్యాత్మికచింతనం భారతీయులకు ఉగ్గుతో పోసినది. కాని, మానవుని నిత్యజీవితానికి ఉపయుక్తమై, సౌఖ్యప్రదములైన యంత్రములు ప్రసాదిస్తూన్న నేటి పాశ్చాత్యవిజ్ఞానం ముందు నాగరికజీవాభ్యున్నతికి భారతీయవిజ్ఞానం నిరర్థకంగా తోస్తూంది. నేటిజీవి సౌఖ్యాన్వేషణమే పరమావధిగా పరిగణిస్తున్నాడు. తత్సాధనోపాయంగా స్థూలదృష్టికి గోచరించని ఆధ్యాత్మికజ్ఞానసంపత్తిని నిరసించి వెనుకకు నెట్టుతున్నాడు. భౌతికశాస్త్రవ్యామోహంలో పడి, తాత్కాలికసౌఖ్యార్థియై మాతృవిజ్ఞానానికి ద్రోహం చేస్తున్నాడు.

మా విజ్ఞానమే ప్రాచీనమైనదని, మా విజ్ఞానాన్ని దొంగిలించి పాశ్చాత్యులు ఆధునిక విజ్ఞానరూపేణ ప్రదర్శిస్తున్నారని, మా విజ్ఞానదృష్టితో విమర్శిస్తే పాశ్చాత్యులు కనుగొనవలసిన విషయాలు ఇంకా బహుళంగా ఉన్నాయని విఱ్ఱవీగుతూన్న నేటి భారతీయుని వ్యర్థప్రగల్భాలు విషసిక్తశరములట్లు మాతృశరీరాన్ని జొచ్చి ఎంతగాఢంగా బాధిస్తున్నవో ఎవరు చెప్పగలరు? మహాసాధ్వియైన భారతజనని ఆత్మస్తుతి, పరనింద సహించగల దని ఎవరు చెప్పగలరు? భార

తీయవిజ్ఞానౌన్నత్యం, ప్రతిభ, ఉత్కృష్టత దేశదేశాలు వ్యాపింపచేయుటకు మారుగ పాశ్చాత్యవిజ్ఞాన నిరసనంతో కాలం వ్యర్థ మొనరించు నేటిభారతీయుని అసంబద్ధప్రలాపాలను ఆధునిక విజ్ఞానంతో పరిచయంగల ఏభారతీయుడు సహించగలడు?

ఇట్టివాదం మహాసాహసంగాను, వితండంగాను కనుపించవచ్చును. అయితే, ప్రాక్పశ్చిమవిజ్ఞానాలను సమన్వయం చేసినప్పుడే భారతీయవిజ్ఞాన ప్రతిభా స్థాపనసమస్యను పునఃఫలోత్పాదకంగా పరిష్కార మొనర్చడం జరుగుతుంది. ఇంక ముడుకుగా ఈ నిశ్చితాభిప్రాయాన్ని వెలిబుచ్చుటకు రెండు కారణము లున్నవి.

౧. ప్రాచీనవేద విజ్ఞానాధిక్యంపై గల నమ్మకము.

౨. ప్రాక్పశ్చిమవిజ్ఞానములకు గల అవినాభావసంబంధము. కార్యసాధనానికి అవలంబించేమార్గ మేమంటే: మన ప్రాచీననియమములు, నిష్ఠలు, ఆచారములు ఆధునిక విజ్ఞానదృష్టితో విమర్శించి, వాటియొక్క ఔచిత్యం, ఉపయోగం నిరూపించడము.

సుఖజీవనప్రవర్తకమును, దృగ్గోచరఫలజనకమును అగు ఆధునికవిజ్ఞానంచేత ఆకర్షింపబడిన భారతీయులు ప్రతివిషయాన్ని శాస్త్రీయంగా విమర్శించడం ప్రారంభించారు. వేదవిజ్ఞానంలోగల విశేష మేమనగా అందలి నియమాలు ఏఆధారంపై ఏర్పరుపబడినవో అందు చెప్పబడియుండలేదు. ప్రాచీనవైజ్ఞానికులు ఏఏప్రయోగాలు చేశారో, వాటివిధాన మెట్టిదో తెలియచేయకుండ వాటిఫలితాలు మాత్రం మన కందజేశారు. దానిపై మనకు గౌరవ మున్నంతవరకు ఆ నియమములు, ఆచారములు పాటించుట జరిగింది. శాస్త్రీయ విమర్శనాపద్ధతి అవలంబించినతరువాత ఆ ఆచారాలలో నమ్మకం క్షీణింప మొదలిడింది; తన్మూలంగా ప్రాచీనవిజ్ఞానమంటే నిరసనభావం ఏర్పడింది. కాని, ఈ వ్యామోహంలో పడినవారు ఒక్కవిశేషం గ్రహింపలేకపోయినారు. వందలకొలది శతాబ్దములు గడిపి, అనేక నాగరికతలను ప్రతిఘటించి, వివిధ దేశస్థులచేతను, మతస్థులచేతను పరిపాలింపబడినప్పటికి అన్యమతసంప్రదాయములట్లు క్షీణింపక, కాలప్రవాహానికి ఎదురొడ్డి ఆత్మగౌరవం, ప్రతిభ, వ్యక్తిత్వం సర్వాంగసుందరంగా కాపాడుకొనుచున్న ప్రాచీనవేదవిజ్ఞానజనని, నేడు మనకు అవశ్యప్రాయంగా లేదని, మనోవికాసకరంగా లేదని పొరబడి ఆమహాజనని, నాగరకతామాతని తిరస్కరించడం యుక్తమా, శ్రేయస్కరమా, జ్ఞానదాయకమా యని యోచించక వక్రమార్గాను వర్తులైన నేటిభారతీయులదే మహాదోషము వేదవిజ్ఞానము సార్వత్రికము.

ఆధ్యాత్మికచింతనమే ప్రధాన మగు ప్రాచీనవిజ్ఞానము, భౌతికప్రాధాన్యంగల ఆధునికవిజ్ఞానము, స్థూలదృష్టికి, పరస్పర ప్రతికూలములుగా గోచరించును. ఆత్మజ్ఞానం వ్యక్తిపరంగా వృద్ధిచేసుకోవలెను. భౌతికజ్ఞానం ప్రత్యక్షంగా జనసామాన్యానికి ఋజువుచేయవచ్చును అయినను, ఆధునిక విజ్ఞానస్థితి పరిశీలించినప్పుడు కొంతసందేహనివృత్తి కాగలదు. భౌతికశాస్త్రజ్ఞుడు, విశ్వరహస్యం కనుగొను నిశ్చలచిత్తంతో దృగ్గోచరంగానున్న ద్రవ్యాన్ని (Matter) పరిశోధింప మొదలిడి, ద్రవ్యాన్ని భిన్నంచేయగా

పరమాణువును కనుగొన్నాడు. ఏపదార్థమైనా భిన్నంచేస్తే ఆపదార్థలక్షణాలు కలిగిన సూక్ష్మకణం అణువుగాని, పరమాణువుగాని అగునని గ్రహించాడు. తరువాత, అవిభాజ్యంగా భావింపబడుచున్న ఈ పరమాణువు మహాయంత్రాలలో మర్దింపబడి భిన్నమైంది. పరమాణువులోగల సూక్ష్మఖండ-ఎలక్ట్రాను-ద్రవ్యంకాక, శక్తిపుంజంగా పరిణమించింది. అనగా, ద్రవ్యం శక్తితో ఏర్పడుచున్నట్లు తెల్లమైంది.

అంతేకాదు; ద్రవ్యలక్షణవియుక్తమై కేవలం శక్తిగా పరిగణింపబడుచున్న కాంతి, ద్రవ్యంవలె ప్రకటిత మౌతూంది. ఒకరాగి రేకుమీద కాంతి పడినప్పుడు తేజఃకిరణాలు శరపరంపరవలె ప్రసరించి అందలిపరమాణువులలోని ఎలక్ట్రానులను ఎగురగొట్టుచున్నది. తుపాకిగుండ్లవలె ప్రవర్తించు ఎలక్ట్రానులు పలుచని రేకులమీద పడినప్పుడు తేజఃపుంజములట్లు చెదిరిపోవుచున్నవి. ఈ ప్రయోగాలు ద్రవ్యానికి శక్తికిగల అవినాభావ సంబంధం ప్రస్ఫుటంగా స్థాపించినవి. ఒకే పదార్థం ఒకప్పుడు ద్రవ్యఖండంగాను, మరొకప్పుడు తేజఃపుంజంగాను వ్యక్తమౌతూంది. గనుక ద్రవ్యమే శక్తి, శక్తియే ద్రవ్యము.

పాశ్చాత్యతత్త్వపరిశోధనంతో పైవిషయం బయల్పడింది. ఇక, ఆధునికవైజ్ఞానికుని కర్తవ్య మేమి? పరమాణుతత్త్వం గ్రహించి, పరమాణువులను రూపపరివర్తన మొందునట్లు శక్తిమంతములైన యంత్రములచే నిర్బంధింపగలడు. వెండిని బంగారులోనికి, రాగిని బంగారులోనికి మార్చగలడు. అంతే. సృష్టిరహస్యాన్వేషణ మంతతో పరిసమాప్తమొందవలసిన దేనా? లేక, నక్షత్రగర్భపరిశీలన ఫలిత మేమి? ఆ మహోగ్రగర్భాలలో పరమాణువులు మండి, భస్మమై ఆవిభూతినుండి శక్తి జనించుచున్నది. అనంతాకాశశీతల కుహరాలలో శక్తి మందగించి పరమాణువులుగా, ద్రవ్యంగా పరివర్తన మొందుచున్నది. ఇక పర్యవసాన మేమి?

వైజ్ఞానికులలో కొందరి దృష్టి ఆధ్యాత్మం వైపు తిరిగింది. ఆత్మశక్తిప్రభావం భారతీయులవలె ఇతరులకు తెలియదు. యోగనిష్ఠచే ఆత్మశక్తిని పెంపొందించుకొని అజేయకార్యసాధన మొనరించుట పశ్చిమవాసు లెరుంగనిది. కాని, భౌతికాన్ని అతిక్రమించక తప్పదని గ్రహించి, మనప్రాచీన మార్గ మెరుగని పాశ్చాత్యులు 'సైకిక్' రంగంలో ప్రవేశించారు. అది సరళమార్గం గాదు.

శక్తికి ద్రవ్యానికి ఏర్పడిన అవినాభావ సంబంధమే ఆధ్యాత్మికానికి భౌతికానికి వర్తిస్తుంది. ద్రవ్యంతో శక్తిని, శక్తితో ద్రవ్యాన్ని సాధిస్తున్నాము. ఆధ్యాత్మికశక్తితో కలకు రాక్షసులను పూర్వం సాధించారంటే వింత కాదు. వైర్లెస్‌మూలంగా విమానాలు నడుపుచున్న ఈకాలంలో పూర్వం ఆధ్యాత్మికశక్తితో సేనానివహాలను మూర్ఛింపచేసే రంటే నమ్మడానికి అవకాశం ఉంది. నిష్ఠాగరిష్ఠ మగు ఆత్మజనకశక్తి సర్వతోముఖంగా కార్యసాధన మొనరించిన దను విషయం విశ్వసించడానికి, శాస్త్రీయంగా విశ్వసించడానికి ఈకాలంలో వీలగుతూంది. మహత్తరమైన అట్టి ఆత్మశక్తిని కైవశంచేసికోవాలంటే, యథార్థంగా ప్రాచీన వేదవిజ్ఞాన [illegible]

డించా లంటే వేదవిజ్ఞానమార్గం అవలం బించుటకన్న అన్యోపాయం లేదు.

మనోవేగంతో ప్రవహిస్తూన్న కాల ప్రవాహంలో బుద్బుదప్రాయంగా కొట్టుకొని పోతూన్న నేటిమానవుని జీవితమంతా ఉదరపోషణార్థమై వ్యయ మౌతూందని, ఆధ్యాత్మికచింతనానికే వేళలే దని కొందరు వాదింపవచ్చును. అది ఎంతమాత్రము సత్యం కాదు. అభ్యాసయోగంచే విశ్రాంతి కలుగ జేసికొనవచ్చును. తదుపరి ఆత్మజ్ఞానాభి వృద్ధికి ప్రయత్నింపవచ్చును. అది ఒక్కటే మార్గంగాని, మరియేవిధంగాను మనప్రాచీన ఔన్నత్యం ప్రతిష్ఠింపలేము.

అందుకు మన ఆచారాలను, పద్ధతులను ఆధునికవిజ్ఞానదృష్టితో విమర్శించి సహేతు కంగా వాటి ఆధిక్యం నిరూపించుట అత్యావశ్యకము. తత్సందర్భంలో, బహు జనోపయోగంగానున్న మంత్రాన్ని ఉదా హరణగా చేసుకొని, దానిప్రభావం శాస్త్రీ యంగా నిరూపించుటకు ప్రయత్నించవల సైంది. ఇది సర్వజనానుమోదంగా ఉంటుం దని గాదు. ఇంతటితో ప్రాచీనవిజ్ఞానానికి మెరుగుపెట్టినట్టైందనీ కాదు. ఈఉదాహర ణములోవలె ఈ పద్ధతి అవలంబిస్తే యథా శక్తి ప్రాచీనవిజ్ఞానసేవ చేసినట్లగు నన్న ముఖ్యోద్దేశమే ఈ విషయంపై చర్చించుటకు ప్రోత్సహించినది.

సులభసాధ్యమగు మంత్రములు విచా రిస్తే సామాన్యంగా మాంత్రికుడు మూడు నియమాలకి కట్టుపడాలి అంటారు ఏమనగా:

౧. మంత్రం గురుముఖతా ఉపదేశం పొందాలని;

౨. ఆ ఉపదేశం గ్రహణసమయంలో కావాలని;

3. మంత్రమును అనుదినం నిశ్చలంగా కొన్నిసార్లు పురశ్చరణ చేయాలని;

ఈ నియమాలు పాటిస్తే మంత్రాలు పిలవడంతో పలుకుతాయి. ఈ నియమాలు ఆధునికవిజ్ఞాన రీత్యా ఎట్టివో విచారిస్తే, పాషండునికైనా వాటిలో నమ్మకం కలుగుతుం దని ఆశింప వచ్చును.

౪. ఉపదేశం అవసరమా అన్నప్రశ్న మనకు అప్రస్తుతం గురువుది శక్తిమంతమైన మనస్సు. ఆత్మశక్తిని కొంతవరకు గ్రహించిన కారణాన్ని, గురువుని అయస్కాంతంతో సరి పోల్చవచ్చును. అయస్కాంతంతో ఉక్కు, ఇనుము ముక్కలమీద రాసినపుడు అవి అయస్కాంతము లౌతవి. ఏమనగా వాటిలో స్వాభావికంగా అయస్కాంతత్వం ఉంది కాని, అది మరుగ్గా ఉంది. వాటిమీద అయస్కాంతంతో రాసినప్పుడు వాటిలోని అయస్కాంతపుటణువులను క్రమంగా ఒక వరుసలోనికి తీసుకొనివస్తవి. అలాగే ప్రతి మానవునిలో ఆత్మ ఉంది; ఆత్మశక్తికూడా ఉంది. కాని, సర్వదా అది వ్యక్తంకాలేదు. ఉక్కుముక్కలో చిందరవందరగానున్న అణువులవలె శక్తిరహితంగానున్న ఆత్మను, గురువు ఉపదేశసమయంలో అంతశ్శక్తిని రగుల్కొలిపి అది శిష్యునికి అలవడచేస్తాడు. ఉక్కు అయస్కాంతత్వం పొందినట్లే శిష్యుడు తనశక్తిని గుర్తించి వశంచేసికొంటాడు. అందువల్ల, ప్రచ్ఛన్నంగా శిష్యునిలో ఉన్న శక్తిని గురువు ఉపదేశంతో శిష్యునికి లభింప చేస్తాడు. అంతవరకు గురూపదేశం అవసరం.

౨. గ్రహణసమయంలో సూర్యుడు, భూమి, చంద్రుడు ఒకే సమతలం (Plane) లో, ఒకే ఋజురేఖ (Straight Line) లో ఉంటారు. సూర్యచంద్రుల గురుత్వాకర్షణ బలానికి భూసముద్రాలలో కెరటా లుప్పతిల్లుచున్నవి. అమావాస్య పూర్ణిమ దినాలలో సముద్రు డుప్పొంగుతా డని ఎరుగుదుము. అమావాస్యనాడు సూర్యచంద్రులిద్దరు భూమికొక్క వైపునే ఉంటారు. ఆ రెండుగోళాలు ఏకముఖంగా భూమిని ఆకర్షించు చుంటవి. అగుట, భూమి అమావాస్యనాడు అత్యధిక గురుత్వాకర్షణబలానికి లోనౌతుంది.

సామాన్యపదార్థంవలెనే మానవశరీరంలోనున్న పదార్థంసైతం గురుత్వాకర్షణ బలాధీన మౌతుంది. మానవశరీరంలో కోట్లకొలది పరమాణువు లున్నవి. ఎడ్డింగుటన్ గారి లెక్కప్రకారము సుమారు ౧౦ లక్షల కోట్ల కోట్లకోట్లపరమాణువులు ఒక్కొక్క శరీరంలో ఉన్నవి. ఈ పరమాణువులు వాటి నియమానుసారంగా శరీరంలో సంచరిస్తూ ఉంటవి. వీటిని శాసించి, లోబరుచుకొనేది మనశ్శక్తి. యుక్తియుక్తంగా ఈపరమాణువులు కాంతారాంతర స్వేచ్ఛా సంచారిమృగము లనుకొందము. అట్టి మృగాలను చెప్పుచేతలలో నుంచుకొనుటకు అమితశక్తి నుపయోగింపవలెను. కాని, అవే బోనులో పడినప్పుడు సులభంగా వాటిని లొంగదీయవచ్చును. సర్కసులో సింహాలను ఎలుకలకన్న హీనంగా ఆడించడం ఎరుగుదుము. అట్లే సూర్యచంద్రద్వయాకర్షణశక్తిచే బంధింపబడిన పరమాణువులు బోనులో పడ్డ మృగరాజువలె బాహ్యశక్తికి సులభసాధ్య మౌతవి.

మానవునిలో మంచిచెడ్డ లున్నవి. సత్ప్రవర్తకులై, సన్మార్గావలంబు లగుటకు సామాన్యంగా జనులు ప్రయత్నిస్తూంటారు. ఆత్మశక్తి, ఆత్మనిగ్రహంగలవారు వాటిని సద్వినియోగంచేసి లోకోపకారులు కాగలరు. అనగా, మానవునిలో శక్తికి (మనసు) ద్రవ్యానికి (వికారాలు) నిత్యసంగ్రామం జరుగుతూనే ఉంటుంది. సూర్యగ్రహణ సమయంలో ద్రవ్యపరమాణువులు బోనులో పడ్డ వన్యమృగములట్లు బంధితము లగుటచేత మనస్సు వాటిని కించిద్బలంతో జయించి తనశక్తిని మహావేగంగా పెంపొందించుకొనుటకు యుక్తమైన పరిస్థితు లేర్పడుతవి. గనుక, ఆ సమయంలో మంత్రోపదేశం పొందితే, ఆత్మనిగ్రహంలేని సామాన్యులైనా భౌతికప్రాబల్యాన్ని అతిక్రమించగలరని ప్రాచీనుల అభిప్రాయమై ఉండవచ్చును. అప్పటికి గురువు శిష్యులలోని ప్రచ్ఛన్నశక్తిని శిష్యుని కలవడచేయుటచేత త్వరగా ఆత్మశక్తిని వృద్ధిచేసికోగలడు.

3. పాముగాని తేలుగాని కుట్టినప్పుడు మానవునిశరీరంలో విషం ప్రవేశిస్తుంది. విషం రక్తంలో కలిసి ప్రవహించుటచేత విశేషంగా బాధపడతాడు. ఆ విషాన్ని రక్తంలో ప్రవేశింపనీయకున్నచో బాధ శమిస్తుంది. మంత్రం వేసి బాధోపశమనం చేయునప్పుడు మాంత్రికుడు కొంతశక్తి వ్యయపరుస్తున్నాడు. పురశ్చరణవల్ల శక్తిని పునఃసంపాదిస్తాడు.

నీటిని ఉన్నతప్రదేశమందు జలాశయంలోనుంచి గొట్టములద్వారా ప్రవహింపచేసినప్పుడు, ఆ ప్రవాహబలంతో కొంతపని చేయగలుగుచున్నాము. జలాశయంలో స్థానికంగా ఉన్న నీటికి "స్థానికశక్తి" (Potential

energy) ఉంది. ప్రవాహసమయంలో అది "గతిజశక్తి" (Kinetic energy) గా పరివర్తన మొందుతూంది. ప్రవాహంతో నీటిమట్టం తగ్గుతుంది. దానితో ప్రవాహబలం క్షీణిస్తుంది. కాబట్టి ఎప్పటికప్పుడు జలాశయంలో నీటిమట్టం తగ్గకుండా దానిలో నీరు పెట్టుచుందురు. అదేవిధంగా పురశ్చరణ చేసినప్పుడు మంత్రశక్తిని స్థానికశక్తిగా మానసజలాశయంలో మాంత్రికుడు గుప్తపరుస్తున్నాడు. మంత్రం ప్రయోగించినప్పుడు స్థానికావస్థలో నున్న శక్తి గతిజశక్తిగా మారి విషాన్ని ఉపసంహరిస్తుంది. మంత్రజలంయొక్క మట్టం తగ్గకుండా పురశ్చరణ అనుదినం చేస్తూ ఉండాలి.

ఇక జలాశయంలో నీటిమట్టం ఎంత ఎత్తుగానుంటే నీటిప్రవాహం అంత బలవత్తరంగా ఉంటుంది. గనుక, నీటిప్రవాహ ప్రసక్తిలేకుండా జలాశయం పూరించవచ్చును. దానితో గతిజశక్తి అధిక మవుతుంది. అట్లే మాంత్రికుడు పురశ్చరణ దినదినం ఎంతైనా చేయవచ్చును. మంత్రజలశక్తి ఎంత అధికంగా ఉంటే మంత్రం అంత సిద్ధికరంగాను, అమోఘంగాను పారి బాధ నివారింపచేస్తుంది.

మంత్రం వేసినప్పుడు మాంత్రికుడు విద్యుదయస్కాంత తరంగాలను (Electro-magnetic waves) ప్రభవింపజేస్తున్నట్లు అనుమానంగా ఉంది. ఏమంటే రక్తంలో జొచ్చిన విషాన్ని మంత్రశక్తి విద్యుదయస్కాంత తరంగరూపంలో నశింపచేస్తూన్నట్లు భావింపవచ్చును. ఈనడుమ అమెరికాలో కొంత గరళాన్ని ఒకపాత్రలోపోసి దాన్ని విద్యుదయస్కాంత తరంగములచే శుద్ధిచేయగా అది విషలక్షణాన్ని గోల్పోయినట్లు కనుగొన్నారు. అట్లు శుద్ధిచేసినవిషాన్ని సర్పదష్టుని రక్తనాళములలోనికి అంతఃక్షేపింపగా తక్షణం బాధ తగ్గినట్లు ఈ నడుమనే వార్తాపత్రికలలో ప్రకటితమైంది.

ఈ విధంగా ఒక్కొక్క ప్రాచీననియమాన్నే విమర్శించినప్పుడు దాని ఉపపత్తి విశదం కాకపోదు. ఇట్టి విమర్శ నూతనపథాలలోనికి తీసుకొనిపోవచ్చును. మంత్రంవలె పనిచేయు విద్యుదయస్కాంత తరంగములను కనుగొనినట్లు సర్వజనోపయోగమైన విషయాలు ఆధునికవిజ్ఞానసహాయంతో కనుగొని మన ప్రాచీనవిజ్ఞానాన్ని మహోపయోగకరంగా చేయవచ్చును.

రెండవది: మానవజీవితములు ఎంత విశ్రాంతి రహితము లౌచున్నను, నేటి యువకులు ఆత్మశక్తిని పెంపొందించుకొను ప్రయత్న మొనర్చుటకు వ్యవధిలేదనిన నమ్మజాలము. ఆపట్టుదల, కాంక్ష, జిజ్ఞాస ఎప్పుడు జనిస్తవో అప్పుడే భావిభాగ్యోదయానికి మార్గమేర్పరచినవా రగుదురని మనము విశ్వసింపవచ్చును.

కృష్ణకుమారి

శ్రీ కె. అన్నమరాజశర్మ

[పదునెనిమిదవ శతాబ్దాంతమున మేవాడురాజ్యపరిపాలకుండును, సిసోదియావంశనాయకుఁడును, మందభాగ్యుఁడును, పిఱికిపందయు నగు భీమసింహునికాలమున నుదయపురపు కోటలో సంఘటిల్లిన హృదయ నిర్భేదకమగు విషాదగాథ.

భీమసింహుఁ డొకవంక సింధియాప్రభృతి మహారాష్ట్రరాజన్య విజృంభణమునకును, వేఱొకచాయ జయపురాధీశ్వరుని దాడికిని, మఱొకదెస మారువారు పాలకుఁడగు మానసింహుని విక్రాంతికిని, భయంపడి, వారొకరినిమించి యొకరు కృష్ణకుమారినిమిత్తమై కత్తుల దూయుచుండ, కార్యగతి గానక, దుర్మంత్రియగు నజితసింహుని ప్రేరణమున కన్నకూతురును, అతిలోకసుందరిని, పాలబుగ్గలచే నిగనిగలాడు పదునైదేండ్ల లేజవ్వనిని, అమాయికురాలిని, సుగుణాఢ్యను, సుకుమారిని, కృష్ణకుమారిని, కఠినశిలాసదృశమనస్కుఁడై, యమానుష వృత్తిని, మరణదేవత కాహుతిఁ జేసెను. కరుణరసభూయిష్ఠమగు నీయథార్థకథానకమే యిందలి యితివృత్తము.]

చదువరీ, సిద్ధపడుమోయి సాహసమున
గళితదుఃఖాశ్రుఝరులకుఁ గట్టవేయ,
కరుణరస మొల్కు మేవాడుకన్యహత్య
వ్రాయ నుంకించినట్టి యీస్వాంత మెట్టి
కర్కశంబగు గ్రావమో, కాక యినుప
చిట్టెమో, కాక మొదలంట చిట్లకున్నె ?

"జయపురీశుఁడో సింధియా జనవిభుండో
మనపయిం దాఁకు కృష్ణకుమారి నింక
నాఁచుటో సంగరంబో కర్తవ్య" మనుచు
రాజపుత్రులు కార్యనిర్ణయము గనక
గుసగుసలువోవ నుదయపూర్ కోటలోన
మృత్యుదేవత కాలిడె నృత్యమాడ.

పేరు నేతిబీరముబోలు భీమసింగు
రాయబారికిఁ బ్రత్యుత్తరం బొసంగ
లేక, చింతావివృత్తడోలికల నూగ
బాష్పరుద్ధాక్షుఁడై, రాజపత్నిఁ గూడ

"ఒకఁడు గుణహీనుఁ డొక్కఁడు కులవిహీనుఁ
డెట్టు లర్పింప మనకన్య నెంచి, యెంచి."

అనఁగఁ దెఱచాటునుండియే యాలకించు
బాల వెనువెంట జనయిత్రిప్రక్క నిలిచి
నాన్నకు నమస్కరించి శాంతంబు గదుర
"నాన్న, నాకయి యిందఱు నాశ మొందఁ
దగదు, రూపలావణ్య మింతకును గాన
యాత్మబలిశేయు మార్గంబు నరయు లేరొ.

క్షత్రియోచితమృత్యుసఖ్యమున కింత
బెంగఁ గొన నేటికమ్మ సంప్రీతితోడ
నేను సంసిద్ధురాలను నిశితఖడ్గ
మిదిగో! సోదరా, మమతఁ ద్యజించి యిం
నన్నుఁ దెగటార్పు" మనఁడు నంతఃపురంబు
గొల్లుమని యేడ్చె శోకాగ్ని కుములుకొనఁగ.

బాలికను జంపఁజేయాడు బాలిసుండు
కానరాఁడయ్యె నాజనకాండమందు,
ఆత్మదేహార్పణమున కాయత్తపడిన
ప్రసవకోమలి పల్కెను" "విసము తెండు
కలహకారణదృశ్యలోకమ్ము విడిచి
శాశ్వతానందజగతిని సంచరింప."

పాఠకా, భావదృష్టి శంపాలతాంగి
భువనమోహనసౌందర్యమును, విలోల
సుందరాపాంగదృష్టుల శోభ, కనుము,
కనుము, కడసారి కన్నుల కరవుదీర,
మఱుపునకురాని తన్ముఖమండలంబు
స్వప్నములనైన యిఁకఁజూడ సాధ్యపడదొ!

అకట! ఏమని చెప్ప నోరాడు నింక
తరుణి యొక్కర్తు విషపాత్రఁ ద్రావనిచ్చె,

కష్టకారణమై జనాకృష్టమైన
మందహాసంబు కడసారి చిందులీన
కన్నుఁగవ మూసికొన్నంత కన్నెమిన్న
యాత్మ యొకదివ్యతేజమై యఱిగె నెటకో.

ఆహిమాచలసేతుపర్యంతమైన
భారతోర్వీతలంబు కంపప్రకంప
గతఁల మృతివార్త దిక్కుల కడల మ్రోఁగ,
మాఱుమ్రోఁగెను కృష్ణకుమారి లేని
కోటగోడల; మృత్యువుకూత లిడుచు
తాండవించెను కన్నీటిధారలందు.

అయ్యలేఖ్యతనూకాంతి, యామనోజ్ఞ
పాటలాధరసుషమ, ప్రపంచదృష్టి
కందరానివి; నిర్జరోద్యానసీమ
పారిజాతంపుఁ బాదలననారతంబు
సౌరసుందరీస్నేహసంసర్గ మంది
లీల విహరించుచుంటి కన్యాలలామ!



నమ్మిక ద్రోహం*

శ్రీ పోతుకూరు వేంకటేశ్వర్లు

[మంత్రకూట ప్రాంత నిబిడారణ్యము. అడవిగంభీరముగ వుంటుంది — పండువెన్నెలరాత్రి. గుబురుగా పెనవేసుకొన్న చెట్లుగల కీకారణ్యము. ఒకగుబురుచెట్టు క్రీనీడ — శిశువు నిదురించుచుండ ప్రక్కను 'మాణిక్యాదేవి' మేల్కొని వుంటుంది. కొద్ది దూరంలో, కందూరు రాజ్యాధిపతి— 'తైలపదేవుడు' వర్ధమాన పురాధీశ్వరుడు 'భీమరాజు' కలసి మాట్లాడుచుందురు.]

తైల — ప్రభూ! అంతకన్న మా కింకేమీ అవసరము లేదు.

భీమ — (అటు యిటు తిరిగి ఆలోచిస్తూ) సరే కానీ, — మాకు కబురన్నా చేస్తే మా సహాయము ఏమయినా దొరికెడిదే!

తైల — ఏమి చేయగలను. హఠాత్తుగా వచ్చి పడిన — ఆంధ్ర సామ్రాజ్యాధిపుని యెదుర్కొనడానికి అవకాశమేదీ?

భీమ — అయితే,— 'రుద్రదేవ చక్రవర్తి' నీపై పూర్తిగ గతు వహించినాడన్న మాట.

తైల — ఇందులో, గతు యేముంది — కప్పము కట్టలేదన్న కినుక తప్ప!

భీమ — పాపము,— కారడవుల బడి పరుగెత్తుకొచ్చారు...

తైల — నిస్సహాయులము... ఏమి చేయగలం?

(కొంతసేపు నిశ్శబ్దం — దూరంలో వున్న చెట్టుపైనుండి గుడ్లగూబ వికారంగా అరుస్తుంటుంది.)

భీమ — తైలపదేవా! కొన్ని రాజకీయ విషయాలు నీతో, ఏకాంతముగ మాట్లాడాలి. కొంతదూరం రాగలవా?

తైల — ఆశ్రయ మిచ్చిన ప్రభువులకు వ్యతిరేకులమా? ......కానీ —

భీమ — ఏమి, నన్ను అనుమా... —

తైల — లేదు ప్రభూ! (సంకోచిస్తూ) ఒంటరిగ యిక్కడ ఆడువాళ్లను వదలి రావడం—...

భీమ — (నవ్వుతూ) అదా నీ సంశయం? చూడు— మన మెంతో దూరము వెళ్లనవసరము లేదు— ఆప్రక్కనే—

తైల — (సంశయంతో) మం-చి-దే, కానీ-

భీమ — నీకా అనుమానం అవసరం లేదు. ఈ చుట్టుప్రక్కలనే, నా శిబిరములు నిర్మింపబడి యున్నవి— ఎవరూ రారు యిక్కడికి —

---

* శ్రీ శేషాద్రిరమణకవికృత "వసుంధర" నవలలోని ఒక ప్రకరణం దీనికాధారం.

తైల — చిత్తం—పదండి.

భీమ — (నడుస్తూ) నేను నీ సహాయం— అడుగుతున్నాను. నెరవేరుస్తావా?—

తైల — మిమ్ములనే మేము శరణు జొచ్చి నపుడు—...

భీమ — ఇప్పుడు కాదు — చూడు యిక్కడ యింకెవ్వరూ లేరు గద (నలుదైపుల చూచి— ఆగి) మరేమీ లేదు. అహంకారముతో నున్న — ఆంధ్ర సామ్రాజ్యాధిపుని అంతమొందించి—

తైల — (చకితుడై) అందుకు, నా సహాయము కావలయునా?

భీమ — (వ్యంగ్యముగ) మరి నీవు నీ రాజ్యమును తిరిగి ఏలుబడి చేసుకొంటున్న పరిస్థితులలో చేయలేవా?—

తైల — (నిట్టూర్పు విడుస్తూ) ఇంకెక్కడి నా రాజ్యము?—

భీమ — ఏమి? నా సైన్యములతో, నీ రాజ్యముపై, దండెత్తినచో—

తైల — అంతటి ఆదరణ చూపిన మీకు ధన్యవాదాలు.

భీమ — పిచ్చివాడా! వర్ధమానపురాధీశ్వరుడైన, భీమరాజు వట్టి వాచాళుడు గాడు—నిన్ను తిరిగి రాజ్యాభిషిక్తుని చేయగల కార్యశూరుడు.

తైల — (ఆనందముతో) యెంతటి శ్రమ తీసుకుంటున్నారు—కానీ—

భీమ — ఏమా సందేహం?

తైల — మన మిప్పుడు అక్కడున్న సేనానిని బంధించి- సైన్యాలను జయించిన పిమ్మట- 'రుద్రదేవ చక్రవర్తి' పూరుకుంటాడా?

భీమ — సైన్యాలను నీవూ- వెంటనే సిద్ధపరచి వుంచితే నేనూ ఆపదకు అడ్డ రాగలను.

తైల — (సంతోషముతో) మంచిదే కానీ,- 'రుద్రదేవచక్రవర్తి' ని మన మెట్లా జయించగలము?

భీమ — ఏముంది — మనవంటి సామంత రాజులను చేరదీసి కప్పములు కట్టకుండా, అత న్నెదురిస్తే యేమి చేయగలడు?

తైల — మీ సలహా మంచిదే కానీ,- తదితరు లందరూ- ఏకీభవిస్తారా? అని...

భీమ — ఏకీభవించడమన్నది యెంతసేపు- కందూరు రాజ్యాధిపతియైన, 'తైలప దేవుడు'—కొద్దిరోజులలో కప్పము కట్టెద నన్నా వినక - వెంటనే కట్టలేదన్న మిషతో— అతన్ని రాజ్యపదచ్యుతున్ని చేయడం 'రుద్రదేవ చక్రవర్తి'కి బాగులేదన్న మిషతో- నేను వారి నందరినీ పురిగొల్పనా?

తైల — (ఆనందముతో గూడిన సంశయంతో)- మన ప్రయత్నము లన్నీ ఆయనకు ముందుగనే తెలుస్తే?

భీమ — (సగర్వంగా) నిశ్చయించుకున్నదే గా - ఈమాత్రము దానికి వెరవడం దేనికి?

తైల — అటు లయిన మీ యుక్తి మంచిదనే తలుస్తాను!

భీమ — (అటుయిటు తిరుగుతూ) ఆంధ్ర సామ్రాజ్యాధిపుని అంత మొందించ వలయు ననే నే నిదివరకు నిశ్చయించు కున్నాను. కానీ, మార్గములో నీవు నాతో- రెండుసారులు అనవసరముగా నా సైన్యాన్ని వధించావు.

తైల — (వివర్ణుడై) తమ వుద్దేశాన్ని గ్రహించ లేకపోయాను—

భీమ — కానీ, మించిపోయినదానికి యేం చేస్తాం? చూడు తైలపదేవా!— ఆ రుద్రదేవ చక్రవర్తితోపాటు, అతని తమ్ము డయిన మహాదేవరాయలను గూడా—మట్టుపెట్టవలయును సుమా.

తైల — అప్పటికి గాని ఆంధ్రసామ్రాజ్యము అడుగంటదు.

భీమ — దానితో గాని, యీ భీమరాజు మనసునకు శాంతి ఏర్పడదు.

తైల — ఆంధ్రదేశచక్రవర్తి అంతరిస్తే- మన కింక అడ్డెవ్వరు?

భీమ — అందుకనే నేను నీ సహాయ మపే క్షిస్తున్నా!

తైల — ఆశ్రయ మిచ్చిన ప్రభువుల కంత మాత్రము సహాయము చేయలేనా?

భీమ — (చిరునవ్వుతో) అప్పుడు నేను కనుపించగలనా— అని నా సందేహం.

తైల — కందూరు రాజ్యమాత తోడుగా- కత్తిపట్టి ప్రతిజ్ఞచేస్తున్నాను ప్రభూ! (కత్తిని తీసిమూర్ధమున కద్దుకొని — తిరిగి ఒరలో నిముడ్చుకొనును.)

భీమ — (సంతోషమున వీపు నిమురుతూ) నాకు తెలియకనా? ఏమి ప్రత్యుత్తర మిత్తు వో యని-

తైల — అంత అవిశ్వాసకుడు కాడీ తైలప దేవుడు- ప్రభూ!

భీమ — మంచిది. మరి. ఆంధ్ర సామ్రా జ్యము పంపకవిషయమున—

తైల — అది తమ యిచ్ఛానుసారముగ—

భీమ — (అటు యిటు తిరుగుతూ ఒకసారి పెద్దగ దగ్గును.)

(వెంటనే పొదలలో ప్రక్క ప్రక్కనే దాగి కొని యున్న నలుగురు సైనికులు వచ్చి — తైలపదేవుని చేతులు విరిచి పట్టుకొందురు. తైలపదేవుడు విడిపించుకొనుటకు పెనగు లాడును కాని నిష్ఫలోద్యము డవును.)

తైల — (కోపముతో) ఛీ— మూర్ఖుడా! భీమరాజా! ఎంత ద్రోహము చేశావు?

భీమ — ఆం— ఏమా ప్రగల్భములు?

తైల — (కోపముతో) విశ్వాసఘాతకా!- భీరుడా?- ప్రాణభిక్ష మిచ్చితి వని నమ్మించి- హత్య చేయుటకే నమ్మించి తివా? విషకీటకమా! నీవు వసించెడు దేశము నందలి వాయువు సహితము, యీ పనికి—కృతఘ్నువిష సంకులమై పోవదా- (ఒర నున్న కత్తిని లాగ బోవును. సైనికులు బలవంతముగ పట్టుకొందురు.)

భీమ — తైలపదేవా! తైలపదేవా! భీమ రాజ పరివారముచే బంధింపబడితి వని గుర్తుదెచ్చుకొనుము—

తైల — ఛీ- భీరుడా! ఎందు కా ప్రగల్భ ములు. నమ్మించి న న్నరికట్టెదవా? చేతనైనచో కత్తినిపట్టి కదనరంగము నకు నడువుము. కందూరు రాజన్యుల కదనకేళి తేటపడగలదు.

భీమ — నోరు మూయుము. అతిగా వాగినచో, నీ శిర మిప్పుడే ఖండింపబడును- జాగ్రత.

తైల — అంతకన్న నీవు చేయగల్గున దేమిరా ?- నన్నీ భటులనుండి- విడిపించినచో భీమరాజా! నీ వక్షఃకవాటముపై నిలచి—- నీ హృత్పిండము నూడబెరికెదనుసుమా-

భీమ —ఎందులకీ మూర్ఖత్వము. (వికటముగ నవ్వును.)

తైల —ఛీ- పౌరుష జ్ఞానశూన్యుడవైన ద్రోహివి- నీతో నాకేమి పని-

భీమ — అట్లు అణగిపడి యుండుము - ఎందు కొచ్చిన నీ ప్రగల్భాలు-

తైల — దుర్మార్గుడా! నీకునూ, నావలెనే హృదయ ముండునని, నిన్నర్థించినందులకు మంచిపని చేసితివి.

భీమ — (హేళనముగ) ఓయీ! మేము నీచే, రెండుమారులు ఓడింపబడినవార మని నీకు తెలిసియున్నపుడు- మేమా మీకు సహాయపడునది.

తైల — నావలెనే, సంస్థానాధిపతి వని, సహాయపడుదు వని, ఆశించినందుకు ద్రోహమున బంధించుట నీ కెంత కీర్తో- ఆలోచించుకొనుము.

భీమ — ఆంధ్ర దేశాధీశునిపై కత్తికట్టిన మమ్ములను, నీవు రెండుపర్యాయములు యెంతటి చీకాకు పరచితివో మరచితివా ?- కృతఘ్నుడా- అరవక పడి యుండు-

తైల — మాయమాటలచే, రాజకీయములు మాట్లాడుదు నని నమ్మించి, తెచ్చితివే? ముందుగా మేలుకున్న యింత విపత్తునకు నీకు చిక్కుదునా ?

భీమ — చింత చచ్చిననూ పులుసు చావకున్నదే ?

తైల — తెలివిడివాడనే, నాపని వీరు లేకున్న.

భీమ — అన్యాయంగా మాపై రెండు సారులు దాడివెడలి, యెంతటి జనక్షయాన్ని చేశావో గుర్తు వుందా! దాని కిప్పుడు యిది ప్రతిఫలము.

తైల — ఇడుములలో వున్నమమ్ములను- ఆశ్రయ మిత్తు నని నమ్మించి- ప్రాణములు తీయుట గొప్ప కాదు.

భీమ — తోక త్రొక్కిన పాము పగ మరచునా ?

తైల — ధైర్య మున్న ఒంటరిగ రమ్ము-

భీమ — ఆం- (అని దగ్గరకు వెళ్లి — చెంపపై గట్టిగ చరచును.)

తైల — (మహోక్రోధముతో)- ఏమిరా ? భీమరాజ్ !...భీమా — కృతఘ్నా! చిక్కితి ననా నీ కీ సాహసము- (కాలితో యెగిరి తన్నును.)

భీమ — (కోపముతో) పట్టుబడిన బానిసవు- పడివుండక- సింహాదంష్ట్రిలపై ముష్టిఘాతము చేయుటకే దలపడితివా ?- నీవంటి తలబిరుసు బందీలను భారత భూమి మోయలేదు

తైల — అవును. మహామేరువులను, అనంతమయిన సముద్రములను, పర్వతములను భరించగల భారతభూమి, నీవంటి నమ్మికద్రోహులను, కృతఘ్నులను ఒక్క నిమిష మైననూ భరింపలేదు.

భీమ — (కోపముతో కత్తిని దూసి) తైలప దేవా! ఏమా తలబిరుసు? (కత్తితో కంఠమున పొడుచును.)

తైల — ఛీ- ఛీ- పాపాత్ముడా!- ఎంతటి అవినీతి కార్యాన్ని చే-శా-వు.

(తైలపుడు క్రింద పడిపోవును. చంద్రుడిని దట్టమయిన ఒక నల్లని మబ్బు కప్పివేస్తుంది. వికృతంగా నవ్వు కుంటూ భీమరాజ్, సైనికులతో వెళ్లి పోతాడు—నక్షత్రాలు వికారంగా చూస్తుంది...)

(తెర)

ముక్తులకు కర్తవ్యం వున్నదా? లేదా?

శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి

ముక్తులకు కర్తవ్యం ఉన్నదా, లేదా? అంటూ వొక మీమాంస సుమారు కొన్ని మాసాలనుంచీ అప్పుడప్పుడు పత్రికల్లో జరుగుతూ వుంది. కర్తవ్యం వున్నట్టు శ్రీమద్భాగవతంలో దశమస్కంధంలో—

"అత్ర లోకే త్రివిధా జనాః, ముక్తాః, ముముక్షవః, విషయిణశ్చ. తేషాంమధ్యే అత్ర న కస్యాప్యలంప్రత్యయ ఇత్యాహ—

నివృత్తతర్షై రుపగీయమానా
ద్భవౌషధా చ్ఛ్రోత్రమనోభిరామాత్,
క ఉత్తమ శ్లోకగుణానువాదా
త్పుమాన్ విరజ్యేత? వినా పశుఘ్నాత్.

అనే శ్లోక వ్యాఖ్యానంవల్ల స్పష్టంగా కనపడుతుంది. "నివృత్తః తర్షః అభిలాషః యేషాం తైః ముక్తైరిత్యర్థః" అని విగ్రహం చెప్పవలసిందేకాని ఆపదానికి అన్యథాగా విగ్రహం యెవరూ చెప్పరు. నివృత్తశబ్దం భూతార్థకక్తాంతంగాని మఱివొకటి కాదు. పండితులెవరేనా అన్యథాగా చెపుతూ వున్నారేమో? అంటే, చెప్పడమూ లేదు. అలా చెప్పవలసిన ప్రసక్తిన్నీ కనపడదు. భాగవతాగ్రగణ్యులు శ్రీ రాంభొట్ల అప్పన్నశాస్త్రుల్లుగారు (వీరు జగదేక పండితశిఖామణి మంథా చెన్నయ్యశాస్త్రుల్లుగారివద్ద శ్రీమద్భాగవతం ప్రత్యక్షరమూ అధ్యయనం చేసిన వారు రెండో శుకులే) గాని, శ్రీ అద్దేపల్లి కృష్ణశాస్త్రుల్లుగారు, గాని మా పరమగురువులు శ్రీ చర్ల బ్రహ్మయ్య శాస్త్రుల్లుగారు గాని యీ స్థలంలో— "నివృత్తతర్ష" పదానికి, ముముక్షువులు అని వ్యాఖ్యానించినట్టు వినలేదు. వ్యాఖ్యానించేవారికి భూతార్థక ప్రత్యయం పూర్తిగా బాధకమని చెప్పే వున్నాను. శ్రీ పోతరాజుగారు —

"ముముక్షు" పదంతో అనువదించి వున్నమాట సత్యం. ఇక్కడ వ్యాఖ్యాతలు న్యాయబద్ధంగా వ్యాఖ్యానించినదాన్ని పోతరాజుగారు అతిక్రమించినట్టయింది. సహజపాండిత్యులే అయినా పోతరాజుగారు సర్వసులభంగావున్న— "ముక్తైః" అనే పదాన్ని అన్వయించుకోలేనివారు కారు. కాని భాగవతమే కాదు, భారతమే కాదు, నైషధాది కావ్యములే కాదు — ఆంధ్రంలో అనువదించేటప్పుడు ఆయా కవులు స్వతంత్రించి కథాప్రధానంగా రచన సాగిస్తూ వచ్చారు కాని "మక్కికిమక్కి"గా అనువదించలేదని పలువురు విమర్శకులు యిదివఱకే తెల్పియున్నారు. శ్రీనివాసవిలాసపీఠికలో ఆంధ్రీకృత కావ్య ఫక్కిని గూర్చి మేముకూడా విస్తరించివున్నదే కనక దాన్ని యిక్కడ విస్తరించ నక్కఱలేదు. ఆంధ్రానువాదకులేనా గద్యకావ్యంగా రచించేయెడల అంతగా చిక్కుండదు; గాని పద్యకావ్యంగా అనువదించవలసివస్తే గణయతిప్రాసాదులు

యెంత మహాకవికేనా కొంత అడ్డు తగలక మానవు. యీ కారణమే అనండి. లేదా? స్థూలదృష్టిగా ప్రవర్తించడమే అనండి, యేలాగయితే యేమి భారతాదులన్నీ చాలా మూలానికి భిన్నంగానే వున్నాయి. అందులో భాగవతాన్ని గూర్చి చెప్పనే అక్కఱలేదు. వామనచరిత్ర, శ్రీకృష్ణుని బాల్యచేష్టలు వగయిరాలు పరిశీలిస్తే యీ సంగతి స్పష్టపడుతుంది. అందుచేత పోత రాజుగారి అనువాదాన్ని పురస్కరించుకొని వ్యాఖ్యాతల వ్యాఖ్యానాన్ని తిరస్కరించడం సహృదయసమ్మతం కాదనియ్యేవే నే ననుకుంటాను. వ్యాఖ్యాతల వ్యాఖ్యానం శ్రుతిస్థానాపన్న మనిన్నీ పోత రాజుగారి అను వాదం స్మృతిస్థానాపన్న మనిన్నీ—

"శ్రుతి స్మృత్యో ర్విరోధే శ్రుతి ర్బలీయసీ" అనే మీమాంసకుల పంథను అనుసరించ సమన్వయించుకుంటే యుక్తంగా వుంటుందనిన్నీ నేను అనుకుంటాను. పూర్వ పక్షకర్తలు—.

"ముక్తులకు కర్తవ్యం లేదు" అనే వాదాన్ని, సమర్థించడానికి చాలా శ్రుతిస్మృతులను వుదాహరించి వున్నారు. అవి వారి వాదాన్ని సమర్థిస్తాయా? సమర్థించవా? అనే చర్చలోకి దిగితే గ్రంథం బళ్లని తోల వలసివస్తుంది. అట్టి పాండిత్యం గాని, దేహ దార్ఢ్యంగాని, బుద్ధిబలం గాని నాకు లేదు. కనుక వేదసమ్మతమైన మతాలలోకూడా యిప్పటికి మూఁడు మతాలుగా యేర్పడి వుండడమే కాకుండా యెవరో మహానుభావులు తప్ప తక్కినవారు వొకరి మొఖం వొకరు చూడడానికికూడా సంశయించడం యెల్లరూ యెఱఁగిందే. చెప్పొచ్చే దేమిటంటే- సర్వమతాలకీ ఐక్యమంటూ యెప్పటికీ సంభవించ దనియ్యేవే. యీ విషయం మనుష్య మాత్రులకే కాదు; భగవంతునకు కూడా చెప్పడానికి గీతలలోనే క్వాచిత్కంగా కొంత ఆధారం కనపడుతుంది. అవసరమైనప్పుడు ఆమాటలు చూపుతాను. ప్రస్తుతం పూర్వపక్ష కర్తల మతంకూడా వొకటి (ముక్తులకు కర్తవ్యం లేదనేది) ఉంటే ఉండ నివ్వండి గాని శ్రీమద్భాగవతంలో వున్న "నివృత్తతర్ష" శ్లోకం వారిమతానికి అనుకూలించేదిమాత్రం కాదనే నేను అభిప్రాయ పడతాను. భాగవతమతం — ముక్తులకు కూడా భగవద్గుణానువాదం కాలక్షేపార్థం ఆవశ్యక మనియ్యేవే. స్థూలదృష్టిని విచారిస్తే "ఫలము చేకూరిన పిమ్మట" అనే వాక్యం ఆపాతరమణీయమే కాని సూక్ష్మ దృష్టిని విచారిస్తే (స్వబుద్ధిచేత కాదు శ్రీమద్భాగవతాన్ని పట్టి) ముక్తులకు కూడా భగవత్కల్యాణగుణానువాద మావశ్యకమే అని తేలుతుంది. యద్వా, వేఱొకమతంకూడా అక్షతమైనదే ఉండనివ్వండి— "మహాఋషీణాం మతయశ్చ భిన్నాః" కాఁబట్టి "జీవయాత్ర"లో వున్న రచన భాగవత శ్లోకానుయాయిగా వున్నప్పుడు దాన్ని ఆక్షేపించవలసి వుండదు. ఆయీసందర్భంలో పూర్వపక్ష కర్తలు వ్రాసిన వాక్యాలు కొన్ని చాలా సందిగ్ధాలుగా వున్నాయి. వాటిలో వొకటి చూపుతాను.

(౧) ఒకవేళ ముక్తులచేత పరమేశ్వరుఁడు గానము చేయఁబడువాఁ డని యెచ్చటనైనను చెప్పఁబడియున్నచో (ఈ సంశయానికి బీజమే లేదుకదా? భాగవతంలో స్పష్టంగా కనపడుతూ వుందే?) నది పరమేశ్వ

రుని మహిమను కీర్తించుటకు చెప్పియుండ వలయును"

ఈ వాక్యం వా రెందుకు వ్రాశారో కాని పూర్తిగా ముక్తులకు భగవత్కల్యాణ గుణానువాదం వున్నట్లు వొప్పుకొన్న ట్లయింది. వాక్యాంతమందు మళ్లా నిషేధం కనపడుతూవుంది —

"ముక్తులకు కర్తవ్యములున్నవని చెప్ప టకు కాదు" భగవన్మహిమను కీర్తించుటకు అంగీకరిస్తూ మళ్లా యీనిషేధం యెందుకు? దీనికి వారు యేదో అర్థాంతరం చెపుతారు, చెప్పనివ్వండి. దానితో అవసరం లేదు. భాగవతమతాన్ని పట్టి "జీవయాత్ర"లోని—

"ముక్తగానం" సమర్థనీయమే. సర్వ పథీనాః కవయః.

ఇక మరో వాక్యం—

(౨) "కల్పితులగు హరిహర బ్రహ్మా దుల నామగుణకీర్తనలను జేయుట పొసం గదు."

దీన్నిగూర్చి వ్రాస్తే చాలా వ్రాయాలి. ఆవ్రాంతతో అవసరం లేకుండానే ప్రస్తుతం సమర్థిత మవుతూ వుండంగా దాన్ని గురించి విస్తరించడం యెందుకు?— "నివృత్తతర్ష" శ్లోకంలో వున్న—

"ఉత్తమశ్లోక" పదం సాత్పాత్పరాత్పర బోధనమే అనుకోరాదా? "కల్పితుల" పర మని యెందు కనుకోవాలి! భాగవతం యీ పత్తున్నా శ్రీహరి లీలావతార గుణాను వాదనమే అంటే వ్యతిరేకించేవా రుండరు. అట్టి స్థితిలో—

"బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా"వాదం లోకి దిగితే ఆ అవతారాలు గాని, ఆ గుణాలు గాని, ఆ అనువాదకులు గాని సర్వ లూ మిథ్యాభూతజగదంతఃపాతులే కావలసి వచ్చి—"గజం మిథ్య పలాయనం మిథ్య" వాదంగా పరిణమించవలసి వస్తుందికదా! — (అహో మూలచ్ఛేదీ తవ పాండిత్యప్రకర్షః, అన్నరీతిలోకి వాదం దిగితే భాగవతమే లేక పోవలసివస్తుందేమో.)

"ఇత్థంభూతగుణో హరిః" అంటే— ముక్తులుకూడా తత్పరత్వంతో గానం చేయడానికి తగిన అనంతకల్యాణగుణాలు కలవాఁడు శ్రీహరి అనేకదా! దాని తాత్పర్యం. విస్తర మెందుకు? పూర్వపక్ష కర్తలు వుదాహరించిన శ్రుతిస్మృతు లన్నీ సాయుజ్యముక్తిపరమనిన్నీ భాగవతశ్లోకం (నివృత్త తర్షైః) జీవన్ముక్తపరమనిన్నీ విషయ భేదం కల్పించుకొని సమన్వయించుకుంటే —"నచ శంకా నచోత్తరం"గా సరిపోతుం దని నే ననుకుంటాను. ఒకవేళ యిట్టిసూత్ర్యో పాయం కనపడుతూ వున్నా యింకా వాదం పెరుఁగుతుం దంటారా? పెరిఁగినా యీ వాదం—

" నహినహి రక్షతి డుకృఞ్ కరణే " వంటిది కాదు కనక అభినందనీయమే కాఁబట్టి శోచ్యం కాదని యింతటితో స్వస్తి చెపుతాను.

నన్నిచోడ కుమారసంభవకాలము

శ్రీ దేవరపల్లి వేంకటకృష్ణారెడ్డి

వేంకటాచిన్య కవిరాజు తన జానుతెనుగు కుమారసంభవప్రబంధావతారికలో :

"—దైవజ్ఞ నట్లు (నేనును) శుభోదయమున
దివ్యసుకృతిఁ బ్రతిష్ఠింతు"

నని ప్రతిజ్ఞ చేయుటయే కాక, తద్దృష్టాంతములతో కుమారసంభవ రచనాకాలమును "అలంకార - గూఢ (ము)" గా ప్రతిష్ఠించి, ప్రతిజ్ఞాపాలనము గావించి యున్నాడని నే నీ వ్యాసములో సహేతుకముగా నిరూపింప దలచినాను.

దైవజ్ఞశుభోదయం కాలము

షణ్ముఖ—తారక యుద్ధవర్ణనలో :

"—విస్ఫురదవదాత ఖడ్గలత పూఁచెనో
నా జయచైత్రసంపదన్. (ఉత్ప్రేక్ష.)

*　　*　　*

"—ప్రశస్త శాపవలిఖితాక్షరంబు లయ్యె" నని నా పరిశోధన చెప్పుచున్నది. ఇది "అలంకారము గూఢవస్తుమయ కావ్యముగా—చెప్పె" నందు కుదాహరణమని తోచకపోదు.

౧. "—జయచైత్ర సంపదన్ విస్ఫురదవదాత ఖడ్గలత పూచెనో నా" అనునది సులభాన్వయము.

౨. "విస్ఫురత్—జయచైత్ర సంపదన్ అవదాత ఖడ్గలత పూచెనో నా" అనునది దూరాన్వయము.

ఈ యన్వయ విభాగ మందలి సందేహ మేమనగా: మొదటి సులభాన్వయప్రకారము – "జయ సంవత్సర చైత్ర సంపద"ను మన ముపయోగించుకొనవలెనా? లేక, రెండవ దూరాన్వయ ప్రకారము— "వి-యుపసర్గాక్షరముతో (స్ఫురించుచున్న) ప్రకాశించుచున్న జయసంవత్సర చైత్రసంపద"ను మన ముపయోగించుకొనవలెనా? అని జిజ్ఞాస కలుగుచున్నది. కాని, ముమ్ముందు నిరూపింపబోయే, దైవజ్ఞకవి విక్రమశక వర్షంబులు దూరాన్వయ మయినప్పటికిని, రెండవ దగు "వి-(స్ఫురించుచున్న) జయసంవత్సర చైత్రసంపద"కు చక్కఁగా సరిపోవుచున్నవి. అనగా— "విజయసంవత్సర చైత్రసంపద" కొక్కఁ శకవర్ష వ్యత్యాసముకూడ లేని, విక్రమశకవర్షంబులు నన్నిచోడ కుమారసంభవములో కలవని సారాంశము. కనుక సులభాన్వయ మయినప్పటికిని, మొదటిదగు "జయ సంవత్సర చైత్రసంపద"ను స్థూలదృష్టితో గ్రహింపకూడదు.

ఇంతకీ దూరాన్వయ పద్ధతి క్రీ. శ, ౧౧-వ శతాబ్దమునాటినుండి మన మాతృభాషలో శ్రీకృష్ణదేవరాయాది కవితాప్రవీణుల కాలమువరకు వ్యాప్తిలో నున్నట్లు చెప్పకతప్పదు. ఇది దైవజ్ఞగణిత దూరాన్వయమని మరచిపో కూడదు.

ఇక, నీ "విస్ఫురత్—జయచైత్ర సంపద"లో:

(౧) "విస్ఫురత్ జయ—" వి(-స్ఫురించుచున్న) జయ (విజయ)సంవత్సరమును:

(౨) "చైత్ర—చైత్రమాసమును:

(౩) "(అవదాత—అవదాత (శుద్ధ) పక్షమును):

(౪) "జయ—జయ తిథి యును:

(౫) "జయ—జయ వారమును:

"గూఢ వస్తుమయ [ములు)" గా నిమిడియున్నవి.

ఇందలి "అవదాత ఖడ్గలత పూచెనో నా," అనే యుత్ప్రేక్షాలంకారము శ్లేషార్థద్యోతకముగా శరవణభవుని జన్మప్రకారమును సూచించుచున్నదని నాకు తోచుచున్నది. వైద్యనిఘంటువులలో "ఖడ్గలత"కు — బృహత్కాశము (పెద్దరెల్లు) అని వృక్షపర్యాయార్థము కలదు. "శరవణభవు"ని కనగా "కుమారస్వామి"కి "రెల్లుచూలి" యని రూఢ్యర్థము కలదు. కాబట్టి, "తెల్ల తెల్ల నెడి స్త్రీ రెల్లుచూలిని ప్రసవిం

చెనో యన్నట్లు తెల్ల తెల్లుపూతను పూచె" నని గూఢార్థము.

ఏది యెట్లయినను, "విజయ సంవత్సర, చైత్ర, శుద్ధ, జయతిథి, జయవార శుభోదయమున దివ్యసుకృతిని ప్రతిష్ఠిం(చె)"నని మనము స్ఫురింపవచ్చును.

ఇది "తారకవి"యం దెల్లునను "కవితా విశేషము" కాదేమో? "ఒరసిచూడి" చెప్పుడు.

దైవజ్ఞ శకవర్ష కాలము

ఇంతకీ "వి (స్ఫురత్] జయ చైత్ర సంపద"కు సరియగు విక్రమశకవర్షంబు లయ్యుదయగిరి శిలాపట్టములో ప్రశస్తశాసన లిఖితాక్షరంబు లయ్యె" నని దైవజ్ఞగణితము చెప్పక చెప్పుచున్నది.

మణిమ్మఖ—త్రినయనాలింగన వర్ణనలో:

"ఉదయదశ శతకిరణుఁ డయ్యుదయనగముఁ

గిట్టి దశశతకరములఁ జుట్టినట్లు. (ఉపమానము)

* * *

"—ప్రశస్తశాసనలిఖితాక్షరంబు లయ్యె" నని పరిశోధనాఫలితము చెప్పుచున్నది.

ఇది "అలంకారము గూఢవస్తుమయ కావ్యముగా—చెప్పి"నందు కుదాహరణము.

ఇందలి శ్లేషచరిత్రను ముమ్ముందు పరిశీలింతము. "ఉదయకిరణుఁ డయ్యుదయనగముఁ గిట్టి నిజకరములఁ జుట్టినట్లు ఉదయ (తేంకణ) ఆదిత్యుఁడ యుదయగిరిని సమీపించి నిజకరముల ముట్టడించెను." అని శ్లేషచరిత్ర చెప్పుచున్నది. "అయ్యుదయగిరి—పాకనాటియం దిరువదియొక్క వేయిటికి" రాజధానియని గూఢవస్తుమయకావ్య సంఖ్యాచరితము చెప్పుచున్నది. కాని దీని నిక్కడ వివరింప నవకాశము లేదు.

ఏది యెట్లయినను, అయ్యుదయగిరి పాకనాటి కధీశుండు నాఁడను తేంకణాదిత్య నన్నిచోడకవివంశకునికి (అయిదవతరము మనుమనికి) "కంద్లుకూరిపుర వరేశ్వర—పాకనాంటి విమయ ఏకవింశతి సహస్ర (౨౧౦౦౦) గ్రామావనీ వల్లభ" బిరుదు లున్నట్లు పెద్ద చెరుకూరుశాసనప్రమాణము చెప్పుచున్నదని మరచిపోకూడదు.

మరియు, తేంకణాదిత్యకవి తన గురువగు జంగమ మల్లికార్జునముని - నివాసస్థానము "శ్రీనగ"మనగా పాకనాటికి పడమటిసరిహద్దనగిన "శ్రీశైలపర్వత" మని శ్లేషార్థచరిత్రను సూచించియున్నాడనికూడ మరచిపోకూడదు.

ఇంతకు, అయ్యుదయగిరి శిలాపట్టములో:

(౧) "దశ శత" మనగా:

"దశోత్తర శత" మని శ్లేష	౧౧౦
"దశ శత" మని సహజము	౧౦౦౦
	౧౧౧౦

విక్రమశకము "దశ + శత + దశశత (౧౧౧౦) వర్షంబులు ప్రశస్తశాసన లిఖితాక్షరంబు లయ్యె" నని "వి (స్ఫురత్) జయచైత్రసంపద" చెప్పక చెప్పుచున్నది. పైగా, ఇవి "జయచైత్రసంపద"లో ప్రశస్తశాసనలిఖితాక్షరంబు లయ్యె" నని సమన్వయింప నవకాశ మున్నదా? అని పరిశోధింపగా, "దశ + శత + దశశత (౧౧౧౦)" విక్రమశకవర్ష సంఖ్యలలో ఒక సంవత్సర సంఖ్యాలోపము కాన్పించుచున్నది. కాబట్టి వెనుక దైవజ్ఞ శుభోదయకాలములో వివరించిన ప్రకారము, దూరాన్వయ మయినప్పటికిని: "విస్ఫురత్—జయచైత్రసంపదల (విజయసంవత్సర చైత్ర సంపదల) అయ్యుదయగిరి విక్రమశకము "దశ + శత + దశశత (౧౧౧౦) కరవర్షంబులు ప్రశస్తశాసన లిఖితాక్షరంబులయ్యె" నని "దైవజ్ఞునట్లై" మనము సిద్ధాంతము చేయక తప్పదు.

మరియు, "విస్ఫురత్ — జయచైత్ర సంపదల ఖడ్గలత (అయ్యుదయగిరి విక్రమ విజయమును) పూచెనో నా ఖడ్గలత (విశాఖుని— తెల్లుచూలిని) పూచె" నని గూఢాన్వయము చెప్పుచున్నది.

ఇంత కిది "శుభోదయమున ప్రతిష్ఠింతు (ననిన) దివ్యసుకృతి" కాదేమో? "దైవజ్ఞునట్లై" సిద్ధాంతీకరింపుడు.

కుమారసంభవ పాకనాటి చోడవంశము	నన్నూరుశాసన పాకనాటి చోడ వంశము		చారిత్రకవ్యక్తి సమనామములు	పెద్దచెరుకూరు శాసన పాకనాటి చోడ వంశము	నన్నూరు-పెదచెరుకూరు శాసనద్వయపాకనాటిచోడవంశాభేదము	చారిత్రక స్పష్ట కాలము	పురుషాంతర కాలము.(సుమారు)
మూలము	మూలము	సవరణ	సాదృశ్యము	మూలము	సమన్వయము	క్రీస్తుశకము	క్రీస్తుశకము
సూర్యవంశము	సూర్యవంశజు	సూర్యవంశము	సూర్య—సూర్య	సూర్యాన్వయము	సూర్యాన్వయము		
|	చాగివెంకన	చాగి వెంకన			చాగి వెంకన		౯౩౮— ౯౬౮
	బల్లెరాజు	కంట్రు వంకెరాజు			కంట్రువంకెరాజు		౯౬౮— ౯౯౮
	(?)	(చోడ)			+		+
చోడబల్లి	కంట్రువంక్యరాజు	బల్లెరాజు	బల్లె—బల్లి	చోడబల్లినృపుడు	చోడబల్లిరాజు		౯౯౮—౧౦౨౮
నన్నిచోడుడు	నన్నిచోడ	నన్నిచోడడు	నన్ని—నన్ని	నన్నిచోడడు	నన్నిచోడ (కవి)రాజు	౧౦౫౩—౧౦౭౪	౧౦౨౮—౧౦౫౮
	సూరపరాజు	సూరపరాజు	సూర—సూర	సూర భూపుడు	సూరపరాజు		౧౦౫౮—౧౦౮౮
	రాజమహేంద్ర పా(తె)పిచోడు శక. ౧౦౧౦ - వర్షంబులు	(రాజ)రాజమహీంద్రుడు— (క్రీ. శ. ౧౦౮౮-౧౦౮౯)	రాజ—రాజ పాత్తపి(పాకనాటి) చోడ వంశీకులు	రాజరాజమహీపతి	రాజరాజపాత్తపి చోడుడు	౧౦౮౮—౧౦౮౯	౧౦౮౮—౧౧౧౮
				ఘటంకారనృపుడు	ఘటంకారరాజు		——౧౧౧౯
				మల్లి దేవనృపుడు	మల్లి దేవరాజు		౧౧౧౯—౧౧౪౯
				నన్నిచోడడు	నన్నిచోడుడు		౧౧౪౯—౧౧౭౯
				మల్లి దేవ మహీపతి	మల్లి దేవచోడుడు		౧౧౭౯—౧౨౦౯
				కాకతియ్యగణపతి	కాకతీయగణపతి	౧౧౯౯—౧౨౬౧	౧౨౦౯—౧౨౧౦

గూఢకావ్య రచనాకాలము

అయ్యుదయగిరి పాకనాటి కధిపతి నాఁడను వేంకటా దిత్యకవిరాజు "దైవజ్ఞునఁట్లే" అయ్యుదయనగ ఖడ్గలత పూచిన విక్రమశకము "దశశత—దశశతకరముల (వార్షి కముల)" మీఁద "విస్ఫురత్—జయచైత్ర సంపద" ను కలిపి లెక్కించి, విక్రమశకము ౧౧౧౦ ("దశ + శత + దశశత") వర్షంబులను నేఁటి విజయసంవత్సర నిజ చైత్రశుద్ధ జయాష్టమి జయవార ("విస్ఫురజ్జయచైత్రసం పద") శుభోదయమున ఖడ్గలతపూచిన కెల్లుచూలి దివ్య సుకృతిని ప్రతిష్ఠింతు" నని చెప్పినట్లే "ప్రతిష్ఠిం(చె)" నని మన మంగీకరింపక తప్పదు.

ఇంతకూ విక్రమశకము ౧౧౧౦ ("దశ + శత + దశశత") వర్షంబులను నేఁటి విస్ఫురజ్జయచైత్రసంపదకు సరియగు నేఁటి క్రీస్తుశకము ౧౦౫౩ సంవత్సరము మార్చి నెల ౩౦ తేది మంగళవార శుభోదయమున కుమార సంభవ దివ్యసుకృతిని ప్రతిష్ఠించి(తి)" నని "దైవజ్ఞునఁట్లే" వేంకటాదిత్యకవిరాజశిఖామణి చెప్పుచున్నాఁడు.

ఇంతేకాక వేంకటాదిత్యకవిరాజు దైవజ్ఞునఁట్లే అన్యతారక వితతుల నాదరించి — శుభోదయ మున—కృతిఁ బ్రతిష్ఠింతు" నన్నట్లే, "అన్య జయా ష్టమీ జయవారపుమ్యమీ తార కవితతుల నాదరించి —శుభోదయమున—కృతిఁ బ్రతిష్ఠిం(చె)" నని కూడ మన మంగీకరింపక తప్పదు.

కనుకనే, వేంకటాదిత్యకవి తన ప్రబంధ పీఠిక లో పాకకసంస్తుతిమిషతో:

"సుఱుతెఱిఁగి (అంధ) వస్తుచయమున
కొఱఁగెడు నా దీపవర్తియును బోలె నిజ
మ్మెఱిఁగి కృతి (గూఢ) వస్తుసమితికి
వెలుఁగ మదినెఱుఁగు విబుధవర్గము దలఁతున్.

* * *

"అది యెట్లనిన
"అన్యతారక వితతుల నాదరిం (తున్.)"

అని తన గూఢ కవితాలక్షణమును వివరించి యున్నాఁ డని మనము మఱచిపోఁగూడదు.

ఇంతకీ నన్నిచోడకుమారసంభవ మనే గూఢ వస్తుమయ కావ్యరచనాకాలమున్ను, క్రీ. శ. ౧౦౫౩ "వి (-స్ఫురత్) జయచైత్ర సంపద"ను అన్యశాసన చోడవంశపురుషాంతర కాలము బలపరచుచున్న దని పైని శాసనకాలపట్టిక చెప్పుచున్నది.

ఇంతకీ శిలాశాసన చోడవంశ సాదృశ్యపుపట్టిక ప్రకారము—జాను తెనుగు కుమారసంభవ చోడబల్లి వంశమందలి "కవిరాజశిఖామణి—నన్నెచోడు" నికిని —పెద్దచెరుకూరు శాసన చోడబల్లి వంశమందలి "చోడబల్లి నృపస్తస్మా న్నన్నిచోడః" అనే నన్ని చోడునికిని వ్యక్తిభేదముగాని, వంశభేదముగాని, క్రీ. శ. ౧౧-వ శతాబ్ది కాలభేదముగాని లేదని సూక్ష్మ దృష్టికి గోచరము కాకపోదు.

ఇట్లే, అయ్యుదయగిరి పాకనాటియం దిరువది యొక్క వేయిటి కధీశులు నాఁడను కుమారసంభవ చోడవంశమునకును—కంద్దుకూరిపురవరేశ్వర, పాక నాంటి విషయ ఏకవింశతి సహస్ర ("పాకనాటియం దిరువదియొక్క వేయి") గ్రామావనీవల్లభు(లు)" నాఁ డను పెద్దచెరుకూరు శాసన చోడవంశమునకును మూల పురుష భేదము లేదు.

మరియొక విశేష మేమనగా: పట్టికయందలి నన్నూరుశాసన చోడవంశములో సంకేతముగా "పొ (త్త)పిచోడు" వంశప్రస్తావముగల బిరుదు సూచింపబడి యున్నది. దీనికి "పొత్తపియ చెన్నగుపీకుగవాలి పాకనాం డిరువదియొక్క వేయిం జనపేలుచు (న్న) పొత్తపి చోడవంశ శేఖరుం డినవంశకర్త." అనే కాణి దెవశాసనబిరుదు సమానార్థకముగా నున్నది. పైగా, దానకాలము లేని నన్నూరుశాసన చోడవంశములో: "నన్నూరి హూంకార దేవికి — సూర్యవంశులకుం ధర్మ్యముగా(ం) ఒకనాంటి ప్రతిష్ఠగా(ం)నిల్పినది." అని కలదు. కాబట్టి, పట్టికయందలి నన్నూరుశాసన చోడవంశము కంటె పెద్దచెరుకూరుశాసన చోడవం శము భిన్నమయినది కాదని శాసనద్వయసాదృశ్యము చెప్పుచున్నది.

ముగింపు

ఇంతకీ ౩౦-౩-౧౦౫౩ తేదీ జాను తెనుగు కుమారసంభవ "కావ్యకర్త" వేంకటాదిత్య నన్నిచోడు

నికిని—౨౭-౧౧-౧౦౫౩ తేదీ నందమపూండిశాసన "కావ్యకర్త" నన్నియభట్టునకును మధ్య యెనిమిది మాసములకంటె కాలవ్యవధి లేదు. కాన, వీ రిద్దరును "ఆంధ్రభాషాంగన దక్కనేలిన మహత్వము లోకము నం బ్రసిద్ధిగా" కుమారసంభవ ప్రబంధమును, భారత పర్వత్రయమును రచించి కావ్యకర్తలయినా రని మన మంగీకరింపక తప్పదు.

మరియు, నన్నిచోడకవి వ్యావహారికప్రయోగ ములను నన్నియభట్టు సంస్కరించినందువల్లనే శబ్ద శాసనబిరుదాంకితు డైనాడనికూడ చెప్పవచ్చు నని నాకు తోచుచున్నది.

నేడు మనము చేయవలసిన కృషి యేమనగా, నన్నిచోడ కుమారసంభవమును — నన్నియభట్టు చాముండికావిలాసమును సత్యదృష్టితో పరిశీలించిన గాని, నన్నియభట్టు భారతపర్వత్రయ విశిష్టత మనకు గోచరించదని మనవి చేయుచున్నాను.

ఇంతకూ, క్రీ. శ. ౧౧-వ శతాబ్దము ౧౦౫౩ సంవత్సర ప్రాంతమందలి ఆదికావ్యద్వయ మనదగిన నన్నిచోడ కుమారసంభవమును, నన్నియభట్టు చాముం డికావిలాసమును మన కిప్పుడు పునర్ముద్రితము లయి లభించుట లేదని చెప్పకతప్పదు.

'శి వా జీ'

శ్రీ వన్యాల వేంకటరంగనాథరావు

[కార్తికమాస 'భారతిలోని' 'శ్రీ శివాజీ'చిత్రమును చూచి.]

ఆ మనోహరసౌందర్య మందు భీక
రంబయిన పౌరుషజ్వాల రగులుకొనియె,
ప్రతినఁబట్టుచు నుంటివే రణములోన
జయతు గీతికలను పాడ చనెద వీవు ?

నీవామహాస్త్రాన నిట్టనిల్చినబల్లె
    మందు నీపౌరుష మణఁగియుండె,
నీకేలుసూపులో నిలచి చాటిన నీమ
    నోనిశ్చయమ్ము, లోకాన తనరె,
నిన్నంటిప్రేలాడు నీకత్తియును డాలు
    నీనెయ్యమును మాకు నేర్పఁబూనె,
నీకళాపూరితనిర్మలప్రేమము
    ఖాన నీతల్లివాక్యాలు చాటె,
నీ వడుగుపెట్టినట్టి ఈనేల ఏమి
నోములను నోచుకొన్నదో నీమనోహ
రాకృతికిఁ బడయుంగ, ధన్యవతి కాదె
నిన్ను కడుపార కన్ననీ కన్నతల్లి!

నిలువరా పౌరుష మూగులాడినదో, తం
    డ్రీ! నీశరీరమ్మునం
దలి; జ్యోత్స్నాపరిపూర్ణమైన హృదయా
    నరా, వేడిరక్తంపు జ్వా
లలు పైపై కెగయుంగ తల్లిచరణా
    లరా మ్రొక్కి నీశల్యపు
ల్కులలో దాగు స్వతంత్రబీజములు మొ
    ల్చుఁ గాక నానాటికిన్.

"ప్రతినలో నెగ్గితిని నాడు పావనియగు
నన్నుకన్నట్టితల్లి బంధాలు విప్ప,
నవ్యజీవనమున వచ్చినాడ మరల
నా ఋణమ్మును చెల్లింతు-నాప్రతిజ్ఞ."

అనుచు నుంటివో యేమొ! నా కల్లె తోచె.
అయినచో నాదుస్వాగత మందికొనుము;
మంగళాచరణ మొనర్చి మాతృదేవి
శృంఖలల్ ద్రెంపి ప్రోవవే శ్రీశివాజి!

అస్పృశ్యత

శ్రీ జలగం సుబ్రహ్మణ్యం నాయుడు

పారాశర్య, వశిష్ఠ, నారద, శుక, ప్రాచేతసుల్, కొంద రా
ళ్వారాదుల్, నయనార్లు, నేకులజు లంద్రవ్వారినిన్? ముజ్జగం
బాధింపగలేదె, జాతిజననం బావశ్యమే శీలమే
హేరాళం బని, నెన్నికూడి మనరే! హిందూమతోద్ధారకుల్!

బావుల్, గుంటలు, చెర్వులున్, వనములున్, పర్యంకముల్, టంకముల్
త్రోవల్, మావులు, సీధులున్, నివసతుల్, దుర్గంబులున్, జర్జరుల్
బ్రోవన్, గావను, నల్పు, నిల్పు దగునార్యుండంటరాదంట, మీ
హేవాకంబునకే, గోరంతగనుడీ, హిందూమతోద్ధారకుల్!

కుక్కల్, నక్కలు, పిల్లి లెల్కలను సంకోచంబులే కెంతయున్
బ్రక్కన్నక్కునఁ జేర్చి ముద్దులిడు మీపాండిత్యమేమో సదా
దిక్కై యక్కరదీర్చు సోదరులఁ బ్రీతిన్ బ్రోవ కస్పృశ్యులం
చిక్కట్లన్నిడ నేల చేరి మనరే హిందూమతోద్ధారకుల్!

ఔరా యెంతటి రాజనీతి తనవా రస్పృశ్యులం చెంతయో
దూరానన్ బడ ద్రొబ్బి యన్యకులజుల్తో మెక్కుచెంతో సదా
చారుల్ మేమని నక్కకూతలిడ నిచ్చన్ మెత్తురే సద్యశో
హేరంబుల్ సమతన్ గణింపదగదే హిందూమతోద్ధారకుల్!

తానై కట్టిన కోవెలల్ కొలకులన్ తల్పంబులన్ బాటల
న్నే నేరంబున జేసి మెట్ట జన దంద్రీక్షింపవార్ మీవలెన్
నానాభంగుల కన్నకూళ్ల దిని యేటన్ గల్పిరే సన్మతం
హీనత్వంబు త్యజించి కూడిమనరే, హిందూమతోద్ధారకుల్!

ఆనాడట్టు లనాదరత్వమున ద్రోయన్ జన్నరంగాదులే
యీనా డన్యమతంబు జెందుటను సాహేబ్ హోహల్లై మీపయిన్
న్నానందంబున స్వారి జేసి రికనైనన్ మౌర్ఖ్యమున్ మాని యెం
తేనిన్గూడి మనంగ రండు గముల్లై హిందూమతోద్ధారకుల్!

అకటా యెందరో హైందవాగ్రణులు మీయార్భాటముల్ సైపనే
రక యెన్నెన్నొ మతంబుల న్గొనియు, మీరా, సూసె, యంచెన్నొ పి
ల్వకనుల్ నీరుస్రవింప భారతిటు లేడ్వంగంటిరే యొంటిరై
యికనైనన్ మత ముద్ధరింప గనుడీ హిందూమతోద్ధారకుల్ !

కపటం బిట్టి దటం చెరుంగని స్వసంఘుంబెన్నియో కార్యముల్
నిపుణత్వంబున జేసి సంపదలచే నీయిల్లు నింపంగ చీ
కృపలే కంటకురోరి మాల యన నోరెట్లాడెనో లెందు, రం
డికనైనన్ మత ముద్ధరింపగను వే హిందుమతోద్ధారకుల్ !

కరుణాలేశము లేక సోదరుల సంఘుంబంటినన్ పాపముల్
పరగున్ మా కని పల్కు దార్యులగు నాపన్నిద్ధరాళ్వార్ల స
చ్చరితం బించుక సంస్మరించిన సమస్తం బందెదిన్ బుద్ధికి
న్నిరవొందన్ మత ముద్ధరించుకొనుడో హిందూమతోద్ధారకుల్ !

పూర్వమీమాంసాదర్శనము*

శ్రీ పూర్ణానంద

శబ్దబ్రహ్మ యదేకం యచ్చైతన్యం సర్వభూతానాం,
యత్పరిణామస్త్రిభువన మఖిలం ఇదం జయతిసావాణీ.

౧

మీమాంసాదర్శనము వేదసంబంధీయము. అందువలన వేదముల గుఱించి, ఒకింత ముందుగ ప్రస్తావించుట అనవసరము కాదు, వేద మన నేమి?

"ధర్మబ్రహ్మప్రతిపాదకం అపౌరుషేయం స్వతః ప్రమాణవాక్యం వేదః; ఇష్టప్రాప్తి - అనిష్టపరిహారయోః అలౌకికం ఉపాయం యో గ్రంథో వేదయతి స వేదః, స హి అజ్ఞాతార్థజ్ఞాపకః"
అని తజ్ఞులు పల్కుచున్నారు.

'ధర్మము అనగా యజ్ఞయాగాది కర్మలను, పరమతత్త్వమగు బ్రహ్మమును బ్రతిపాదించుచు, ఇతరత్ర ప్రత్యక్ష అనుమానాది ప్రమాణములకు అనవగమ్యమును, ఇష్టానిష్టప్రాప్తిపరిహారకరమును నగు ఉపాయమును దెల్పుగ్రంథము వేదము' అని ఫలితాంశము.

ఇయ్యది మంత్రబ్రాహ్మణములుగ ద్వధావిభక్తము. 'మంత్రబ్రాహ్మణయోర్వేద నామధేయః'. సంహితా, బ్రాహ్మణ, ఆరణ్యక, ఉపనిషత్తులని మఱియొక విభజన. సంహితను మూలమెనచ్చుకొని తక్కిన వన్నియు ప్రతిసంహితకును బ్రాహ్మణ, ఆరణ్యక, ఉపనిషత్తు లున్నవి. యథా : యజుస్సంహిత, యజుర్వేద బ్రాహ్మణము, యజురారణ్యకము, తైత్తిరీయ శాక నారాయణోపనిషత్తు. ఇట్లే తదితర సంహితల పట్లగూడ అవగమ్యము.

వేదమంత్రములు చతుర్విధములు. అర్థానుసారము పాదములుగ విభజింపబడినవానిని 'ఋక్కు' లందురు. 'తేషాంఋక్ యత్రార్థవశేన పాదవ్యవస్థా'
(జై. సూ. ౨-౧-౩౫)

ఇవి గానసాపేక్షము లైన సామములు—'గీతిషుసామాఖ్యా' (జై. సూ. ౨-౧-౩౬); మిగిలినవి అనగా గద్యాత్మకములు యజుస్సు. 'శేషే యజుఃశబ్దః' (జై. సూ. ౧-౨-౩౬) 'వృత్తి - గీతవర్జితత్వేన ప్రశ్లిష్టపఠితాః, మంత్రా యజూంషి' వీటియందు పాదవిభజనగాని, గానవశ్యతగాని లేదు. మొదటివి ఛందోపూర్వకములగు మంత్రములు, రెండవవి గానపూర్వకములగు స్తవములు, మూడవవి యజ్ఞయాగాదుల వినియోజ్యములు, కాన, నిరుక్తకారుడు 'మంత్రామననాత్, ఛందాంసి ఛాదనాత్, స్తోమః స్తవనాత్, యజుర్యజతేరితి' (ని. ౭.౧౨) అని నిర్వచించియున్నాడు. ఇవి యజ్ఞసమయమున ఋత్విక్, ఉద్గాత, అధ్వర్యులకు అవశ్యపఠనీయములు.

బహువిస్తృతమైన ఈ వేదరాశిని ఏఒక్కరును పఠింపజాల కున్నందువలన వ్యాసమహర్షి 'ఉద్ధృత్యైవర్గశః చతస్రః సంహితాశ్చక్రే' ఫలతః, వేదవ్యాస నామ మాయనకు ఆ చంద్రతారకముగ నిలచినది, ఆయన ఈ నాల్గుభాగములను పైల, వైశంపాయన, జైమిని, సుమంతులను శిష్యుల కొసంగెను. శిష్యపరం

* మల్లిఖిత దర్శనవ్యాసములలో ఇది అయిదవది. వీనిపూర్వము న్యాయ, వైశేషిక, సాంఖ్య, యోగ, దర్శనముల గుఱించి చిన్నమ్రతముగ భారతియందు ప్రస్తావించియుంటిని. భవిష్యత్తున, వేదాంత దర్శనమున విభిన్నపంథల జూపు, శంకర, రామానుజ, మధ్వ, వల్లభ, నింబార్క, బలదేవ, యాదవ, భాస్కర, శ్రీకంఠ, విజ్ఞానభిక్షుల మతవాదములజూపు పదివ్యాసముల వెలువరించు కోరికయున్నది.

పరగ ఈ వేదము విభిన్నశాఖలను, పాఠభేదములను దాల్చినది. ఋక్కునకు ఇరువది యొక్కటి, యజుస్సునకు నూరు, సామమునకు వెయ్యి, అథర్వవేదమునకు తొమ్మిదిశాఖలు నిలచినవి. అష్టాదశ మహాపురాణములకు ఉప పురాణములు, కొపరగ స్థలపురాణములు వెలయునట్లు, ధనుః, వసు, గాంధర్వ, ఆయుర్వేదములను ఉపవేదములు, మహాభారతమును పంచమవేదము నిరూఢముగ ఒప్పుచున్నవి. యజుర్వేదము శుక్ల కృష్ణము లని ద్వివిధము. శుక్లయజుర్వేదమునకు కాణ్వశాఖ, మాధ్యందినశాఖ అను రెండు శాఖలున్నవి.

యజుర్వేదోత్పత్తి ఒకింత విచిత్రము. విద్యాగర్వితుడును, ప్రగల్భుడును అగు యాజ్ఞవల్క్యుని గాంచి, గురుడు తనకడ గ్రహించిన వేదముల ఇచ్చివేయుమనెనట. యాజ్ఞవల్క్యుడు వమనమొనర్చి వెడలగ్రక్కెను. అంత మహర్షులు వేదముల ఈ శోచనీయస్థితిని గాంచి తిత్తిరిపక్షులరూపమును దాల్చి వాటిని గ్రహించిరి. అదియే కృష్ణయజుర్వేద తైత్తిరీయశాఖ. పిదప యాజ్ఞవల్క్యుడు,

"యో ఒనధీత్య ద్విజో వేదా నన్యత్రకురుతే శ్రమమ్,
స జీవన్నేవ శూద్రత్వ మాశు గచ్ఛతి సాన్వయః."

అని యుండుటవలన, వేదప్రాప్తికై సూర్యుని ప్రార్థించెను. ఆయన అశ్వరూపమును ధరించి యాజ్ఞవల్క్యునకు వేదమును జెప్పెను. ఇదియే శుక్లయజుర్వేద వాజసనేయసంహిత. ఇట్లే ప్రతి వేదభాగముయొక్క ఆవిష్కృతిని గురించి సాయనాచార్యులవారు తమ వేదార్థ ప్రకాశికయను భాష్యమున కథల నుదాహరించిరి.

అందు కృష్ణయజుః తైత్తిరీయ సంహితా, శుక్లయజుర్వేద కాణ్వ సంహితా, ఋక్సంహితా, అథర్వ సంహితా, తైత్తిరీయ బ్రాహ్మణ, ఆరణ్యక, ఐతరేయ బ్రాహ్మణ, ఆరణ్యకములకును, సామవేద సంహితా, తత్సంయుక్తములగు తాండ్య, షడ్వింశ, సామవిధాన, ఆర్షేయ, దేవతాధ్యాయ, ఉపనిషద్, సంహితోపనిషద్, వంశబ్రాహ్మణములకును, శుక్ల యజుర్వేదాంతర్గతమగు శతపథ బ్రాహ్మణమునకును, సాయనాచార్యులవారు భాష్య మొనర్చి వేదార్థమును ప్రకాశిత మొనర్చిరి. ఉవ్వట, మహీధరులనువారు శుక్లయజుస్సంహితకు భాష్యమును గూర్చిరి. వీరుగాక, వేదభాష్య కర్తలగు మాధవులు ముగ్గ రగుపడుచున్నారు. వారిభాష్యములు అల్పములు, అసమగ్రములు, అప్రసిద్ధములు.

ఇక లభ్యములగు ఉపనిషత్తు లన్నిటిపైని - ఇవి ప్రాయికముగ నూటపదునెనిమిది - శ్రీ ఉపనిషద్బ్రహ్మయోగీంద్రులవారు విరచించియున్నారు; ఆంశికముగ శంకరానంద నారాయణయతీంద్రులు. ముఖ్యములగు దశోపనిషత్తులపై త్రిమతాచార్యులగు శంకర, రామానుజ మాధ్వ ఆచార్యులభాష్యములు, తచ్ఛిష్య ప్రశిష్య విరచితములగు టీకా, వివరణ, వార్తికములును వెలయుచు గీర్వాణవాణిని పుష్టి నొందించుచున్నవి. వీటి కన్నింటికిని ఆంగ్ల, జర్మన్, ఫ్రెంచిమున్నగు విదేశభాషలలోను, హిందీ, వంగ, కేరళాది స్వదేశభాషలలోను — తెలుగున తప్ప — అనువాదములు వెలయుచున్నవి.

౨

వేదము సంహితా, బ్రాహ్మణ, ఆరణ్యక, ఉపనిషదాత్మక మని పైని నుడివియుంటిని. సంహితయందు సూక్తము లనబడు మంత్రసమిష్టు లున్నవి. ప్రతిమంత్రమునకు ఋషి, దేవత, ఛందస్సులున్నవి. ఋషియన ఆవిష్కరించిన ఆయన, ప్రణేత కాదు. ఈ మంత్రముల నెప్పు డేవిధముగ ప్రయోగింపవలసినది తెల్పునది బ్రాహ్మణము. ఇయ్యది ఇతిహాస, పురాణ, విద్యా, ఉపనిషద్, శ్లోక, సూత్ర, అనువ్యాఖ్యాన, వ్యాఖ్యాన మని అష్టధాభిన్నము.

'భృగుర్వై వారుణి' ఇత్యాదులు ఇతిహాసము. ఇట కథ చెప్పబడుచున్నది. 'యతో వా ఇమాని' అనుతీరుగ నుండు సృష్టి ప్రతిపాదక వాక్యములు పురాణము. 'యఏవమేతా మహాసగ్ంహితా వ్యాఖ్యాతా వేద' ఇత్యాది ఉపాసనలు విద్య. రహస్యార్థ బోధకములు ఉపనిషత్తులు. శ్లోకములు అచ్చటచ్చట ఉదాహరింప

బడినవి, 'ఏతేకోకాధవంతి' అనుచు. "బ్రహ్మవిదాప్నోతి పరం' — ఇయ్యది సూత్రము. 'సత్యంజ్ఞానంబ్రహ్మ' అనునది అనువ్యాఖ్యానము; సూత్రకథితమగు బ్రహ్మమును నిర్వచించుచున్నది. ఈ అర్థమును స్పష్టీకరించుటయే వ్యాఖ్యానము.

ఆరణ్యకములందు ఉపాసనలును, ఉపనిషత్తుల జ్ఞానమును, సంహితా బ్రాహ్మణముల కర్మలును జెప్పబడియున్నవి. అందువలన వేదము కర్మ, ఉపాసనా, జ్ఞానకాండ లను పేరిటగూడ త్రిధావిభక్తము. ఇట కర్మ యన ఇంద్రాదిదేవతల నుద్దేశించి అగ్నియందు పురోడాశాదుల, మంత్రోచ్చారణ పూర్వకముగ నర్పించుట. ఆదిపదమున, నర, పశు, ద్రవ్యములు గ్రాహ్యములు. జీవ, బ్రహ్మముల పరస్పర ఉపాసక ఉపాస్యభావదర్శనము, ఉపాసన. ఉభయుల అభేద బుద్ధి, జ్ఞానము. ఈ వేదరాశిని గ్రహింప, శిక్షా, కల్ప, వ్యాకరణ, నిరుక్త, ఛందో జ్యోతిషము లను షడంగములు అవసరము.

శిక్షయన ఉచ్చారణ. కల్పమన యజ్ఞాదిప్రయోగ వివరణములగు సూత్రగ్రంథములు. ఇవి శ్రౌత, గృహ్య ధర్మ, సూత్రములను అత్యంత విస్తృత వాఙ్మయము; వాటి ననుసరించియే తర్వాత ఛందోబద్ధములగు మను స్మృత్యాది గ్రంథములు నిర్మింపఁబడినవి. వ్యాకరణము భాషాన్వయ బోధకము; ఇది లౌకిక వ్యాకరణముకంటె అన్యము. 'ప్రతిశాఖ్యము' అను పేరిట ప్రతివేదశాఖకొక్కొక్క వ్యాకరణ మున్నది. నిరుక్తమన నిఘంటువు. ఛందస్సు గణాదిపరము. జ్యోతిషము ఏఏ కర్మల, ఏఏ తిథినక్షత్రముల నాచరింపవలెనది నిర్దేశించునది.

ఈ వేదరాశియొక్క అర్థ పరిష్కృతియే మీమాంసాదర్శనము. ఇది ఇరువది అధ్యాయములతో నొప్పు బృహచ్ఛాస్త్రము. అందు, ద్వాదశ లక్షణి యనంబడుపూర్వమీమాంసయందు పదిరెండు అధ్యాయములు కర్మకాండాపరములు. సంకర్షణకాండ అనబడు ఉపాసనాకాండ సంబంధియగు 'మధ్య – మీమాంస' అధునా విలుప్తము. జ్ఞానకాండను సమన్వయించు ఉత్తర - మీమాంస అనువేదాంత సూత్రములు నాలుగు అధ్యాయముల గ్రంథము.

3

ప్రస్తుత మీవ్యాస విషయమైన పూర్వమీమాంసను గుఱించి, ఆలోచింతము.

పూర్వమీమాంసాసూత్ర ప్రణేతమహర్షి జైమిని. ఇందు ౧౨ అధ్యాయములు, ౬౦ పాదములు, ౯౧౫ అధికరణములు, ౨౭౪౫ సూత్రములు ఉన్నవి.

సూత్ర మన:—

'స్వల్పాక్షర మసందిగ్ధం సారవత్ సర్వతో ముఖమ్,
అస్తోభ మనవద్యంచ సూత్రం సూత్రవిదో విదుః'

అని నిర్వచనము. కాని, స్వల్పాక్షరయుతముగ నొనర్చుటయందే సూత్రకారులు సామాన్యముగ తమశక్తిని జూపి, బహువిధ భేద కారణములకు భాష్యములకు గారకులైరి.

అధికరణ మన:—

'విషయో విషయశ్చైవ పూర్వపక్షస్తథోత్తరః,
సిద్ధాంతశ్చ ఇతి పంచాంగం శాస్త్రేధికరణం స్మృతమ్'

ఈ జైమినీయసూత్రములపై పాణినిగురు వగు ఉపవర్షాచార్యులు 'వృత్తి'ని విలిఖించెనని వినికి. కాని ప్రస్తుత మది అలబ్ధము. శబర-భాష్యము అత్యంతప్రామాణికమగు గ్రంథము. మఱియు, కుమారిలభట్టు విరచితములగు శ్లోక, తంత్ర వార్తికములను గ్రంథములును సాయనాచార్యప్రోక్త మగు 'న్యాయమాల' అను గ్రంథమును, పార్థసారథి మిశ్రవిరచితమగు 'శాస్త్రదీపిక' అను గ్రంథమును పండితసమాజమున విశేష సమాదరమును బడయుచున్నవి. ఆపదేవవిరచితమగు న్యాయప్రకాశము, లౌగాక్షిభాస్కరవిరచిత మగు అర్థసంగ్రహము అను గ్రంథమును ఈ శాస్త్రమునకు అనుక్రమణికలు. ఈగ్రంథము లన్నింటిపైని ఏకాధికముగ టీక లున్నవి.

జైమినీయసూత్రములు పదిరెండు అధ్యాయముల గ్రంథ మనికదా చెప్పియుంటిని. ప్రథమాధ్యాయమున విధ్యాదుల [illegible]

ధ్యాయమున కర్మభేదములును తర్వాత క్రమముగ కర్మల అంగాంగీభావము, హోమపదార్థముల పరిమాణము, అనుష్ఠానవిధానము, కర్మఫల భోక్తృత్వ విధానము, ప్రకృతి వికృతుల అతిదేశము, విశేషాతిదేశము, అధ్యాహారము, వికృతిబాధలు, ప్రకృత్యనుష్ఠానమువ వికృతిఫలప్రాప్తి, ఉపకార్యుపకారకభావములు చర్చింపబడినవి. ఇవన్నియును క్రియాపరములు.

వేదవాక్యములు, విధి, మంత్ర, నామధేయ, నిషేధ, అర్థవాదము లని పంచవిధములు.

౪

అందు అజ్ఞాతార్థజ్ఞాపక మనునది విధి. ఇది ప్రత్యక్ష అనుమాన ప్రమాణానవగమ్యము. స్వర్గకాంక్షికి 'అగ్నిహోత్రం జుహుయాత్స్వర్గకామః' అనువిధి వినా గత్యంతరము లేదు. ఇతరత్ర అప్రాప్తము. ఈవిధి కర్మబోధకము అన్యత్ర కర్మ గ్రాహ్యమైన పిదప గానవచ్చు 'దధ్నా జుహోతి' ఇత్యాదులు గుణపరము లనంబడుచున్నవి. హోమ పదార్థబోధకములను 'సోమేన యజేత' ఇత్యాదివిధులు విశిష్టను లనంబడుచున్నవి.

ఈవిధి ఉత్పత్తివిధి, వినియోగవిధి, అధికారవిధి, ప్రయోగవిధి అని నాల్గువిధములు.

అందు కేవలము కర్మ స్వరూపమాత్ర బోధకములు ఉత్పత్తివిధులు. 'అగ్నిహోత్రమును ఒనరించునది' ఇత్యాదులు.

యజ్ఞాంగములను ద్రవ్యదేవతాదులను ప్రధానముగ నడుపునది 'వినియోగవిధి' యథా, 'దధ్నా జుహోతి' ఇట 'దధితో హోమమొనర్చునది' అనియుంట చేసి ఏద్రవ్యము యజ్ఞాంగమైనదియు తెలియుచున్నది.

ఈ వినియోగవిధికి సహకారభూతము లైన ప్రమాణములు ఆరు. అవి: శ్రుతి, లింగ, వాక్య, ప్రకరణ, స్థాన, సమాఖ్యలు.

అందు ప్రమాణాంతర నిరపేక్షమగు శబ్దము శ్రుతి. ఇయ్యది మరల విధాత్రి, అభిధాత్రి, వినియోక్త్రి అని త్రివిధము. మొదటి దానియందు 'యజేత' ఇత్యాది రూపకమగు 'లింగ్' ప్రత్యయముండును. రెండవదానియందు యజ్ఞాంగ ద్రవ్యములగు వ్రీహియవాదుల ఉల్లేఖ ముండును. మూడవ దానియందు వినియోజ్య వినియోజకభావముండును. చివరిదగు 'వినియోక్త్రి శ్రుతి' విభక్తిరూపము, ఏకాభిధాన రూపము, ఏకపదరూపము అని మూడువిధములు. 'వ్రీహిభిర్యజేత' అనునది విభక్తి - శ్రుతి ఇటనున్న తృతీయావిభక్తి యాగాంగత్వమును సూచించుచున్నది. 'పశునాయజేత' అనునది ఏకాభిధానము. 'యజేత' అనునది ఏకపదరూపము.

శబ్దసామర్థ్యము లింగము. సమభివ్యాహారము వాక్యము. ఆకాంక్షాయుత మనునది ప్రకరణము. ఇయ్యది మహాప్రకరణము అవాంతరప్రకరణము అని ద్వివిధము. దేశసామాన్యము స్థానము; ఇయ్యది పాఠసాదేశ్య, అనుష్ఠాన సాదేశ్యమని రెండువిధములు. సన్నిధిపాఠము సంఖ్యాపాఠమని గూడ రెండురీతులు దీని కున్నవి. సమాఖ్యయన యౌగికశబ్దము; ఇయ్యది వైదికము, లౌకికమని ద్వివిధము.

ఇట్లు శ్రుత్యాది షట్ప్రమాణములతో నొప్పు వినియోగవిధికి సిద్ధిరూపము, అసిద్ధిరూపము అను రెండు అంగము లున్నవి.

ప్రయోగమును చక్కగ తెల్పునది ప్రయోగ విధి. దీనికిగూడ శ్రుతి, అర్థ, పాఠ, స్థాన, ముఖ్య, ప్రవృత్తులను ఆరుప్రమాణము లున్నవి.

కర్మఫలాధికారిని తెల్పునది 'అధికారవిధి' యథా: 'స్వర్గకామో అగ్నిహోత్రం జుహుయాత్' ఇత్యాదులు. ఇట అగ్నిహోత్ర యాగాధికారి నిర్వచన మున్నది.

స్థూలముగ జెప్పవలసిన పైనజెప్పబడిన విధిజన శాబ్దికము. అర్థానుసారము విధి అపూర్వ విధి, నియమ విధి, పరిసంఖ్యావిధి అని త్రివిధము.

ప్రమాణాంతర అప్రాప్తమనునది 'అపూర్వ విధి'. 'వ్రీహీనవహంతి' అనునది నియమవిధి. తండులార్థము వ్రీహిధాన్యములను దంపవలె ననునది లోకప్రాప్తము; అందఱికిని తెలిసియేయున్నది. కాని,

ఆయా యాగసాపేక్షముగ ఈ విషయమును చెప్పిన 'నియమవిధి' యనుచున్నది. 'పంచపంచనఖాభక్ష్యా' అనునది పరిసంఖ్యావిధి. మాంసభక్షణము రాగతః లోకప్రాప్తము. ఈభక్షణాసక్తిని కొంతమటుకు నియమించి, ప్రాస్వీకరించునది పరిసంఖ్యావిధి. మాంసమును సంపూర్ణముగ వదలజాలకున్న పంచనఖయుతములగు శశకాదిపంచనఖజంతువుల మాంసమును భక్షింప ఈశ్రుతి ఆదేశించుచున్నది.

౫

యాగనామమును సూచించునది నామధేయము. 'ఉద్భిదా యజేత' — ఇచ్చట ఉద్భిద్యాగనామము లభ్యమగుచున్నది.

'న కలంజం భక్షయేత్' ఇత్యాది నివర్తకవాక్యములు నిషేధము లనంబడుచున్నవి. కలంజమును భక్షింప గూడదను సంగతి ఒక్క వేదమువలననే తెలియవగును.

నిందాప్రశస్త పరములగు వాక్యములు అర్థవాదములు; ఇవి విధిశేషము, నిషేధశేషము అని రెండు విధములు. వాయవీయ యాగమున 'వాయవీయం పశుమాలభేత' వాయవీయ పశువును సంపాదించునది అని చెప్పబడియున్నది. ఇట వాయువును ప్రశంసించుచు, ప్రరోచనార్థము చెప్పబడు వాక్యము 'వాయుర్వై క్షేపిష్ఠా దేవతా' అనునది విధిశేషము. 'వాయవీయం పశుమాలభేత' అనునది విధివాక్యమని అవగంతవ్యము. 'న బర్హిషి రజతం దేయం' — బర్హి అను యజ్ఞపాత్రయందు రజతము నుంపదగదు — ఈ వాక్యము నిషేధ రూపకమగు విధి. నిషేధితకర్మను నివారింప, నిందించు 'సోఽరోదీద్యదరోదీత్త ద్రుదస్య రుద్రత్వమ్' — రుద్రుడు రజతమునుంచి రోదించి, రుద్రుడైనాడు, అనువాక్యము నిషేధశేషము.

ఈ అర్థవాదము గుణవాదము, అనువాదము, భూతార్థవాదము అని మూడు తెఱగులు.

ప్రమాణాంతర విరోధమగు అర్థవాదము 'గుణవాదము' 'ఆదిత్యో యూపః' యూపము ఆదిత్యుడు. యూపమన బలినొసగబడు పశువును బంధించు ఖదిర కాష్ఠము, ఇది ఆదిత్యుడని చెప్పబడుచున్నది. ఖదిర కాష్ఠము సూర్యుడు కాదే! అయినను దాని మహత్వ సూచకముగ, లోకసత్యవిరుద్ధమైనను చెప్పబడినది. ఇట్టివాక్యములు గుణవాదము లనంబడును.

ప్రమాణాంతర అర్థబోధకమగునది అనువాదము. 'అగ్నిర్హిమస్య భేషజమ్' ఇట అగ్ని మంచును విరుగుడు అని చెప్పబడినది. ఇది మన నిత్యానుభవమే కదా; చలిని దీర్చుకొనన నిప్పుకడకు బోనివాడెవడు? ఈ విషయము లోకముననే తెలియబడుచున్నది. దీనిని దెల్ప, వేదముయొక్క అవసరములేదు. ఇట్టి, ప్రాప్తానువాద వాక్యములను 'అనువాదమందురు'.

ప్రమాణాంతర విరోధరహితమగునది 'భూతార్థవాదము'. 'వజ్రహస్తః పురందరః' ఇంద్రుడు వజ్రహస్తుడు. ఈ విషయమును, మనము అన్యప్రమాణము వలన నిరాకరింపజాలము. ఏలయన, ఇంద్రునిచేత వజ్రమున్నది లేనిది మనము చూడలేదు. నిరాకరించుటకుముందు, చూడవలెను గదా, చూచి వచ్చువఱకు ఇది అబాధితము. ఇట్టి వాక్యములు భూతార్థవాదములు.

ఇవి మీమాంసకుల వేద విభజన.

౬

పూర్వ మీమాంసకులు నిత్య - ప్రళయమగు సుషుప్తినిగాక ఇతర విధములగు నైమిత్తిక, అవాంతర, మహాప్రళయముల నంగీకరింపరు. అందువలన వీరికి సృష్ట్యాది, సృష్టి ధ్వంసము అనునవి లేవు. ఫలతః, జగత్తునిత్యము. మంత్రములు గాక వేరొక ఈశ్వరునిగాని దేవతనుగాని ఒప్పుకొనరు. మంత్రమే దేవత. కావున్న, ఇంద్రుని ఘటమున ఆహ్వానించినప్పుడు ఐరావతయుతముగ వాస్తవముగ అతడరుదెంచిన, ఘటము ముక్కలు చెక్కలు కావలసివచ్చును. వీరు శరీరసహితులైన విభిన్నస్థానముల ఒకే సమయమున సల్పు యజ్ఞముల ఆహుతిని గ్రహింప అశక్యము. ఇవి వారు చూపు ఉపపత్తులు. ఇది సనాతన - మీమాంసకులమాట. తరువాతివారు 'యత్కరోషి యదశ్నాసి' అనుశ్లోకము నుదాహరించుచు, భగవత్పరముగ కర్మల నొనర్ప ఆదేశించు

యున్నారు. బహుశః, కర్మమయమును జడ వాదమును నగు ఈదర్శనము విలుప్తము కాకుండ నుంచుటకే ఈ ఈశ్వరగ్రహణము అని తోచు చున్నది.

ఈశ్వరుని ఒప్పుకొనకపోయినను వారు ఆస్తికులే. ఆకాలమున నాస్తికుడన వేదమును, పరలోకమును ఒప్పుకొననివాడు. తక్కినవారు ఆస్తికులు. ఈ విభజన ననుసరించి, ఈశ్వరరహితములగు సాంఖ్య, మీమాంసాదర్శనములు ఆస్తికదర్శనములు. బౌద్ధ జైన్యాది వేదనిందక దర్శనములు నాస్తికములు. ఇచ్చట వేదము, పరలోకములపై విశ్వాసమే ముఖ్య మని గమనించునది. కాని, ప్రస్తుతము మన ఆస్తిక నాస్తికత్వములు ఈశ్వరగ్రహణాగ్రహణములపై నిర్భర పడుచున్నవి.

వీరి 'అపూర్వము' ఒకఅపూర్వవస్తువు. యజ్ఞాది కర్మల నొనర్ప, తయారగు పుణ్యమే ఇయ్యది. దీనివలన, కర్మి ఇహమునగాని, పరమునగాని సుఖమునందును.

వీరి మతమున నిత్యనైమిత్తిక కర్మలు అవశ్యమా చరణీయములు. ఆచరింపకున్న ప్రత్యవాయమగును. ప్రత్యవాయ మన, స్థూలముగ పాపము. ఆచరించిన పుణ్యములేదు. నిషిద్ధకర్మాచరణమున పాపము కల్గును. ప్రాయశ్చిత్త కర్మల పాపక్షయమగును. కామ్య ననుసరించి.


కర్మత్యాగమును వీరు ఒప్పరు. నిషిద్ధకర్మల గాక తక్కిన నిత్యాదికర్మల మరణ పర్యంతము ఆచ రించుచుండుటయే వీ రొసగు ఉపదేశము.

వీరు బొందగోరునది, వైదిక కర్మల చరమ లక్ష్యమగు బ్రహ్మలోక మనబడు ముక్తి. ఇట బ్రహ్మ లోక మన పురాణ వర్ణితమగు, బ్రహ్మలోకము కాదు; సుఖవిశేషము. ఇదియే వారిఅమృతత్వము. 'అపామ సోమ అమృతాబభూమ'.

వీరు ప్రత్యక్ష, అనుమాన, శబ్ద, ఉపమాన అర్థాపత్తి, అనుపలబ్ధి ప్రమాణముల గ్రహించిరి. ఈ దార్శనికుల నకుమభాట్ట, ప్రభాకరుల మతములు రెండున్నవి. భాట్టులు అనుపలబ్ధిని అంగీకరింపరు. వీటిలో శబ్దప్రమాణము అనగా వేదమే ముఖ్యము.

వేదముయొక్క నిత్యత్వమును, శబ్దముయొక్క నిత్యత్వమును స్థాపింప వీరు జూపిన ప్రతిభ అత్యంత విస్మయకరము. వీరి వేదవిభజన ప్రణాళి ననుసరించి యే ఎల్లరయెడల వేదము అధ్యయన మొనర్పబడు చున్నది. ఈ విభజనపట్లగూడ వీరి ఓపిక, బుద్ధినైశిత్యము, భయావహములు. వేదాంతులు, తదితర దార్శ నికులు ఈ ప్రణాళి ననుసరించియే వేదముల నర్థమొనర్చి, తమతమ మతముల స్థాపింప యత్నించిరి. ఈ దర్శనముయొక్క చరమసిద్ధాంతములు అందఱకు నచ్చకపోయిన నచ్చకపోవచ్చును గాని, వీరికి పరమ పూజ్యమగు వేదమెట్లు వీరి సమాజమును కాపాడినది, నా 'ఛాయాగ్రహణం' అను వ్యాసమున జూపి యున్నాను.

యస్య నిశ్వసితం వేదా యో వేదేభ్యోఽఖిలం జగత్
నిర్మమే తమహం వందే విద్యాతీర్థమహేశ్వరమ్.



గు రు ద క్షి ణ

(శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరి)

[పూర్వకథ:— ఔరంగజేబునకును సిక్కులకును ఆఱని చిచ్చువలె యుద్ధములు జరుగుచుండెను. ఒక యుద్ధమున సిక్కు లోడిరి. వారి మతగురుఁడును సర్వసేనాపతియు నగు తేజ్ బహద్దరు శత్రువశ మయ్యెను. మహమ్మదీయ మతమును స్వీకరించినచో నిన్ను విడిచెద నని పాదుషా పల్కెను. సిక్కువీరుఁడు నిరాకరించెను.]

చిక్కిన సిక్కువీరు మగచేవ మెయిన్ రణ మిమ్మటంచుఁ దాఁ
జక్కటిసూప కమ్మొగలుపా కలుషక్రమ మూఁది వాదరన్
ముక్కలు చేసి దాన ముదము న్గనఁజాలక పూతిగంధముల్
గ్రక్కుచుఁ గుళ్లి కుళ్లి చెడఁగావలె వీఁ డని యెంచె నీసునన్.

ఆతని పన్నున భటులు ప
రేతక్షితి శవము నిల్పి రేయుం బవలున్
జైతన్యము గల వీరుఁగు
లై తమ ధర్మంబు నడపు నాసల నుండన్.

ఒక్క ముహూర్తములో నిది
పొక్కె నమృతసరములోన; బోరన సిక్కుల్
వెక్కిరి లేటమొగమ్ములఁ
జిక్కిరి పరిభవదవాగ్ని సెగలసెగలకున్.

ఒకముసలిసిక్కు గురుభ
క్తికి లోఁగినవాఁడు వగలఁ దెరలెడి తనవా
రికి నిట్లు వల్కె నెత్తురు
తుకతుక నుడుకెత్తి పొంగి తొందరపెట్టన్.

పగఱకు నోహటించి నగుఁబాటున గ్రుంగుట గాక లోకముల్
పొగడిన మేటిజోదు గురుపుంగవు గ్రుంగుట గాక గెల్పులో
సొగసిన శత్రు లిట్లు తెగఁజూచియుఁ దత్కుణపంబు నిమ్మెయిన్
దెగడుటయున్ సహింతురె? నుతింతురె శూరులు మీ చరిత్రముల్.

పోవలయును గురుశవమున్
దేవలయును మాన్యమతవిధిన్ మఱుపఱుపం

గావలయును సత్కీర్తులు
రావలయును మనకు నిహపరంబుల రెంటన్.

రాచపుట్టువు గన్నవారలకు నిట్టి
తరుణము లఖండపుణ్యాలబ్ధములు గావె?
నీచముగ నింటఁ దెవులుచే నీల్గ నేల?
నడుము గట్టుఁడు గురునిఋణమ్ము సేఁగ.

నే వెడలెద నే వెడలెద
నే వెడలెద నన్న రవళి నింకను సభలో
ఏవానిభాగ్య ముఅవో
దైవ మెఱుఁగు నంచు వృద్ధు తనివోయె నెదన్.

పుత్రునిఁ గూడి కోడియలఁ బూన్చిన కంచర మెక్కి నిర్భర
క్షాత్రము నందడింప నొకసైనికుఁ డెల్లరికంటె ముందె మద్
గాత్రము నేఁడు ధన్య మవుఁగా! యని పొంగుచు హస్తినాపుర
క్షేత్రము సేరె నన్నవనచీఁకటి దాఁగురుమూత లాడఁగన్.

హైందవుఁ డెవ్వఁడో తెలియు నాడినజాడలు వట్టి సంశయ
స్పందితచిత్తుఁడై యొలికిపట్టున కల్లన సేరి కాపరుల్
నందడి మాని నిద్రకు వశంపడినంత ముసుంగుచాటునన్
గందిన గాజువాతిన జగా మగఁటన్ గుఱితించె సద్గురున్.

వీరల కన్నొఱంగి పదవిం బడినంతన కార్యఖడ్గముల్
దీరవ కాఁపువాండ్రు తెలతెల్లగ వేగిన వెన్క నాగ్రహో
దారత వెంబడింతురుగదా మదవజ్జవనాశ్వకోటిపై
బారులు దీరి; నట్టి లవి పాపము! అక్కలు లేనిసాధువుల్.

ఈదుష్పటిమఱువున గురు
పాదులబడు లొండుపీన్గు పడియుండినచో
మీఁ దెల్ల రుద్ధవిఘ్నో
త్పాదనమై వెలయుఁ గీర్తి ఫలసాధనమై.

కొడుకా! ధైర్యము జీవగఱ్ఱ యనుపల్కుం బల్కి వెన్వెంట నే
బెడిదంబౌ నడిదంబు దూసి తనుఁ దా భేదించె రోమాంచముల్
వెడలన్ దివ్యులమేన నందనవనావిఖ్యాతముల్ క్రొవ్విరుల్
జడియై ముంచెను సిక్కురైతు నఖిలాశల్ సుప్రసన్నంబుగన్.

గూనిగుంపన్న

శ్రీ సోమయాజుల వెంకటరామమూర్తి

అసలా అబ్బాయిపేరు దుర్భాగుంప స్వామి. కాని 'గూనిగుంపన్న' అనేపౌరుష నామం, అతడికి గూని వుండడంమూలాన్ని వచ్చేసింది.

"వెధవా! గూనివెధవా! చాకలి మూటలాంగు గూనీ నివ్వూను; నీ అల్లరి భరించలేకుండా వున్నాం క్లాసులో; నిన్ను పచ్చడిక్రింద దంచేద్దా మన్నంతకోపం నాకు ఉన్నదికాని, నీగూని చూచి కనికరం కలిగి, నిన్ను కొట్టడానికికూడా చేతులు రాకుండా వున్నాయి అన్నారు ఆమేష్టరుగారు.

గుంపన్న చాలా పెంకిక్రాడు.

ఆవేళ మాష్టరుగారు, క్లాసులో 'ఎటం డెన్సు' వెయ్యడానికని ఒకర్ని 'ఫౌంటెన్ పెన్' ఇమ్మన్నారు.

ముందుబెంచీలో కూర్చున్న గుంపన్న 'టప్' మని తన జేబులోనుంచి కలం తీసి, తొందరగా మూతతీస్తూ, పరుగునా మేష్టారు కుర్చీ దగ్గరికివచ్చి, కలం మేష్టారు కందిచ్చాడు.

కాని — ఆ అందించటంలో, మరి గుంపన్న చెయ్యాలనే చేశాడో, లేక అది ప్రమాదమో, చెప్పలేముకాని, ఆ 'ఫౌంటెన్ పెన్'లో నుంచి నల్లని సిరాధార, జొతు కానావలె, మేష్టారి నుదుట్ని కురిసి, గడ్డం మీదుగా ప్రవహించి, తెల్లని ఉత్తరీయం మీదా, కోటుమీదా, యింకిపోయి, తాత్కాలిక కలంకాన్ని ఆపాదించినది. అది చూచి క్లాసులో కుర్రాళ్లంతా, గొల్లున నవ్వారు. మేష్టారు 'తహతహ' లాడిపోయి, చిందులుతొక్కడం ఆరంభించారు. అప్పుడైనా ఊరుకున్నాడూ గుంపన్న?

"అయ్యో! మేష్టారూ! అయ్యో మేష్టారూ!" అంటూ ముఖంమీద ఒకనిలువు చారగావున్న సిరా, తనచేత్తో ముఖం అంతటా అలికేసి, ఆచేతిని మేష్టారి పాగాకు తగిలించాడు.

మేష్టారు—వెధవా, గుంపిగా! నువ్వు వెంటనే బెంచీ ఎక్కు.

గుంపన్న—నేనేం తప్పు చేశానండీ? మీరడుగుతే 'పెన్' ఇచ్చానండీ, ప్రమాదం వల్ల సిరా మీమీద పడిందండి. పెన్ ఇవ్వడమే తప్పాండీ?

మే — ముందు బెంచీ ఎక్కు!—ఊ!—ఎక్కుతావా లేదా?

గుం — ఎక్కలేనండి! అని క్రింద నిలబడినాడు.

మే — గాడిదీ! అల్లరిచేయగలవుగానీ బెంచీ ఎక్కలేవూ? ఓయ్ మోనిటరూ! వీడు బెంచీ ఎక్కినా నరే, లేక పైకి వెళ్లిపోయినా నరే— అదేదోచూడు. (రొనరొనలాడుతాడు.)

మోనిటరు గుంపన్న సీటుదగ్గరికి వెళ్లి, చిరునవ్వు నవ్వుతూ, "మేష్టారు ఎక్కమంటున్నారోయ్-వేగం ఎక్కు," ...

అప్పుడు గుంపన్న బెంచీ ఎక్కడానికి ప్రయత్నించి, పొట్టివాడగుటచేత ఎక్కలేక పోతాడు. క్లాసంతా 'గొల్లు' మని నవ్వుతారు.

గుం—ఎక్కడానికి నాకేం అభ్యంతరం లేదుకాని, ఎవ్వరైనా ఎక్కించాలి మరి.

మే—(నవ్వి) అదా నీఘోష ?

ఇంతలో మోనిటరు రెక్కపట్టుకుని ఎత్తగా గుంపన్న అతికష్టంమీద బెంచీ ఎక్కుతాడు. అది చూచి మేష్టారు,

"అయితే, కింద నుంచో ఈ 'పీఠం' తా. నీగూని నిన్ను కాపాడుతోంది నిజంగా" అన్నారు.

గుంపన్న కిందికి గంతువేసి, లోలోపల నవ్వుకుని, "నాకు గూని ప్రసాదించినందుకు దేముడికి పది నమస్కారాలు" అన్నాడు.

గుంపన్న పెంకివాడైనా, మాంచి తెలివితేటలుగల కుర్రాడు. అందుకే మేష్టర్లందరికీ వాడంటే అభిమానం.

గుంపన్న 'స్కూలుఫైనలు' ప్యాసైనాడు.

*   *   *

రామయ్యశెట్టి, ఆవూళ్లో ఒక సంపన్న గృహస్థు. అతనిది ఇనుపసామానువర్తకం. అతడికి ఒక తెలివైన గుమస్తా కావలసి వచ్చింది. శెట్టి ఆ ఉద్యోగానికి తప్పకుండా గుంపన్ననే నియమిస్తాడని వూరంతా అనుకున్నారు. కాని దైవసంకల్పం వేరయింది. ఇంతకూ శెట్టిగారి గృహిణి— ఆవిడ రెండో పెళ్లి పెళ్లాం శెట్టిగారికి— ఆవిడగారి అనుగ్రహం గుంపన్నపై లేకపోయింది. ఆవిడ మాంచి ఎర్రగా బుర్రగా వున్న ఇరవైయేళ్ల వయసుగల ఒక కుర్రాడినిగూర్చి భర్తతో, ఆవుద్యోగానికి గట్టిగా సిఫారసు చేసింది. అతడికే వుద్యోగం యివ్వాలని భీష్మించింది.

"గూనివాడు నాగుమ్మంలో అడుగు పెడితే నేను వప్ప"నంది. అంతేకాక "గూనివాడిమొగం చూడనని నావ్రతం" అన్నది.

పాపం శెట్టిమాత్రం,

నీవ్రతాలు నట్టింట్లోనూ, గుమస్తా సావిడిలోనూ; నాగుమస్తా గూనైతే నీకేం? అని అష్టవాదనకు దిగాడు. కాని ఆవిడ వాల్చూపు ఒకటి అతనిమీద పారేసి, "అయితే నామాట వినరుకదూ?" అని సగం దీనత్వంగానూ, సగం కాటించినట్లూ అనేసరికి రామయ్యశెట్టి మెత్తబడిపోయాడు— వామాక్షీ వాల్చూపులకు మెత్తబడని పురుషు డుంటాడా మరి?

మూడేళ్లు గడిచినాయి. ఇంతలో ఒకనాడు ఆగృహిణి హటాత్తుగా, ఆగుమస్తాతోనూ, నగలపెట్టెతోనూ, లేచి చక్కాపోయిందని వూళ్లో వదంతి చెలరేగింది. తరువాత కథ సంగ్రహంగా యిదీ:—

పోలీసులు—సెర్చివారంటు—హాజా స్టేషను–ఎరస్టు–బంధం–గుప్ చుప్ !—కాని ఆ గ్రామంలో ఆ గుమస్తాను తిట్టని పెద్దమనిషి లేడు. ఇదంతా చూచాడు మన గుంపన్న. "ఆడవాళ్లు ఎంతకైనా సాహసులురా,నాయినా! కొంపతీసి, నేనే గుమస్తానయ్యుంటే, నాకేం బుద్ధిపుట్టేదో! ఇంతకూ పైచవులు మరగిన ఆడదానికి వాడేమిటి,

పీడేమిటి? నాగూని ధర్మమా అని నేను బ్రతికిపోయాను. నాకు గూని ప్రసాదించిన బ్రహ్మకి నూరు నమస్కారాలు.”

* * * *

కొన్నాళ్లకు గుంపన్నకుకూడా యౌవ్వనం అంకురించింది. గూనైతే వుండొచ్చుగాని, కాలానుకూలంగా హావభావాలు మారవూమరి? యౌవనం పొడచూపేసరికి గుంపన్నకుకూడా నూతనభావాలు ఉదయించినాయి.

వీపుమీద గూనికాని, మనస్సుకి గూని లేదుగా మరి? గుంపన్నకూడా ఆడపిల్లల వైపు వెర్రిచూపులు చూడ్డం ప్రారంభించాడు.

ఆవూళ్లో శ్యామల మంచి చక్కని పిల్ల, ‘స్కూల్ఫైనల్’ చదువుకుంటూంది, అతివయ్యారంగా నడిచేది. పదిహేనేళ్ల వయస్సు. వయస్సుకు సరిపోయినట్టుగా శరీరంలో మార్పులు కనిపిస్తున్నాయి.

ఆమె నడుస్తూంటే, గాలిలోంచి సున్నితంగా ఎగిరిపోయే ఒక దేవకన్యలాగు కనుపించేది. లోలాకులు వుయ్యాల లూగుతూండగా, ఆమె అతిధీమాగా నలుగుర్నీ చూస్తూ మందహాసం అనేవెన్నెల నలుదిక్కులా ప్రసరింపచేస్తూ సాయంకాలం ‘పార్కు’ నుంచి ఇంటికి పోతూంటే ఆమెను చూచి చకితులైపోయేవారు కుర్రాళ్లంతా. ఎవళ్ల మట్టుకివాళ్లే, “నన్నుచూచి నవ్వియిందంటే, నన్నుచూచి నవ్వింద”ని మురిసిపోతూండేవారు.

ఒకనాడు శ్యామల గుంపన్నవైపు చూచి నవ్వడం సంభవించింది. అ దేలాగంటే?

సాయంకాలం ఎలక్ట్రిక్కుదీపాలు అప్పుడే వచ్చాయి. శ్యామల పార్కునుంచి యింటివైపు పోతూంది. గుంపన్న కోవెల్లో హరికథ విని అటునుంచి వస్తున్నాడు. శ్యామల సిల్కు చేరుమాలు ప్రమాదవశాత్తూ చెయ్యిజారి రోడ్డుమీద పడిపోయింది. గుంపన్న కప్పలాగు గెంతుకుంటూ పోయి రుమాలు తీసి, దులిపి శ్యామల కందిచ్చాడు. శ్యామల నవ్వుతూ,

“Thank you, very much” అంది.

“Don't mention, please”అన్నాడు గుంపన్న నవ్వుతూను.

“But we will mention it to all please” అన్నారు పక్కనిచెరువుగట్టుమీద కూర్చొని, ఇదంతా కనిపెడుతూన్న నలుగురు తుంటరికుర్రాళ్లు.

“గూనివాడుకూడా ఒకకథానాయకుడౌతున్నాడురోయ్!” అన్నాడు మరొక్కడు.

గుంపన్న మనస్సు పాదరసంలాగు పరుగెత్తడం ఆరంభించింది. శ్యామల నాడు నవ్విందంటే నిజంగా తన్ను ప్రేమించినదనే అనుకున్నాడు. పాపం! శ్యామల తనగూని చూచి వెక్కిరింతనవ్వు నవ్విందని అతనికి తెలిసిందికాదు.

మరి నెలరోజులకే శ్యామలను విశ్వపతిరావు అనేఅబ్బాయి కిచ్చి పెళ్లి చెయ్యడానికని ప్రధానం చేశారు పెద్దలంతా కలిసి. గుంపన్నగుండెకాయ చెక్కలైపోయినట్టయింది. శ్యామలవిషయంలో తన పొరపాటు గ్రహించాడు గుంపన్న. క్రమేణ చెక్కలైపోయిం దనుకున్న అతని గుండెకాయ మళ్లీ కలిసిపోయిన ట్టయింది.

ఇంతలో యుద్ధం వచ్చింది.

విశ్వపతిరావునే కాకుండా, ఆవూళ్లో యువకుల్నందరినీ Active serviceకి నిర్బంధించారు గవర్నమెంటువారు. గూనివాడు కాబట్టి గుంపన్న తప్పుకున్నాడు. విశ్వపతిరావు వెళ్లిపోతే శ్యామల తన్నే పెళ్లాడ్డానికి ఛాన్సు వుం దనుకున్నాడు గుంపన్న.

సేనలో చేరబోయే యువకు లంతా వెళ్లేరోజు వచ్చింది.

శ్యామల విశ్వపతిరావు భుజంమీద శిరస్సు వంచి వెక్కి-వెక్కి యేడుస్తూంది.

శ్యామల—విశ్వం, నువ్వు యుద్ధభూమి నుంచి జయంపొంది వచ్చేవరకూ నీనామమే జపిస్తూంటాను.

విశ్వ—మన యిరువురి ప్రేమప్రవాహానికి భగవంతుడు ఇల్లాంటి అవరోధం కలిగిస్తా డనుకోలేదు, శ్యామలా. కాని నీవు ధైర్యంగా, ఉత్సాహంగా వుంటానని ప్రమాణం చేస్తే, నేను ధైర్యంగా రణరంగానికి పోతాను. ఊరడిల్లి నన్ను పంపించు.

శ్యామల—సరే. జయం పొంది తిరిగి రా. కాని నువ్వు ఒక్కయేడాదిలో తిరిగి రాకపోతే, నేను కృశించిపోయి, అలాగే ప్రాణాలు వదలేస్తాను, నీ నామాక్షరాలు పెదవులుమీద నుంచుకొని.

విశ్వ—నెలకు రెండుత్తరాలు రాస్తుంటాలే. అని ఆమె చెక్కిలి నొక్కి, ముద్దెట్టుకున్నాడు. గుంపన్న యిదంతా కనిపెడుతూనేవున్నాడు. దుఃఖం పట్టలేకపోయాడు.

"పవిత్రమైన ప్రేమ అంటే విశ్వాం శ్యామలదే" అనుకున్నాడు.

విశ్వపతిరావు యుద్ధానికి వెళ్లిపోయిన మూడునెలలకే శ్యామలని ఒక పుస్తకాల వర్తకుడైన శ్రీనివాసం అనే అబ్బాయి కిచ్చి ఆపెద్దలే—ఎవరైతే శ్యామలను విశ్వాని కిచ్చి వివాహం చేద్దామని ప్రధానం చేశారో, ఆ పెద్దలే—ముడెట్టేశారు. పెళ్లవడమే వాళ్లకు కావాలిగాని, ప్రేమవ్యాసు వాళ్ల కెందుకూ? ఈవిధంగా, శ్యామల విశ్వపతిరావుపట్ల చేసిన శపథాలన్నీ గాలిబుంగలక్రింద ఎగిరిపోయాయి.

శ్యామల శ్రీనివాసానికి 'ధర్మపత్ని' అయింది—పెద్దలధర్మమా అని.

ఒకనాడు గుంపన్న షైరీ కొందామని శ్రీనివాసంయింటికి వెళ్లాడు.

ఇంటిసావిడిలోనే షాపు. శ్రీనివాసం, లోపల భార్య శ్యామలతో ఏదో ఘర్షణ పడుతూన్నట్టుంది.

శ్యామలనోరు మహాఎక్కువ ధాటీగా వినిపిస్తూంది. కేకలు సావిడీ వేపునకే వస్తూన్నవి.

ఇంతలో శ్రీనివాసం ముందుపరుగెత్తుకొంటూ వచ్చాడు. ఆవెనుక శ్యామల—భీకరమూర్తి. నిజంగా అపరకాళికాదేవివలె వుంది. అది భార్యాభర్తల కలహం. కేవలం మాటలతోనే అంతమయ్యేటట్టు కనుపించలేదది. శ్యామలచేతిలో దోష్డీచెం బున్నది. శ్యామల కోపోద్దీపితులురాలు. మహావిష్ణువు చక్రం వదిలినట్టుగా ఆదోష్డీచెంబు గురిచూచి, శ్రీనివాసం తలవైపు విడిచిపెట్టింది. 'టంగ్' మని శబ్దం. అటుతరువాత శ్రీనివాసం తలకాయ రక్తంలో తడసిపోవడం. శ్రీనివాసం తల రెండుచేతులతో పట్టుకుని

కుర్చీలో చదికిలబడడం. ఇదంతా మూడు క్షణాల్లో జరిగిపోయింది.

ఈ వ్యవహార మంతా గుంపన్న చూచాడు. "నాకు గూని వుండిపోబట్టిగానీ, లేకపోతే—నన్ను శ్యామల పెళ్లాడితే—నాగతి ఏమైయ్యుండును? నాగూనికి వెయ్యి నమస్కారాలు" అనుకుంటూ షాపులో నుంచి వీధిలోకి ఒకటే కుప్పిగంతు వేసి నిష్క్రమించాడు.

సతీపతుల కలహం కళ్లారా చూచిన గుంపన్నకు పెళ్లిఅంటేనే ఏవగింపుకలిగింది. పెళ్లాడితే తనస్వేచ్ఛకు భంగం అనుకున్నాడు. విచ్చలవిడిగా బ్రహ్మచారిగా వుండిపోయి జన్మాంతం చూసేద్దా మనుకున్నాడు.

ఒకనాడు బ్రహ్మచారి గుంపన్న, సాయంకాలం షైరు పోతూండగా ఊరు బయట— చిన్న అడవి ప్రదేశంలాంటిచోట, క్రిందపడివున్న ఒకచింత మొద్దుమీద, ఒక పురుషవ్యక్తి సైనికదుస్తులు వేసుకుని కూర్చొనివున్నాడు అంధుడు. దిక్కు తెలియక తలమాత్రం యిటు అటూ తిప్పుతున్నాడు.

"కళ్లులేని కబోదిని బాబయ్యా, చూడ నేత్రాలు లేవు, అమ్మల్లారా, నాజోలిలో ఒకదమ్మిడీ పడెయ్యండి బాబుల్లారా" అని తనయాచనే ఒకపాటగా చేసి ఆర్తనాదం చేస్తున్నాడు.

గుంపన్న—ఏయ్, అబ్బీ! చెయ్యిపట్టు ఒకడబ్బు వేస్తా.

వ్యక్తి—మెడలోవున్న నా జోలిలో పడేయండి బాబూ!

గుంపన్న—నీజోలి నేను అంటను. చెయ్యి పట్టు.

వ్యక్తి—రెండు చేతులూ లేవండి బాబయ్యా!

గుంపన్న—ఏమిటీ! నీచేతులు రెండూ ఏమైనాయి? (తనలో) కంఠస్వరం పరిచితమైనదానిలా గున్నదే!

వ్యక్తి—యుద్ధంలో గుండుదెబ్బలు తగిలితే, ఆస్పత్రిలో తీసి పారేశారు బాబయ్యా.

గుంపన్న—కొంపతీసి నువ్వు మావిశ్వపతిరావు కావుగదా?

వ్యక్తి—నాపేరు అదేనండీ బాబయ్యా! తమ రెవరండీ?

గుంపన్న—ఈవూర్లో గుంపన్న నెరుగుదువ్? నేను గుంపన్నని. పాపం! విశ్వం, నీస్థితి చూస్తే నాకు చాలా దుఃఖంగావుంది. ఇకను నీజీవితం ఎలాగు గడుస్తుందా అని నేనాలోచిస్తున్నాను. అప్పటిస్థితికీ ఇప్పటిస్థితికీ ఎంత వ్యత్యాసం! అద్భుతం! ఈశ్వరలీల!

విశ్వ—శ్యామల బాగుందీ?

గుంపన్న—శ్యామలకేం బంగారుతల్లిలాగుంది. ఆమె రేపో, నేడో, ఒకశిశువుకు తల్లి కాబోతుంది. నీల్లాడేప్రొద్దు లామెకు.

విశ్వ—చాలా సంతోషం. శ్యామలకు వివాహం అయిందంటే పరమ సంతోషం. వెర్రిమొగంలాగు నాకోసం ఎదురుచూస్తూ బ్రహ్మచారిణై కూర్చొకుండా!—

గుంపన్న—అలా అనుకోవడం నీ వెర్రి!—నువ్వు వెళ్లిన మూడుమాసాలకే

'భారతీ బుక్‌స్టాలు' మేనేజరు శ్రీనివాసాన్ని పెళ్లి చేసుకుంది.

విశ్వ—వాళ్లిద్దరూ సుఖంగా వున్నారు. నా కంతే చాలు!

గుం—కావలసినంతసుఖం. సుఖానికేం?

అని గుంపన్న పూరుమార్గం పట్టాడు.

"అహా! దైవసంకల్పం. ఒకప్పుడు స్ఫురద్రూపినని మురిసిపోతూండిన విశ్వపతిరావుకు అంగవైకల్యం, అంధత్వం! నాలాగు గూని వుండివుంటే తన కీ బాధ తప్పిపోనుకదా? నాగూనికి పదివేల నమస్కారములు!" ఇటువంటి ఊహలతో గుంపన్న తన యిల్లు చేరి పడకకుర్చీలో చేరబడ్డాడు.

"బాబూ! స్నానానికి వేడినీళ్లు కాగినై" అన్నది పనిమనిషి అంకమ్మ.

* * *

ప్రతిమనిషికీ ఏదో ఒకగూని—ఏదో ఒకలోపం అని మనం అనుకునేది,—ఏదో ఒక లోటుబాటు – వుంటూనే వుంటుంది. అలాంటిలోపం వుండడమే మంచిదనుకోండి. అలాంటి లోటుబాటువల్ల మన కెంతలాభం వుంటుందో మనం ఊహించలేము, నిజంగా. అది దైవేచ్ఛ. దైవం అలాటి లోపం మనలో వుంచినందుకే మనం కృతజ్ఞులమై యుండాలి. సెలవు.

(ఒక ఆంగ్లరచన ననుసరించి.)

కానుక

శ్రీ గొరావఝుల వెంకటసుబ్బరామయ్య

నీ ఉపాసకు లెంతో
నిండుసంతోషముతో
నాల్గువైపులనుంచి
పలువిధకానుకల్
అర్పింప వచ్చేరు
నీ కెంతో
నేర్పుతో ఇచ్చేరు.

నఖశిఖవర్ణనా
లంకారముల నెంతో
సొంపుతో కూర్చి నీ
అందములో లీనమై
పోతారు
నిఁ గూర్చి తపమాచరిస్తారు.

శూన్యాకాశములో
దృక్కులను పారించి
జీవతన్మయతలో
తెగిన తీగలవీణె మీటేరు
ఆమీద
మత్తుగా పాడేరు

నీలోన లీనమై
మూగగానము చేసి
లోకాని కెల్ల నీ
మత్తుమంత్రము నేర్పి
నిండుమధుపాత్రను తెస్తారు
వారు తమ
ప్రేయసిని రంజింపచేస్తారు

రసపుష్టిసామగ్రి
రహితుండనై దేవి!
కూనరాగము తీస్తు
గుడిలోకి వచ్చాను
చదువు సంధ్యలు లేవు
శాస్త్రజ్ఞానము లేదు
కల్పనాశక్తి నా
కిసుమంతయును లేదు
వట్టిచేతులతోటి వచ్చాను
ఓ దేవి!
వెంట నే నేమియుఁ తేలేదు.

చిత్రవిచిత్రముల్
చిత్రింప నేజాల
నిర్గుణోపాసనలో
నిఁ గాంచజాల
నే ననంతజ్ఞాన
శూన్యుండనౌటచే
నేర్పుతో
నేనెట్లు కవి నౌదును?

అనధికారంబుగ
అతిసాహసుండనై
నీసేవకై నేను వచ్చాను,
నాశుద్ధమానసమె
సర్వాభరణములు
నాశుద్ధహృదయమను
గతి, యతిప్రాసలతో
భక్తిపుష్పంబులను
కూర్చిమాలను గట్టి
నానిర్మలప్రేమనర్పించ-
భక్తితో
చేతులు జోడించా.

ఈనిర్ధనునివద్ద
ఇంకేదియుఁ లేదు
నాశుద్ధహృదయమే
అర్పింపవచ్చాను
ఈదీనభిక్షుని
దీనవచనంబులను
ఆలించి ప్రేమతో
ఈక్షుద్రకానుకను
గ్రహియింపుమా
లేకున్న
నీకాల నఁ తన్నునా

సోవియట్ రష్యా వ్యవసాయవిధానం

శ్రీ అకుండి వెంకటేశ్వరరావు

ఏ దేశంలో ధనధాన్యా లెక్కువగా వుంటే ఆ దేశం సాధారణంగా అన్ని విషయాలలో అభివృద్ధికరంగాను, సుక్షేమంగాను వుంటుంది. ధనధాన్యా లెక్కువగా కావాలంటే వ్యవసాయం ఎక్కువగా జరగాలి. కనుక ప్రతీ దేశంయొక్క ఆధిక్యతగాని, సంపదగాని, క్షేమంగాని, ఆ దేశంయొక్క వ్యవసాయసంపదనిబట్టి వుంటుంది. అందువల్ల ఏ దేశమైతే తన అభివృద్ధిని, సంపదని, స్వాతంత్ర్యాన్ని పెంపొందింప చేసుకోవాలని వాంఛిస్తుందో, అది మొదట దేశంలోవున్న వ్యవసాయాన్ని, తన్మూలంగా పాడిపంటలను, ఎక్కువ అభివృద్ధి చేసుకోవాలి. దేశంలో పాడిపంటల కేవిధమైన లోటు లేనినాడు, ఆ దేశం సర్వ విషయాలలో ఆధిక్యతతో అభివృద్ధి పొంది వుంటుంది. ప్రపంచంలో ఈరహస్యాన్ని పూర్తిగా గ్రహించి, దానిని సర్వవిధాలా అమలులో పెట్టి, అచిరకాలంలో సర్వ సమృద్ధిగా అభివృద్ధి పొంది, ప్రస్తుతం ప్రపంచం అంతటికీ, అన్ని విషయాలలో ఆదర్శప్రాయంగా నిలచినది సోవియట్ రష్యా. ఈ రష్యాయొక్క పూర్వాపరచరిత్రను కొంచెం చూస్తే, ఈ దేశంలో వ్యవసాయం ఏయేపద్ధతులలో, ఎంత త్వరలో అభివృద్ధి పొందినదీ, తన్మూలంగా దేశం ఎంత ఉచ్ఛదశ ననుభవిస్తున్నదీ తెలుస్తుంది.

మార్చి ౧౯౧౭ లో రష్యాలో విప్లవం ప్రారంభమయింది. జారుచక్రవర్తి మూటాముల్లె కట్టి పారిపోయాడు. దేశంలో సోషలిస్టుప్రభుత్వం స్థాపింపబడింది. కాని ౧౯౨౧ వరకుకూడా, దేశంలో దానికి తగినబలం, రక్షణ, అధికారం, లేకపోయాయి. దేశంలో అనేకచోట్ల, అంతర్యుద్ధాలు, అంతర్విప్లవాలు చెలరేగుతున్నాయి. జమీందార్లు, షాహుకార్లు, ధనికులు, ప్రభుత్వపక్షీయులు, తమ తమ పూర్వపు అధికారాలను నిలబెట్టుకోటానికి, సోషలిస్టుప్రభుత్వాన్నెలాగైనా మొదలంటు రూపుమాపాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. సోషలిస్టుసిద్ధాంతాలకు వ్యతిరేకులైన బ్రిటన్, ఫ్రాన్సు, జపాన్ మొదలైన దేశాలన్నీ, ఈతిరుగుబాటుదార్ల కనేక విధాల సహాయం చేస్తున్నారు. దీనివలన, క్రొత్తప్రభుత్వానికి, తిరుగుబాటుదార్లకు, విదేశీయసైనికులకు ఎల్లప్పుడు యుద్ధాలు జరుగుతుండేవి. ఎడతెరపిలేకుండా, దోపిళ్లు, బందిపోట్లు, ముట్టడులు, జరుగుతుండటంచేత ప్రజలు సర్వకాల సర్వావస్థలయందూ శాంతిభద్రతలులేక, ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని కాలక్షేపం చేస్తున్నారు. ఈ స్థితిలో బీదలు, కూలినాలిచేసి జీవించేవారు, వ్యవసాయదారులు, తమ దుర్భరస్థితికి, కొందరు ఆత్మహత్యలుకూడా చేసుకున్నారు.

ఇక వ్యవసాయం, పరిశ్రమలు నేలమట్టమైపోయాయి. అనేకులు తిండిలేక, మలమలమాడి మరణించారు. ప్రతివాని ముఖంలోనూ మృత్యుదేవత తాండవిస్తుం

జేది. ఇన్ని విపరీతపరిస్థితుల్లోకూడా, నూతన ప్రభుత్వంవారు జంకకుండా, ఎదుర్కొని, విద్రోహులతో అనేకయుద్ధాలుచేసి, చివరకు ౧౯౨౧-వ సంవత్సరంనాటికి అంతర్యుద్ధాలన్నింటినీ అణచివేశారు. కాని దేశంలో ఈ నాల్గుసంవత్సరాలనుంచీ పంటలుగాని, పరిశ్రమలుగాని లేకపోవటంచేత, యుద్ధానంతరం గొప్ప క్షామం సంభవించింది. తిండి తిప్పలు లేక, అనేకులు, ప్రజలుపశువులతో పాటు మరణించారు. ఈ క్షామనివారణచేసి, ప్రజలకు తిండీ నివ్వలేకపోయింది ప్రభుత్వం. ప్రజలలో నూతనప్రభుత్వం పైనికూడా అసంతృప్తి కలిగి, అనేకచోట్ల తిరుగుబాట్లు చేశారు. అప్పు డధికారంలోవున్న లెనిన్ కంగారుపడి, చేయవలసిన సాధనంకొరకు దీర్ఘంగా ఆలోచించి వెంటనే గ్రహించాడు. ౧౯౨౧లో కమ్యూనిస్టుపార్టీ ౧౦-వ సమావేశం జరిగింది. ఆసమావేశంలో, రైతుల వద్దనుంచి, ఇదివరకువలె అధికంగా ధాన్యం వసూలుచేయకూడదనీ, రైతుల నికరాదాయాన్నిబట్టి పన్నులు విధించాలనీ, మిగిలిన పంటను రైతులు తమ యిష్టానుసారం వినియోగించుకోవచ్చుననీ, వర్తకవ్యాపారాలు చేసుకోవచ్చుననీ, కొన్నిపరిస్థితుల్లో ధనిక రైతులు కూలీలను నియమించుకొని వ్యవసాయం చేయించుకోవచ్చుననీ, లెనిన్ ఒక పెద్దతీర్మానం ప్రవేశపెట్టాడు. ఈతీర్మానం పార్టీసిద్ధాంతాలకి అక్కడక్కడ విరుద్ధంగా వుందని, కొన్ని తీవ్రచర్చలు జరిగినప్పటికీ తుదకు నెగ్గింది. ఈతీర్మానాన్నిబట్టి దేశంలో వ్యవసాయం నాలుగుపద్ధతుల్లో జరగాలి.

(౧) సహకార వ్యవసాయపద్ధతి— అనగా రైతులందరూ తమతమ భూములన్నింటినీ ఏకఖండంగా వ్యవసాయంచేసి, తరువాత పంటని పంచుకుంటారు.

(౨) రైతు లందరూ కలిసి పనిచేసి తమతమ పొలాల వైశాల్యాన్నిబట్టి పంటను పంచుకుంటారు.

(3) రైతులు కలిసి పనిచేయుటయే కాక, తమతమ పనిముట్లనీ, పశువులనీ, ఏకమొత్తంగా వుపయోగించి సేద్యంచేస్తారు. దీనికి "ఆర్టెల్" అంటారు.

(౪) పంటకు సంబంధించినవే కాక, గ్రామంలో జరిగేపరిశ్రమలు మొదలైనవి కూడా సమష్టిపద్ధతిలో చేస్తారు. దీనికి "కమ్యూన్" పద్ధతి అంటారు.

కాని మొత్తం యీపద్ధతులన్నీ సమష్టి వ్యవసాయపద్ధతిలో అంతర్భాగా లన్నమాట. దీనినిబట్టి ప్రజలకు తృప్తి కలిగించటానికి వ్యవసాయాభివృద్ధి ముఖ్యమని తెలుస్తోంది. అందువలన నూతనప్రభుత్వపు దృష్టి అంతా ప్రధానంగా వ్యవసాయాభివృద్ధిమీద పడింది. దీనికి సమష్టివ్యవసాయపద్ధతి చాలా అనుకూలంగా వుందని గ్రహించి, ప్రభుత్వంవారు ఈపద్ధతిప్రకారం దేశమంతటా వ్యవసాయం చెయ్యాలని నిశ్చయించుకున్నారు. దీనికొరకు ౧౯౨౮లో మొదటి పంచవర్షప్రణాళిక నొకదానిని ప్రవేశపెట్టారు. దేశంలోని సాగుబడిభూము లన్నింటినీ సమష్టి వ్యవసాయపద్ధతిలోనికి తీసుకురావాలనేయీ ప్రణాళికయొక్క ప్రధానోద్దేశ్యం. ప్రతి సంవత్సరము, ౫-వ వంతు చొప్పున, ౫ సంవత్సరాలలో దేశములోని భూభాగాన్నంతనీ సమష్టివ్యవసాయం చేయించాలని యీ ప్రణాళిక వుద్దేశ్యం.

ప్రభుత్వశాసనప్రకారం దేశంలోని యావత్తుభూమికీ ప్రజలే అధికారులు. వ్యవసాయంచేసేరైతు లందరూ శాశ్వతంగా జిరాయితీహక్కులను కలిగివుంటారు. కొన్ని వందలుగాని, వేలుగాని ఎకరాలను ఒక క్షేత్రంగా, మొత్తం భూమినంతనీ కొన్ని క్షేత్రాలుగా భాగిస్తారు. వీటినే "కోల్ ఖోజ్" లంటారు. ఈక్షేత్రాలలో వ్యవసాయం చేయటానికి కావలసినయంత్రములు, పనిముట్లు మొదలైనవన్నీ ఉమ్మడిఆస్తిగానే పరిగణింపబడతాయి. క్షేత్రాలలో జరుగవలసిన కార్యక్రమాన్నంతనీ సంవత్సరం ముందు, రైతులే నిర్ణయించుకుంటారు. సంవత్సరాంతం, మొత్తంపంటలో కొంత భాగాన్ని ప్రభుత్వానికి పన్నుగా చెల్లించి, మిగిలినది రైతులందరూ తాము చేసినపనిని బట్టి పంచుకుంటారు. ఏయేక్షేత్రాలలో, ఏయేపంటలను, ఎంతెంత పండించాలో, ఆ భూమి సారాన్నిబట్టి, దేశంయొక్క అవసరాన్నిబట్టి, ప్రభుత్వంవారే నిర్ణయించి, ఆయాక్షేత్రాలకి తెలియచేస్తారు. ఆక్షేత్రంలో జరిగే పరిశ్రమలను ప్రజలు పైవిధంగానే పంచుకుంటారు. మొత్తానికిఆక్షేత్రంలోవున్న ప్రతిదానికి, అందులోని చిన్న పెద్ద జనులందరు భాగస్వాము లన్నమాట. ఇదికాక ప్రతికుటుంబం ౨½ ఎకరాలభూమినీ, స్వల్పంగా ఆవులు మొదలైన ఉపయుక్తమైన జంతువులను స్వయంగా, ప్రత్యేకంగా ఉంచుకోవచ్చును.

ఈపద్ధతిలో ప్రారంభంలోనే ప్రభుత్వంవా రనుకున్నదానికంటె ఎక్కువ అభివృద్ధికరంగా పని జరిగింది. మొదటి పంచవర్ష ప్రణాళిక ప్రకారం మొదటిసంవత్సరంలో [illegible] భూభాగంమాత్రమే యీపద్ధతిలోకి చేరాలి. కాని మొదటిసంవత్సరమే, మొత్తంలో ⅓ భాగం యీసమష్టిపద్ధతిలోనికి మారింది. కాని యింతభూమినీ సాగుచెయ్యటానికి కావలసిన యంత్రపరికరాలను, ప్రభుత్వంవారు సప్లయిచేయలేకపోవటమేకాక, రైతులవద్దనున్న స్వల్పపరికరాలను, జంతువులనుకూడా వారి వశంచేసుకున్నారు. అందువలన వ్యవసాయం సంతృప్తికరంగా జరుగలేదు. రైతులలో చాలా అసంతృప్తి బయలుదేరి, ప్రభుత్వాన్ని విమర్శించటం ప్రారంభించారు. ఇది అదునుగా తీసికొని, అంతకుముందునుంచీ ప్రభుత్వానికి ప్రతికూలంగావున్న జమీందారులు, పెద్దరైతులు మొదలైనవారు తిరుగుబాట్లుచేయటం ప్రారంభించారు. ఈసంగతి చూచి, స్టాలిన్, మధ్యతరగతిరైతుల నెవ్వరినీ బలవంతంగా, ఈసమష్టిపద్ధతిలోకి చేర్చకూడదనీ, ఇంతకుముందు చేరినవారిలో కూడా, ఇష్టంలేనివారు మానుకోవచ్చుననీ ఒక ఉత్తర్వుచేశాడు. అందుచేత మరుసంవత్సరంలో సగంమంది రైతు లీపద్ధతికి స్వస్తి చెప్పారు. తరువాత క్రమంగా, ప్రభుత్వం ఎక్కువ యంత్రసహాయఅభివృద్ధి చేసి, ఎక్కువ ఫలవంతంగా సాగుబడిచేయటం చేత మూడవసంవత్సరంలో సమష్టిపద్ధతిలో రైతు లనేకులు చేరటం ప్రారంభించారు. ఇదికాక, కారణాంతరాలచేత మధ్యతరగతి రైతులనుండి, ధనికరైతులనుండి బలవంతంగా భూములను తీసికొని సమష్టి వ్యవసాయపద్ధతిలోనికి చేర్చారు. ప్రతిఘటించిన వారి ననేకులను జైళ్లకు, ప్రవాసాలకు పంపించారు. అమాయికప్రజల కష్టాన్ని దోచుకొని, వారిని జీవచ్ఛవాలుగా చేసి,

కొందరుమాత్రం సర్వసౌఖ్యాల ననుభవించటం అన్యాయం అని అటువంటిదానిని నిషేధించాలని ప్రభుత్వంవారే ప్రచారం ప్రారంభించారు. జైళ్లలోను, ప్రవాసాలలోను వున్నవారిని, తమ పూర్వపుభావాలను మార్చుకొని, నూత్నభావాల ననుసరింప నిశ్చయించినట్లైతే విడిచిపెట్టి వారిని సమష్టిక్షేత్రాలలో చేర్చుకున్నారు.

ఈ నూతన విధానపు వ్యవసాయంలో పాతకాలపు పనిముట్లనే వుపయోగించినట్లైతే పని తొందరగా పూర్తికాక, తగినంత సస్యసంపద వృద్ధిపొందలేదు. అందుచేత వ్యవసాయ సంబంధమైన ప్రతిపనిని యంత్ర సహాయంతో చేయాలని ప్రభుత్వంవారు నిశ్చయించుకొని, తగిన కర్మాగారాలను నిర్మించి యంత్ర నిర్మాణం ప్రారంభించారు. మొదటి పంచవర్ష ప్రణాళికలోనే యంత్రనిర్మాణం చాలా అభివృద్ధిపొంది, రెండవ పంచవర్షప్రణాళిక ప్రారంభానికే అనేకరెట్లు అభివృద్ధి పొందింది. అనేక ఇతర రకములైన యంత్రాలనుకూడా సృష్టించి నిర్మించారు. ఇంతకుముందు దున్నటం, విత్తులు చల్లటం మొదలైన కొన్నిపనులు మాత్రమే యంత్ర సహాయంవల్ల జరుగుతూ ఉండేవి. కాని క్రమక్రమంగా కోతలు కోయడం కట్టలు కట్టడం, నూర్చడం, ఇత్యాది పనులన్నీ కూడా అతి త్వరగా చేయటానికి వీలయ్యేటట్లు, తగిన యంత్రాలను కనిపెట్టి నిర్మించారు. రెండవ పంచవర్ష ప్రణాళికలో ఈయంత్రాలన్నీ అనేకరెట్లు హెచ్చుగా తయారుచేయబడ్డాయి. మొదటి ౫సంవత్సరాలలో, అనగా ౧౯౨౮-౩౨ సంవత్సరాలలో, ౩,౬౭,౦౦౦ ట్రాక్టర్లు, ౧,౮౦౦మోటారులారీలు, ౧౬,౦౦౦ విత్తులుచల్లే యంత్రాలు, ౧౦౮వేలు కోసే యంత్రాలు (కంబైన్లు) మొదలైన యంత్రాల కోసం, మొత్తంమీద ౧,౦౮౦కోట్లరూబుల్సు ఖర్చుచేశారు. మరుసటి ౫ సంవత్సరాలలో, అనగా ౧౯౩౨-౩౭ సంవత్సరాలలో ౨,౧౯౦ కోట్ల రూబుల్సు ఖర్చుచేశారు. ఇంత విరివిగా యంత్ర సామగ్రికి ఖర్చుచేశారు కనుకనే, ఈ పది సంవత్సరాలలోనే, వ్యవసాయంలో ఎక్కువ పెట్టుబడిదారీ దేశమైన అమెరికా కంటె కూడా ఎక్కువ ఉన్నత స్థానంలోనికి వచ్చింది. ౧౯౨౯లో వ్యవసాయపుపనులన్నీ ౧౦౦ కి ౯౦ పాళ్లు సామాన్యపు పనిముట్లతో చేస్తే, ఇప్పుడు ౧౦౦ కి ౯౯ పాళ్లు యంత్ర సహాయముతో చేస్తున్నారు. తదనుగుణ్యముగా సస్యసంపద కూడా, ఆ నాటి కంటె ఈ నాడు అంత ఎక్కువగా అభివృద్ధి పొందింది. మొత్తము దేశంలో ౧౯౩౨-వసం.లో ౧,౦౩౭ కోట్ల రూబుల్సు విలువగల పంట తయారైతే ౧౯౩౭-వ సం.లో ౨,౬౧౬కోట్ల రూబుల్సు విలువగల పంట తయారయింది.

ఈ సమష్టి వ్యవసాయక్షేత్రాలను వారి భాషలో కోల్‌ఖోజు లంటారు. ఒక్కొక్క కోల్‌ఖోజ్‌లో కొన్ని వేల ఎకరాల భూమి, అనేక వేల జన సంఖ్య వుంటుంది. ఆ క్షేత్రంలో వున్న ముసిలివాళ్లు, పిల్లలు తక్క మిగిలిన ప్రతివ్యక్తీ పని చేయవలసిందే. పనిచేయగలవారి నందరినీ నాలుగు భాగాలు చేస్తారు. మొదటి రెండు భాగాలవారు కేవలం వ్యవసాయంపని చేస్తారు. ఒక భాగంపూర్తిగా కూరగాయలు, పండ్లు పండిస్తారు. ఒక భాగం పశువుల సంరక్షణ చెయ్యాలి. మొత్తం దేశంలోవున్న క్షేత్రాలన్నింటిలో కూడా సంవత్సరంలో ఏ వ

పని ఎంతెంత జరగాలో, అంతా ఒక కార్యక్రమాన్ని ప్రభుత్వము మొదటే నిర్ణయిస్తుంది. ఇది కాక ప్రతి సంవత్సరారంభములో ఆ క్షేత్రంలోని వారందరు ఒక సభ చేసుకొని, ప్రభుత్వ కార్యక్రమాన్ని జయప్రదంగా నెరవేర్చటానికి వీలుగా, వారు వేరే కొన్ని ఏర్పాట్లు చేసుకుంటారు. ఈ జనం అంతా కలిసి ఐదుగురిని కార్యనిర్వాహక సంఘంగా ఎన్నుకుంటారు. వీరిలో ఒకరు ప్రెసిడెంట్, ఒకరు వైస్ ప్రెసిడెంట్. వీరిద్దరికే జీతాలిస్తారు. వీరేమీ కాయకష్టం పడనక్కరలేదు. మిగిలిన ముగ్గురూ అందరితో పాటు కష్టపడాలి. మరొక యిద్దరిని, ప్రభుత్వంవారే గుమాస్తాలుగా నిర్ణయిస్తారు. వీరిద్దరికి జీతాలు మాత్రం ఆ క్షేత్రమే భరించాలి. ఆ క్షేత్రంలో జరిగే వ్యవసాయాలను బట్టి, ఆయా శాస్త్రాలలో నిపుణులైన వారిని కూడా ఒకరిద్దరిని పెద్ద జీతాల మీద నియమిస్తారు.

ప్రభుత్వాజ్ఞ ప్రకారం ప్రతీ క్షేత్రంలోనూ, అక్కడి పిల్లలకి కిండర్ గార్టెన్ స్కూలు వుండాలి. దీనిలో అక్కడి యావన్మంది పిల్లలు తప్పకుండా తర్ఫీదు పొందాలి. పెద్దవారి కుపయుక్తంగా ఒక క్లబ్బు వుంటుంది. వినోదార్థం సినిమాలు, నాటకశాలలు కూడా వుంటాయి. సంవత్సరం ఆఖరున పండేపంటలో, పైన చెప్పిన వాటికి, ప్రభుత్వానికి కట్టవలసిన దానికి, తదితరమైన వాటికి ఖర్చు కాగా మిగిలిన దానిని మాత్రమే ప్రజలు పంచుకుంటారు. ఏ యే వ్యక్తి ఎన్నిరోజులు, ఎన్నిగంటలు పని చేశాడో లెక్కకట్టి ఆ లెక్కప్రకారం పంచుకుంటారు. ప్రతీ క్షేత్రంలోని పంటను ప్రభుత్వంవారే ఇన్‌స్యూర్ చేస్తారు. అందుచేత ఒకవేళ ఎప్పుడైనా పంటలు చెడిపోయినా, ఆ సంవత్సరం ప్రజలు పస్తుం డక్కర్లేదు. ఆయా క్షేత్రాల్లో వుండే ఫ్యాక్టరీలవల్ల, తదితర పరిశ్రమలవల్ల వచ్చే రాబడికూడా ప్రజలదే.

చిన్న క్షేత్రంలో ఒకసంవత్సరపు ఉత్పత్తివ్యయాల సంఖ్యలనుబట్టి, ఈ క్రొత్త పద్ధతి ప్రజల కేవిధంగా లాభదాయకమైనదీ తెలుస్తుంది. ఏ క్షేత్రంలోనూ సాధారణంగా ౫౦౦ ఎకరాలకు తక్కువ భూమి వుండదు. దీనిలో ౧౨౫ ఎకరాలలో బంగాళా దుంపలను, ౧౦౦ ఎకరాలలో రకరకాల ఫలవృక్షములను, ౧౨౫ ఎకరాలలో గోధుమలను, ౫౦ ఎకరాలలో కూరగాయలను, పండిస్తారు. ఈ పంటలు క్షేత్రములోని భూసారాన్ని బట్టి మారుతుంటాయి. పైన చెప్పిన చిన్న క్షేత్రంలో సంవత్సరములో రోజుకి ౧౫ రూబుల్సును, (అనగా ౨౫ రూపాయలు) ౮౦ పీశెలు పళ్లు కూరగాయలు, మొదలైనవి ముడతాయి. ఇటువంటి చిన్న చిన్న క్షేత్రాలలో వారు యంత్రాలను కొనుక్కో లేక పోతే, ప్రభుత్వం వారు వారికి అద్దెకిచ్చి, సంవత్సరాంతంలో వచ్చిన పంటను బట్టి అద్దె తీసుకుంటారు. అంతకు ముందు, అనగా ౩౦ సంవత్సరాల క్రిందట ౧౦ ఎకరాలున్న భూఖామందుకు సంవత్సరానికి ౧౫ మణుగుల గోధుమలు, 3 మణుగుల బార్లీగింజలు, ౪ మణుగుల ఓట్లు, పంట పండేది. దీనిలో పశువులకూ, తదితరమైన వాటికీ, ప్రభుత్వం పన్నుకూ ఖర్చుపోగా ఇంకమిగిలేదే కాదు.

ఇప్పుడో — మొత్తం రష్యా అంతలో భూమిఖామందనీ, రైతనీ వివక్షత లేదు.

అంతా రైతులే, అంతా కూలీలే అంతా అధి కారులే. నాభూమి, నాపంట, నాఆవు అనేది, పోయి, మనభూమి, మనపంట, మనఆవు అని చెప్పుకుంటారు. మొదటి సంవత్సరాల్లో కొంతమంది భూఖామందులు చాలఅసంతృప్తి పడ్డారు. కాని క్రమక్రమంగా, సమష్టిపద్ధతి లోని లాభాన్ని గ్రహించి, అందరూ ఈ పద్ధతిని ఆమోదించారు. ఇప్పుడు రష్యాలో ౧౦౦కి ౯౯త్తి ఎకరాలు సమిష్టి వ్యవసాయ పద్ధతిలోనే వున్నాయి. దేశంలో ప్రజలంతా హెచ్చుతగ్గులు లేకుండా, సర్వసమత్వమైన సోదర భావాలతో, సంతృప్తిగా భోజనం, సిరి సంపదలతో తులతూగుతున్నారు.

వర్షాసంధ్య

శ్రీ పి. గణపతి శాస్త్రి

నీలాభ్రసాంద్రవియదంతర మెల్లెడ న్నా
డేలో! వలాహకజలాశ్రులవృష్టి గ్రమ్మెన్ ;
కాలాంతవేళవరకుం గగనమ్ము వర్షా
జాలమ్ములే యలమునో ! యనిపించెనాలో !

సాయంతనారుణిమ గ్రమ్మిన సాంధ్యధారా
తోయమ్ములం దొలికెఁ గుంకుమరాగశోభల్ ;
గోదావరీసలిలఘోషలలో బలాకా
నాదమ్ములో, పిలుపులో, వినిపించె నేవో !

వీథుల్ మనుష్యరహితమ్ములు; జాలులై వ
ర్షాధార లంత గనుచీకటిఁ బ్రాకిపోయెన్ ;
పాథోలవమ్ములు గృహమ్ముల జారె నందం
దారానముల్ శ్రుతులకింపులు గొల్పెలోలో!

ధూమమ్ములుం గృహములం దెగిరెన్నభోగా
యన్మాకృతమ్ములఁ జలించుచు వక్రరీతిన్ ;
భూమిం గడుం బరువిడెం నవమేఘబృంద
శ్యామాకృతుల్ విశదవారితలమ్ములందున్.

నీపమ్ములం బరిమళమ్ముల మంచిముత్యా
లై, పూలు సెజ్జలుగ రాలెను మెల్ల మెల్లన్ ;
సంపూర్ణసుందరములై తెలిచంద్రకాంతా
లుం బూవుల స్మెరయు దీపికలై జ్వలించెన్.

ఆరమ్యవేళఁ దమవత్సలు పాలు ద్రావన్
ద్వారమ్ములం దజములు న్నయనించి నిద్రా
భారార్ధసంకుచితదృష్టుల మందరోమం
థారంభముల్ నెరపుచు న్గదలించె నోరుల్.

ఆసాంధ్యసుందరత, ఆచలవారివాహా
భాసమ్ములుం, గనులలో యమునానదీనం
కాశమ్ములై, బరువులై, ప్రవహింప, దూరా
కాశమ్ము, నీలహిమశైలమువోలె నిల్చెన్.

ఆవేళ నా హృదయమే, సకలప్రపంచ
మ్మై, వార్షమేఘములె గ్రమ్మినరీతి దోచెఁ
ఆవారిధారల విసంజియు వెల్గుల న్నా
లో, వానకాల్వలవిధమ్మున మ్రోగి నిండెన్.

ఆచారుతామధుమదమ్మున సంతసంతం
దోచెం గతమ్ములు బురాతన నీలవర్షా
రోచిర్విలాసములు; నాచలవారిధారా
వీచీభుజంగమగతమ్ముల వక్రరేఖల్

అందందు బాలికలు నీథుల నాడ సంధ్యా
సౌందర్యముల్, మరలరాని తదీయహాసా
నందమ్ము లాలలిత బాల్యవిలాసమాయా
చందమ్ములై, మెరసి నెమ్మదిలో వెలింగెన్ ;

ఆశావిహంగముల కందనియాపురావ
ర్షాసుందరాకృతుల నీక్షణవారి ధారా
ఘోషమ్ములం, గనుల కందని భావినీలా
శాశోభలం, దలఁచి నాహృది నిశ్వసించెన్

"ఎందో మరెన్ని దివసమ్ములకో గదా! నా
డెందమ్ము లోచనములం బ్రతిబింబితమ్మా
సౌందర్యధార, బ్రవహించినదారి నే యా
నందైకవార్ధిమునుంగు మహోత్సవమ్మున్"

చెకోస్లోవేకియాలో జర్మనీ యుగచాట్లు

శ్రీ ఎస్. జగన్నాథ్

"దేశమంటే మన్ను కాదోయ్
దేశమంటే మనుషులోయ్."

అయితే ఈరోజుల యుద్ధతత్వంబట్టి దేశమంతా మన్ను అనే లెక్కకిందే చలామణీ అవుతోంది. శత్రుసైన్యాలకు రెంటికీ మధ్య కొంత ఖాలీస్థలము—ఎవరు పోట్లాడి ఆక్రమించుకున్న స్థలము వారు నిలబెట్టుకుని సంరక్షించుకొన్నన్నాళ్లు వాళ్లకి చెందినట్లు.

యుద్ధమంతా అయిపోయి ఏదో ఒక ప్రభుత్వము నిలచినప్పుడు ఆ స్థలము ఉపయోగించేటట్లు చేయడానికి జనులు కావలసివస్తారు.

చెకోస్లోవేకియాను హిట్లరు ఏమీ యుద్ధము చేయకుండానే వశపరచుకున్నాడు. ఆ దేశపు సరిహద్దులలో ఉన్న నేల ధనకనక నిక్షేప వస్తు వాహనాలతో సహా జర్మనీది. కాని అందులో ప్రజలుమాత్రం జర్మనుప్రభుత్వాన్ని సవతితల్లిలా ఆదరిస్తున్నారు. ఎక్కువగా ఎదిరించరు—కొడుతుందనీ—చెప్పిన పనులన్నీ చేస్తూనే ఉంటారు—నోరెత్తరు.

అయినా జర్మనీకిమాత్రం వాళ్లు చూచే చూపులో గల అర్థం హృదయంలో గుచ్చుకుపోతోంది. ఒక్కొక్కప్పుడు కోపం పట్టలేక ఏదో ఒకమిషతో డజనులకొద్దీ జనాన్ని చంపిస్తూంది—మిగిలినవాళ్లకు బుద్ధిచెప్పడానికి. బ్రతికిఉన్న మిగిలిన ప్రజలు నోట్లో గుడ్డలుకుక్కుకుని తడికళ్లతో తమరు చేయవలసిన దాన్నిగురించి తీర్మానాలకు వస్తున్నారు.

ఆ అన్నితీర్మానాలకూ ఒకటేసూత్రము—జర్మనీని ఎలాగ వేధించటమా అని—ప్రతిక్షణమూ, ఇష్టంలేని మొగుడుతో కాపరం చేసినట్లుంది ప్రతిమనిషికీ.

జర్మనీకి చెకోస్లోవేకియాను ఆక్రమించుకోవటంలో ముఖ్య ఉద్దేశ్యము ఆ దేశంలో ఉన్న అతి విలువగల యుద్ధసామగ్రి చేసే యంత్రాలనూ—మరికొన్ని చిన్నచిన్న పరికరాలు చేసే యంత్రాలనూ ఉపయోగించుకుందామనీ; ఊహా పైగా చెకోస్లోవేకియాలో పాడిపంటలు జర్మనుసైన్యానికి పనికివస్తాయనిన్నీ.

ఈ విషయాలు మిగతా ప్రపంచకానికి తెలిసినట్లే ఆ దేశపు ప్రజకుకూడా బాగా తెలుసు. అందులోనూ యుద్ధము చేయకుండా ఆక్రమించుకొన్న రాజ్యంగనుక ఆ దేశపు ప్రజలో ఆట్టే నష్టంలేకుండా ప్రాణాలతోనూ పాడిపంటలతోనూ చాలమంది అలాగే ఉన్నారు—ఆ ఫ్యాక్టరీలన్నీ అలాగే

పనిచేస్తున్నాయి. మానేజర్లుమాత్రము జర్మనులు వచ్చారు. ఎంత యుద్ధం చేయకపోయినా జర్మను ప్రభుత్వము చెకోస్లోవాకియాకు దుర్వాసాతిథ్యమే.

అందుచేత ఎవరిమట్టుకువారు ఈచూరు పట్టుకువేళ్లాడే ప్రభుత్వాన్ని విసిగించటానికి ప్రయత్నిస్తున్నారు.

యుద్ధసామాగ్రిచేసే ఫ్యాక్టరీలలో వందలకొద్ది పనివాళ్లు, ఏళ్ల తరబడిని అలవాటయి పనిచేసినవాళ్లు. కాని పై అధికార్లుమాత్రం జర్మనులు — అధికార్లున్నంతసేపూ పని అంతా సవ్యంగానే ఉంటుంది. జర్మనీకోసమని ఒక పెద్దఫిరంగి చేస్తున్నారు ఒకసారి. అది పోతపోసినతరువాత చల్లారడము రోజుల కొద్దీ చల్లారుతుంది. అందులో ఒక రోజున ఒక పనిచేసే అతను. కాఫీ త్రాగేటైములో పై అధికారులు లేకుండా చూసి కాస్త కాఫీ దానిలో పోశేశాడు. అప్పటిమట్టుకు ఏమీ తెలియదు. అయితే, ఫిరంగి తయారయి జర్మనీకి వెళ్లి ఒకగుండు వేయడానికి ఉపయోగించినతరువాత మూలబడుతుంది ఫిరంగి — బీటవేసి ఊరుకుంటుంది. అలాగే అనేకవిధాల కోట్లకొద్ది డబ్బుపోసి నెలలకొద్దీ కష్టపడి ఎంతోఆశతో ఒకసామాను చేయించుకోవడం — చివరకి ఇష్టంలేని ప్రజలను ప్రక్కలో బల్లెంలాగా ఉండి చేయించుకున్న అంతపనీ వ్యర్థమయిపోవడం.

మరోపనిమనిషి ఎవరూ లేని సమయం చూసి మరలో పోసే నూనెలో కాస్త పంచదారకూడా కలిపి పోశేశాడు. ఏదో నాలుగు రోజులు పోయినతరువాత యంత్రంలో ఏదో ఒకకీలు బిగిసిపోయి ఊరుకుంటుంది. యంత్రం ఆగిపోవడం. అంతా విప్పడం — నాలుగురోజులు పని జరగకపోవడం — ఏ నిమిషానికానిమిషం పని, కొత్తసామగ్రి కావలసి వచ్చిన సమయంలో ఇంత ఆలస్యం —

ఒక్క యంత్రాల్లోనేకాదు ప్రతిచోటా అంతే - చెకోదేశస్థులంతా ఒక కట్టు — జర్మనులను విసిగించడమే వాళ్లకు ముఖ్యము — ఏదేనా కొట్లోకి జర్మనుమనిషి వచ్చినప్పుడు అతనికి కావలసిన వస్తు వుండదు — అక్కడే అయిపోతుంది. — లేకపోతే అమ్మే అతనికి కొనే అతనిభాష తెలియదు — ఆ కాస్సేపయినా.

హాయిగా పాడిపంటలూ ఉన్న రైతయినా జర్మనీకి వెన్నపంపించమని ఆర్డరు రాగానే — పితికినపాలు పందులకి పోసేసి — ఏవో సాకులు చెపుతాడు.

ఏ పనిచేస్తూన్నవ్యక్తి అయినా సరే అవలంబించ తగినట్లు ఈవిసిగింపుసూత్రాలు అచ్చేసినవి, ఇంటింటా పోస్టుబంట్రోతులే పంచిపెడుతూంటారు.

సోదాచేయడానికి వచ్చేముందు ఇంటివాళ్లకి కబురు వస్తుంది లోపాయికారీని. పోలీసు లంతా ఆ దేశస్థులేగా.

హోటళ్లలోకివెళ్లి ఎంతసేపో కూర్చుంటే కాని ఒక బట్లరూ రాడు జర్మనులున్న బల్లదగ్గిరకి.

ప్రతి జర్మనుకూ దినదినగండం — పట్టరానంత ఉడుకుబోతుతనం - కడుపుమంట.

ఏదో అన్నికష్టాలకూ ఓర్చిఉన్న జర్మనులకూ ఉన్నఫలం లేదు-ఏదో కష్టపడి కన్నులు కాయలు గాసేలాగు కాపు కాచి చేసినపని

ముల్లు జాగ్రత్తగా బంగీలుకట్టి జర్మనీకి పంపిస్తారు—"జాగ్రత్త గాజుపనిముట్లు" అని అన్నిచోట్లా కాగితాలంటించి. అంత కష్టపడినా ఫ్యాక్టరీలో తప్పఎడ్రసైనా అంటిస్తారు, కూలీలయినా ఎక్కడో అక్కడ ఎత్తిపడేస్తారు— జర్మనీలో అక్కడలేని వాళ్లింట్లోకి వెళ్లి విరిగిపోయినసామాను చేరుతుంది నిక్కచ్చిగా.

క్రొత్తగా వచ్చిన ప్రభుత్వముమీద అయిష్ట మిలా ఉంటూనే ఉంటుంది— కాస్త ప్రజలకు నచ్చేలాగు, బాగా నాటేలాగు ప్రచారము చేస్తే జర్మనుప్రభుత్వముమీద ఇష్ట మేర్పడుతుం దనుకుని — "జర్మను సామ్రాజ్యము ప్రపంచకములోకంతా గొప్ప ప్రభుత్వము" అని ఒక ఫిలిము పంపించారు- దాన్ని చెకోస్లొవాకియాలో ప్రదర్శించేటప్పుడు ఆ సినీమా మానేజరు—

"ప్రపంచకములో కంతా గొప్ప ప్రభుత్వము" అన్నమాటల తరువాత వాళ్ల భాషలో "కొద్దిరోజులు మాత్రమే" అని అతికించాడు. జనమంతా ఒకటే చప్పట్లా-అల్లరీని.

హోటల్లో ఒక జర్మను అధికారి కూర్చుని ఉంటే ఎవరో చేక్ దేశస్థుడు వచ్చి- ఒక గ్లాసుసారా ఇచ్చి ఏదో తనభాషలో పెద్ద ఉపన్యాసమిచ్చి త్రాగమన్నాడు — ఏదో జర్మనీ, హిట్లరు అని పేర్లు గుర్తుపట్టి జర్మను అధికారి తమకు ఆతిథ్య మను కున్నాడు.

అయితే ఆభాష తెలిసిన ఆ దేశీయులందరికీ తెలుసు 'జర్మనీయొక్క శీఘ్రపతనము కోరుతూ ఈ పానీయము పుచ్చుకో' అని ఆ దేశస్థు డనటం.

ఇంతకీ చేకోదేశస్థులు పెద్ద అసహాయనిరాకరణం అని పేరుపెట్టుకోలేదు, పెద్ద గొడవచేయలేదు. ఎవరిమట్టుకు వారు —-ఉదాసీనభక్తిలాగు— దేశ మంటే ప్రజలు గనుక ఈ ప్రజల కిష్టంలేని ప్రభుత్వం ఎలా సాగుతుందో చూద్దామని అన్నివిధాలా అడ్డుతగులుతున్నారు.

వందలకొద్దీ జనులను కాల్చేసి చంపేసినా దేశములో పోకడ అలాగేఉంది. "ఉత్త మూర్ఖులు" అన్నాడట ఒక జర్మను వర్తకుడు ఆ దేశస్థులను.

వాళ్ల గుమ్మంలోకి వచ్చినదొంగను తరిమివేయలేకపోయినా, తమసరుకు తీసుకొనిపోనీయకపోవడమే వాళ్లమూర్ఖత.

ప్రజలను కాదని వచ్చిన ప్రభుత్వము ప్రజలు లేని దేశముతో ఏమి చేయగల దని వాళ్లనమ్మకము.

ఆధునిక ఆర్థిక జీవనము:
ప్రభుత్వము, బ్యాంకింగు

శ్రీ బులుసు వేంకటేశ్వరులు

ఆధునిక ఆర్థిక ఔన్నత్యమునకు ముఖ్యకారణములు ప్రభుత్వకృషి, బ్యాంకింగు దినదినాభివృద్ధి, వివిధ విద్యావ్యాప్తి యని వెనుక నొకవ్యాసములో పేర్కొని యున్నాను. ఈ వ్యాసమున మొదటి రెండువిషయములను పరిశీలింతము.

ప్రభుత్వకృషి

ప్రభుత్వము: పరిశ్రమలు

ఇతర దేశములనుండి, ఒక దేశమునకు దిగుమతి యగు సరకులపై సుంకములను విధించి కాని, ఆదేశమునందే తయారగువస్తువుల నాదరించి కాని, అనర్థదాయకమగు పోటీనుండి స్వదేశ పరిశ్రమలను సంరక్షింప నేటి ప్రభుత్వ మెంతయో ప్రయత్నించుచున్నది. మఱియు, స్వదేశ పరిశ్రమలపై విదేశీయుల కే యధికారమును లేకుండునట్లుగా కూడ నేటి ప్రభుత్వము చేయుచున్నది. ఈ విషయమున టర్కీ రాజ్యము నుదాహరణగా గ్రహింపవచ్చును. టర్కీ దేశమునందలి రైలు మార్గములందును, బ్యాంకులు, నౌకాపరిశ్రమలందును విదేశీయుల కేస్వాతంత్ర్యమును లేకుండ ఆదేశము చేసివైచినది. ఇట్లని, ఒక దేశస్థులకు చేతకాని విషయములలోఁగూడ విదేశీయుల కధికార మీయవల దన్న భావ మిందు లేదు. ఏలయన, చక్కనినైపుణ్యముగల విదేశీయుల సహాయము, ఆవశ్యక మైనపుడు అపేక్షించుచునే యుండవలయును. ఆధునిక వ్యవసాయ పరిశ్రమ యందును, బ్యాంకింగుపరిశ్రమలందును జపాను దేశము విదేశీయులసహాయమును పొందుట కెన్నఁడును వెనుకంజ వేసియుండలేదు. అదియే, ఆ దేశము పారిశ్రామికముగా బాగుపడుటకు కారణమైనది.

ఇంకను, రష్యాప్రభుత్వము పైతము, స్వయం సహాయము, నిరౌన్నత్యము నభిలషించుచుండియు, ఆ దేశమున నుపకరించు అంతర్జాతీయ వర్తకమున విదేశ కంపెనీల సహాయ మర్థించినది. కాని, మహాయుద్ధానంతరము, అభివృద్ధికాంచిన ఇటలీనౌకానిర్మాణ పరిశ్రమ ముస్సోలినీప్రభుత్వమునకే చెందియున్నది.

రష్యా, జపాను మొదలగు దేశము లందలి పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వమే ప్రధాన కారణము. కేంద్రీకృతమైన రష్యా ప్రభుత్వమే ఆదేశము త్వరలో పారిశ్రామిక మగుటకు కారణభూతము. పందొమ్మిదవ శతాబ్దాంతమువఱకు అంతర్జాతీయ సంస్థయందు స్థానమే లేని జపానుదేశము ౧౯౦౫ లో జరిగిన రష్యా జపాను యుద్ధముతో, గొప్పస్థాన మాక్రమింప గలిగినది. దీనికి కారణము ౧౮౬౮-వ సంవత్సరమునుండి జపానుప్రభుత్వము ఆధునిక సంస్కారణములను అమలునఁ బెట్టుటకు ప్రారంభించుటయే. జపానున కాధునికత్వ మెట్లబ్బెను? కాప్రభుత్వ మేమేమి యొనరించినదో మనము చూడవలసియున్నది.

దీనికి జపానుప్రభుత్వము చేసినపనులు ముఖ్యముగా మూఁడు. (౧) స్వల్పమగు నియమితకాలమునకే నేర్పరులగు విదేశస్థులను దేశమున చేర్చుకొనుట (౨) అమెరికా మొదలగు గొప్పగొప్ప దేశములకు క్రమశిక్షణ పొందివచ్చుటకై, విద్యార్థులను, ఉద్యోగులను ఉపకారవేతనము లొసగి, పంపుట (౩) నూతనపరిశ్రమలను స్థాపించి,అవి బాగుపడుచున్న స్థితిలో ప్రత్యేకవ్యక్తులకు వాని నొసఁగుట—ప్రభుత్వము ఈ సహాయములనుచేసి, పారిశ్రామికాభివృద్ధి కెంతయు తోడ్పడినది.

2. ప్రభుత్వము : వ్యవసాయము

వ్యవసాయము నభివృద్ధిపరచుటకై నేటిదొరతనము అనేకవిధముల ప్రయత్నించుచున్నది. వివిధములగు భూమిచట్టముల ప్రవేశపెట్టి, భూస్వాములభూములను వారినుండి తీసికొని వ్యవసాయదారులకు పంచిపెట్టుచుండుట మనము చూడనగును. దీని కుదాహరణము జర్మనీ, డెన్మార్కు, గ్రేటుబ్రిటను మొదలగు దేశములను తీసికొనవచ్చును. తరువాత ఫ్రాన్సుదేశము నందువలె విద్యుచ్ఛక్తి పల్లెపల్లెలకును సరఫరాచేసి, దాని యుపయోగమును పల్లెలవారుకూడ పొందునట్లు ప్రభుత్వము చేయుచున్నది. జపానుదేశమున, ఆధునికములగు వ్యవసాయ సౌలభ్యములను ప్రతిరైతునకును బోధించుటకు కొన్నిస్థలములు ఏర్పాటుచేయఁబడినవి. మఱియు, వ్యావసాయిక విద్యాపాఠశాలలు కళాశాలలు మొదలగువానికిని, సామాన్య వ్యవసాయదారునకును సామరస్యము కలిగించునేర్పాట్లను గ్రేటుబ్రిటను నందలి ప్రభుత్వము చేయుచున్నది. ఇంకను, దరిద్రులగు వ్యవసాయదారులకు, సహకారసంఘములను స్థాపించికాని, మఱియేవిధముననైనఁగాని, తగిన ఆర్థిక సాహాయ్యమును నేటి ఫ్రాన్సు, బల్గేరియా, గ్రేటుబ్రిటను మొదలగుదేశములు చేయుచున్నవి. వ్యవసాయదారులచే తయారుచేయఁబడిన ముడిపదార్థములనే ముఖ్యముగా వాడుచు తద్ద్వారా సేద్యకాండ్రకు సహాయముచేయుట, హంగేరీ మొదలగుదేశములఁ గాననగును. అంతేకాక, వ్యవసాయపరిశీలనము చేసియు, వ్యావసాయికజ్ఞానమును ఇతరదేశములనుండి గ్రహించియు నేటిప్రభుత్వములు వ్యవసాయాభివృద్ధికిఁ దగిన పనులు చేయుచున్నవి.

3. ప్రభుత్వము : వర్తకము

వివిధములగువస్తువులను తయారుచేసినవారికి, వేతనములు, బహుమతులు నొసఁగియు, వస్తువులను తయారుచేయువారికిని, ఇతరదేశములకు ఎగుమతిచేయువారికిని కావలసినధనము బదు లిచ్చియు, ఆధునికప్రభుత్వము వ్యాపారమును పెంపొందించుచున్నది. పారిశ్రామికవస్తువులనేకాక, వ్యావసాయికపదార్థములను సైతము అధికముగా నితరదేశములకు ఎగుమతిచేయు సౌకర్యములను నేటిప్రభుత్వ మధికముచేయుచున్నది. హంగేరీదేశమున వ్యావసాయికవస్తువులను ఎగుమతిచేయుట చక్కఁగా నేర్చినది. కాని, ఏదేశములో తయారైన వస్తువులు ఆదేశమునఁ గల ప్రజల కనీసపుకోరికలను తీర్పఁగలిగినపిదపనే యితరదేశములకు ఎగుమతి చేయఁబడుచున్నవి. పోలండుదేశమున తలసరికి ఆవశ్యకమైన పంచదార ౧౬ పౌనులుగా లెక్కింపఁబడినది. ఈ విధముగా మొత్తము ప్రజలకు సరిపోఁగా మిగిలిన పంచదారనే ఆదేశము ఎగుమతి చేయుచువచ్చినది.

ఇదిగాక, నేఁడు ప్రతిదేశమందును వివిధములగు వస్తుప్రదర్శనములను (Exhibitions) గాంచుచున్నాము. వీనిని గ్రామ, జాతీయ, అంతర్జాతీయ ప్రదర్శనములని మూఁడువిధములుగా విభజింపవచ్చును. నేఁడు మనదేశమున జరగు స్వదేశీప్రదర్శనము లెంతయు వర్తకాభివృద్ధి కుపకరించుచున్నవి. ఏలయన, ఈ ప్రదర్శనములవలన వేలకొలఁదివర్తకులు, విక్రేతలు, ప్రజలు తమకుఁగల వస్తువుల నమ్ముటయు, వారివారికి కావలసినవానిని కొనుటయు జరగుచున్నది.

ఇంతకన్నను, వర్తకాభివృద్ధికి ప్రధానమైనది ధనవృద్ధి. ఈపని నేటిబ్యాంకులు చేయుచున్నవి. సాధారణముగా అనేకదేశములం దిట్టిబ్యాంకులు ప్రభుత్వాధీనమునందే యున్నవి. ఈ రీతిగా, ప్రభుత్వము వర్తకాభివృద్ధికిఁ దోడ్పడుచున్నది.

౪. ప్రభుత్వము : ప్రత్యేకవ్యక్తుల నైపుణ్యము

దేశమునందు శాంతి, క్రమశిక్షణ పెంపొందించుటయే ప్రభుత్వకర్తవ్యము కాదు. దేశముయొక్క సాంఘికసంస్థలు, సేవాధర్మముపై నాధారపడియుండునట్లును ప్రభుత్వము చూచుచున్నది. ఈ ప్రభుత్వపు సాంఘికసేవాధర్మము ముఖ్యమైనది, అధికవ్యాప్తమైనదియు ప్రశంసాపాత్రమును.

అనేకవిధములుగా ప్రతివ్యక్తియు ఉపయోగకరములగు వస్తువులను సృజింపఁగలుగు నేర్పాటులను ఆధునికప్రభుత్వము లవలంబించుచున్నవి. అందుచే

ప్రత్యేకవ్యక్తుల నైపుణ్యమునకు ఆటంకము కలుగఁ జేయువాని నన్నిటిని ప్రభుత్వము త్రోసివేయుచున్నది.

ఈ విషయమున జర్మనీదేశ మెన్నిక గాంచిన దనవచ్చును. ఏల యన, జర్మనీదేశమే పారిశ్రామిక భీమావ్యాపారమునకు ముందంజవేసినది. పందొమ్మిదవ శతాబ్దాంతమునకే, జర్మనీప్రభుత్వభీమాపద్ధతి నలుగడల వ్యాపించినది. ఈ భీమా మూఁడువిధములుగా నున్నది. (౧) వ్యాధులకు భీమా (౨) ప్రమాదములకు భీమా (౩) అంగవైకల్యమునకు భీమా. ఇందు, వ్యాధినివారణ భీమాకు మూఁడువంతులలో రెండువంతులు ప్రభుత్వమును, మూఁడువంతులలో నొకవంతు కూలివాండ్రును ఖర్చులను భరించుచున్నారు. మిగిలినవానికిని ప్రభుత్వము ఒకభాగము భరించుచునే యున్నది.

దీనికి ఫలితముగా ౧౫,౨౦ సంవత్సరములలోనే జర్మనీదేశమున,౧౧,౫౦౦,౦౦౦ ప్రజలు మొదటితరగతిలోను, ౧౭,౩౩౦,౦౦౦ రెండవతరగతిలోను, ౧౭,౪౫౦,౦౦౦ లు మూఁడవతరగతిలోను భీమాచేసియున్నారు.

జర్మనీదేశమునందలి పారిశ్రామిక భీమాపద్ధతిని గూర్చి వినయకుమారసర్కారు ఈ క్రిందివిధమున వ్రాసియున్నారు. "జర్మనీదేశము జీవితము, ఆరోగ్యము సంరక్షించు విషయములో మిగిలిన దేశములకుఁ దలమానికముగా నున్నదనుటకు కారణము ఈపారిశ్రామిక భీమాపద్ధతియే. ఈపారిశ్రామిక భీమాచట్టములే జర్మను జాతీయఔన్నత్యమునకు ప్రధాన కారణము"

ఈ పారిశ్రామిక భీమాపద్ధతిఁ బ్రవేశపెట్టినది మొదట గ్రేటుబ్రిటనునందు లాయడుజార్జి. (౧౯౦౮-౧౯౧౧) ఈపద్ధతియందు, వార్ధక్యవేతనము, కనీసపుకూలి, జాతీయభీమా అనునవి ముఖ్యముగా కూడియున్నవి. ఇంతేకాక, వివిధములగు కర్మాగారశాసనములు నేటి కార్మికులను, స్త్రీలను, బాలురను సంరక్షించుటకుఁగాను ఏర్పడియున్నవి. ఈరీతి ఇటలీ మొదలగు ప్రభుత్వములు ఆరోగ్యభాగ్యము, వ్యక్తినైపుణ్యమును అభివృద్ధిపరచుచున్నవి.

బ్యాంకింగు: లేక పరపతిసంఘములు

అభివృద్ధిచెందిన ప్రతిదేశమందును బ్యాంకింగుపద్ధతి చాల ముందంజవేసియున్నది. జర్మనీ, ఫ్రాన్సుదేశములందును, ఇతరదేశములందునుకూడ, పందొమ్మిదవశతాబ్దముననే ఈపద్ధతి పూర్తిగా నాటుకొని, వ్రేళ్లుపారినది.

ఆధునిక ప్రపంచమునందలి బ్యాంకింగుపద్ధతులు వివిధములుగా నున్నవి. కొన్నివిషయములలో, బ్యాంకింగు సంస్థలు ప్రభుత్వ స్వాధీనమునం దున్నవి; మఱికొన్ని దేశములలో బ్యాంకులు ప్రభుత్వసంస్థలే. కొన్నిదేశములలో గొప్ప కేంద్ర పరపతిసంఘములు గలవు. ఇతరము లగు చిన్నపరపతిసంఘములు దీనిపై నాధారపడియుండును; మఱికొన్ని దేశములలో ఒకే పెద్దపరపతిసంఘమునకు అనేకములగు నుపసంఘములు ఉండును. ఇవియేగాక, అనేకవిషయములలో భిన్నభిన్నములుగా నుండు పరపతిసంఘములు వివిధదేశములం దున్నవి.

కాని, అన్ని పరపతిసంఘముల ప్రధాన ఆశయము, ప్రధానకర్తవ్యము నొకటే. దేశముయొక్క ఆర్థికసామగ్రిని ప్రోవుచేయుటయు, వినియోగించుటయు పరపతిసంఘములపని. జాతియొక్క విత్తమును సరియగు వినియోగమునకు తెచ్చుటయు, ఈధనము బహురూపములఁ గాగితములు, చెక్కులు, మొదలగునోట్ల మూలమున, ద్విగుణీకృతము, త్రిగుణీకృతముచేయుటయు, ఈవిధముగా నభివృద్ధినందు ధనమును వర్తకాభివృద్ధికి, పారిశ్రామిక ఔన్నత్యమునకు వ్యయపరచుటయు జరుగును. అందుచే, నేటిదేశములలో వివిధకర్మాగారములకు, వర్తకవ్యాపారములకు,వస్తువుల తయారు చేయుటకు, ధనమును సమకూర్చుటయే ఆధునిక పరపతి సంఘములు చేయుపని. ఈపరపతి సంఘాభివృద్ధిపైననే జర్మనీయొక్క పారిశ్రామిక, వర్త అభి వృద్ధి ఆధారపడియున్నదని తెలిసికొనవలసియున్నది.

జపానుదేశీయులు తమజాతీయ భాగ్యాభివృద్ధికి, పరపతి సంఘముల (Banks) ఆధిక్యమును

గ్రహించి ౧౮౮౦-వ సంవత్సరములో నొక అంతర్జాతీయ సంస్థను యోకొహామాయందు స్థాపించిరి. ఇరువదవశతాబ్దారంభము నందే, వ్యావసాయిక, వర్తకాభివృద్ధికై మఱికొన్ని బ్యాంకులను సంస్థాపించిరి. అప్పు తీసికొనువాఁడు మోసగించినను, తిరిగి యిచ్చివేయఁగలఁడని నమ్మకమున్నప్పుడు తప్పక పత్రము లేకనే ఋణమునొసఁగు చుండుటచే, త్వరలో నివి యెంతయో వ్యాప్తి నందినవి.

పరిశ్రమ, వర్తకముల అభివృద్ధితోపాటు బ్యాంకులును పెరుగఁ జొచ్చినవి. క్రమక్రమముగా ఈ బ్యాంకులలో ఐక్యనిధి (**Joint stock**) సూత్రము ప్రవేశించినది. ఇదివఱలో పేర్కొన్న ట్రస్టీషిప్ కూడ, బ్యాంకు ప్రపంచమున చెలరేగఁ జొచ్చినది. వివిధములగు బ్యాంకుసంస్థల కలయిక (**Amalgamation**) కూడ ఈ సూత్రముపైననే ప్రారంభమైనది. ఇంతలో, అంతర్జాతీయ వర్తకమునకు, స్వదేశ వ్యాపారమునకు పరిశ్రమ స్థాపనకు మొదలగువానికి సహాయము నకుగాను బ్యాంకులు వృద్ధికాఁ జొచ్చినవి.

పరస్పర విశ్వాసముపైననే బ్యాంకింగు సూత్ర మాధారపడియున్నది. నేటిగొప్పగొప్ప బ్యాంకు సంస్థలన్నియు ఈ నైతికధర్మమునే ప్రధానముగాఁ జేసికొని నడచుచున్నవి. అందుచే, ఏ దేశమున నధికముగు బ్యాంకు సంస్థలుఁకలవో, ఆ దేశము నైతికముగా, ఆర్థికముగా నౌన్నత్యము నందినదని చెప్పవచ్చును. కనుక, జాతీయ సద్ధర్మముయొక్క పరివర్తన సాధనము చేయు పనియే నేఁటి బ్యాంకులు చేయుచున్నవి.

ఇంతేకాదు, ఒక దేశముయొక్క ఆర్థికసంస్థలు సమిగూడు కేంద్రములే ఈ బ్యాంకులు. ఈ పునాదుల పైననే మఱికొన్ని ఆర్థికసంస్థలు తమంత నవి బయలుదేరి, విజృంభించును. పారిశ్రామిక, వర్తక వ్యాపారములకు ప్రాణదాన మొసఁగుశక్తి ఈ బ్యాంకులు కలుగఁజేయును. అందుచే బ్యాంకులు జాతీయ ఆర్థిక ఔన్నత్యమునకు ప్రధానాంగము లనుట కావంతయును సందియము లేదు.

జాబులు :

'గామిడి' శబ్దము

విక్రమసంవత్సరాది సంచికయందు శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు కొన్ని పదములను గూర్చి చర్చించియున్నారు. అందు 'గామిడి' శబ్దమునుగూర్చి యీ విధముగా వ్రాసియున్నారు.

గామిడి=శ్రేష్ఠుఁడు-శబ్దరత్నాకరము. (ఊరిగామిడిబాపల్) అని యున్నది.

'గామిడి' 'గ్రామీణ' శబ్దభవముగాని 'గ్రామణీ' శబ్దభవముగాదు.

గ్రామీణుఁడనగాఁ బల్లెటూరివాఁడని యనాగరకుఁడని భావము. ఇది శబ్దరత్నాకరమున లేదు. ఆప్టేలో నున్నది.

'గామిడి చన్నదోయి' (కఠినమైన చన్నదోయి)

'గామిడిగొల్ల—పల్లెటూరి గొల్ల'

అని వ్రాసియున్నారు

కాని కూచిమంచి తిమ్మకవి తన అచ్చతెనుగు రామాయణములో 'రక్కసిగామిడి'యని ప్రయోగించియున్నాడు. రక్కసి గామిడియన రాక్షసగ్రామణి (రాక్షసశ్రేష్ఠుఁడు) అని యర్థము పొసఁగునుగాని అనాగరకరావణుఁడని చెల్లదుగదా!

"ఆ మాటమదిని బెట్టక
నామీఁదం గవికరంబు నాటుకొలుపుచుకా
వే మొనలుదెచ్చి రక్కసి
గామిడి నడుపుమని యతనికఁడంగడుఁ జెపుమా"

గామిడి యనుపదము ప్రాసస్థానమున నుంటచే మార్పునకును జెల్లదు. దీనినిగూర్చి శాస్త్రిగారు యోచింతురని ప్రార్థన.

చాలపప్పు కర్నూలుజిల్లాలో నెక్కువ వాడుకలో నున్నది. మిక్కిలి స్నేహముతో నొప్పుచుందును.

—విద్వాన్ పాలపర్తి సూర్యనారాయణ.

రాయలసీమ - ఆంధ్రరాష్ట్రము

శ్రీ అంబటి సుబ్బరాయలు

నీ బాహుదానదీనీరంబుచే గాదె పెన్న నెల్లూరికి వెన్న బెట్టు
నీ తుంగభద్రానదీతోయములఁగాదె బెజవాడ కన్నంబు బెట్టుఁ గృష్ణ
నీ కృష్ణరాయని నేర్పునగాదె సింహాచలాదులు నేటి కలరుచుండె
నీ రామరాయని నేర్పునగాదె, విశాఖపట్టణమందు శాశ్వతముగ
విశ్వవిద్యాలయము నేడు వెలయుచుండె
నుత్తరాంధ్రుల కీరీతి నూత వగుచు
నాదినుండియు మఱచితి వాత్మసుఖము
చెనటివై, కట్ట! రాయలసీమమాత!

నీ నాయకులశక్తి నేర్పున గాదొకో అరవల కాలయాన్నంబు లబ్బ
నీ నాయకులపేర్మి నీడనగాదె తంజాపూరఁ బెరిగె గ్రంథాలయంబు
నీ నాయకాఢ్యుండు నిల్పుటగాదె మద్రాసు పాదము పెట్టు తమిళులకును
నీ నాయకాఢ్యుని నేర్పున గాదొకో మధురకు మణిరీతి మలయుచుండె
నెగడి తిరుమలనాయకు నగరు; యిట్టు
లాదినుండియు నరవల కాదుకొంటి
వాత్మసుఖమింత దలపెట్ట కకట! వికట
చేతలం బడి రాయలసీమమాత!

కాకతీయులఁ బుట్టి జోకతెల్గుల బల్మికల్మి మా రాయల కరముఁబట్టె
రాణ్మహేంద్రినిఁ బుట్టి రాయలనే ప్రీతి నాశ్రయించి వరించె నాంధ్రవాణి
బెజవాడలోఁ బుట్టి విశ్వవిద్యాలయకన్య మా రెడ్డినే కట్టుకొనెను
రాఁబోయెడు నవాంధ్రరాష్ట్రలక్ష్మియును మా చెన్నపురమునే చెట్టపట్ట
నభిలషించెడు, గాన రే ఆదినుండి
అల్లురగుటయు మీకు సీమాంధ్రజనులు;
దైవసములగు నల్లుర దనియఁజేయు
నగు వివేకంబు గను డుత్త రాంధ్రులార!

గర్భిణి

డాక్టర్ శ్రీమతి పైడికొండల చంద్రమతీదేవి

౧

ఒకవృక్షం జీవంతో ఉంది, ఒక్కటే కొమ్మను కలిగి నిటారుగ పువ్వులు, కాయలు, ఆకులు లేకుండా మన కెందుకూ పనికిరాక చివరకు యెండలోనుంచి వచ్చినవారికి నీడ నయిన నోసంగజాలని యెడల ఆ చెట్టును మన మంతా యేమంటాము. ఇదేమిచెట్టు? మొరడులా గెందుకు పనికిరాదని నిందిస్తాము. అలాగే సంతానరహితురాలైన స్త్రీ సైతము నిందింపబడునని వేరే చెప్పవలెనా? వచ్చీ రాని తడబడుచుండు నడక — అంటే తప్ప టడుగులు వేయటం మొదలుపెట్టినది లగాయతు రెండడుగులు వేయటం, పడడం దభేలుమని పిర్రలు కమిలిపోయేలాగు, మళ్లీ లేవడం, మళ్లీ రెండడుగులు వేసి మళ్లీ పడడం — స్పష్టము గాని, వచ్చీ రాని మాటలు, దుమ్ము దుట్ర చేసుకున్న శరీరము, నోటివెంట చొల్లు, చిరునవ్వు యిటువంటి లక్షణములుగల బిడ్డను తల్లిదండ్రులు చూచునప్పుడు కలుగు ఆనందము బిడ్డలుకన్న తల్లిదండ్రులకే తెలియును అని నేను వేరే చెప్పవలెనా? అందు కీర్తిని, గౌరవమును, సంపదను, కులము నుద్ధరించునట్టి సుగుణసంతానమును కలిగియున్న తల్లిదండ్రుల యానందమునకు మేర యున్నదా? లేదు. అట్టిసంతానమునకు మూలాధార మెవరు? గర్భిణి. పురుషులుమాత్రం కారా యనవచ్చు కొందరు బుద్ధిమంతులు. ఉభయులు కారణభూతు లయినను అంత్యమున కష్టనిష్ఠురముల కోర్చి యుత్కృష్టతను వహించి సత్సంతానమును ప్రసాదించు భాగ్యశాలి గర్భిణియే. అట్టిగర్భముకు కోరి యీప్రపంచములో యెంతమంది యెన్ని అవస్థలు పడుచున్నారు. లోధ్ర, అశోకారిష్ట వగైరా ఔషధములను సేవించువారు, రక్షరేకులు, తాయత్తులువగైరాలు ధరించువారు, సంపూర్ణయాత్రలు వగైరా సేవించు శ్రీమంతులు, అన్నదాన వస్త్రదానములనల్పు వదాన్యులు, గుళ్లుగోపురములను కట్టించే గౌరవవంతులు, స్వాములవారిని స్వగృహమున మఠము వేయించి మేపే మేధావంతులు, సోదెలకు, సుద్దులకు, గద్దెలకు వెళ్లి అణాడబ్బులు, అర్ధశేరుబియ్యం అర్పించే అభాగ్యులు, బుడబుక్కలవాళ్లను, నూనెగుడ్డలవాళ్లను బ్రతికించే బీదసంసారులు వగైరాలెందరో గలరు. అట్టిసందర్భమున మనము నిజంగా గర్భిణి అంటే ఎంత గౌరవముగా చూడాలి. చూడకపోవుట సరిగదా పైగా మగవారికి— అంటే అందరికి కాదనుకోండి— కొంతమందికైనా ఎంతో నిర్లక్ష్యం, నిర్దయా, వేళాకోళమూను. గర్భిణి తృతీయ చతుర్థ మాసములలో వేవిళ్లు ప్రారంభించి బాధ పడుతూవుంటే బలేఛాన్సుగా వుం దాడాళ్ల పని, కావలసినకోరిక లన్ని నెరవేర్చుకొనుట కిదే సమయం అంటారు మగాళ్లు. అందలి నిజానిజములు పరిశీలించరు. అంతఅవసరము

వారికి లేనూలేదు. ఆకోరికలు వాస్తవముగా తల్లివా? లేక గర్భస్థశిశువివా? పైత్యమెక్కువయి తల్లి అలా ఓకరించుకుంటూ ఉండా? లేక దొంగవేషమా? అనే విషయము ముందుగా చదువరులు విచారించ వలసియున్నది.

౨

శుక్రశోణితములు గర్భాశయమున చేరినది లగాయతు ప్రథమాదితృతీయమాసములలో అంగప్రత్యంగము లన్ని యేర్పడి తృతీయ చతుర్థమాసములలో హృదయమేర్పడును. అప్పుడు దౌహృదిని (ద్విహృదిని) అన్న పేరు గర్భిణికి సార్థకమగును. ఎందుచేతనంటే తల్లి హృదయ మొకటి బిడ్డహృదయ మొకటి మొత్తం రెండు హృదయములు కలిగియున్నది కనుక. ఆ హృదయ మేర్పడినప్పుడు ఆత్మకు (సూక్ష్మ శరీరమునకు) హృదయము స్థానంబగుటచే బిడ్డయొక్క ఆత్మ తన పూర్వజన్మ ప్రారబ్ధ కర్మానుగుణమైన కోరికలు తల్లి ద్వారా కోర నారంభించును. అది యెట్లనిన తల్లియొక్క హృదయనాళమునకు శిశువుయొక్క హృదయనాళ మమర్చబడియుండును. అందుచే ఆనాడిద్వారా తల్లియొక్క ఆ హా ర ర స ం (ఆయుర్వేదపద్ధతిప్రకారం) హృదయముననుండి శిశువుయొక్క హృదయమునకు చేరుకొని శిశువును పోషించుచుండును. అదేవిధమున శిశువు హృదయముననుండు ఆత్మయొక్క కోరికలు తల్లియొక్క హృదయముననుండు ఆత్మకు తంతిద్వారా తెలియజేయును. దానంజేసి, బిడ్డకోరికలు తల్లి వెలిబుచ్చుచుండును. అట్టికోరికలు సంపూర్ణము కానియెడల బొక్కి రొమ్ము, ఊచ చేతులు, మరుగుజ్జుతనము, కుంటితనము, గ్రుడ్డితనము మొదలగు వికృతాకారములుగల శిశువు కల్గును. గర్భిణికి వేవిళ్లసమయమున చెవుల కానందము కలుగ చేయు గానము మొదలైనవాటియం దిచ్ఛగలిగిన నవి లభించనియెడల గర్భస్థశిశువుయొక్క చెవులకు బాధయు, కండ్లకు ప్రీతికరమైన దేవతాదర్శనము నృత్యము మొదలైనవానియం దిచ్ఛగలిగినప్పు డవి సమకూరనియెడల బిడ్డయొక్క కండ్లకు వేదనయు, జిహ్వా కాహ్లాదకరమైన షడ్రసాన్న భక్ష్య భోజ్యాదిపదార్థములం దిష్టత కలిగిన నవి ప్రాప్తించనప్పుడు బిడ్డజిహ్వకు బాధయు, అటులనే యేయే యింద్రియమునకు సంబంధించిన కోరిక నెరవేరనిపక్షమున నాయా యింద్రియములకు బాధ కల్గునని తెలియదగును. కనుక బిడ్డయొక్క క్షేమముకోరియైనను గర్భిణీద్వారా బిడ్డ వెల్లడించిన కోరికల నెరవేర్చుట మన కర్తవ్యమైయున్నది. అట్లొనర్చిన మంచి బలపరాక్రమములు కల దీర్ఘాయువునగు సంతానము కలుగును.

3

గర్భిణీస్త్రీయొక్క కోరికలనుబట్టియే ముందు యెటువంటిబిడ్డ జనించునదియు తెలియదగునని వైద్యశాస్త్రములనుబట్టి వెల్లడియగుచున్నది. అదియెట్లనిన గర్భిణిఅందమైన సిల్కుచీరెలు, గ్లాస్గోచీరలు, పూవులు మొదలుగాగల యలంకారములయం దిష్టత కనుపర్చిన యలంకారప్రియుడైన బహు సుందరమైన పోకిల్లా జనించును. దైవారాధన, భక్తి మొదలగు సత్వగుణ ప్రధానవిషయములం దిచ్ఛగలిగిన ఆగుణముల కనుకూలమైనయతి జనించును. ధనవంతులయిన రాజాధిరాజుల దర్శనము చేయ గోరికగలిగిన రాజసగుణ

ప్రధానుడైన ధనవంతుడు కల్గును. దుష్టస్వభావముగల పెద్దపులి మొదలైన క్రూరమృగములచూడ నిచ్ఛగించిన క్రూరస్వభావము గల బిడ్డపుట్టును. ఈవిధముగ ఆయాకోరికలనుబట్టి జనించబోవు శిశువుయొక్క స్వభావము టూకీగా గ్రహించవచ్చును.

౪

దౌహృదిని యాహారవిహారములయందు బహు నియమముగా యుండదగును. ఆహారవిషయమున వాతాదిత్రిదోషములలో నే దోషము వృద్ధిబొందించు వస్తువులను-అనగా వాతమును వృద్ధిచేయుపదార్థముల భుజించిన బిడ్డకు వాతమును, పిత్తమనగా వేడి యధికము చేయు పదార్థసేవనవల్ల బిడ్డకు వేడియును, శ్లేష్మాధిక్యపదార్థభక్షణమువల్ల శ్లేష్మాధిక్యమును కలుగజేయును. విహార మనగా తల్లి బరువుపనులు చేయునెడ బిడ్డ కాయాసమును, తల్లియొక్క యేయువయవమునకు దెబ్బతగిలిన శిశువుయొక్క యాయావయవమునకు బాధ కల్గును గనుక గర్భధారణము మొదలు మెల్లప్పుడు శుచియైన తెల్లనివస్త్రములను అలంకారములను ధరించుకొని సంతోషముగా దేవబ్రాహ్మణులయందు భక్తి కలిగియుండవలెను. మలినమైన వస్తువులను, వికృతాకారములను చూచుట, దుర్గంధయుక్తములైన పదార్థముల నాఘ్రాణించుట, భయంకరమైన శబ్దములను, ధ్వనులను, విచారకరమైన కథలు వార్తలు వినుట, చద్దియన్నము, అజీర్ణకరపదార్థములను భుజించుట, బరువుమోయుట, గట్టిగా మాట్లాడుట, శరీరమున కాయాసకరములైన నలుగు మున్నగువాని పెట్టించుకొనుట, యింకను శరీరమున కాయాసకరమైన పనులనుచేయుట, అరబయట, పాడుబడిన గృహములయందు, దేవపిశాచములకు స్థానమైన వృక్షములవద్ద సంచరించుట, రాత్రి మేలుకొనుట, పగలు నిద్రించుట, ఉపవాసములనుచేయుట, గొంతుకూర్చుండుట, మిట్టపల్లములుగల స్థలములయందు కూర్చుండుట, గట్టిగనుండు పీఠములమీద కూర్చుండుట, గోతులు నూతులు మొదలైనవాటి లోనికి చూచుట, వెల్లకిలబరుండుట, ఎర్రని బట్టలు కట్టుకొనుట మొదలైన కృత్యముల నవశ్యము వర్జించవలెను. మెత్తనిపరుపులు దిండ్లు మొదలైనవాటి నుపయోగించవలెను. తేలికగ జీర్ణమగు ద్రవస్నిగ్ధ (నెయ్యివగైరా) యుక్తపదార్థముల నాహారముగా ఉపయోగించవలెను.

౫

పైన తెలియబరచిన విధు లన్నియు చదువరులకు చాలా విసుగ్గాయుండి ఆవిధు లన్నియు ఆచరించకపోతేయేమి? ప్రపంచకములో అంతా అలా వుంటున్నారా? ఉండకపోయినందువల్ల వాళ్ల కేమి నష్టము? ఇది అంతా వట్టికోత లంటారేమో! అది ఒక్కనాటికి కాదు. నేను పైనచెప్పిన విధులన్నియు సాధారణంగా ప్రతియింట ఆచరించేవే అయినా ఒకసారి జ్ఞాపకముచేసుకుంటే మంచి దని చెప్పినాను. అంతేకాని మరొకవిధంగా చదువరు లనుకోరని నమ్ముచున్నాను. దేవు డున్నాడు, మోక్ష ముంది తగినభక్తి కలిగియుంటే నని అందరకు తెలిసిన విషయమే. అయినప్పటికీ భక్తిప్రధానములైన హరికథాకాలక్షేపములు, పురాణములు, స్వాముల వార్ల బోధలు తప్పుతున్నవా? అవి అన్ని ఎందుకు? ఒక్కసారి భక్తి, మోక్షము స్ఫుర

ణకు తెచ్చుకొనుటకే. అలాగే మన కందరకు ఒకసారి ఈవిషయములు జ్ఞాపకము తెచ్చుచున్నందుకు నన్ను చదువరులు క్షమించెదరని నమ్ముచున్నాను. కాబట్టి తల్లికింత సౌఖ్యమా యీవంకమీా దని మీా రనుకోవద్దు. ఇదియంతయు బిడ్డ శ్రేయస్సుకే యైయున్నది. తద్వ్యతిరిక్తముగా గర్భిణి యున్నయెడల పాపపుణ్యము లెరుగని పసిబిడ్డను జన్మపర్యంతము దుఃఖసముద్రములో ముంచినవా రగుదురు. అది యెట్లనిన తల్లి యెప్పుడు కలహము లాడుచుండిన గర్భస్థ శిశువు పిచ్చివానిగాను, తరచు శోకించుచుండిన మిక్కిలి భయస్వభావము గలవానిగను, ఎల్లప్పుడు ఏవో లేనిపోని చింతలలో మునిగి యుండిన ఇతరులను బాధపెట్టువానిగను, దొంగతనము చేయుచుండిన ద్రోహబుద్ధిగల వానిగను, ఓర్పు లేకుండా యుండిన కోప స్వభావము గలవానిగను, ఎల్లప్పుడు నిద్రించుచుండిన ఎప్పుడూనిద్రపోతూ మందకొడిగా ఉండు బండబ్బాయిని, మద్యపానము చేయుచుండిన జ్ఞాపకశక్తి లేనివానిగను, నిలకడ లేనివానిగను, మధురపదార్థముల నెక్కువగ భుజించిన మేహ (మధుమేహ) రోగిగను, ఆమ్ల (పులుపు) రస మెక్కువగ సేవించిన రక్తపిత్తరోగిగను, లవణరస మధికముగ ఉపయోగించిన బట్టతలవానిగను, తిక్త (చేదు) రస మధికముగ పుచ్చుకున్న అల్పశుక్రము గల సంతానహీనునిగను, ప్రసవించును. కావున స్త్రీలయందు పరిపూర్ణానుగ్రహముంచి గర్భిణికి పైవిధుల సక్రమముగ ఆచరించుట కవకాశ మొసంగుట పురుషుల విధి యైయున్నది. గర్భిణికికూడా భర్తమీాద కోపము కల్గి కాని, యింకా యింట్లోయుండే అత్తమామ లాడబుట్టుల సతాయింపులకు వెరచిగాని పైవిధులను బద్ధకించక ముఖ్యముగా ఆచరణలో పెట్టుట కర్తవ్యమై యున్నది. అట్లాచరించనియెడల యేమీా యెరుగని శిశువుల కన్యాయముగ వికృతాకారములు కలుగజేయుటయే యగును. సమయమున భీష్మించుకుని నిర్లక్ష్యభావము వహించి అంత్యమున అనగా గర్భవేదన ప్రారంభించి బాధపడుచున్న సమయమున లేడీడాక్టర్లు, డి. యమ్. ఓ. (D. M. O.) ల కొరకు పరుగెత్తుటకంటే తొలుదొల్తనే విషయములను తెలుసుకుని జాగ్రత్తగా యుండుట సర్వజన శ్రేయస్కరము గదా!

వ్యవసాయశాస్త్రము

శ్రీ కె. భూషణం

ఉన్న శాస్త్రాలనే అర్థం చేసుకోలేక, ఆంధ్ర భాషలోకి అనువదించుకోలేక అవస్థ పడుతూ ఉంటే యీ నూతన వ్యవసాయశాస్త్రం 'పులిమీద పుట్ర లాగు' యెక్కడనుండి వూడిపడింది చెప్మా అని అనుకొనేవా రుంటారు మనలో ! అలాంటివారికి యీశాస్త్రం నూతనం కాదనీ, యెక్కడినుండీ హటాత్తుగా వూడిపడలేదనీ ముందుగా మనవి చేసుకొని తర్వాత గ్రంథంలోకి దిగుతా !

అనాదినుండి అందరూ జీవించడానికి వ్యవసాయమే ఆధారం ఐనా — మనదేశంలో అది నూటికి ౭౦ మందికి వృత్తిగానున్నా — తినేతిండి, కట్టేబట్ట, సర్వసూ సర్వదేశీయులకూ యీ మాతృకృషివల్లనే ఉత్పత్తి యౌతూ ఉన్నా — మనతోబాటు మన పాడిపశువుల జీవనాధారలు దీనిమీద నిలిచియున్నా— "కృషితో నాస్తిదుర్భిక్షం" అని పెద్దలూ, "నినునమ్మి లోకాలు నిలచియున్నాయిరా" అని పిన్నలూ కృషి-కృషకులనుగూర్చి పాడియున్నా – వ్యవసాయమంటే 'పామరులు వంశపారంపర్యా చేసుకొనే బండపని'గా భావిస్తున్నారు పరభాగ్యోపజీవులైన మనలో కొందరు. కాని, యీ ప్రాముఖ్యము గమనించిన పాశ్చాత్యులు దీన్ని పెద్ద'శాస్త్రం'గా పరిగణిస్తున్నారు. పరిగణించి – పెక్కు పరిశోధనలు (**Researches**) చేస్తున్నారు. చేసి – అనేక వింతవిషయాలు కనిపెడుతున్నారు. కనిపెట్టి — సృష్టికి ప్రతిసృష్టి యంతటి పనిని చేయగలుగుతున్నారు. ఆ ప్రతిసృష్టి పద్ధతులు, పరిశోధనల ఫలితాలు యిప్పుడైనా మనం అవగాహన చేసుకొనడానికి ప్రయత్నించాలి — బ్రతుకు తెరువు యెఱిగిన బుద్ధిమంతులం గనుకొను, "కోటివిద్యలు కూడ కూటికొరకే సుమీ"అని పెద్దలన్నారు గనుకొను. కూడే జీవితపరమావధి గాదని కొందరనవచ్చు; కాని దాన్ని తిని, యీ భౌతికశరీరం యెదిగి ఆరోగ్యవంతంగా నున్నప్పుడే గద ఆధ్యాత్మికంమాట ఆలోచించగలగడం అని శాస్త్రజ్ఞు డంటాడు.



రావుబహదూరు బి. విశ్వనాథ్
యఫ్. ఐ. సి. యఫ్. సి. యస్ గారు (ఆంధ్రులు)
ఇంపీరియల్ అగ్రికల్చరల్ డైరెక్టరు.

వ్యవసాయశాస్త్రం చాల గొప్పశాస్త్రము. అది శాస్త్రాల సమ్మేళనం. ఎందుచేతనంటే శాస్త్రాలన్నీ చాలవరకు 'ప్రకృతి'ని పరిశోధించేవే గనుకనూ— ఆ 'ప్రకృతి'నుండియే మనకు కావలసిన ఆహారం ఆదిగాగల అనేకవస్తువులు వుత్పత్తిచేసే కృషే వ్యవసాయం గనుకొనూ. పదార్థ విజ్ఞానశాస్త్రం(**Physics**), రసాయనశాస్త్రం (**Chemistry**),

(Botany), జంతుశాస్త్రం (Zoology), యంత్ర సాధనశాస్త్రం (Engineering), వాతావరణశాస్త్రం (Meteorology), యిత్యాది వివిధ శాస్త్రాలలో పేరెన్నికగన్న శాస్త్రవేత్తలంతా (Scientists) కలిసి యీ కృషిలోని రహస్యాలన్నీ యింకా బయటపెట్ట లేకుండా ఉన్నారు. అంత మనమెరుగని చిదంబర రహస్యాలేమున్నాయి వ్యవసాయంలో నని భారతీయులు నిరసనభావం వహించగలరు! అలా విద్యావిహీనులతోబాటు విద్యాధికులును నిరసనభావం, అశ్రద్ధా వహించబట్టే— అడిగిన జీతంబీయని మిడిమేలపు దొరనుకొలిచి, మిడుకుటకంటెన్, వడిగల యెద్దుల గట్టుక మడికున్నక బ్రతుకవచ్చు మహిలో" నన్న ఆర్యోక్తికంజలి విడువబట్టే — "యేడవగలిగితే వ్యవసాయం చెయ్యి, ప్రాధేయపడగలిగితే ప్రభుత్వోద్యోగం చెయ్యి" అన్న అధునికసూక్తి మనకు లభించింది! ఏడవడం యెందుకంటే— ప్రభుత్వంవారి పన్నుకైనా సరిపోని పంటపండించ గలుగబట్టి; లేదా, పండినదానికన్నా, ప్రభుత్వంవారికీయవలసినపన్ను యెక్కువ కాబట్టి; లేదా, 'విద్యాపీఠం,' 'రత్నగర్భం', 'కల్పవల్లి' అనిపించుకొన్న దేశంలో పరిస్థితులు యిలా పరిణమించబట్టో!!

ఏదోవిధంగా, ఏదో పండినంత పండించడమే గాదు వ్యవసాయమంటేను. అంతకంటె జేయవలసినవి, తెలిసికోవలసినవి చాలా వున్నాయి. ఏమిటంటారేమో; కొద్దిగా సూచిస్తున్నా:—

౧. పైరు లన్నిటికి ఆధారభూత మయ్యేది భూదేవి. ఆభూమి యెలా తయారైంది, ఏయే రకాల భూము లున్నాయి, వాటి ధర్మాలేమిటి? వాటిని బాగుచేసే పద్ధతులేమిటి? ఊసర క్షేత్రాలు ఉత్కృష్టభూములుగా మార్చడం యేలాగు? అనేవిషయాలు ప్రప్రథమమున తెలుసుకోవాలి.

౨. 'దున్నకుండా చల్లితే కొయ్యకుండా పండుతుంది' గనుక భూమిని సాగు చేసేపద్ధతులు తెలియాలి. సాగుఅంటే దున్నడం ఒక్కటేగాదు; చాలా తంతు వుంది; ఆ తంతుకి చాలా అర్థంకూడా వుంది. అర్థం తెలియకుండా చేసేపనికన్నా అర్థం యెఱిగి చేసేపనిలో యెక్కువ సులువు, లాభం వుంటుంది. ఈసాగు చేయటానికి పలురకాలపనిముట్లు గావాలి; పనిముట్లు లాగటానికి పశువులు గావాలి. కాన వీటినిగూడ యెలా బాగుపరచి, వృద్ధిపొందించాలో నేర్చుకోవడం ఆవశ్యకం.

౩. ఏ ప్రదేశంలోని పైరులైనా అక్కడి వర్షపాతం (Rainfall), శీతోష్ణపరిస్థితులు (Meteorological Conditions) మొదలైన వాటినిబట్టి వుంటాయి. ఉదాహరణ: వర్షపాతం యెక్కువగానున్న ఉత్తర సర్కారు, మలయాళదేశంపంటలు చూడండి, కేవలం వర్షాధారంగల దత్తమండలాల పద్ధతులు పనిముట్లు చూడండి. కావలసినప్పుడు ఆకాశంలోకి విమానాల్లో యెగిరివెళ్లి, వర్షం కురిపించగలిగి — అక్కర్లేనప్పుడు బాంబులు పేల్చి మేఘాలను చెల్లాచెదరుచేసి వర్షం ఆపగలిగిన యిప్పటి పాశ్చాత్య శాస్త్రవేత్తల కున్నంత విజ్ఞానం కాకపోయినా వీటి విషయమై కొంతైనా తెలిసికోవలసి యుంటుందంటారా?

౪. భూమిని ఫలవంతంగా జేయటానికి యెరువులు (Manures) జేర్చాలి. మనలాగ యెన్నాళ్లు జూచినా ఒక్కటే యెరువుతో కొట్టుకోకుండా శాస్త్రజ్ఞులు అనేకరకాల యెరువులు కనిపెట్టారు. గాలిలోనుంచి నత్రజని(Nitrogen) అనేవాయువును బట్టుకొని యెరువుగా మార్చేరు. మనుష్యుల విసర్జనలను మనం అనుకొనేలాగ యెంతమాత్రం అసహ్యకరం, హానికరం గాకుండా సారవంతమైన యెరువులుగా వాడే విధానం కనిపెట్టారు. ఈ యెరువులమాట యెలావున్నా — మనకు తెలిసిన పశువుల మలమూత్రములనైనా యెలా మంచి యెరువులుగా మార్చాలో, వాటిసారం పోకుండా నిలవయుంచడం యేలాగో నన్న విషయాలైనా తెలిసికోవాలి. అవిగాక మేకలు, గొర్రెల మందలు, పాటిమన్నులు, గానుగపిండ్లు. పచ్చిరొట్ట మొదలైనవాట్లలో నేముందో, వాటి తారతమ్యాలు ఆయా యెరువులను తయారుచేసే క్రమం, ఉపయోగించే విధానం, ఏపంటకు— యేది — కావాలో నన్న విచక్షణ మున్నగు విషయాలు తెలుసుకొని చేస్తే

మంచిదంటారా, లేక తోచినట్లు, చూచినట్లు ఉపయోగిస్తే లాభ మంటారా?

౫. వేరువేరుపంటలు (Different crops), వాటిని పైరుచేసేవిధానాలు, కలిసివచ్చే క్రొత్తపంటలు, పద్ధతులు తెలిసికోవలసియుంది. వీటితోపాటు పండిన ఫలదాయాన్ని తగురూపంగా తగువెలకు విక్రయించే మార్గాలు, సహకారసంఘ (Co-operativeSociety's) పద్ధతులు, వాటిలాభాలు తెలిసికోవలసియుంది; లేకపోతే పండించడంతోనే సంతృప్తిపడి, కాళ్లు చాచుకకూర్చుంటే—మధ్యవర్తులు (Middle-men), సాహుకార్లు లాభాన్నంతా మ్రింగివేస్తుండడమున్నూ, యెంత పండించినా, యెన్నాళ్లైనా మన లాభాలు గొర్రెతోకలలాగు యెదుగుబొదుగు లేకుండా నుండడమున్నూ తటస్థిస్తుంది!

౬. లోకమంతా వ్యవసాయకృషిపై ఆధారపడియుంటే, ఆకృషి పశువుల (Cattle) పై ఆధారపడివుంది. కాబట్టి పశుగణాన్ని చక్కగాసాకే విధానాలు, మంచి అనుగుణమైన జాతులు వుత్పత్తిజేసే పద్ధతులు, వాటికి తగిలేరోగాలు (Diseases), వాటిని మాన్పే మార్గాలు అర్థంచేసుకోవాలి. ఇవి తెలియని యెడల 'నావాటికి తీసికట్టు నాగంభట్టు' అన్నట్లు అగుతున్న చచ్చుపెద్దమ్మదూడలతో మనం అవస్థపడడమే గాకుండా, 'దొమ్మ' అంటే 'అమ్మవార'ని, 'వాతకు సాటి వైద్యంలే'దని అన్నిరోగాలకు అదే వడ్డిస్తూ కూర్చోవలసి వస్తుంది!

౭. నేలయొక్క తత్వాన్ని గూర్చి, అది పైరులనెట్లు పండించేదీ, దానికి యెరువులు చేర్చినప్పుడు ఏయే మార్పులు జరిగేదీ కొంతైనా అర్థంకానిదే మంచి పంటలు పండించడం సాధ్యంకాదు. కనుక, యీ మర్మమూ కొంత తెలిసికోవాలి.

౮. పిదప వృక్షశాస్త్రాన్ని గూర్చి యెక్కువగా తెలిసికోవలసివుంది. చల్లినగింజ మొక్కగా యేలా మారుతుంది, మొలచిన మొక్క తనకు కావలసినఆహార పదార్థములను భూమినుండి, గాలినుండి తీసుకొని, సూర్యరశ్మి సాహాయ్యంచే, యేలా వివిధసేంద్రియ పదార్థములను (Organic Compounds) తయారుజేసి, పూచి ఫలిస్తుంది? ఒకగింజ నూరుగింజలు ఎలా అవుతుంది? అనే విషయాలన్నీ అత్యంత ఆశ్చర్యకరములైయున్నా, తెలిసికోడానికి యత్నించక—"అది అంతా ప్రకృతి ధర్మం" అని చల్లగా జెప్పేవా రుంటారు; కాని, మనిషి యీప్రకృతిధర్మాలను పరిశోధించి, వాటి నియమాలను (Laws of Nature) గుర్తించడం వల్లనే ప్రకృతిలో అనేక వింతలు చేయగలుగుతున్నాడు; నూతనరకాలు, విస్తారంఫలదాయం యిచ్చే జాతులు (High yielding strains) తయారుచేయగలుగుతున్నాడు అని జ్ఞాపక ముంచుకోవాలి.

౯. "అన్నీ అమర్చివుంచితే అయ్యవార్లం గారు వచ్చిభక్షిస్తారు" అన్నట్లు—

ఉన్న ఆర్థికదుస్థితులు (Economic troubles) చాలక మనకు మళ్లీ పురుగులబాధ ఒకటి. మనకు రోగం లేనిపైరు, పురుగులు తినని పంట లభించడంలేదు; తరుచు పండిన దంతా పురుగులే (Insect pests) నాకేస్తుంటాయి! ఇలా కీటకాదులవల్ల తరుచు విశేష నష్టం వస్తుంటుంది. కనుక పంటలకు తగిలే తెగుళ్లు, వాటికి హేతువులు, అవి రాకుండా ఆపేమార్గాలు (Preventive methods), వస్తే అణిచే సూత్రాలు (Curative methods) చేజిక్కించుకోవాలి.

౧౦. వీటితోపాటు నూతులు త్రవ్వించడం, నీరు తోడుటకు యంత్రాలు నిర్మించడం, తగు వ్యవసాయపు పనిముట్లు (Agricultural implements) తయారు చేయడం, భూములు కొలవడం, పశుశాలలు నిర్మించడం అనే విషయాలు తెలియాలి.

౧౧. అంతేకాక పాలుమొదలైన వాటికొరకు పాడిజంతువులను పెంచడం (Dairying), తేనెటీగలను పెంచి తేనెతయారు చేయడం (Apiculture), సులువుగా కోళ్లు మున్నగు వానిని పెంచి ధనమార్జించడం (Poultrying), చేపలు పెంచడం (Pisciculture), వివిధఫలవృక్షాలను, కూరగాయలను పైరుచేయడం (Horticulture) మొదలైన అనేకాంశములు-గృహపరిశ్రమ లగు (Cottage industries) నూలు వడకడం, బెల్లం వండడం, పట్టుపురుగుల పెంపకం యిత్యాది చిన్న చిన్న

పనులను కొద్దిగనో గొప్పగనో తెలిసికొంటే కేవలం పైరులమీదనే ఆధారపడి వుండనక్కర లేకుండా, కొంత కలిసివచ్చే (Remunerative) మార్గం యేర్పడుతుంది. కనుక వ్యవసాయశాస్త్రంలో గల యీలాంటి రహస్యాలన్నీ తెలుసుకొంటే పాశ్చాత్యులవలె మనంకూడా విచిత్రాలు, విస్ఫూరాలు, అదనంపంటలు, అనుకోనిపైరులు, క్రొత్తరకం పసువులు, వగైరా అన్నీ తయారు చేసుకొని సుభిక్షంగా బ్రతుక కలుసతాం. అదీగాక యిప్పటివలె అప్పనం పక్షుల్లాగ అమాయకుడైన రైతు పండించింది ఆరగిస్తూ కూర్చొనక్కరలేకుండా, మన సాంఘిక కట్టడానికి పునాదియైన ఆ నిష్కామకర్మునికి యింత సాయం చేసి అతని అభ్యుదయంలో మన అభ్యుదయం, దేశాభ్యుదయంకూడ ఉందని చూడుకోగలుగుతాం; దేశకల్యాణానికి కొంత దోహదం కలిగించినవాళ్ల మవుతాము.

ఈశాస్త్ర రహస్యాలన్నీ తెలియ జెప్పడానికి చాలాగ్రంథం చెప్పాలి; పాఠకులకు పైన జెప్పిన శాస్త్రాలలో కొంత కొంత ప్రవేశం ఉండాలి; కాని, శాస్త్రపరిభాష అంత యెత్తకుండా, సామాన్యజనానికి సుబోధక మయ్యేరీతిని చెప్పవలసివుంది గనుక ఆ విధంగానే ఉపక్రమిస్తాను.

ఈవిషయాలు తెలిసికోడానికి మనం బత్తెఖర్చులు గట్టుకొని యింగ్లండులోనున్న 'రోథామ్‌స్టేడ్' వ్యవసాయశాస్త్రపరిశోధనాలయాలలో (Rothamstead Agricultural Research Laboratories in England) ప్రవేశించ నక్కరలేదు. అంతకు దగ్గరగనే తత్తుల్యమైన పరిశోధనశాలలు ఢిల్లీలోను, దానితర్వాత కోయంబత్తూరులోను ఉన్నాయి. దేశంలో జరుగుతున్న యీశాస్త్ర పరిశోధనలను గురించి — అఖిల భారతవ్యవసాయశాఖకు డైరెక్టరుగానున్న (Imperial Agricultural Director ఆంధ్రమహాశయులు శ్రీ రావుబహదూరు బి. విశ్వనాథ్ యఫ్. ఐ. సి., యఫ్. సి. యస్. గారు యిటీవల బహుక్లుప్తంగా సామాన్యభాష (Non-scientific language) లో తెలియ పరచియున్నారు. వారి అంగీకారంతో, దానినే, స్వల్పమార్పులతో, ఆంధ్రంలో, పాఠక లోకానికి 'భారతి' పత్రికద్వారా మాసమాసం విన్నవిస్తుంటాను.

కనకాంగి

శ్రీ శర్మసోదరులు

కనకాంగి రాగము ౭౨ మేళకర్తల రాగములలో మొదటి మేళకర్తకు చెందిన-సంపూర్ణ రాగము. ఇందలి స్వరములు షడ్జము, శుద్ధరిషభము, శుద్ధగాంధారము, శుద్ధమధ్యమము, పంచమము, శుద్ధధైవతము, శుద్ధనిషాదము. శుద్ధములైన రిషభగాంధారములున్ను, శుద్ధములయిన ధైవతనిషాదములున్ను కలిసిన రాగమగుటచేత ఇది వివాదిస్వరకూటము గలది గనుక ఎక్కువగా ప్రచారములోనికి రాలేదు. ఈ దిగువను సూచించిన స్వరసంచార క్రమమును అనుసరించినయెడల ఈ రాగమందలి వివాది దోషమంతరించి గాత్రముతో పాడుటకు సైతము అనుకూల్యమేర్పడి ఈ రాగము శ్రావ్యముగా నుండును.

స్వర సంచారక్రమము:—

సరిగామపా — ఇందు రిషభము హ్రస్వముగాను, గాంధారము దీర్ఘముగాను, వరీకు గలదిగాను ఉన్నవి.

రీగమపా — ఇందు రిషభము దీర్ఘముగాను, గాంధారము హ్రస్వముగాను ఉన్నవి. రిషభము కంపముగలది.

ఈ విధముగానే, పధనీసా, ధానిసా సంచారక్రమములు గ్రహించవలెను.

కొన్ని సంచారక్రమములందు ఒకొక్క స్వరము వర్జించవలెను. 'సరిమా' లో గాంధారము, 'సగమా' లో రిషభము, 'పధసా' లో నిషాదము, 'పనిసా' లో ధైవతము వర్జ్యములు.

మగారిస — ఇందు గాంధారమునుండి రిషభమునకు వచ్చునప్పుడు అవరోహణము జారు గలది.

సనీధప — ఇందు నిషాదము నుండి ధైవతమునకు వచ్చునప్పుడు అవరోహణము జారు గలది.

ప్రయోగ విశేషములు:— సపసీధపా; మసగారిస మొదలయిన స్వరకూటములు ప్రయోగించిన యెడల కనకాంగి రాగము కడు శ్రావ్యముగా నుండును.

భారతీస్తవము

కనకాంగిరాగము - రూపకతాళము

పల్లవి

భారతి - మా - సన్నుతిగొని!
పామధ - పమ - గా మ మ పధ
వరములు - మా - కొసగు మమ్మ॥
పధ పమ - గా - రిరిస పామ

అనుపల్లవి

వాణి! గాన - వేద శాస్త్ర!
పాధ పధమ - మపధ సా సే
వాగ్దేవిగ - వెలసితీవు!
నీ నీ పధ - పధమ పాప
సంగీతం - సాహిత్యం!
పధ పధ పమ - పా పధ సా
కంగవలయి - యలరు నీకు॥
గరిసపధప - సరిమ పధమ

చరణము

తొలి చదువుల - నలువ చెలీ!
పధ పమ పమ - గమ గగ మా
పలుకు వెలంది - పలుకు - లొలికి!
గమ పరి గమ - పసమ గ - రిరిస
పలికింపవె - పలుకులు మా!
పధ సా సరి - పమ సరీ మా
వాలు కపయి - జాలువార!
రీ స రి స రి - సరిధ సా స
సరసీరుహ - నయన! మమ్మ!
స రి సరిమా రిమపా - మపధ సాసే
వరమొసంగి - బ్రోవుమమ్మ!
రి రి రి సాగ - రీ రి సా సే
కలి - గిం - పవె - మాకు, - నిను!
సేరి సేరిమా మాకమ - రీ సే, - సేసే
కనెదు - భాగ్యము - కనకాంగి! ॥భారతి॥
గరిసి - పధ పమ - పరిమపధ


జీవితాశయము

శ్రీ నండూరి బంగారయ్య

నన్నయకవిత్వ మనియెడి వెన్నపూస
నారగింపగ నేర్చు నీ యాంధ్రజాతి
మెచ్చి తల యూప జాలిన మేలిరచన
మస్మదీయతపంబున కందునొక్కొ ?

తిక్కనకవిత్వ మనియెడి తేనెపట్టు
నిరవశేషంబుగా గ్రోలు పరమరసిక
చక్రవర్తుల గనినైన జనని కిపుడు
నూతనోత్సాహ మొనగూర్పగా తరంబె ?

వ్యాసవాల్మీకులును కాళిదాసగురుడు
కావ్యరచనాప్రపంచితాకాశమందు
మేలిజోతుల విధముగ గ్రాలుచుండ
జూచుకొందును గాక నా సుకృతఫలము



పూర్ణ చతురంగ క్రీడ

శ్రీ పంతుల వెంకటసీతారామమూర్తి

ప్రస్తుత కాలమందు విశేష ప్రచారమును గాంచిన చతురంగక్రీడయందు కొన్ని లోపములు కలిగియున్నట్లు నాకు దోచినందున అట్టిలోపములు కలుగకుండుటకై నేను ప్రయత్నించి యీపూర్ణచతురంగక్రీడావిధానమును నిర్మాణము చేసియున్నాను.

దీని మంచిచెడ్డలు పాఠకులు విమర్శింతురుగాక. ఇంతకుమున్ను ప్రచారమునందుండిన చతురంగము సంపూర్ణబలయుక్తము కానందుననూ, నే నిపుడు నిర్మించిన చతురంగము సంపూర్ణబలయుక్తమైన దగుటవలననూ, దీనికి పూర్ణ చతురంగక్రీడ యనునామముంచబడినది.

చతురంగము యుద్ధలోకస్వభావానుగుణముగా నిర్మింపబడినది. ఇది యుద్ధప్రవృత్తుడగు రాజుసైన్యము ననుసరించి నిర్మింపబడినది. కావుననే యీ యాటయందలి బలములకు "రథ, గజా"దినామము లుంచబడినవి. కాని ప్రస్తుతము ప్రచారమునందున్న యాటయందు క్రమము సరిగా లేకుండుట మొదటిలోపము. "రథ, గజ, తురగ, పదాతు"లు లోకశాస్త్రస్వభావము ననుసరించి క్రమముగా నుండగా నీ యాటయందు తద్విరుద్ధముగా "రథ, తురగ, గజ, పదాతి" క్రమ మంగీకరింపబడుచున్నది.

లోకమునందు ముఖ్యముగా జూపట్టు సమస్తవాహనారూఢ నైపుణ్యప్రజ్ఞావంతుడగు సేనాధిపతి యీ యాటయందు లేకుండుట రెండవలోపము. లోకయుద్ధస్వభావముల ననుసరించి నిర్మింపబడిన చతురంగక్రీడయందు లోకమందుంబోలె రాజునకు రక్షకుండు ఒకడైన నుండుట న్యాయము. అట్టి రాజరక్షకుం డిందు లేకుండుట మూడవ లోపము.

నాచే నిర్మింపబడిన యీ పూర్ణచతురంగక్రీడయందు "రథ, గజ, తురగ, పదాతి" క్రమ మేర్పరుపబడుటచే లోకస్వభావవైరుధ్య ముండనేరదు. ఈ క్రొత్త యాటయందు లోకస్వభావము ననుసరించి ప్రజ్ఞాశాలియగు రాజునకు విజయలక్ష్మిం జేకూర్చెడు సర్వగమన సేనానియు రాజరక్షకుడుగూడ చేర్చబడిరి. ఇందు రాణిని రాజరక్షకునిగా నియమించినాము. ఇందు బల్లపైని ప్రతివరసకును పదిగళ్లేర్పడును. క్రొత్తగా

చేర్పబడిన సైన్యాధ్యక్షు రాజరక్షకులకు ముందు చెరియొకబం టుండును. కావున మొత్తము భటులసంఖ్య పది యగుచున్నవి. ఈక్రింద పొందుపరచిన పట్టికయందు మా పూర్ణచతురంగక్రమమును గుర్తింపదగును. పట్టికయందు చూపిన యంకెలు గమనించి చిత్రరువునందు లిఖించిన ఆకారములు తెలియగలవు.

భాగపుచివర నుంచబడెను. సేనాధిపతి వివిధ సైన్యములకు నాధిపత్యము వహించుటచే అతనికి మంత్రికంటె హెచ్చుగా అశ్వగమనము (గుఱ్ఱపునడక) కూడ క్రొత్తయాటయందు న్యాయముగా నిర్ణయించబడెను. రాజరక్షకునిగమనము గుఱ్ఱపుదాటు తక్కరాజగమనము ననుసరించియె యుండును. ఇది లోకస్వభావమే కదా! దీనివలన మా

ఎఱ్ఱబలము

సేనాని 1	గుఱ్ఱము 2	ఏనుగు 3	సైగటు 4	రాజు 5	రాణి 6	సైగటు 7	ఏనుగు 8	గుఱ్ఱము 9	మంత్రి 10
o	o	o	o	o	o	o	o	o	o
o	o	o	o	o	o	o	o	o	o
మంత్రి	గుఱ్ఱము	ఏనుగు	సైగటు	రాణి	రాజు	సైగటు	ఏనుగు	గుఱ్ఱము	సేనాని

నల్లబలము

చిత్రరంపు

రాజుప్రక్కనుండు మంత్రిని ఎడమప్రక్కచివర నుంచుటకు హేతువు రాజరక్షకుండు రాజుసమీపమున తప్పక నియమితుడై యుండవలసియుండుటయే. సేనాని దక్షిణపుకొనను విధిగా నుండవలసి యుండినందున నించుమించుగా తత్తుల్యుండగుమంత్రి వామ

క్రొత్త పూర్ణచతురంగ క్రీడయందు శాస్త్రసమ్మతము లోకస్వభావానుగుణ్యము సిద్ధించుచున్నవి. ప్రస్తుతము ప్రచారమందున్న యాటలో కాళీగానున్న ౩౨ గళ్లే చూచుకొనవలసిన వగుటచే సర్వజనసులభమై స్వల్పకాలములోనే యాట ముగియుచున్నది. బుద్ధిబలపరీక్షాస్థానమైన యీ యాట యింత

స్వల్పకాలములో ముగియుట సంగతముగా లేదు. మా పూర్ణచతురంగక్రీడ యందు కాళీగానున్న ౬౦ గళ్లు చూచుకొనవలసి యుండుటను, పై మార్పులు కలుగుటను బట్టి సర్వజనసులభము గాక యాట ముగియుటకు విశేషకాలము పట్టును. బలములు సక్రమంగా చేర్చుటచే నేనుగులు మొదలగు జంతువులు అక్రమపు చావునకు దూరస్థము లగుచున్నవి. కావుననే రాజునకు నిరపాయస్థలము లభించును. టగాంగ్రహబుద్ధి ప్రతిభ అభివృద్ధి గావించుకొనుట కధికమగు అవకాశము లభించును. పాఠకు లీవిషయమును గమనించి యీ యాటను ప్రచారములోనికి దీసుకొని వచ్చి నాకృషి ఫలింపజేయ గోరుచున్నాను.

సేనానికి రాజరక్షకునికి ఆకార నిర్ణయములు :—

సేనాని మంత్రివలె నుంటూ చివరను గుఱ్ఱమురీతిగా నుండును ఈమార్పు గుఱ్ఱపునడకను సూచించును. రాజరక్షకుడు మంత్రికన్న భిన్నరూపముతో నుండును. ఈ క్రొత్త పూర్ణ చతురంగక్రీడయందు రాజమర్యాదలను, ధర్మయుద్ధమర్యాదలను సూచించెడు కొలది నియమములు మాత్ర ముంచబడెను.

(౧) సమరాజు ఆడకూడదు, (౨) యుద్ధప్రారంభము గానిదీ రాజనరాదు. (3) రాజరక్షకుని ముందుబంటు ౧౦-వ గడికి హెచ్చబడదు (౪) సేనానిముందుబంటు మంత్రిగాను మంత్రిముందు బంటు సేనానిగాను చేయవలెను. ఇంక నితరవిషయములుగూర్చి సందేహముకలవారు మమ్ముల నడిగి తెలుసుకోవచ్చును. ఎవరైన కళాప్రియులు నాతో నాడ నుత్సహించిన నేనట్టియవకాశమును సఫల మొనర్చుకొన యత్నింతును.

దేహి కెట్లు జతగూడునమ్మ?

శ్రీ పురాణం సూర్యనారాయణ తీర్థులు

సచ్చరిత్రుం డగ్రప్రశస్తిఁ గాంచిన పుత్రుఁడనురాగవతి యైన యాఁడుమనిషి
తన్నం బ్రసన్నచిత్తముతోడఁ గనుఁజేఁడు స్నేహయుక్తుం డైన చెలిమికాఁడు
మోస మ్మెఱుంగని దాసాదిపరిజనుల్ లేశమ్మునఁ గ్లేశమ్ము లేనిమనసు
కడుఁ జక్కనైన యాకారమ్ము ధరను శాశ్వత మై యెసఁగు కీర్తివైభవమ్ము
విద్యచే ననవద్య మై వెలయు బ్రదుకు, నెల్ల బ్రహ్మాండముల నేలు తల్లి వైన
నిన్ను మున్నుగ భజింపలే కున్న దేహి కెట్లు జతగూడునమ్మ? కామేశ్వరమ్మ?

హంపీ క్షేత్రము

శ్రీ అయ్యగారి విశ్వేశ్వరరావు

కాలిగజ్జెలు సందియ ఘల్లు మనగ
హంపిక్షేత్రాన విహరించె నాంధ్రలక్ష్మి,
దానిఫలితమా ? ప్రేతము ల్దసరుచుంట !
అస్తమించిన దయ్యయో ఆంధ్రలక్ష్మి !

కవిసార్వభౌముల కావ్యపఠన మెంతో కర్ణపేశలమౌచు గ్రాలె నెచట,
గాయకరత్నాల గానమ్ము మోదాన మారోగ్రిగ నెచ్చోట మహితగతిని,
వేదవేదాంగంపు విద్యావినోదమ్ము ఘోషించె నేవీట కులుకులొలుక,
కత్తిసాముల నేర్చి కడుపుపంటగనైన వీరాధివీరులు వెలసిరేడ,

అట్టి మహనీయపురమైన హంపియందు
మనుజు డుండుట కఱవాయె ! మాయవిధికి
గృధ్రజంబుకవాసమై గూడియుంట
కంటిచలువగ నుండె నక్కటిక మనగ.

ఆంధ్ర తేజంబుల నాశాంతరమ్ముగ వర్ధిల్లఁజేసిన వంద్యభూమి,
ఆంధ్రకళాదీప్తి యసమాన మనురీతి ప్రకటించినట్టి యాభవ్యభూమి,
ప్రథితవిద్యారణ్య పండితవాక్కున ప్రభవించినట్టి యా భాగ్యభూమి,
ఆంధ్రపాండిత్యమ్ము నన్నిదేశాలకు వింతగా జూపిన విమలభూమి,

త్రాచుపాములు మృగములు దనరువేళ
పాడుడొంకెల మధ్యాన పాడువడియె,
తెలుగుహృదయాల నాళముల్ తెంచివైచె,
ఆంధ్ర తేజమ్ము వింతగా నస్తమించె.

తెలుగువెలుంగు మాసె, ఘనతేజము యాంధ్రులటన్న రోసె, నా
సలలిత కీర్తికాంత మనసార వరించె విదేశవల్లభున్
విలసిత యాంధ్రలక్ష్మి యిట వేసరిపోయె బికారిపోలికన్
కులుకుదనమ్ము నాంధ్రులకు కూడనిదాయె ! యిదేటి చిత్రమో !

అస్తమించెనుగదా! యలసాని పెద్దన్న యాంధ్రభాషాసేవ నలరువాడు,
ముక్కలైపోయెగా ముద్దుపల్కులక్రేవ ముక్కు తిమ్మనధీరు ముక్తిత్రోవ,
మేదిని లేదాయె మేలైన హాస్యమ్ము రామకృష్ణుడు నాకగామి యగుట,
అంతమందెనుగాదె యాంధ్రదేశపు శీవి, కృష్ణరాయ నృపతి విష్ణుజేర,

ఏర లున్నార లాంధ్రుల పేరు నిల్ప?
హంపి కూలుటె యాదిగా నాంధ్రతేజ
మంతరించెను దారిద్ర్యవంత హెచ్చె
దాస్యపైశాచికమ్ములు దాపురించె!

హంపి కెంతటి దుర్దశ లావహించె!
వన్యమృగములరవములా? ఫలము లయ్యె!
మచ్చుకైనను మనుజుడు మసలడిపుడు,
మాటలేటికి మన శౌర్య మంతరించె!



రేడియో మామ

రేడియో మామయ్య మేడలో కెళ్లి
అమ్మ నే నెప్పుడే ఆడుకొంటాను?
మామయ్య పాడించు మహామంచిపాట
పాడుచూ, ఆడుచూ పలికేదియెపుడె?



రేడియో మామవద్దకు వెళ్దాం

రకరకపు సంగీత రాగాల పెట్టె
పల్లాలు తగిలించి వాయించు టెపుడె?
చిన్ని మా మామయ్య చెవులు మెలివేసి
చిట్టి చిట్టీ కథలు చెప్పేది యెపుడె?
పాడేటి ఆడేటి బాలికల తోడ
ఆడి పాడీనేను కూడేది యెపుడె?
వీణలూ ఫిడేళ్లు పిల్లనగ్రోవి
పిల్ల సొన్నాయిలు చిల్లు బూరాలు
పీరణం రమఢోళ్లు పెళ్లి బాజాలు
ఘల్లు మని వాయించి వినిపించు టెపుడె?

* * *

మామయ్య యింటిలో మధ్య చావడిలో
సభ చేసి ముచ్చటలు సరసమాడుచును
కొలువున్న అత్తలా కొంగుకొస లాగి
కొంటెగా ముడివేసి కులికేది యెపుడె?
కిలకిలా అత్తలకు కితకితలు పెట్టి
పకపకా నవ్వించి పలికేది యెపుడె?
అన్ని మాటలు చెప్ప అమ్మలక్కలతో
కలిసి ముద్దాడి కౌగిలి చేర్చు టెపుడె?

* * *

యుద్ధం, పటాలాలు ఓడలూ మరలు
బాంబుల్ విమానాలు పడవేయుగుళ్లు
మంచు తుపానులూ మందుపాతరలు
చావులూ బ్రతుకులూ నావలా ముంపు
జర్మనీ, బ్రిటీషు ఫ్రెంచి సైన్యాలు
పోరాడి పడి చచ్చిపోవు వార్తలను
చెప్పేటి మామయ్య చెంతనే పోయి
బాంబుయుద్ధము చూచి వచ్చేది యెపుడె?

* * *

చెవులు దిబ్బడివేయు చవట 'సరిగమలు'
వద్దంటు మామతో గద్దించు టెపుడె?
గిలగిచ్చ కాయవలె గింజుకొని పాడు
పాటకుల లెంప నే వాయించు టెపుడె?

* * *

'పీసు పీ'సింగ్లీషు బాసలో చెప్ప
సూటు బూటూ దొరల చూచేది యెపుడె?

—శ్రీ వాత్సవ.



చెల్ చెల్ గుర్రం

కోతికథ

కోతులను చూస్తే పిల్లలకు చాలా సరదా. అవి చేసే పనులన్నీ పిల్లలకు నవ్వు పుట్టిస్తూ ఉంటవి. ఒకనాడు ఒకకోతి ఎంత పని చేసిందో విన్నారా?

ఒక బ్రాహ్మడు కాశీకి వెళ్తున్నాడు. తోవలో ఒకనదిఒడ్డున ఒక మర్రిచెట్టునీడను వంటచేసుకొని భోజనం చేదామని ఆగాడు. బుజాన ఉన్నమూట నేలమీదపెట్టాడు. చేతిలో ఉన్నకర్ర మూటమీద పెట్టాడు. ఏటిలోనికి పోయి స్నానంచేసి, బడలు తుడుచుకొని మూటవిప్పి, వంటసామానులు పైకి తీసి, అక్కడ కనబడ్డరాళ్లు మూడుతెచ్చుకొని పొయ్యిచేసి, తాను తెచ్చుకొన్న కట్టెపుడకలుపెట్టి వంటచేశాడు. వంట పూర్తి కాగానే మర్రిఆకులు కోసి విస్తరికుట్టుకొని భోజనానికి కూర్చున్నాడు.

అక్కడ కోతులు ఎక్కువగా ఉన్నవి. గాని, అంతవరకు ఒక్కకోతి అయినా రాలేదు. తీరా భోజనం మొదలుపెట్టగానే ఒక్కకోతిమాత్రం వచ్చి ఆ చెట్టెక్కి, ఒక కొమ్మమీద కూర్చున్నది. ఈ బ్రాహ్మడికి భయంవేసింది—ఇంకా ఎక్కువగా కోతులు వచ్చి వడ్డించుకొన్న అన్నము ఎత్తుకొని పోతాయేమో అని. గాని, ఆ ఒక్కకోతి తప్ప మరికోతులు రాలేదు. ఒక్కకోతే కదా వచ్చింది; భయంలేదు, అనుకొన్నాడు; ఐనా ఎందుకైనా మంచిది అని తనచేతి కర్ర ఎడమచేతితో పట్టుకొని ఆ కోతిని బెదరిస్తూ ఉండేవాడు.

పాపం! ఆ కోతి ఏమి చేయగలదు? ఆ చెట్టుకొమ్మమీద కూర్చుండి ఆ బ్రాహ్మడి వైపూ, ఆ బ్రాహ్మడు తింటూఉన్న అన్నం వైపూ చూస్తూ ఉండేది.

"నా అన్నం నీవుకూడా తినవలె నని చూస్తున్నావా?"

అని అనడమే కాకుండా, ఆ బ్రాహ్మడు ఒకొక్కముద్ద చేతితో పట్టుకొని "ఇందు" అంటూ ఆ కోతి వైపు చూపిస్తూ ఉండేవాడు. పాపం, ఆ కోతి తిందామని ఆశతో ముందుకు తలవంచి ఉరుకడానికి సిద్ధపడుతూ ఉంటే, అతడు ఆ అన్నంముద్ద తన నోటిలో వేసుకొని, ఎడమచేతితో పట్టుకొన్న కర్ర కోతివైపు ఎత్తుతూ ఉండేవాడు. పాపం, ఆ కోతి వెనుకకు పోతూ ఉండేది. మళ్లీ ఆ బ్రాహ్మడు మరియొక అన్నం ముద్ద "ఇందు" అన్నట్టు చూపించగానే ఆ కోతి ముందుకు మెడచాచి గంతుటకు చూస్తూ ఉండేది. అప్పుడు మళ్లీ ఆ బ్రాహ్మడు ముద్ద నోటిలో వేసుకొని కర్ర ఎత్తి ఆడిస్తూ ఉండేవాడు. ఈ విధముగా అతడు ముద్దముద్దకూ ఆశ పుట్టిస్తూ ఆ కోతి ప్రాణాలు విసిగించాడు. గాని ఒక్క మెతుకైనా దానికి ఇవ్వలేదు.



కోతికథ. విన్నారా?

"సరే వీడికి తగిన పని ఏమి చేయడమురా?" అని ఆ కోతి ఆలోచించింది.

భోజనం కాగానే ఆ బ్రాహ్మడు ఎంగిలివిస్తరి చుట్టపెట్టి ఆవలికి విసరివేసి, ఏటిలోనికి పోయి, చేయి కడుగుకొందా మనుకొంటున్నాడు. ఈలోగా ఆ కోతి చంగున నేలకు ఉరికి, విప్పియున్న ఆ బ్రాహ్మడి మూటలో ఒకచిన్నమూట నోట కరచిపట్టి ఆ బ్రాహ్మడు విడిచిపెట్టి వెళ్లిన చేతికర్ర ఒకచేతితో పట్టుకొని, మళ్లీ చెట్టెక్కి ఎత్తైన కొమ్మమీద కూర్చున్నది.

అది చూచి "ఆఁ ఆఁ" అంటూ ఆ బ్రాహ్మడు చెయ్యి ఐనా తిన్నగా కడుగుకోకుండా పరుగెత్తి వచ్చి చూచాడు. అప్పుడు ఆ కోతి చేతికర్ర చెట్టుకొమ్మలమీద జాగ్రత్తగా పెట్టి, తాను తెచ్చుకొన్న చిన్న మూట విప్పినది. అందులో పదిరూపాయలున్నవి. వాటిని చూచి కోతి కిచకిచలాడుతూ నవ్వింది.

"అయ్యో! నా రూపాయలమూటే ఎత్తుకొనిపోయింది పాడుముండాకోతి!" అని ఆ బ్రాహ్మడు కోతివైపు కోపంగా చూచి ఒక చిన్నరాయి దానిమీదికి విసిరాడు. అది దానికి తగలలేదు; గాని, కోతికూడా కోపం తెచ్చుకొని, చేతితో కర్రపట్టుకొని భోజనంచేస్తూ ఉన్నంతసేపూ ఆ బ్రాహ్మడు తనను ఎట్లా జడిపించాడో అట్లానే కర్ర ఆడిస్తూ జడిపించింది. దానితో ఆ బ్రాహ్మడు కొంచెము భయపడి దీనంగా ముఖంపెట్టి "నా రూపాయలమూట నా కిచ్చివేయవూ? నీకు బియ్యము పెడతాను. నారూపాయలు నా కిచ్చివేయవూ?" అని బతిమాలడానికి మొదలుపెట్టాడు.

అప్పుడు ఆ కోతి చిన్న మూటలో ఉన్న పది రూపాయలను ఒకొక్కటి పైకి తీసి "ఇంద" అన్నట్టుగా ఆ బ్రాహ్మడి వైపు చూపిస్తూ అతడు దానిని అందుకొందామనే ఆశతో చేయి చాపగానే, ఒక్క విసరున ఆ రూపాయి ఏటిలోనికి విసరివేస్తూ ఉండేది. ఈ విధముగా ఒక రూపాయి తర్వాత ఒక రూపాయి "ఇంద" అన్నట్టుగా ఆ బ్రాహ్మడికి చూపిస్తూ ఏటిలోనికి అతడి పది రూపాయలున్నూ విసరివేసినది. ఆఁ... ఆఁ... అంటూ ఆ బ్రాహ్మడు కేకలు వేస్తూ ఉంటే, ఆ కోతి కిచకిచ లాడుతూ నవ్వుతూ ఉండేది.

'నాకు తగిన శాస్తి చేశావే కోతి కానా' అంటూ ఆ బ్రాహ్మడు మూటా ముల్లీ కట్టుకొని వెడలి పోయినాడు. కథ కంచికి పోయింది మనం ఇంటికి కొచ్చాం.

సీతాపతి.

పుస్తకసమీక్ష

ఉక్కుమనిషి రష్యన్ నియంత స్టాలిన్

గ్రంథకర్త: శ్రీ గోవాడ నిరీక్షణరావుగారు.
అడ్రసు: నవ్యసాహిత్యపరిషత్, ౨౧౧ స్ట్రింగ్టన్ ముత్యాలమ్మొదలి వీధి. పోష్టుబాక్సు నెం. ౨౫౧౧ మద్రాసు.

స్టాలిన్ అన్నా, రష్యా పరిపాలనా విధానమన్నా ప్రతివాడికి ఒక జిజ్ఞాస కలుగుతోంది ఈరోజులలో. కార్లమార్క్సు చెప్పిన సామ్యవాద సిద్ధాంతాలను అమలులో పెట్టడానికి జీవితాన్ని ధారపోసిన మేటిపురుషుల్లో స్టాలిన్ కూడ ఒకడు కనుక ఆయన జీవితంలోని విశేషాలను ప్రతివాడూ తెలుసుకోవాలని అనుకోవడం స్వాభావికమే.

చెప్పులు కుట్టేజాతికి చెందిన సామాన్యకుటుంబంలో పుట్టినా అత డింతగా రాణించాడంటే అతనిలో ఏదో ఒకవిశేషం ఉండితీరాలి. అతనిలో వున్న పట్టుదల, త్యాగబుద్ధి, ముందుకు సాగవలెనన్న కుతూహలం, ఓర్పు ఇవన్నీ ప్రతిమానవుడు తెలుసుకోదగ్గ విశేషాలు.

మనదేశంలాగే రష్యాకూడ అనేక భాషలు, అనేకజాతిసంప్రదాయాలతో కూడుకున్న దేశం. వీరందరిని ఒక కాడిక్రిందకు తీసుకు రావాలంటే ఒక ప్రత్యేక ప్రతిభగల ప్రజ్ఞావంతుడు కావాలి. లెనిన్ ఉండగానే ఈ సమీకరణపని స్టాలిన్‌కు వప్పగించాడు. గ్రంథకర్త చెప్పినట్టు—"అతను స్వతహాగ ఫక్తురష్యనుజాతివాడు గాడు — అతను జార్జియను జాతివాడు. కాబట్టే రష్యనులు కాని యితరజాతులవారిని "మనమంతా భిన్నత్వాన్ని మరచిపోయి ఏకరష్యాజాతి కావాలి" అని బోధచేయడానికి అతను బాగా పనికివచ్చాడు.

స్టాలిన్ చాలా నిరాడంబరజీవి. అతను చెప్పేదానికి చేసేదానికి తేడా వుండదు. ఇతర నియంతలవలె తనపేర "గొప్పమొత్తా"న్ని బ్యాంకుల్లో వేసి అట్టిపెట్టుకోవడం అతను ఎరగడు. ఒకసారి అతను సిపాయిలను అజ్మాయిషీ చేయటానికి వెళ్లాడట. అందులో ఒకడు అతనికి సలామ్ చేయలేదట. కారణమేమని అడిగితే ఆ సిపాయి వెంటనే తనకాళ్లబూట్సువంక, చూపించాడట. అప్పుడు స్టాలిన్ తన నిగనిగలాడుతున్న బూట్సు వెంటనే తీసి ఆ సిపాయికి పారేసి, వానికాళ్లమురికిబూట్సు తాను తీసి తొడుగుకున్నాడట.

ఈ పుస్తకంలో ట్రాటస్కీకి, స్టాలిన్‌కు మధ్య ఉన్న అభిప్రాయభేదాలుకూడా కొద్దిలో విశదీకరించబడ్డాయి. మచ్చుకు కొంచెంగా క్రోడీకరిస్తాము— "వ్యక్తిగత విషయాలలోనే గాకుండా, రాజకీయాభిప్రాయాలలోకూడ ఉభయులకు చాలా పెద్దతేడాలున్నవి. సోవియట్ రాజ్యాంగాన్ని నడిపించడంలో ఇవి ఒకటి కొకటి ఎదురొ్కన్నవి. 'మనదేశం సంగతి మనం చూచుకుంటే చాలులే!' అని స్టాలిన్ ఉద్దేశం. 'అట్లా గాదు. లోకంలో మనం కేటాయింపుగ ఉండడానికి వీలులేదు. ప్రపంచంలోవున్న తక్కిన దేశాలన్నీ కూడ మన విప్లవమార్గానికి వస్తేనేగాని, మనరష్యాలోనైనా సోవియటురాజ్యపద్ధతి నిలవ'దని ట్రాటస్కీ అభిప్రాయం. ఇలాగే స్టాలిన్ బాల్యంనాటి అభిరుచులు వాఙ్మయమంటే అతనికి గల ఆసక్తి, అతని ప్రణయరహస్యాలు, అతని శాసనపద్ధతినిగురించి క్లుప్తంగా చక్కగా తెలియపరచారు గ్రంథకర్తలు.

చివరి భాగంలో "స్టాలిన్ నిరంకుశత" అనే పేరుతో స్టాలిన్ ఇప్పుడు తొక్కుతూవున్న పరిపాలనా పథాన్నికూడా సూచించారు — "అతడు స్ఫురద్రూపి, చండశాసనుడు. అతనిది సుగ్రీవాజ్ఞ... ఈ నియంత ప్రపంచము నంతను సామ్యవాదపు వెల్లువతో ముంచివేయవలె నని వేచియున్నాడు. సాధ్యమగునా?

అందుకుగాను నిరంకుశుడై తనతో కష్టించి సామ్యవాదము నెలకొల్పినవారిని పలువురను బంధించి పలువురను హత్యచేసి, పలువురను ఉరులుతీసి, కొంతరిని దేశాంతరమునకు తరిమినాడు. అతని జోడైన ట్రాటస్కీ జీవముతో దేశాంతరమున వున్నందుకే

ఆతడు నగచుచున్నాడు. ఈప్రళయతాండవ మంతా అతడు స్వదేశములోనే.

ఇతర నియంతలగు హిట్లర్, ముసోలినీలకును ఆతనికి యిక్కడే తేడా. హిట్లర్, ముసోలినీలు ఇతర దేశములపైబడి కబళించుచుండ స్టాలిన్ తన స్వదేశీయులనే మ్రింగుచున్నాడు. ఇట్లు పచ్చినెత్తురు త్రాగుచున్న ఈనియంతసంకల్పము ఎంతవరకు సిద్ధించునో కాలమే నిర్ణయించవలెను.”

స్టాలిన్ గురించి తెలుసుకోగోరేవారికి ఈపుస్తకం కొంతవరకు బాగానే వుపయోగిస్తుంది. భాష కూడ విషయానికి అనుకూలించి ధారాళంగానడిచింది. అక్కడక్కడ మిగిలిపోయిన గ్రాంథికవాసనలుకూడ పోతే రచయిత తెలుగుభాషకు, తెలుగుదేశానికి ఎక్కువసేవ చేయకలుగుతాడు.

యు. వెంకటేశ్వరరావు.

గ్రామపారిశుభ్రత, గ్రామారోగ్యము

(గ్రామోద్ధరణ గ్రంథములలో మొదటిది)

గ్రంథకర్త: శ్రీ గరిమెళ్ల సత్యనారాయణగారు. మద్రాసు రాష్ట్రీయ సహకార యూనియను వారిచే ప్రకటితము.

గ్రామోద్ధరణము మిగుల అక్కరైన దనువిషయమును నేడు అందఱును అంగీకరించిరి. భారతదేశమున ఏడులక్షల గ్రామము లున్నవి. నేడు గ్రామసేవ దేశసేవకు పర్యాయ పదమనుట ముదావహము. ప్రజాసముద్ధరణమును పరమాశయము గావించుకొని, ఈయాశయసిద్ధికై యూరపుఖండమున సహకారోద్యమము బహుధా ప్రయత్నించుచున్నది. డెన్మార్కు మున్నగు దేశములందు చక్కని ఫలితములు గోచరించినవి. భారతదేశమున సహకారోద్యమము విశేషముగా “పరపతి” (Credit) మీదనే తనదృష్టిని సారించినది. “పరపతీతర” (Non-credit) క్రియలకై ఈవఱలో నది వలసినంతశ్రద్ధ వహించినది కాదు. పంజాబునందు బెంగాలోమాత్రము ఈవిషయమైన శ్రద్ధ కొంత గోచరించినది. పెక్కులోపములు సహకారోద్యమమున తలనూపినవి. ఒకప్పుడు సహకారసంఘముల రిజిస్ట్రారుగానుండిన స్ట్రాత్రీగారీయుద్యమము జయసిద్ధినందలేదనియే తెలిపిరి. ఇపుడు “పరపతీతర” క్రియలదెస మననాయకులు ఆదరదృష్టిని సారించుట సంతోషకరము.

ఆర్థికవృద్ధితోపాటు గ్రామస్థులు ఆరోగ్యాభివృద్ధిని, సాంఘికాభివృద్ధిని అందితీరవలెను. ఈయభివృద్ధులు చేకుఱుటకు మున్ను వీనికి సంబంధించిన పరిజ్ఞానమును గ్రామస్థు లందవలెను. వారికి వలసిన ప్రబోధము నీయ నుద్దేశించియే మద్రాసురాష్ట్రీయ సహకారయూనియనువా రీ గ్రంథమును సుప్రసిద్ధదేశసేవకులైన శ్రీ గరిమెళ్ల సత్యనారాయణగారిచే వ్రాయించి ప్రకటించిరి. గ్రామస్థులకు వలసిన పాఠములను గుఱించి ప్రణాళికను ప్రకటించి శ్రీ సత్యనారాయణగారు గ్రామసమస్యలను పరిశీలించిరి. సర్వతోముఖమైన గ్రామాభివృద్ధికి వలసిన అంశములను ప్రస్తుతగ్రంథమున వివరించిరి. ప్రాచీన గ్రామపరిస్థితులను సింహావలోకనము గావించి, ప్రస్తుత పరిస్థితులందు గోచరింపవలసిన సంస్కరణమును, అభివృద్ధిని సూచించిరి. తొల్లింటి గ్రామస్థులు కులవృత్తులను నిర్వహించుచు, విశ్రాంతిసమయములందు విద్యాగోష్ఠి సలుపుచు, పండుగలందును, తీర్థములందును హాయిగా కాలము గడపుచుండువారనియు, సంఘజీవితమున ఉచితమైన కట్టుబాట్లను పాటించుచు, సంఘీభావముతో మెలగుచుండిరనియు తెలిపిరి. వెనుక గ్రామవ్యవహారములు జరుగుతెఱగును ఎఱిగించిరి. విదేశవస్తువులను దూరముగా నెట్టివేయవలెనని గ్రామస్థులు గృహపరిశ్రమలం దాఱితేఱవలె నని నొక్కిచెప్పిరి. గ్రామసౌభాగ్యము, గ్రామారోగ్యము, గ్రామవిజ్ఞానము, గ్రామపరిశుభ్రత మున్నగువాని అక్కఱలను నేరిమితో వివరించిరి. గృహ నిర్మాణమందును, నీటివసతికి సంబంధించిన వ్యవస్థయందును నేడు గోచరించు లోపములను చూపి అవి మాపుటకు వలసినమార్గములను సూచించిరి. నిరుపేదలపట్ల సిరిగలవారు నిర్వహింపవలసిన బాధ్యతను తెలిపిరి. తొల్లింటి మేలిదృష్టాంతములను వివరించిరి. ఆరోగ్యశాస్త్ర-

ఆహారశాస్త్రములకు సంబంధించిన బహుశాంశములను వివరించిరి. మరబియ్యమువలన వాటిలు చెఱుపులను, మెఱుగుపెట్టని దంపుడు బియ్యమువలన చేకుఱుమేళ్లను వివరించిరి. కలరా, మశూచికము, చలిజ్వరము, ప్లేగు, కొంకిపురుగురోగము, సన్నిపాతజ్వరము, ఇన్ఫ్లుయెంజా, క్షయ మున్నగువ్యాధుల లక్షణములను, వాని నివారణోపాయములను తెలిపిరి. సక్రమపదభ్యాసముల యొక్క అవసరమెట్టిదో యెఱిగించిరి. శిశుపోషణమందును, శిశుచికిత్సయందును తల్లి పాటింపవలసిన అంశములను, గర్భిణీస్త్రీ గ్రహింపవలసిన విషయములను వివరించిరి. ఆరోగ్యశాఖవారు వేర్వేఱు క్రియాంగణములందు నెఱపిన కర్తవ్యము నుల్లేఖించిరి. వేర్వేఱుజంతువులవలన గృహస్థుడు పడుబాధలను తెలుపుచు డాక్టరు పట్టాభిగారు రచించినవ్యాసమును వారియనుమతి నంది, తమగ్రంథమున నొక యధ్యాయముగా జేర్చిరి.

విషయ బాహుళ్యముకతనను, విషయప్రాముఖ్యమువలనను గ్రంథము మిగుల నుత్కృష్టమైనదని చెప్పవచ్చును. ఇట్టి గ్రంథములు సులభమైన ఆకరింతకు అందితీరవలెను కావున గ్రంథకర్తగారు చక్కనివాడుక భాషనే ప్రయోగించిరి. గ్రంథము ప్రతిగ్రామస్థుని చేతులనలంకరింపవలసినది. గ్రామపునర్నిర్మాణమును గురించి గంభీరోపన్యాసము లొసగువా రెందఱో యున్నారు. కాని క్రియానిర్వహణమున పాటింపవలసిన విషయనిర్ణయమును విషయవిభజనమును, వివిధవిషయపరిజ్ఞానమును దెలియక, ఏదారినిగాని, తెన్నునుగాని కానక వారల్లాడుచున్నారు. ప్రస్తుతగ్రంథము వారికిని వార్ధావిద్యా విధానము ననుసరించు వారికిని మిగుల ప్రయోజనకారియై యుండును. ఈపూనికను జయప్రదముగ కొనసాగించిన గ్రంథకర్తగారును, మదరాసు రాష్ట్రీయ సహకార యూనియనువారును అభినందనీయులు. రాజకీయ మహోద్యమమునకును, సహకారమహోద్యమమునకును సన్నిహితులైన దేశనాయకులు శ్రీ భోగరాజు పట్టాభిసీతారామయ్యగారు భావబంధురమైన మున్నుడి వ్రాసి గ్రంథమూల్యమును ఘనతర మొనరించిరి. ఇట్టి గ్రంథములు నేడెన్నో అక్కఱయై యున్నవి. కాలక్రమమున నవి ప్రకటింపబడు నని ఆశపడుచున్నాను.

జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి.

వెలుగోటివారి వంశావళి

గ్రంథకర్త: శ్రీ నే. వెంకటరమణయ్యగారు. ఎమ్. ఏ. పి. హెచ్. డి. మద్రాసు యూనివర్సిటీ, మద్రాసు వెల ౨-౦-౦.

పైజెప్పబడిన పద్యాత్మకమైన పుస్తకము రేచెర్ల నాయకుల, అథవా మదరాసు ఇలాకాలో జేరిన వెంకటగిరి జమీందారులపూర్వీకుల, వెలుగోటి వారివంశమును గురించినది. ఇది ముఖ్యమైనదియు, సారముగలదియు నగు చరిత్రము. వందిమాగధులు ఈ వంశావళి నాయకుల ప్రసిద్ధమైన శూరకృత్యములను కీర్తించుటకు పద్యరూపమున రచియించిరి. మొత్తమున ఈ కావ్యము పలుచేతులచే రచింపబడి యున్నను చరిత్రముమాత్రము కాలక్రమానుసారముగానే యున్నది. ఈవంశావళి మెకంజీ(MacKenzie) దొరగారు కూర్చిన వ్రాతపత్రములలోనిది. ఇది మదరాసు గవర్నమెంటు ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్సు లైబ్రరిలో యున్నది.

ఈ పురాతనవంశమును స్థాపించినవాడు అనుగమనల్లు గ్రామస్థుడైన చర్విరెడ్డియను కాపు. ఇతనికి అదృష్టవశమునను, అకస్మాత్తుగాను తన పంచమజాతి సేవకునివలన యొక గొప్ప ఆస్తి లభించినది. ఈ నాయకులు తమ పూర్వీకులు పుట్టుకయందు సర్వసాధారణ మయినవారుగా నుండుటను మిక్కిలి తలంచి, ఉన్నతస్థితిని కీర్తిని సంపాదించినతోడనే, నమ్మరాని కథలచే తమ పెద్దలపేర్లను మెప్పించిరి. ఈవంశస్థులు మొట్టమొదట వోరగల్లురాజు పక్షమున జేరినవారై వారి యుద్ధములయందు ముఖ్యపాత్రలను వహించి విస్తారమయిన భూస్థితిని సంపాదించుకొనిరి. తరువాత వారు మిక్కిలి ప్రఖ్యాతినిపొంది, వోరగల్లు రాజుకు సమానులై, కాకతీయరాజ్యమును వశించిన

పిమ్మట, స్వతంత్రనాయకవీరులై, తుదకు నలగొండ పర్వతప్రాంతమున స్థిరపరుచుకొనిరి. తరువాత వీరు చుట్టుప్రక్కలనుండు రాజులచే ముట్టింపబడినవారై, తమ స్వస్థానమును వదలి, కర్ణాటకప్రదేశమును జేరి, విజయనగర సామ్రాజ్యవీరులకు సామంతులయిరి.

చర్విరెడ్డి పుత్రుడు, ప్రసాదాదిత్యుడు, గణపతి రాజకుమారితె యయిన రుద్రాంబ, సింహాసనమునకు హక్కు రాలని నియమించుటకై ముఖ్యకార్యములను జేసి తుదకు కాకతీయరాజ్య స్థాపనాచార్య డని బిరుదును సంపాదించెను. ఈవంశావళిలో నాలుగవతరమునకు సంబంధించిన ఎర్రదాచ, అయిదవతరమునకు సంబంధించిన పీచ, తొమ్మిదవతరమునకు సంబంధించిన అంగీ, వీరి ప్రతాపకృత్యములు విస్తారముగా వర్ణింపబడియున్నవి. వోరగల్లురాజ్యము ౧౩౨౩-వ సం॥న నశించుటయు, రాచకొండ, కొండవీడు సామ్రాజ్యము లుద్భవించుటయు, వంశావళి అయిదవతరమున జరిగినది. ఈ వంశమువారు ఏ ఏ రాజులకు సామంతులయి యుండిరో వా రందరియందు మిక్కిలి కృతజ్ఞతతో వర్తించుచుండిరి. ౧౭౫౧-వ సం॥వ ఈ వంశము హైదరాలికి విరోధముగా ఇంగ్లీషు వారికి సహాయమొనరించిరి. ఈ వంశస్థులు ఇంగ్లీషు వారికి రాజభక్తియందు ఘనతకెక్కినవారు.

"వెలుగోటివారి వంశావళి", వెలుగోటినాయకుల విజయనగరము, కొండవీడు, రాజమండ్రి, కట్టక్, బీదరు రాజ్యములపైని పోరులను వర్ణించు ముఖ్యమైన గ్రంథము. దక్షిణ హిందూదేశచరిత్రచదువరులకు ఈ పుస్తకము చాల ఉపయోగకరమైనది. ఎన్. వెంకటరమణయ్యగారు తమ ఉపోద్ఘాతముచే ముతకలోహమును విలువగలదిగా జేసిరి.

ఆర్. బి. పింగళే

ప్రతిభ

సంపుటి ౪ (౨౪౨ పుటలు గలది) రావు సాహెబు, మహోపాధ్యాయ, కళాప్రపూర్ణ గిడుగువేంకటరామమూర్తిగారి స్మారకసంచిక. సంపాదకులు : తెలికిచర్ల వేంకటరత్నంగారు నవ్యసాహిత్యపరిషత్తు : గుంటూరు.

ఈ సంపుటి శ్రీ శ్రీ పిఠాపురం యువరాజావారి "ఆవాదు - ఆవేశ" అనే పద్యాలతో ప్రారంభమైనది. అందులో షాజహాన్-ముంతాజ్ దంపతుల ప్రేమబాధగాథ వర్ణితమయినది. పద్యములు హృద్యములుగాను, భావములు కరుణరసభరితములయి గభీరముగాను ఉన్నవి: గ్రాంథికభాషలో శ్రీవారికి పద్యరచన సాగించగలనేర్పు కనబడుతున్నది. శ్రీ శెట్టిగారి. శ్రీనివాసమూర్తిగారి "బుకుపరివేదనము"; శ్రీ అత్తిలి సూర్యనారాయణమూర్తిగారి "కనకలక్ష్మి" "ఎవరు"; శ్రీ గణపతిశాస్త్రిగారి "శాంతి! శాంతి! శాంతి! శాంతి!" శ్రీ జొడ్డు బాపిరాజుగారి "నిరాశ", రజనిగారి "మధుపాయి"; శ్రీ పెనుమర్తి కామేశ్వరరావుగారి "నీకోసం"; శ్రీ గుంటుపల్లి వేంకటేశ్వరరావుగారి "ఆమె.." శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారి "గీతికావ్యములు"; శ్రీ పఠాభిగారి "ఉమర్ ఖయాందు బాయితీలు", శ్రీ పన్యాల వేంకటరంగనాథరావుగారి "ఎలిక" శ్రీ శ్రీ గారి "రుబాయత్" "Docompositions" "విమానకుని ఆత్మహత్య" "టాంటాం", "కొంటెకోణాలు" శ్రీ అడవి బాపిరాజుగారి "శశికళ", శ్రీ కొమరాజు బాపయ్యగారి "వనమాలి", "మల్లిక"; శ్రీ కృత్తివాసతీర్థులుగారి "గోపికాగీతలు"; శ్రీ దేశిరాజుకృష్ణశర్మగారి "చావు", "శిఖరదీపం"; శ్రీ హనుమచ్ఛాస్త్రిగారి "శ్వేతగీతి"—ఇవి పద్యరచనలు. వీటిలో రెండుమూడు సంప్రదాయానుసరములయిన పద్యములు తప్ప తక్కినవన్నీ గేయములు. శ్రీ నోరి నరసింహశాస్త్రిగారి "సర్పసత్రము"న్ను, శ్రీ తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రిగారి "యక్షరాత్రి"న్ని నాటికలు; మొదటిది గద్యముగాను, రెండవది పద్యముగాను రచితము లయినవి.

శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారి "కళలవల్ల ప్రయోజనమేమిటి?" అనేవ్యాసంలో "నాకు "Art for the sake of Art" అనేసూత్రాన్ని అవలంబించేవాళ్లతో సామభూతిలేదు. ప్రయోజనాన్ని పూర్తిగా నిరసించిన కళాప్రదర్శనం నాకు హాస్యాస్పదంగా ఉంటుంది" అని కళవల్ల ఏదైనా ఒక ఉద్దిష్టప్రయోజనం ఉండితీరవలె నన్నారు.

ఈ సంపుటి కీ. శే. రావుసాహెబు గిడుగు వేంకటరామమూర్తిగారి స్మారక సంచిక గనుక వారి "శ్రీ సూర్యరాయాంధ్రనిఘంటువిమర్శనము", "తుది విన్నపము"తోపాటు వారిని స్మరిస్తూ రచించిన వ్యాసములు ఏడు గలవు: శ్రీ నోరి నరసింహశాస్త్రిగారి "రామమూర్తిపంతులు"; శ్రీ యల్లాపంతుల జగన్నాథంగారి "గురుస్మరణము"; శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారి "మిత్రప్రశంస"; శ్రీ చింతా దీక్షితులుగారి "కర్మవీరుడు"; శ్రీ తెలికిచెర్ల వెంకటరత్నంగారి "ధన్యజీవి"; డాక్టరు చిలుకూరి నారాయణరావుగారి "నా గురువుగారు"; శ్రీ వడ్డాది అప్పారావుగారి "రామమూర్తిపంతులుగారి స్మృతి". శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారు "స్మృతి" యను పద్యాలలో వారిని స్మరించినారు.

సీతాపతి

హిందూదేశ చరిత్రవాచకములు

రచయిత: శ్రీ వేలూరి సత్యనారాయణగారు. భీమవరము, బెజవాడ ఆంధ్ర గ్రంథాలయ ప్రెస్సులో ముద్రితములు.

మూడు, నాలుగు, అయిదవతరగతులకు ఉపయోగపడువట్లు మూడుభాగములక్రింద ఇటీవల శిక్షావిభాగమువారు ప్రకటించినసిలబసు ననుసరించి వ్రాయబడినవి. వీటిని చదివే బాలురకు భాషాజ్ఞానముతోపాటు చారిత్రకజ్ఞానంకూడా కలుగుతుంది. వీటిలోని భాషాశైలి మిగులసరళము. ఆయాతరగతుల విద్యార్థుల మనోబుద్ధివికసనాలకు సరిపోవులాగున వ్రాయబడినవి కావున ఆయీడుబాలుర కెంతభాషావిజ్ఞానమావశ్యకమో అంతేకలుగుతుంది. మరియు ముందు ముందు పెద్దక్లాసులలో చదువవలసిన చరిత్రగ్రంథములకివి చక్కని పునాదులవంటివి. ఇంతవరకు స్కూళ్లలో ప్రచారమందు ఉంటూవచ్చిన విదేశనాయకుల స్తుతి సంకీర్తనలకు వీటిలో స్థానము అతిస్వల్పము. క్వాచిత్కముగ నుండవలసివచ్చినను మొత్తంమీద చాలభాగం భారతీయ వీరపురుషుల ఇతివృత్తములతో నిండియుండుటవల్ల వీటిని పఠించే బాలికాబాలకులకు వెనుకటివారిలాగు విదేశీయుల యెడల మాత్రమే పూజ్యభావములునూ, స్వదేశీయుల యెడల నిరసనభావములునూ కలుగవు. పుస్తకములందు చిత్రపటములు సైతముండుటచేత చదివే బాలుర కందరకూ మహోల్లాసంగా వుంటుంది. మూడుభాగముల వెలలు క్రమంగా, రు. ౦-౮-౦, ౦-౫-౦, ౦-౬-౦ లు.

చేతావని

ప్రకాశకులు: ఉన్నవ, హనుమన్నిలయమువారు. గుంటూరు, బ్రాడీపేటలోని గుంటూరు తాలూకాగ్రంథాలయ సంఘము యొక్క కార్యదర్శి పేర వ్రాసిన యెడల గ్రంథము దొరకును. వెల రు ౧-౦-౦.

ఈ గ్రంథమునకు మరొక పేరు 'కృతయుగాగమనము'. చేతావనీ అనగా హెచ్చరిక యని యర్థము. అసలు హిందీలో పరమహంస శ్రీ ౧౦౮ స్వామి పండిత రాజనారాయణజీ షట్‌శాస్త్రిగారు వ్రాసిన మూలమునకు ఇది అనువాదము. అనువాదకుడు శ్రీ వంకాయలపాటి లక్ష్మీనారాయణగారు. మహావిచిత్ర గ్రంథము. త్వరలో కలియుగ మంతరించి కృతయుగము ఆరంభం కాబోతున్నదనీ, శ్రీకలికి భగవానుడిదివరకే అవతరించి పెరుగుతున్నాడనీ సప్రమాణంగా యుక్తియుక్తంగా వ్రాయబడినగ్రంథ మిది. మరింత ఆశ్చర్యం కొలిపేది ఏమంటే యుగాల ఆయుర్దాయ ప్రమాణం లక్షలకొలది సంవత్సరాలని సిద్ధాంతీకరించడానికి ప్రాచీనులు వేటిని ప్రమాణాలుగా తీసుకొన్నారో వాటినే స్వాములవారు సైతం ప్రమాణాలుగా స్వీకరించి ఉదాహరించారు. ఆంధ్రు లందరూ పఠించి యానందించవలసిన గ్రంథం.

సూఫీవేదాంతదర్శనం

గ్రంథకర్త: శ్రీ ఉమర్ అలీషాకవిగారు. పిఠాపురం, విద్వజ్జనమనోరంజనీ ప్రెస్సులో ముద్రితం. వెల రు ౨-౦-౦.

ఇదివరకు మనకు షడ్దర్శనాలే. ఇప్పుడు ఉమర్ అలీషాగారు మరొకదాన్ని చేర్చారు. మన దర్శనములలోని విషయములకు ప్రాచీనార్ష గ్రంథాలు ప్రమాణాలూ, ఆధారాలూ. ఈ దర్శనానికి ప్రాచీన ఖురాను గ్రంథాలు ఆధారాలు—మొత్తంమీద ఆధ్యాత్మికతత్వనిరూపణంచేసేవారికి-ఏమతావలంబులకైనా-ప్రవృత్తి, నివృత్తులూ, కార్యాకార్యాలూ, పుణ్యపాపాలూ, ధర్మాధర్మాలూ అందరికీ సమానమే అని ఈ గ్రంథం చదవడంవల్ల గోచరమవుతుంది. హిందూ ముసల్మానులు మతాలపేరిట ద్వేషాలు పెంచుకొని పరస్పరం హత్యలు కావించుకొనే ఈ రోజులలో, రెండుమతాలవారూ తమతమ మతములలోని సమాన ధర్మాలను అవగాహనంచేసుకొని సమరసభావాలతో ప్రవర్తించడానికిటువంటిగ్రంథాలు చాలా వుపకరిస్తాయి. శ్రీ కవిగారిటువంటివాటి నింకనూ ఆంధ్రులకు ప్రసాదింతురుగాక.

మాక్మిలన్ తెనుగువాచకములు

రావుబహాదూర్ శ్రీ కందుకూరి వీరేశలింగం గారిచే రచితములు. ఆచార్య శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారిచే సుపరిష్కృతములు. మాక్మిలన్ కంపెనీవారిచే ముద్రితములు - మొదటి మూడుభాగములు క్రమముగా వెలరు ౦-౩-౬, ౦-౪-౬, ౦-౫-౦ లు.

ప్రథమాది తృతీయశ్రేణివరకు గల బాలుర పఠనానికి నిర్దిష్టములు. వీటిని పఠించడంవల్ల ఆయాడులలోవారికి కలుగవలసిన లోకజ్ఞానంకలుగుతుంది. ఇవి పూర్వ మెప్పుడో వ్రాసిన వైనప్పటికీ ప్రస్తుత కాలానికి సరిపోయేలాగు పరిష్కరింపబడినవి. పాఠశాలలలో ఉపయోగించుటకు అర్హమైనవి.

—◇—

గ్రంథస్వీకారము

వైరెటు—రచయిత : శ్రీ వెల్దుర్తి మాణిక్యారావుగారు. అణా గ్రంథమాలవారి రెండవ ప్రచురణం. నెం. ౧౧౧. సుల్తాన్ బజారు, హైదరాబాదు దక్కన్ అని వ్రాసిన గ్రంథము దొరుకును.

ఆంధ్రరాష్ట్రము—రచయితలు : శ్రీ శ్రీనివాస సోదరులు, శతావధానులు. తెనాలి. గ్రంథకర్తలకుగాని లేక వీరేశ్వరపు బసవయ్యాచారి, తెనాలి యని గాని వ్రాసిన పుస్తకములు దొరకును. వెల రు ౦-౨-౦

ప్రపంచయుద్ధము: భారతదేశకర్తవ్యము— ప్రకాశకులు : రాడికల్ కాంగ్రెసువారుల సమితివారు. మెడికల్ హాల్ తెనాలి అని వ్రాసిన పుస్తకములు పడయవచ్చును. వెల నాలుగణాలు.

శ్రీరామగజోత్సవము—గ్రంథకర్త : శ్రీ కవికిశోర సుందరరామస్వామిశాస్త్రిగారు, ఆనందాశ్రమము—వేళంగి, కాకినాడతాలూకా, తూ. గో. వెల రు ౦-౮-౦ లు.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press,
No. 7, Thambu Chetty St., Madras. Editor:— S. Sambhu Prasad.